ఆర్షవిద్యాతరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

PRASNOPANISHAD

# ప్రశ్నోపనిషత్



షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!

విశ్వమే విష్ణువు!!

**స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో**

**వారి ఆశీస్సులతో**

**తెనుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

PRASNOPANISHAD
Second edition - Sankara Jayanthi Year 2023
1000 copies

For Copies
ARSHA VIDYA TARANGINI TRUST
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
For free softcopy
**http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm**

Sanskrit Support - Sri Desu Chaitanya Krishna

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 150

# బ్రహ్మయజ్ఞం

**కీర్తిశేషులు శ్రీ దంతులూరి లక్ష్మీనరసింహరాజు గారు, వారి సతీమణి కీర్తిశేషులు శ్రీమతి దంతులూరి విలాసకుమారి గారు**, తూర్పు శ్రీనివాసనగర్ కాలనీ ఉద్భవానికీ, ఉన్నతికీ ఎంతో కృషిచేశారు. పరోపకారమంటే ముందంజ వేసేవారు. ఆ కాలనీ వాస్తవ్యులకు తలలో నాలుకగా, పెద్దదిక్కుగా ఉండేవారు.

శ్రీ లక్ష్మీనరసింహరాజు గారు ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ డిపార్టుమెంటులో అసిస్టెంట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరు సెయింట్ ఆల్ఫోన్సాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు. వీరి సిద్ధాంతం– **సర్వేజనాః సుఖినో భవంతు**.

ఈ పుణ్యదంపతుల స్మృతి చిహ్నంగా వారి పెద్ద కుమారులు దంతులూరి శ్రీనివాసరాజు గారు ప్రశ్నోపనిషత్ గ్రంథప్రచురణ అనే బ్రహ్మయజ్ఞానికి శ్రీకారం చుట్టారు.

తల్లిదండ్రులలాగే శ్రీ దంతులూరి శ్రీనివాసరాజు గారు, వారి శ్రీమతి దంతులూరి అరుంధతి గారు కూడా సేవాభావంతో ఉంటారు.**శ్రీ దంతులూరి శ్రీనివాసరాజు గారు**, సెయింట్ ఆల్ఫోన్సాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరిగా వ్యవహరిస్తున్నారు. వీరు ఎంతో వినూత్నమైన ప్రణాళికలను చేపట్టి ఆల్ఫోన్సాస్ స్కూల్ ప్రగతికి తోడ్పడుతున్నారు. అంతేకాకుండా మన ఆర్ష విద్యా తరంగిణికి ఎంతో సహాయం చేస్తూ మనకు అండగా ఉంటారు.

ప్రశ్నోపనిషత్ గ్రంథప్రచురణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి బృహత్తరంగా సహకరించారు శ్రీనివాసరాజు గారు, వారి సతీమణి శ్రీమతి దంతులూరి అరుంధతి గారు. ఈ ఆదర్శ దంపతుల అల్లుడు బుద్ధరాజు అజయ్ కుమార్, కుమార్తె రమాదేవి, కుమారుడు దంతులూరి నందు, కోడలు సత్యవీణ. వీరికీ, వీరి అల్లుడు–కూతురు, కొడుకు–కోడలు, మనుమలు, మనుమరాళ్ళు – వీరందరికీ భగవంతుడు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి కలుగచేయాలని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

– రాఘవ రావు, రాజ్యశ్రీ

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. ముందుమాట | ...... | 05 |
| 2. పరమార్థానంద స్వామి- అనన్య గురువు | ...... | 08 |
| 3. ఆర్ష ఆనందకుటీర్ సభ్యుల స్పందన | ...... | 11 |
| 4. ప్రశ్నోపనిషత్తు -ఉపోద్ఘాతం | ...... | 14 |
| 5. అధ్యాయం-1 | ...... | 18 |
| 6. అధ్యాయం-2 | ...... | 46 |
| 7. అధ్యాయం-3 | ...... | 64 |
| 8. అధ్యాయం-4 | ...... | 85 |
| 9. అధ్యాయం-5 | ...... | 106 |
| 10. అధ్యాయం-6 | ...... | 118 |
| 11. సారాంశం | ...... | 133 |
| 12. దుర్గాసూక్తం | ...... | 149 |

# ఓం

# ముందుమాట

మన ధర్మానికి ఆధారశిలలైన వేదాలు – సంహిత, బ్రాహ్మణం,ఆరణ్యకం, ఉపనిషత్తులని నాలుగు భాగాలుగా వున్నాయి. వీనిలో ఉపనిషత్తులు వేదాలలో అంతిమ భాగాలు కాబట్టి వానిని వేదాన్తాలనికూడ అంటారు. ఇవి వేదాలలో జడ్జిమెంటువంటివి గాన చాలా ప్రాధాన్యత కలిగి శ్రుతి శిరస్సులనబడుతున్నవి.

వేదాలలోని సంహిత(మన్త్ర), బ్రాహ్మణ భాగాలు కర్మకాండ ప్రధానమైనవి. వానిని నిష్కామంగా కర్తృత్వ భోక్తృత్వాలను వదలి చేస్తే అవి చిత్తానికున్న మలదోషాన్ని పోగొట్టి చిత్తశుద్ధిని కలుగజేస్తాయి. శుద్ధజలం త్రాగడానికి పనికి వచ్చినట్లు, శుద్ధ జలపానం ఆరోగ్యాన్నిచ్చేట్లు; శుద్ధ చిత్తం, నిర్మలచిత్తం భగవదనుభూతికి ఒక మెట్టు అవుతుంది. ఆ పైవి ఆరణ్యకాలు. అవి ఉపాసనా ప్రధానమైనవి. ఆరణ్యకాలలోని ఉపాసనలవలన చిత్తంలోని విక్షేపదోషం పోతుంది. ఏకాగ్రత ఏర్పడుతుంది. నిర్మల ఏకాగ్రచిత్తము సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మతత్త్వజ్ఞాన గ్రహణ సమర్థమవుతుంది. పైవాని అనుష్ఠానంతో నిర్మల ఏకాగ్రచిత్తం అజ్ఞాననాశక తత్త్వజ్ఞానగ్రహణ సమర్థమవుతుంది. ఆత్మతత్త్వ జ్ఞాన ప్రతిపాదకాలు ఉపనిషత్తులు. నిర్మల ఏకాగ్రచిత్తంతో గురుబోధను శ్రవణం చేస్తే అది ఆవరణ దోషాన్ని పోగొడుతుంది. ఇలా జ్ఞానభాండారాలు జ్ఞానప్రదాలు.

నాలుగు వేదాలలో ఒక్కో వేదం కొన్ని శాఖలుగా ఏర్పడి ఆయా శాఖలవారిచే ఆ యా భాగం యథాతథంగా నేర్వబడి వేదం ఏ మార్పులు లేకుండా రక్షింపబడుతూ వస్తున్నది. నాలుగు వేదాలకు ఒక్కో వేదానికి వేరు వేరు శాఖలని చెప్పుకొన్నాం కదా! అందు అథర్వణవేదంలోని పలు శాఖలు లుప్తమై 9 శాఖలు మాత్రం మిగిలి వున్నాయి. ఆ అథర్వణవేదశాఖలలోనివే ముండక, ప్రశ్న, మాండూక్యోపనిషత్తులు.

నాలుగు వేదాలలో గల ఉపనిషత్తులలో పది ముఖ్యమైనవిగా భావించి, శ్రీ జగద్గురు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులనబడే త్రిమతాచార్యులచే వాటికి భాష్యాలు వ్రాయబడ్డాయి. ఆ దశోపనిషత్తులలో ప్రశ్నోపనిషత్తు కూడ ఉంది. అథర్వణవేదంలోని ముండకోపనిషత్తు మంత్రోపనిషత్తైతే, ప్రశ్నోపనిషత్తు బ్రాహ్మణోపనిషత్తుగా వుంది.

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులై, బ్రహ్మతత్త్వ జిజ్ఞాసువులైన ఆర్గురు సుకేశ, సత్యకామాదులు విద్వాంసుడు, సద్గురువైన పిప్పలాద మహర్షిని విడివిడిగా ప్రశ్నించగా పిప్పలాద మహర్షి చెప్పిన బోధయే ప్రశ్నోపనిషత్తు. ఇది ఆరు అధ్యాయాలతో వుంది. ఇందు మొదటి మూడు ప్రశ్నలు మూడధ్యాయాలు. దానిని తొలి త్రికమంటారు. ఆ తరువాతివగు నాలుగు, ఐదు, ఆరధ్యాయాలు మలి త్రికము. మొదటి త్రికంలోని అధ్యాయాలలో ప్రతిపాదించబడిన దానిని అపరా విద్య అంటారు. మలి త్రికం నాలుగు, ఐదు ఆరు అధ్యాయాలలో పరావిద్య తెలుపబడింది. ప్రథమ మూడధ్యాయాలలోని మొదటి అధ్యాయంలో సుకేశుని ప్రశ్నకు సమాధానంగా సృష్టింపబడిన ప్రాణుల మూలకారణం గురించి చెప్పబడింది. రెండవ అధ్యాయంలో సత్యకాముని ప్రశ్నకు సమాధానంగా మానవ ప్రకృతి వివరణ వుంది. మూడవ అధ్యాయంలో కౌసల్యుని ప్రశ్నకు సమాధానంగా ప్రాణమును, ప్రాణ స్వభావాన్ని, దాని కారణాన్ని, ప్రాణోపాసనను వివరించడం జరిగింది. ఇది అపరావిద్య. వీనిద్వారా చిత్తం శుద్ధంకాగా ప్రాణం ఆత్మకాదని, ఆత్మ వేరని దాన్ని తెలుసుకోవాలని జిజ్ఞాస కలుగగా నాల్గు, ఐదు, ఆరధ్యాయాలలో పరావిద్య తెలుపబడింది. ఇందు ఓంకారాన్ని- ప్రణవాన్ని గురించి చెప్పబడింది.

ఉపనిషద్విజ్ఞానాన్ని గురుముఖతః వినాలి. గురుసమాశ్రయం పొందిన యోగ్యుడైన శిష్యునికి సద్గురువు జ్ఞానాన్ని బోధిస్తాడు. ఆ విషయమే ఈ ఉపనిషత్తుద్వారా తెలియబడుతూంది. ఉపనిషత్తులను చదివినంత మాత్రాన యథార్థజ్ఞానం బోధపడదు. సద్గురువును ఆశ్రయిస్తే ఆయన శిష్యుని గ్రహణశక్తిని, శ్రద్ధను గమనించి దానికి తగిన రీతిలో ఉపనిషత్తులలోని లోతుపాతులను విడమరచి విశదీకరించి అజ్ఞాన పొరలను తొలగించి శిష్యుడిని జ్ఞానిగా మలుస్తాడు. అట్టి శిల్పనైపుణ్యం సద్గురువువద్దే వుంది. అట్టి శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడైన గురువు లభించడం పురాకృత పుణ్య విశేష ఫలితం.

పూజ్య శ్రీశ్రీశ్రీ దయానంద సరస్వతి స్వాములవారు ఋషీకేశ్ – పురాణ ఝఢీలో వున్నప్పుడు ఈ ఉపాధి సం 1965- 1968లలో ఋషీకేశ్ పరమార్థ నికేతన్ సంస్కృత మహావిద్యాలయంలో చదువుతూ వుండడం జరిగింది. ఆ కాలంలో అప్పుడప్పుడు పూజ్యశ్రీ దయానందస్వాములవారిని కలుసుకోవడం జరిగేది. పూజ్యశ్రీ దయానందస్వాములవారు వేదాన్తాన్ని బోధించడంలో కడునేర్పరి. అట్టివారి శిష్యులు

పూజ్యశ్రీ పరమార్థానంద సరస్వతి స్వాములవారు కూడా శిష్యులకు వేదాంతాన్ని బోధించడంలో దిట్టయని చాలమందిద్వారా విన్నాను. ఈ మధ్య వారి ప్రవచన గ్రంథాలను చూస్తే ఆ మాట నూటికి నూరు పాళ్ళు నిజమనిపించింది. వారి బోధనలలో విషయ వివరణ, చెప్పిన అంశాలకు శాస్త్ర ప్రమాణం, తర్కం, అనుభవం కలగలపి వుండడం ఒక విశేషం. శాస్త్రవాక్యం, గురువాక్యం, స్వానుభవం ఒకటి అయినపుడు దానికి మించిన ప్రమాణమే లేదు. శ్రీవారి గురువుగారు పూజ్య శ్రీశ్రీశ్రీ దయానంద స్వాములవారే వేదాంత బోధనలో సాటిలేని మేటి అయి వుండగా వారి శిష్యులలో ముఖ్యులైన పూజ్యశ్రీ పరమార్థానంద స్వాములవారి బోధనా పద్ధతిని గురించి వేరే చెప్పవలెనా? పూజ్యశ్రీ పరమార్థానందస్వాములవారి బోధనా పద్ధతిని రచయిత్రి ఇలా వ్రాశారు "అసలేమీ తెలియని ప్రపంచంలోకి స్వయంగా మన చేయిని పట్టుకొని ఒక్కొక్క మెట్టూ ఎక్కించి ఎక్కడ జారిపోతామో అని మధ్య మధ్య జాగ్రత్తగా చూచుకొంటూ పైకి తీసుకువెళ్ళి ఒక అద్భుత ప్రపంచాన్ని చూపించారు" అని. ఇట్టి స్వాములవారి వద్ద శ్రవణం చేసిన శ్రీమతి రాజ్యశ్రీ గారు, రాఘవరావు గారు చాలా ధన్యులు. "స్వయం తీర్ణః పరాంస్తారయతి" అను వాక్యం ప్రకారం తాము అనుభవించిన జ్ఞానామృతాన్ని ఈ రచనలద్వారా సమగ్రంగా మనకందరికి అందిస్తున్న రాఘవరావు దంపతులకు సద్గురు అనుగ్రహం మరింత వృద్ధినొందును గాక!

–ఓం–

– శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు
పీఠాధిపతి, శ్రీశుకబ్రహ్మాశ్రమం, కాళహస్తి

# పరమార్థానంద స్వామి- అనన్య గురువు

స్వామీజీతో మాకున్న అనుబంధాన్ని ఒకసారి పునశ్చరణ చేసుకుంటే, ఆయన మామీద కురిపించిన కృపాకటాక్షాలు ఎన్నో, ఎన్నెన్నో!

గత పదిహేను సంవత్సరాలుగా, మా వారు రాఘవరావు గారూ, నేనూ పరమార్థానంద స్వామి వారి బోధలు వింటూ వస్తున్నాము. మొదట క్యాసెట్లద్వారా విన్నాము. కొన్ని గుళ్ళల్లో వేదఘోష ప్రతిధ్వనిస్తున్నట్లుగా, మా ఇంట్లో ఇటుక, ఇటుకకూ ఆ స్వామీజీ గొంతు సుపరిచితమే అని అప్పట్లో మురిసిపోయేదాన్ని. కాని తర్వాత తెలిసింది, ఆయన గొంతు ప్రొద్దున్నా, సాయంత్రమూ చెన్నై మహానగరంలో ఎక్కడో అక్కడ మారుమ్రోగుతూనే ఉంటుందని.

స్వామీజీ ఉపనిషత్తులు బోధించిన విధానం చూసి, మైమరచిపోయి,ఆయన ఆశ్రమంలో పదిరోజులు ఉండి, ముఖతః ఆయన బోధ విందామని ఎన్నో కలలు గని, ఆయనకి ఫోన్ చేశాము ఆరోజుల్లో. స్వయంగా ఆయనే ఫోను ఎత్తారు. ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అలా ఆశ్రమమంటూ ఏమీ లేదని, వారు చెన్నైలోని అభిరామపురంలో ఒక ఇంట్లో ఉంటున్నారని, మమ్మల్ని ఇంటికి రావచ్చనీ చెప్పారు.

వెంటనే, ముందుగా చెన్నైలో ఆయన బోధ చేస్తున్న మూడు, నాలుగు చోట్లకి వెళ్ళాము. ఎక్కడ చూసినా ఐదారువందలమందికి తక్కువ లేరు వినేవారు. మెట్లమీద కూడా కూర్చుంటారు. అందరూ చక్కగా నోట్స్ రాసుకుంటారు.వయోవృద్ధులు కూడా నిన్న నేను రాలేదు, నీ నోట్సు ఒకసారి ఇస్తావా అని పక్కవారిని అడిగి తీసుకుంటారు. స్వామీజీ నిశ్శబ్దంగా ఒకవైపునుంచి వచ్చి, క్లాసు అయ్యాక, అంతే నిశ్శబ్దంగా వెళ్ళిపోయేవారు. చుట్టూ మనుష్యులు గుమిగూడటంలాంటి ఆర్భాటాలు ఏమీ లేవు. అది ఎంతో నచ్చింది మాకు.

దాని తర్వాత ఇంటికి వెళ్ళాము. ఇంటి దగ్గర కూడా మనుష్యుల తాకిడి లేదు. ఆయనే స్వయంగా వచ్చి తలుపు తీశారు. తన గదిలోకి తీసుకువెళ్ళారు. ఒక చెక్కమంచంమీద సన్నబొంత వేసి ఉంది అంతే. దానిమీద ల్యాప్‌టాప్ పెట్టుకుని తన బోధనలను ఎడిట్ చేసుకుంటున్నారు. ఆయన తన మంచంమీద కూర్చుని, కింద చాపమీద కూర్చోగలరా, లేకపోతే హాల్లో కుర్చీ ఉంది, కుర్చీ తెచ్చుకుంటారా అన్నారు. ఎంతో ఆదరంగా మాట్లాడారు

మాతో. ఏకాంతంగా ఆయనతో మాట్లాడి, వేదాంతంలో మాకు కలిగిన సందేహాలను తనివితీరా నివృత్తి చేసుకున్నాము.

అప్పట్లోనే రెండవసారి వెళ్ళినప్పుడు, బ్రహ్మసూత్రాల్లో ఆయన చెప్పిన మొదటి సూత్రం గురించి టూకీగా ఇంగ్లీషులో రాసి తీసుకెళ్ళాను. అది చదివి బాగుందన్నారు. ఆయన అంగీకారంతో ఆయన చెప్పిన ఆత్మబోధ, గైడెడ్ మెడిటేషన్ మా తెలుగు భక్తి పేజెస్ అనే వెబ్‌సైట్‌లో పెట్టాము.ఒక్కొక్క ఉపనిషత్తులో ఆయన చెప్పే విధానంలో ఒకొక్క ప్రత్యేకత గోచరిస్తుంది. ముండకోపనిషత్తులో 'జ్యోతిషాం జ్యోతిః' వివరించిన తీరు వర్ణనాతీతం! మోకాళ్ళనొప్పితో సరిగా నడవలేను బాబూ అంటే ఉపనిషత్తు గంతులు వేయిస్తోంది అంటూ ఒకొక్క గంతూ గెంతిస్తారు.

ఇప్పుడు ఈ **ప్రశ్నోపనిషత్తు**లో కొన్ని అధ్యాయాలలో ఒకొక్క ప్రశ్నకూ నాలుగు, ఐదు చిరు ప్రశ్నలు కూడి ఉంటాయి. ఆ అధ్యాయం అయ్యేలోపు ఆ చిరు ప్రశ్నలను, వాటి జవాబులను మనం వద్దనుకున్నా మనకు గుర్తుండి పోయేలా తనదైన పద్ధతిలో చెబుతారు.

స్వామీజీ చెప్పినది ఏది విన్నా దానికి అక్షరరూపం ఇవ్వాలని ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. స్వామీజీని కలిసిన కొత్తల్లో, 'స్వామీజీ,ఈ చిన్ని మెదడులో ఎన్నో పెద్ద ప్రణాళికలు ఉన్నాయి, భగవద్గీత వింటే అది రాయాలనిపిస్తుంది; బ్రహ్మసూత్రాలు వింటే అవి రాయాలనిపిస్తుంది; మీరు విడమర్చి చెప్పే ప్రకరణ గ్రంథాలు వింటే అవి రాయాలనిపిస్తుంది,' అంటే రెండుచేతులూ పైకెత్తి మనసారా దీవించారు. 'అన్నీ రాస్తావు, అన్నీ అక్షరరూపం దాలుస్తాయి,' అన్నారు.

సత్యవ్రతానంద సరస్వతి స్వామినితో స్వామీజీ ఇలా దీవించారంటే, 'ఆయన దీవించారంటే అక్షరాలా జరిగితీరుతుంది,' అన్నారు. ఆ దీవెనలు ఫలించాయి. ఇప్పటి వరకు మూడు ప్రకరణ గ్రంథాలు, పది ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత కూడా తెలుగులో వెలుగులోకి తీసుకురాగలిగాము.

అలా రాస్తున్న ఒరవడిలో, 'నేను ప్రత్యేకంగా ఇంకా ఏమన్నా రాయాలని మీకుందా స్వామీజీ,' అన్నాను. అంటే వెంటనే నాలుగు చిన్న పుస్తకాలు స్వయంగా నా చేతిలో పెట్టారు స్వామీజీ. 'అమ్మా, ఇవి **వేదాంతిక్ స్నాక్స్** పేరిట నేను ప్రత్యేక సందర్భాలలో ఇచ్చిన ప్రసంగాలు. ఇవి తెలుగులో రాస్తే బావుంటుంది,' అన్నారు. మా ఇద్దరికీ ఎంతో సంతోషం వేసింది. ఆ పుస్తకాలూ, మరికొన్ని ఆడియో ప్రసంగాలూ కలిపి

**వేదాంత జీవన విధానం** పేరిట పుస్తకంలా ప్రచురించాము. ఈ **వేదాంత జీవన విధానం** చాలా ప్రజాదరణ పొందింది. అచిరకాలంలోనే రెండవ ముద్రణకు కూడా నోచుకుంది. అలాగే ఉపనిషత్తుల్లోంచి ఇంగ్లీషులో కొన్ని వ్యాసాలు కూడా రాశాను.

వీటిని ఈ క్రింది లింక్ లో చూడవచ్చు.
http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

స్వామీజీని లలిత అని ఒకామె భగవద్గీత అధ్యాయాల సారాంశం, స్వామీజీ చెప్పినది, తెలుగులో అనువదించమా అని అడిగితే, రాజ్యశ్రీ నావి తెలుగులో అనువదిస్తున్నారు, ఆమె ఇప్పటికే చేశారేమో కనుక్కోండి అన్నారుట. ఇంక నా ఆనందానికి పట్టపగ్గాలు లేవు. స్వామీజీ కృపా కటాక్షాలతో భగవద్గీతను మూడు షట్కాలుగా ప్రచురించగలిగాము.

స్వామీజీమీద అభిమానం కొద్దీ కొందరు కలిసి arshaavinash.in అన్న వెబ్ సైట్ పెట్టి ఆయన చెప్పిన బోధలన్నింటికీ ఇంగ్లీషులో అక్షరరూపం ఇచ్చారు. అది నిజంగా హెర్క్యులియన్ టాస్క్. www.vedantavidyarthisangha.org లో ఆయన ఆడియో సీ డీ లు దొరుకుతాయి. ఆయన బోధల ఆధారంగా వచ్చిన ఈ అనువాదాలు చదివి, ఇక్కడితో ఆగకుండా, అక్షరాలా ఆయన చెప్పినదే మీరు కూడా విని ధన్యజీవులవ్వాలని మీకు నా విన్నపం.

స్వామీజీ బోధలు ఒక్కసారి వింటే చాలు వింటూనే ఉంటారు. స్వయంగా కలిసి, మనసారా మాట్లాడుకోచ్చు. పదిహేను సంవత్సరాల క్రితం ఎలా నిరాడంబరంగా ఉన్నారో, ఎలా ఆత్మీయంగా మాట్లాడారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. స్వామీజీని ఒకసారి చూస్తే చాలు మన మనస్సులో చెరగని ముద్ర వేస్తారు.

ఒకసారి, మాకు ఏదన్నా సందేశం ఇవ్వండి అంటే, **'ఫాలో ది శాస్త్ర'** అన్నారు. శాస్త్రం చదివినకొద్దీ అది ఎంత అక్షరసత్యమో తెలుస్తుంది. అది మన సనాతన ధర్మం. అది పాటిస్తే చాలు. ఇలాంటి గురువు దొరకటం మా అదృష్టం.

**నమో నమః శ్రీగురు పాదుకాభ్యామ్ ।**

**మద్దూరి రాజ్యశ్రీ**

# ఆర్ష ఆనందకుటీర్ సభ్యుల స్పందన

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।।**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మః తస్మై శ్రీగురవే నమః।।**

**సదాశివసమారంభామ్, శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార పర్యంతామ్, వందే గురుపరంపరామ్।।**

కొన్ని సంవత్సరాలు మా గురువు గారు శ్రీ కస్తూరి రాఘవ రావు గారు, సహ గురువుగారైన వారి సతీమణి మద్దూరి రాజ్యశ్రీగారు, అపర్ణా సరోవర్‌లోని మాకెంతో ఆప్తురాలయిన శ్రీమతి సూర్యకుమారిగారి ఇంట్లో వేదాంతం భగవద్గీత, ఉపనిషత్తులద్వారా బోధించారు. వారిద్దరూ శ్రీ స్వామి దయానంద సరస్వతిగారి శిష్యులైన శ్రీ పరమార్థానంద స్వామి వారి వద్ద బహుకాలం శిష్యరికం చేసి ఆత్మవిద్యలో నిష్ణాతులయ్యారు. వారిద్దరూ గురువులుగా దొరకడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాము. ఇందుకు పరోక్షంగా కారణభూతురాలయిన శ్రీమతి సూర్యకుమారి గారికి కూడా కృతజ్ఞతాభివందనాలు.

ఈ బ్రహ్మవిద్య గురించి మొదట్లో మాకెంత మాత్రం అవగాహనలేదు. ఆత్మవిద్య నేర్చుకోడానికి, తద్వారా జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందడానికి మనుష్యజన్మ మాత్రమే అత్యంత అనువైనదని తెలుసుకున్నాము.

ఆత్మవిద్య సమర్థుడైన గురువుద్వారా అర్హులైన శిష్యులు మాత్రమే క్రమశిక్షణతో నేర్చుకునే విద్య. కాని, అట్టి అర్హతలు అంతంత మాత్రంగా ఉన్నా, మాలో చాలా మంది మలి వయసులో ఉన్నా, మాకు సులభంగా అర్థం కావాలనే తపనతో, సరళమైన భాషతో, వారి స్వంత రచనలతో, దాదాపు ప్రతి ఉపనిషత్తునూ, మాకు బోధిస్తున్న సమయంలో, పుస్తకరూపంలో ప్రచురించి ఎప్పటికప్పుడు మాకు అందజేసి మా శ్రమను తగ్గిస్తున్న మా గురువులకు సదా ఋణపడి ఉంటాము.

ప్రస్తుతం మీరు చూస్తున్న ఈ పుస్తకం '**ప్రశ్నోపనిషత్**' లో, ఆరుగురు శిష్యులు ఆత్మజ్ఞానానికి సంబంధించి వేసిన ప్రశ్నలకు వారి గురువుగారు పిప్పలాద ఋషి సమాధానాలు చెప్పినట్లు కనిపించినా, దాన్ని సరళమైన భాషలో వివరంగా ఎంతో విలువైన సమాచారంతో విశ్లేషణాత్మకంగా మా గురువుగారు శ్రీమతి రాజ్యశ్రీగారు రచించిన శైలి

మమ్మల్నందర్నీ ఎంతగానో ఆకట్టుకుంది. అందుకు వారికి మాప్రత్యేక ధన్యవాదాలు. అచిరకాలంలోనే ఈ **'ప్రశ్నోపనిషత్'** ద్వితీయ ముద్రణకు నోచుకుంది.

మా గురువులు ఇప్పటి వరకు తత్త్వబోధ, ప్రకరణ గ్రంథాలు, భగవద్గీత, ఏకాదశ ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు నేర్పించారు. పురుషసూక్తం, రుద్రం, విష్ణు సహస్రనామం పారాయణం కూడా అర్థసహితంగా నేర్పించారు. వీటిద్వారా మేము ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నాము. ముఖ్యంగా సృష్టిప్రకరణం, బ్రహ్మస్వరూపం, ఆత్మ–అనాత్మల వివేకం, జీవ–ఈశ్వర ఐక్యం, జగన్మిథ్యాత్వం, ఆత్మజ్ఞానికి లభించే జ్ఞానఫలం, దేహాంతమందు అజ్ఞాని ప్రయాణం, మోక్ష సాధనకు తోడ్పడే వివిధ మార్గాలు మొదలైన ఎన్నో విలువైన మంచి విషయాలు సవివరంగా మరల మరల తెలియజేసి మాకు జ్ఞానజ్యోతిని వెలిగించారు.

ఈ సంపాదించిన జ్ఞానంతో, మేము జీవన్ముక్తి పొందామనే నమ్మకం కలుగుతోంది. మా జీవనశైలిలో ఇప్పటికే గణనీయమైన మార్పు వచ్చిందని భావిస్తున్నాము. ఇప్పుడు ఆన్ లైన్ ద్వారా గురుదంపతులు మళ్ళీ వేదాంతాన్ని బోధిస్తూ, ప్రతిరోజూ మాలో ఒకరిచేత రీక్యాప్ చేయిస్తున్నారు. వీరితోపాటు శ్రీ విష్ణుప్రసాదు గారు కూడా వేదాంతాన్ని చాలా చక్కగా బోధిస్తున్నారు.

మాలో ఈవిధంగా జ్ఞానార్తిని కలిగించి మా జన్మసార్థకతకు కారణభూతులైన మా గురువులకు పాదాభివందనాలు.

ఈ అమూల్యమైన ఆత్మవిద్యని మరింతమందికి ప్రసాదించే శక్తిని, తగిన ఆయురారోగ్యాలను ఆ భగవంతుడు మా గురువర్యులిద్దరికీ ప్రసాదించాలని మేమంతా మనసారా కోరుకుంటున్నాము.

– ఆర్ష ఆనంద కుటీర్

సభ్యుల తరపున,

పి.వి.యస్. యస్. శాస్త్రి.

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ।
ధీనామవిత్ర్యవతు। గణేశాయ నమః।
సరస్వత్యై నమః। శ్రీ గురుభ్యో నమః।
హరిః ఓమ్॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# ప్రశ్నోపనిషత్తు -ఉపోద్ఘాతం

**సదాశివసమారంభామ్ శంకరాచార్యమధ్యమామ్ ।**
**అస్మదాచార్యపర్యంతామ్, వందే గురుపరంపరామ్ ॥**

వేదం అనే పదం విద్ ధాతువునుంచి వచ్చింది. విదంతి అనేన ఇతి వేదః – విద్ అంటే తెలుసుకోవటం. ఈ వేదాలు అపౌరుషేయాలు, మనిషి మేధస్సునుంచి వచ్చినవి కావు. వేదాలు మన ప్రాథమిక గ్రంథాలు. అవి నాలుగు – ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం. వేదాలలో ఉన్న విషయాలనిబట్టి వాటిని రెండు భాగాలుగా విభజించారు. వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అంటారు. అందులో అనేక క్రతువుల గురించీ, అనేక ఉపాసనల గురించీ విపులంగా ఉంటుంది. వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అంటారు. అందులో ఆత్మజ్ఞానం గురించి ఉంటుంది.

కర్మలు చేసీ, ఉపాసనలు చేసీ, చివరికి అవి మనిషికి మోక్షాన్ని ఇవ్వవు, మోక్షం కావాలంటే జ్ఞానకాండకు రావాలి అని తెలుసుకుంటారు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన । – ముండకమ్**

జ్ఞానకాండకి వచ్చేసరికి, పరిస్థితి కొత్తగా ఉంటుంది. నేను అపూర్ణపురుషుణ్ణి అనుకుంటే నువ్వు పూర్ణపురుషుడివి అంటుంది. నువ్వు బ్రహ్మని కొత్తగా పొందనక్కరలేదు. నువ్వే బ్రహ్మవి అంటుంది. ఈ విషయం ఆశ్చర్యంగా తెలుసుకుంటారు. ఆత్మవిచారం లేదా జ్ఞానయోగంద్వారా ఆత్మజ్ఞానం పొందితే, కర్మతో పనిలేదు అంటుంది వేదాంతం.

ఆత్మజ్ఞానం స్వంతంగా పొందవద్దు, గురుశాస్త్ర ఉపదేశంద్వారానే పొందాలి అని సూచిస్తుంది కూడా. ఇదే సంప్రదాయం. ఆత్మజ్ఞానం పొందితే – జీవత్వభ్రాంతి అవగచ్ఛతి, బ్రహ్మత్వజ్ఞానం ఆగచ్ఛతి. నేను బ్రహ్మ అన్నది కొత్త విషయం కాదు, కొత్త హోదా మాత్రమే.

**ఉపనిషత్తు:** ఉపనిషత్తుకు అనేక పేర్లున్నాయి. ఉదా: వేదాంతం, బ్రహ్మవిద్య, జ్ఞానకాండ.

**1. వేదాంతం:** వేద అంతభాగం కాబట్టి వేదాంతం అయింది. వేదస్య అంతః– సాధారణంగా అంతభాగంలో ఉంటుంది కాని ఒక్కోసారి అది ముందు కూడా ఉండవచ్చు. ఉదా: సంహితోపనిషత్తు. దీన్ని వేదశిఖ, వేదాగ్రం, ఉత్తరమీమాంస అని కూడా అంటారు. అది ఉన్న స్థానాన్నిబట్టి ఆపేరు వచ్చింది.

**2. జ్ఞానకాండ:** కేవలం జ్ఞానం మాత్రమే. కర్మలేదు. వేదపూర్వభాగంలో అనేక కర్మల గురించి చాలా వివరంగా ఉంటుంది. వేదాంతంలో నిర్గుణ ఈశ్వరజ్ఞానం వస్తుంది.

**3. బ్రహ్మవిద్య:** జ్ఞానం దేని గురించి, అని అడిగితే బ్రహ్మవిద్య అన్న జవాబు వస్తుంది. తత్ త్వం అసి అనే బోధ చేస్తుంది కాబట్టి బ్రహ్మవిద్య అనే పేరు వచ్చింది.

**ఉపనిషత్తు పద అర్థం:**

ఉపనిషత్తు పదానికి కూడా అనేక అర్థాలున్నాయి. దాని గురించిన శ్లోకం –

**ఉపనీయేమమాత్మానం బ్రహ్మాపాస్తద్వయం తతః।**
**నిహన్త్యవిద్యాం తజ్జం చ తస్మాదుపనిషన్మతా॥**

ఉపనీయ – దగ్గరగా తీసుకువెళ్ళేది; ఎవరిని ఎవరి దగ్గరకి? ఇమమ్ ఆత్మానామ్– ఈ జీవాత్మని ఆ పరమాత్మ దగ్గరికి. ఎటువంటి బ్రహ్మ?– అపాస్తద్వయం– ద్వైతం కాని బ్రహ్మ. నిర్వికల్పబ్రహ్మ. ఈ రెండూ కలవటంవల్ల ఏం చేస్తుంది? నిహంతి అవిద్యాం– అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. బ్రహ్మకీ, జీవాత్మకీ మధ్య భేదం సృష్టించిన అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అంతేనా? తజ్జం చ– అజ్ఞానమనే అవిద్యవల్ల పుట్టిన సమస్తాన్నీ నాశనం చేస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే సంసారాన్ని.

అజ్ఞానంవల్ల మనం ఏడు తప్పటడుగులు వేస్తాము. అహంకారం, కర్తృత్వ భోక్తృత్వం, కామం, కర్మ, కర్మఫలం, సుఖదుఃఖం, పునరపి జననం. అజ్ఞానంవల్ల నేను గొప్పవాడిని అనే అహంకారం పెరుగుతుంది. ఆ అహంకారం నేను చేస్తున్నాను అనే భావనను ఇస్తుంది. దానివల్ల కోరిక పుట్టి, కోరికకు తగ్గ పనులు చేస్తాము. వాటివల్ల సుఖదుఃఖాలు పొందుతాము. ఆ పనులకు తగ్గ ఫలాన్ని (పుణ్య,పాపాలు) అనుభవించటంకోసం తిరిగి జననమరణాలు పొందుతాము. లౌకికంగా జీవితభాగస్వామితో ఏడడుగులు వేసి, అరుంధతీ నక్షత్రదర్శనం చేసి, సంసారంలో అడుగుపెడితే, అజ్ఞానమనే జీవితభాగస్వామితో ఏడు తప్పటడుగులు వేసి సంసారమనే బంధంలో కూరుకు పోతున్నాము. మూడు ముళ్ళు వేసి వివాహంలో ఒకటయితే, అరుంధతీ నక్షత్రన్యాయంద్వారా మూడుముళ్ళు (గ్రంథులు) విప్పుకుని, ఉపనిషత్తుద్వారా పరమాత్మతో ఒక్కటవాలి.

అందువల్ల ఉప ని అంటే జీవాత్మ, పరమాత్మలను కలిపేది, షద్ అంటే సంసారాన్ని నాశనం చేసేది అని ఒక అర్థం.

ఇంకో అర్థం ఉప+ని+షద్గా విడదీస్తే వస్తుంది. ఉప అంటే గురుసమీపానికి వెళ్ళి, ని అంటే కింద కూర్చుని, నేర్చుకుంటే, షద్ – బంధాన్ని లేదా సంసారాన్ని నాశనం

చేస్తుంది. ఇంకో అర్థం ఉప అంటే అత్యంత సమీపంగా ఉన్న ఆత్మ గురించిన, ని – నిశ్చయజ్ఞానానికి, షద్ – తీసుకు వెళ్తుంది (మోక్షానికి).

సూక్ష్మభేదం:– ఉపనిషత్తు పదానికే ప్రాముఖ్యత ఉంది. వేదాంతవాక్యాలే ఉపనిషత్తు అని అర్థం. వేదాంతం బోధచేసే తత్త్వమసిలాంటి వాక్యాలు ఉపనిషత్తా? వాటిని విడమరచి అవగాహనా పరంగా చెప్పే జ్ఞానం ఉపనిషత్తా? దేనికి ప్రాముఖ్యతనివ్వాలి? శంకరాచార్యులవారు దానికి జవాబు చెబుతారు. సహజంగానే జ్ఞానమే ముఖ్యం. పదాలవల్లే మోక్షం వచ్చేస్తే, ఇంక ఉపనిషత్తును కష్టపడి నేర్చుకోనక్కరలేదు.

ఉపనిషత్తు సంఖ్య:– ఉపనిషత్తులు మొత్తం 1180 ఉన్నాయి. అందులో ప్రఖ్యాతి చెందినవి 108. కాని ముఖ్యంగా అధ్యయనం చేసేది 10. ఎందుకంటే ఆ పది ఉపనిషత్తులకూ శంకరాచార్యులవారు భాష్యం చెప్పారు. వాటిని తేలికగా గుర్తుంచుకోవటానికి ఒక శ్లోకరూపంలో ఉంటుంది.

**ఈశకేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః ।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా ॥**

ఈ పది ఉపనిషత్తులే ఎందుకు? ఎందుకంటే ఈ పది ఉపనిషత్తులు అధ్యయనం చేస్తే వేదాంతసారం మొత్తం అన్ని కోణాల్లోంచి తెలుస్తుంది. ఇవి నాలుగు వేదాల్లోంచీ ఏర్పడ్డాయి. అదీ కాక బ్రహ్మసూత్రాల్లో తర్కం ఈ పది ఉపనిషత్తులలోని మంత్రాల గురించే ఎక్కువగా ఉంటుంది.

**ఉపనిషత్తు తీరు:** ప్రశ్నోత్తరరూపేణ ప్రతిపాదితయా ఉపనిషత్. ఉపనిషత్తులు ఎక్కువగా సంవాదరూపంలో, అంటే సంభాషణరూపంలో ఉంటాయి. భగవద్గీతను కృష్ణార్జునుల సంవాదం అని కూడా అంటారు. ఈ గురుశిష్యుల సంవాదం ఒక గురువుకీ, ఒక శిష్యునికీ మధ్య ఉండవచ్చు. ఒక గురువుకీ, అనేకమంది శిష్యులకీ మధ్య ఉండవచ్చు. అనేక గురువులకీ, అనేక శిష్యులకీ మధ్య కూడా ఉండవచ్చు. ఉదా: ముండక ఉపనిషత్తులో శౌనక అంగిరసుల మధ్య సంభాషణ ఉంటే, ప్రశ్నోపనిషత్తులో పిప్పలాద ఋషికి, ఆరుగురు శిష్యులకీ మధ్య సంభాషణ ఉంటుంది. ఛాందోగ్యోపనిషత్తులో అనేక గురువులకూ, అనేక శిష్యులకూ మధ్య సంభాషణ ఉంటుంది.

**ఉపనిషత్తు పేరు:** ఒకొక్క ఉపనిషత్తుకీ ఒక్కొక్క కారణంవల్ల ఆ పేరు వచ్చింది. ఈశా వాశ్యమిదగ్ం సర్వం అన్న మొదటి పాదంనుంచి ఈశావాశ్య ఉపనిషత్తు పేరు వచ్చింది. ముండకోపనిషత్తుకి అందులో చేసే ముండకవ్రతం (శిరోవ్రతం)వల్ల ఆ పేరు వచ్చింది.

ఆరుగురు శిష్యులు ప్రశ్నలు వేయటంవల్ల ప్రశ్నోపనిషత్తుకు ఆ పేరు వచ్చింది. ముండకోపనిషత్తును మంత్రోపనిషత్తు అని, ప్రశ్నోపనిషత్తును బ్రాహ్మణోపనిషత్తు అనీ అంటారు. బ్రాహ్మణ అంటే బ్రాహ్మణజాతి అని కాదు అర్థం. వేదంలో రెండు భాగాలున్నాయి. మంత్రభాగం, బ్రాహ్మణ భాగం. మంత్ర బ్రాహ్మణయోః వేదనామధేయమ్. మంత్రభాగాన్ని బ్రాహ్మణభాగం విపులంగా చర్చిస్తుంది. ఇదే ముండక, ప్రశ్నల మధ్య ఉన్న అనుబంధం. ఉదాహరణకు ముండకోపనిషత్తులో పరావిద్య, అపరావిద్యల గురించి టూకీగా వస్తుంది. ప్రశ్నోపనిషత్తులో ఇంకా వివరంగా వస్తుంది. ప్రశ్నోపనిషత్తులో 6 అధ్యాయాలున్నాయి. వాటిల్లో సృష్టిప్రకరణం, ప్రాణస్తుతి, ప్రాణ ఉపాసన, బ్రహ్మవిద్య, ఓంకార ఉపాసన, షోడశకళపురుష పరంబ్రహ్మ (పరావిద్య) గురించి వస్తాయి. ఆరుగురు శిష్యులు అడిగిన ఆరు భిన్నప్రశ్నలకు చెప్పిన జవాబులివి.

శాంతి పాఠం:– ఒక్కొక్క వేదానికీ ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. శాంతిపాఠం విఘ్నాలు కలగకుండా ఉండటంకోసం పఠిస్తాము. ఉపనిషత్తు నేర్చుకునే సమయంలో రెండు రకాల విఘ్నాలు కలుగుతాయి. అవి దృష్టప్రతిబంధకం, అదృష్టప్రతిబంధకం (కనబడే ఆటంకాలు, కనబడని ఆటంకాలు). ఉపనిషత్తు నేర్చుకునే సమయంలో అవి తొలగించమని సర్వజ్ఞుడైన భగవానునికి చేసే ప్రార్థనే శాంతిపాఠం.

**శాంతిపాఠం**

**ఓం భద్రం కర్ణేభిశ్శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః ॥**

దేవతలారా! మేం చెవులతో మంచి విషయాలు వినాలి. కన్నులతో మంచి దృశ్యాలు చూడాలి. దృఢమైన అవయవాలతో కూడిన దేహాలతో మాకు ఆయుష్షు ఉన్నంతవరకూ మిమ్మల్ని స్తుతించాలి. మీకు మేలుకలిగే రీతిలో మేం జీవితం గడపాలి. ఇంద్రుడు, సూర్యుడు, గరుత్మంతుడు, బృహస్పతి మాకు శుభం కలిగించాలి.

# అధ్యాయం - 1

**మంత్రం - 1**

**ఓం నమః పరమాత్మనే। హరిః ఓం ॥**

**సుకేశా చ భారద్వాజః శైబ్యశ్చ సత్యకామః సౌర్యాయణీ చ గార్గ్యః కౌసల్యశ్చాశ్వలాయనో భార్గవో వైదర్భిః కబన్ధీ కాత్యాయనస్తే హైతే బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠాః పరం బ్రహ్మాన్వేషమాణా ఏష హ వై తత్సర్వం వక్ష్యతీతి తే హ సమిత్పాణయో భగవన్తం పిప్పలాదముపసన్నాః ॥ 1 ॥**

**ప్రతిపదార్థం:** పరమాత్మనే– పరమాత్మకు; నమః – నమస్సులు; సుకేశా చ భరద్వాజః– భారద్వాజ గోత్రీకుడైన సుకేశుడు; శైబ్యశ్చ సత్యకామః – శిబి (చక్రవర్తి కాదు) ఋషికొడుకు, సత్యకాముడు; సౌర్యాయణీ చ గార్గ్యః – గార్గ్య గోత్రీకుడు సౌర్యాయణుడు; కౌసల్యశ్చ ఆశ్వలాయనః – అశ్వలుని పుత్రుడైన కౌసల్యుడు; భార్గవో వైదర్భిః – భృగుఋషి కుటుంబానికి చెందిన విదర్భుడు; కబన్ధీ కాత్యాయన– కత్యపుత్రుడైన కబన్ధుడు; తేహ– వారు; బ్రహ్మపరాః– సాధనచతుష్టయసంపన్నులు; బ్రహ్మనిష్ఠా – అవ్యభిచారభక్తి ఉన్న వారు; పరం బ్రహ్మ అన్వేషమాణాః– పరబ్రహ్మని అన్వేషిస్తున్నవారు; తే హ– వారు; భగవంతం– దేవర్షియైన; పిప్పలాదమ్– పిప్పలాదుని; ఏష హ వై తత్సర్వం వక్ష్యతీతి – పరబ్రహ్మ గురించి అంతా బోధిస్తారని; సమిత్పాణయః– సమిధలు తీసుకుని; ఉపసన్నాః– ఆయన దగ్గరకు వెళ్ళారు.

**తాత్పర్యం:** సుకేశ భరద్వాజ, శైబ్య సత్యకామ, సౌర్యాయణీ గార్గ్య, కౌసల్య ఆశ్వలాయన, భార్గవ వైదర్భి, కబన్ధీ కాత్యాయన అనే ఆరుగురు, సాధనచతుష్టయ సంపన్నులు, అవ్యభిచారభక్తి ఉన్నవారు, పరబ్రహ్మని అన్వేషిస్తున్నవారు. వారు దేవర్షియైన పిప్పలాదుడు, పరబ్రహ్మ గురించి అంతా బోధిస్తారని సమిధలు తీసుకుని ఆయన దగ్గరకు వెళ్ళారు.

**వివరణ:** మొదటి రెండు మంత్రాలూ ఉపోద్ఘాతం మంత్రాలు. అవి గురుశిష్యులను కలుపుతున్నాయి. బ్రహ్మవిద్య బోధ ఎక్కడా వెంటనే జరుగలేదు. అర్జునుడు కూడా ముందు, **'సఖాయ న తు శిష్య'**గా ఉన్నాడు. తర్వాత శరణువేడాక, రెండవ అధ్యాయంలో అర్జునుణ్ణి అధికారిగా గుర్తించిన తర్వాత నిజబోధ మొదలయింది. కఠోపనిషత్తులో కూడా అలాగే రెండవ అధ్యాయంనుంచి నచికేతునికి యమధర్మరాజు బోధిస్తాడు.

ఈ మంత్రంద్వారా మనకు కొన్ని విషయాలు తెలుస్తున్నాయి.

1. **తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్** – ఎప్పుడూ గురువు దగ్గరకు శిష్యుడు వెళ్ళాలి కాని శిష్యుని వెతుక్కుంటూ గురువు రానవసరం లేదు.

2. దీనివల్ల సంప్రదాయం విలువ తెలుస్తోంది. గురువు గొప్పదనం తను నేర్చుకున్న శాస్త్రాన్ని గుర్తుంచుకోవటంలో ఉంది. శంకరాచార్యులవారు కూడా వ్యాసాచార్యులవారు చెప్పింది వివరించి చెప్పారే కాని ఆయన స్వంతంగా మార్చి రాయలేదు. ఎవరు చెప్పినా ఒకటే పద్ధతిలో చెప్పాలి. అది అధ్యారోప–అపవాద పద్ధతి. ఎవరు చెప్పినా ఒకటే బోధ చేయాలి. అది బ్రహ్మవిద్య.

3. గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు అయి ఉండాలి. శిష్యుడు సాధనచతుష్టయ సంపన్నుడై ఉండాలి.

సుకేశ భరద్వాజ, శైబ్య సత్యకామ, సౌర్యాయణీ గార్గ్య, కౌసల్య ఆశ్వలాయన, భార్గవ వైదర్భి, కబన్ధీ కాత్యాయన అనే పేర్లుగల ఆరుగురు శిష్యులు పిప్పలాద అనే గురువు దగ్గరకు వచ్చారు. వీరిలో ఒక్కొక్కరికి రెండు పేర్లు ఉన్నాయి. ఒకటి వారి పేరు, రెండోది వారి వంశపరంపరనుసూచించే పేరు. దీన్నిబట్టి వారికి గొప్ప సంస్కారం ఉందని తెలుస్తోంది. వారిని **బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠా** అంటోంది ఉపనిషత్తు. బ్రహ్మపరులు, బ్రహ్మనిష్ఠులైతే బ్రహ్మవిద్య కొత్తగా నేర్చుకోవడమేమిటీ? బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠా అంటే ఇక్కడ సగుణబ్రహ్మపరులు, సగుణబ్రహ్మనిష్ఠులని అర్థం.

బ్రహ్మపరా ఒక అర్థం, వారు కర్మకాండ ముగించి, చిత్తశుద్ధి పొంది, ఉపాసన చేసి, చిత్తనైశ్చల్యం పొందారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే సాధనచతుష్టయ సంపన్నులయ్యారు. వారికి, బ్రహ్మనిష్ఠ అంటే అచంచల భక్తి ఉంది. ఇంకో అర్థం వారు వేదంమీద శ్రద్ధ చూపి, వైదికమార్గాన్ని అనుసరిస్తున్నారు.వారికి కావాల్సినంత భక్తి, శ్రద్ధలు ఉన్నాయి. ఇలాంటి వారు వేదాంతంకొస్తే వారికి శ్రద్ధ పెంచుకోవటానికి సమయం వృథా అవదు.

ఎందుకు వచ్చారు? **పరం బ్రహ్మ అన్వేషమానా** – సగుణబ్రహ్మ ఉపాసనవల్ల మోక్షం కలగదని గ్రహించారు. దాని పరిమితులు తెలుసుకున్నారు. కర్మకాండ, ఉపాసనలతోనే మోక్షం పొందేటట్టయితే ముందుకు ఎందుకు వస్తారు? మొదటి దుకాణంలోనే కావాల్సిన వస్తువు దొరికితే, ఇంకో దుకాణానికి ఎందుకు వెళతారు?

**పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన । – ముండకమ్**

పరబ్రహ్మజ్ఞానంవల్లే బ్రహ్మను పొందవచ్చని తెలుసుకున్నారు. పిప్పలాద దగ్గరకు ఎందుకు? **భగవంతం** – అంటే సర్వజ్ఞుడు; **సర్వశక్తిమాన్**– చెప్పే సామర్థ్యం ఉన్నవాడు. గురువుకు జ్ఞానం పుష్కలంగా ఉండాలి. ఆ ఉన్న జ్ఞానాన్ని విధి ప్రకారం బోధించాలి. ఆయన దగ్గరకు సమిధలు తీసుకువెళ్ళారు.

**రిక్త పాణిర్ న సంపశ్యేత్ రాజానం, దేవతాం, గురుమ్ ॥**

రాజు దగ్గరకి, దైవసన్నిధికి, గురువు దగ్గరకి ఖాళీ చేతులతో వెళ్ళకూడదు; ఆయన దగ్గరకి ఎందుకు వెళ్ళారు?

**ఏషః హ వై తత్సర్వం వక్ష్యతి**– ఆయన మొత్తం బోధిస్తారని వారి ఆలోచన.

**మంత్రం - 2**

**తాన్ హ స ఋషిరువాచ భూయ ఏవ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా సంవత్సరం సంవత్స్యథ యథాకామం ప్రశ్నాన్పృచ్ఛత యది విజ్ఞాస్యామః సర్వం హ వో వక్ష్యామ ఇతి ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** తాన్ – వారితో; సః ఋషిః – ఆ ఋషి; ఉవాచ – చెప్పాడు; భూయ ఏవ– ఇక్కడ; సంవత్సరం సంవత్స్యథ – ఒక సంవత్సరం; తపసా – క్రమశిక్షణతో; బ్రహ్మచర్యేణ– సుఖాలకి అతీతంగా (ఉండండి); శ్రద్ధయా– గురువుమీద, శాస్త్రంమీద శ్రద్ధ చూపండి; యథాకామం– (అప్పుడు) మీరు అనుకున్నట్లు; ప్రశ్నాన్ పృచ్ఛత– ప్రశ్నలు అడిగితే; యది విజ్ఞాస్యామః – అవి నాకు తెలిస్తే; హ– తప్పకుండా; సర్వం వః వక్ష్యామః– నాకు తెలిసినదంతా మీకు చెబుతాను; ఇతి– అని.

**తాత్పర్యం:** వారితో ఆ ఋషి చెప్పాడు – 'మీరు ఇక్కడ ఒక సంవత్సరం పాటు క్రమశిక్షణతో, సుఖాలకి అతీతంగా ఉండండి. గురువుమీద, శాస్త్రంమీద శ్రద్ధ చూపండి. అప్పుడు మీరు అనుకున్న ప్రశ్నలు అడిగితే, అవి నాకు తెలిస్తే, తప్పకుండా నాకు తెలిసినదంతా మీకు చెబుతాను.'

**వివరణ:** పిప్పలాద ఋషి వారికి వెంటనే చెబుతానని అనడం లేదు. సంవత్సరం ఉండండి. సంవత్సరం తరువాత ప్రశ్నలు వేయండి అన్నాడు. అప్పుడన్నా చెబుతానని మాట ఇవ్వటం లేదు. నాకు తెలిస్తే చెబుతానన్నాడు. ఈ సందర్భం అనేకసార్లు ఉపనిషత్తుల్లో వస్తుంది. అంటే శిష్యుడు అడగగానే జ్ఞానబోధ చేయటానికి గురువు తటపటాయించటం. దీనికి కారణాలు అనేకం.

1. ఈ శిష్యునికి మోక్షంమీద ఎంత శ్రద్ధ ఉందో తేల్చుకోవాలి. కొన్నాళ్ళ తర్వాత చెబుతానంటే, కొంతమంది జారిపోతారు. వారికి నిజంగా శ్రద్ధ ఉంటేనే ఓపికగా ఆగుతారు.

2. ఇతనికి అర్హత ఉందో లేదో గురువుకి తెలియాలి. లేకపోతే బోధని అపార్థం చేసుకునే అవకాశం ఉంది.

**న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానాం కర్మసంగినామ్ ।**
**జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్ ॥ గీత 3-26**

3. కావాల్సిన అర్హతల్లో ఏదైనా తక్కువ ఉంటే, ఆ గడువు కాలంలో దాన్ని పెంపొందించుకునేందుకు గురువు దోహదం చేయవచ్చు.

4. పరస్పర అవగాహన ఉంటే బోధ తేలికగా బోధపడుతుంది. గురువు దగ్గరకి కొత్తగా వెళితే, గురువు అలవాటవటానికి కొంత సమయం వృథా అవుతుంది.

5. శిష్యుడు కోరింది ఏ సిద్ధులో, మరేదో అయితే, గురువు అది కుదరదని చెప్పటానికి ఇక్కడ ఆస్కారం ఉంటుంది.

అందుకే **సంవత్సరం సంవత్స్యథ** అన్నాడు పిప్పలాద ఋషి. ఋషి అంటే జ్ఞాని. ఋషతి జానాతి ఇతి ఋషిః. వారు ఎలా ఉండాలో కూడా చెప్పాడు. **తపసా బ్రహ్మచర్యేణ**– తపస్సు అంటే క్రమశిక్షణ. ఆశ్రమంలో ఎలా ఉండాలో అలా ఉండాలి. అది సెలవులకి సరదాగా వెళ్ళే ప్రాంతం కాదు. అలాగే బ్రహ్మచర్యం అంటే సుఖాలు కోరుకోకూడదు. సుఖం కోరేవానికి విద్య ఎక్కడిది? విద్య కోరుకునేవారికి సుఖం ఎక్కడిది? ఇంకో లక్షణం శ్రద్ధ. గురువుమీద, శాస్త్రంమీద శ్రద్ధ పెట్టాలి. ఆశ్రమం బాగుచేయమని గురువు కోరితే, తిట్టుకోకుండా శుభ్రం చేయాలి.

ఒక గురువు కొన్నాళ్ళుగా తన ఆశ్రమంలో ఉన్న వ్యక్తిని, ఒకరోజు హఠాత్తుగా రాత్రికి రాత్రి బయటకు పొమ్మన్నాడు. శిష్యుడు బిత్తరపోయాడు. ఇల్లు, వాకిలి వదిలి వచ్చాను. గురువు మంచివాడనుకున్నాను. ఆయన కూడా అందరిలాంటివాడే అనుకుని బయటకి వెళ్ళిపోయాడు. వారం తర్వాత మళ్ళీ ఆ శిష్యుణ్ణి పిలిపించాడు ఆ గురువు. ఎందుకు పంపినట్టు? ఎందుకు పిలిపించినట్టు? గురువు వివరించాడు. 'నువ్వు ఇంటిని వదిలావు గాని, బంధకత్వాన్ని వదులుకోలేదు. నాలో భద్రత చూసుకుంటున్నావు. అది పారద్రోలటానికే పొమ్మన్నాను.' అది తెలిసాక, అంతకు ముందు దురుసుగా కనిపించిన గురువు అప్పుడు దైవంలా తోచాడు. అలా గురువును అర్థం చేసుకునే పరిస్థితి వస్తుంది.

అన్నీ చెప్పి, ఏడాది తర్వాత మీ ప్రశ్నలకు నాకు జవాబు తెలిస్తే, తెలిసిందంతా చెబుతాను అన్నాడు. అంటే 'ఆయన శక్తిమీద ఆయనకు నమ్మకం లేదా? అంటే, నమ్మకంలేక కాదు, అది ఆయన అణకువ లక్షణం,' అని శంకరాచార్యులవారు అంటున్నారు. ఎందుకంటే పిప్పలాదఋషి గురించి ఉపనిషత్తు **భగవంతమ్** అన్న పదం వేసింది. ఇదే ఆయన గురించి ఎంతో చెబుతుంది. దీన్ని గర్వ అభావ ప్రదర్శన అంటారు.

**మంత్రం - 3**

**అథ కబన్ధీ కాత్యాయన ఉపేత్య పప్రచ్ఛ । భగవన్కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయన్త ఇతి ॥ 3 ॥**

**ప్రతిపదార్థం:** అథ– తర్వాత (సంవత్సరం తర్వాత); కబన్ధీ కాత్యాయనః – కబంధీ కాత్యాయన అనే శిష్యుడు; ఉపేత్య – సమీపించి; భగవన్– భగవాన్; ఇమాః– ఈ; ప్రజాః– ప్రాణకోటి; కుతో హ వా – ఎక్కడనుంచి; ప్రజాయన్తే– పుట్టింది; ఇతి– అని; పప్రచ్ఛ– అడిగాడు.

**తాత్పర్యం:** తర్వాత (సంవత్సరం తరువాత); కబంధీ కాత్యాయన అనే శిష్యుడు పిప్పలాద మహర్షిని సమీపించి అడిగాడు, 'భగవాన్ ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?'

**వివరణ:** ప్రశ్నలు అడిగేటప్పుడు, శిష్యుల వరుసక్రమం మారుతుంది. చివరి శిష్యుడు సృష్టి గురించి అడిగాడు. గురువు సృష్టి గురించి చెప్పాడు. కాని ఈ అధ్యాయం వాటికి ప్రాముఖ్యతనివ్వదు. అంతే.

**కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయన్తే –** ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?

**మంత్రం - 4**

**తస్మై స హోవాచ – ప్రజాకామో వై ప్రజాపతిః స తపోऽతప్యత స తపస్తప్త్వా స మిథునముత్పాదయతే । రయిం చ ప్రాణం చేత్యేతౌ మే బహుధా ప్రజాః కరిష్యత ఇతి ॥ 4 ॥**

**ప్రతిపదార్థం:** తస్మై స హోవాచ – గురువు కాత్యాయనకి చెప్పాడు; ప్రజాపతిః – హిరణ్యగర్భ; ప్రజాకామః – ప్రాణులను సృష్టించదలచుకుని; సః తపః అతప్యత – తపస్సు చేశాడు; తపః తప్త్వా– తపస్సు చేసాక; స మిథునముత్పాదయతే – జంటను సృష్టించాడు; రయిం చ ప్రాణం చ – రయిని, ప్రాణాన్ని; ఏతౌ– ఈ రెండూ; మే – నాకోసం; బహుధా ప్రజాః కరిష్యతే– అనేక జీవాలను ఉత్పత్తి చేస్తాయి; ఇతి– అని.

**తాత్పర్యం:** గురువు కాత్యాయనకి చెప్పాడు. హిరణ్యగర్భ ప్రాణులను సృష్టించదలచుకుని తపస్సు చేశాడు. తపస్సు చేశాక జంటను సృష్టించాడు. అవి రయి, ప్రాణం. ఈ రెండూ నాకోసం అనేక జీవాలను ఉత్పత్తి చేస్తాయి అని అనుకున్నాడు.

**వివరణ: తస్మై సః ఉవాచ** వరకూ ఉపనిషత్తు చెబుతోంది. కబంధీ కాత్యాయనకి గురువు చెప్పాడు. ఇక్కడనుంచి గురువు పిప్పలాద చెప్పుకొస్తాడు. పిప్పలాద చెప్పిన సృష్టిక్రమం కొంచెం ప్రత్యేకంగా ఉంది; కొంచెం కష్టంగా కూడా ఉంది.

ఇక్కడ, ప్రశ్నోపనిషత్తులో సృష్టిక్రమాన్ని గురువు ఐదుదశల్లో వర్ణించాడు. మిథునసృష్టి, లోకసృష్టి, కాలసృష్టి, అన్నసృష్టి, దాని తరువాత ప్రజాసృష్టి. ప్రజలు ఎలా పుట్టారన్న ప్రశ్నకు ఇది చివరి జవాబు.

ఎవరు సృష్టించారు? పిప్పలాద హిరణ్యగర్భనుంచి మొదలుపెడతాడు. హిరణ్యగర్భ, ప్రజాపతి, బ్రహ్మ (చతుర్ముఖ బ్రహ్మ), ఏ పేరు వాడినా ఒకటే. ఇక్కడ వాడిన పేరు ప్రజాపతి. ప్రజాపతి కూడ నిజానికి సృష్టింపబడ్డాడు. అసలు సృష్టికర్త ఈశ్వరుడు. విష్ణుపురాణంలో విష్ణుమూర్తి అని వస్తుంది. ఈశ్వరుడు, విష్ణువు ఒకరే. విష్ణుమూర్తి నాభినుంచి చతుర్ముఖబ్రహ్మ ఉద్భవించాడు.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ విశ్వస్య కర్తా భువనస్య గోప్తా। ముండకమ్ – 1.1.1**

ఇక్కడ మనకు బ్రహ్మ లేదా ప్రజాపతి పుట్టుక గురించి చెప్పలేదు. అది మనం కలిపి చెప్పుకోవాలి. ప్రజాపతికి తక్కిన సృష్టికార్యం అప్పచెప్పాడు. ప్రజాపతికి వివరాలు తెలియకపోతే విష్ణుమూర్తి వేదం బోధించాడు.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై।**

అది తెలుసుకున్నాక **స తపో తప్యత** – దాని గురించి తపస్సు చేసాడు. అంటే దేవుడు జ్ఞానం ఇచ్చాడు. తపస్సు, అంటే పూర్వసృష్టి గురించి ఆలోచనలు చేసాడు. కర్మని దృష్టిలో పెట్టుకుని సృష్టి చేయాలి. ఉదాహరణకి ఇంద్రపదవి ఇచ్చే అతనికి అతని పుణ్యం దృష్టిలో పెట్టుకోవాలి. అంటే మనస్సులో ఒక నిర్దిష్టమైన ప్రణాళికను ఏర్పరచుకుని సృష్టి చేయాలి. అది సంకల్పమాత్రంగానే జరుగుతుంది.

ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. ప్రశ్న సృష్టి గురించి. జవాబు కూడా సృష్టి గురించి. రెండూ ఒకదాని గురించే అయినా, ఈ అధ్యాయం దీనికి ప్రాముఖ్యత నివ్వటంలేదు. ఎందుకు? కేవలం సృష్టి గురించి చెబితే ఏమీ లాభం లేదు. అది ఏదో నేర్చుకున్నట్టవుతుందే తప్ప జీవితంలో ఏమీ మార్పురాదు. వేదాంతం నిష్ప్రయోజనవస్తువు గురించి చెపితే ప్రమాణం అవదు. ప్రమాణం నిర్వచనం – **అనధిగత అబాధిత అర్థబోధకం ప్రమాణమ్**. అర్థానికి ప్రాముఖ్యత లేకపోతే అది చెప్పకూడదు.

అందుకని పిప్పలాద, సృష్టి గురించి మాట్లాడుతూ అపరావిద్య గురించి అనుకోకుండా చొప్పించాడు. కేవలం కర్మ చేసిన వ్యక్తి, కర్మఠుడు, కృష్ణగతిద్వారా స్వర్గలోకానికి జేరుకుంటాడు.

కర్మ, ఉపాసనసముచ్ఛయం చేసినవ్యక్తి శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి చేరుకుంటాడు.

పిప్పలాద సృష్టి గురించి చెబుతూ కర్మఫలం, ఉపాసనఫలం చెప్పాడు. సృష్టి గురించి, అపరావిద్య గురించి చెప్పటం అనవసరమైతే వీటి గురించి ఎందుకు చర్చించాలి? వైరాగ్యసిద్ధ్యర్థం అంటారు ఆనందగిరి. కర్మఫలం స్వర్గలోకప్రాప్తి, ఉపాసనఫలం లేదా కర్మ, ఉపాసనసముచ్చయఫలమే బ్రహ్మలోకం. అంటే ఇందులో అంతర్లీనంగా ఉన్న అర్థం ఏమిటి? రెండూ లోకప్రాప్తి మాత్రమే ఇస్తాయి. రెండూ మోక్షమివ్వవని తెలుస్తోంది. ఇవి ఇక్కడకన్నా కొంచెం ఎక్కువకాలం, కొంచెం ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయి అంతే.

దయానంద సరస్వతి స్వామీజీ సరదాగా ఒక కథ చెబుతారు. ఒక పండితుడు ప్రసంగాలు చెప్పి, చెప్పి మరణం తర్వాత స్వర్గలోకానికి చేరుకున్నాడు. అక్కడ ఒక పెద్దబంగళాలో ఉండనారంభించాడు. కొన్నాళ్ళయ్యాక కుతూహలంకొద్దీ తన పక్క బంగళాలో ఎవరున్నారని చూస్తే, అందులో ఒక ఆటోడ్రైవరు ఉన్నాడు. ఈ పండితునికి చాలా కోపం వచ్చింది. నువ్వూ, నేనూ ఎలా సమానస్థాయిలో ఉన్నామని అడిగాడు.

దానికి అతను ఇలా బదులిచ్చాడు – 'స్వామీ, మీరు రాముని గురించి చెప్పారు నిజమే. కానీ మీ దగ్గరకు వచ్చిన భక్తులు నిద్రలో తూగుతుండే వారు. రాముణ్ణి ఎంతవరకూ తలుచుకున్నారో అనుమానమే. అదే నా విషయానికి వస్తే నేను ఆటోని అడ్డదిడ్డంగా నడిపేవాడిని. అందులో కూర్చున్నవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కూర్చోవాల్సిందే. అందుకని నా ఆటోలో ఉన్నంతసేపూ రామభజన చేస్తూనే ఉండేవారు. ఇప్పుడు చెప్పండి, ఎవరివల్ల వారు రామనామం ఎక్కువ చేశారు?'

అలా స్వర్గలోకంలో కూడా సంతోషంగా ఉండలేరు. జ్ఞానమొక్కటే మోక్షమార్గం. బృహదారణ్యకంలో మైత్రేయి బ్రాహ్మణంలో మైత్రేయి ఈ విషయం గ్రహిస్తుంది. యాజ్ఞవల్క్యుని రెండోభార్య ఆమె. యాజ్ఞవల్క్యుడు జ్ఞానం పొందాక, వైరాగ్యంతో, తన ఆస్తిని రెండు భాగాలు చేసి ఇద్దరు భార్యలకూ పంచాడు. మొదటి భార్య తృప్తి చెందింది. మైత్రేయి మాత్రం ఊరుకోలేదు. 'ఇంత ఆస్తిని మీరు ఇంత తేలికగా కాలదన్నారంటే, మీకు ఇంతకన్నా గొప్ప వస్తువేమిటో దొరికి ఉంటుంది. ఏమిటది,' అని అడిగింది. తద్వారా బ్రహ్మవిద్య పొందింది.

అలా అపరావిద్య మోక్షాన్నివ్వదు అని తెలిస్తే, పరావిద్య గొప్పతనం తెలుస్తుంది. అలా పరావిద్యకు పరోక్షంగా దోహదం చేస్తుంది. ఈ అపరావిద్యను ఎలా ప్రవేశపెట్టాడు? లోకసృష్టి గురించి చెప్పినప్పుడు – చంద్రుడు స్వర్గలోకాన్ని, సూర్యుడు బ్రహ్మలోకాన్ని సూచిస్తాయని చెప్పాడు. తర్వాత దక్షిణాయనం కృష్ణగతిని; ఉత్తరాయణం, శుక్లగతిని సూచిస్తాయని చెప్పాడు. ఇప్పుడు ఇవన్నీ కలిపితే–

కర్మ – స్వర్గలోకప్రాప్తి – చంద్రుడు – దక్షిణాయనం– కృష్ణగతి
ఉపాసన – బ్రహ్మలోకప్రాప్తి – సూర్యుడు – ఉత్తరాయణం – శుక్లగతి.
ఈ విషయం అర్థమయితే, ఈ అధ్యాయం తేలికవుతుంది.

**1. మిథునసృష్టి – స మిథునముత్పాదయతే –**

ఈ మంత్రంలో మొదటిదశ సృష్టి వస్తుంది. **స** – ప్రజాపతి; **మిథునం ఉత్పాదయతే** అంటే ఒక జంటను సృష్టించాడు. వాటి పేర్లు **రయిం చ, ప్రాణం చ** – అంటే రయి, ప్రాణ. రయి, ప్రాణ రెండూ విభిన్న వస్తువులు కావు. రెండు సిద్ధాంతాలు. రెండు వస్తువులు చూడటానికి విభిన్నంగా, వ్యతిరేకంగా ఉన్నట్టు కనిపించినా, అవి కలిస్తేనే ఆ వస్తువు పరిపూర్ణం అవుతుంది. అంటే ఒకదాన్నొకటి పూర్తి చేస్తాయి. ఉదా:– రాత్రీ, పగలు – రెండు కలిస్తేనే రోజు అవుతుంది. పుట్టుక – చావు రెండూ కలిసి జన్మ. స్త్రీ–పురుషులు – ఇద్దరూ కలిసి మనుష్య జన్మ. శంకరాచార్యులవారు ఇచ్చిన ఉదాహరణ– భోక్తా–భోగ్యం; అత్తా– అన్నం, అంటే తినే వ్యక్తి – తినబడే వస్తువు. రెండూ విరుద్ధ స్వభావాలైనా ఒకటి లేనిదే ఇంకోటి లేదు. అర్ధనారీశ్వర తత్త్వం అన్నమాట.

రయికి, ప్రాణకీ నిఘంటువులో సరియైన అర్థం లేదు. రయి అంటే నీరు లేదా ఐశ్వర్యం అనీ, ప్రాణః అంటే ప్రాణశక్తి అని వస్తుంది. అందుకని వాటిని రయి, ప్రాణంగానే వ్యవహరిద్దాము. వాటిని సృష్టిస్తే, **ఏతౌ**– ఆ రెండూ– **ప్రజాః కరిష్యతి**– తర్వాత అనేక జీవులను ఉత్పత్తి చేస్తాయి.

**మంత్రం - 5**

**ఆదిత్యో హ వై ప్రాణో రయిరేవ చన్ద్రమా రయిర్వా ఏతత్సర్వం యన్మూర్తం చామూర్తం చ తస్మాన్మూర్తిరేవ రయిః ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** ఆదిత్యః హ వై ప్రాణః – సూర్యుడు ప్రాణం; రయిరేవ చంద్రమా – చంద్రుడు రయి; రయిర్వా ఏతత్ సర్వమ్ – రయి మాత్రమే అంతా; మూర్తం చ– రూపు ఉన్నవి; అమూర్తం చ – రూపు లేనివి; తస్మాత్ – అందువల్ల; మూర్తిరేవ రయి – మూర్తం రయి.

**తాత్పర్యం:** సూర్యుడు ప్రాణం, చంద్రుడు రయి. రయి మాత్రమే అంతా. మూర్తం, అమూర్తం అన్నీ రయి. (అమూర్తం ప్రాణం.) అందువల్ల మూర్తం రయి.

**వివరణ:** 2 **లోకసృష్టి**. ఇప్పుడు రెండవ సృష్టి, లోకసృష్టి. మొదటి సృష్టి మిథునసృష్టి. అవి రయి, ప్రాణం అని చూసాము. మొదటిది మిథునసృష్టి కాబట్టి ఇంక తక్కినవన్నీ కూడా మిథునసృష్టిగా రావాలి. అంటే ద్వంద్వసృష్టి జరగాలి. ఇప్పుడు లోకసృష్టిలో జంట

చంద్రుడు, సూర్యుడు. వీరు జంటెలా అవుతారు? సూర్యచంద్రులు పగలూ, రాత్రులను ఇస్తారు. పగలు, రాత్రి – రెండు కలిపితేనే ఒక రోజు అవుతుంది.

ఈ రెండింటిలో ఏది రయి, ఏది ప్రాణం? **ఆదిత్యః హ వై ప్రాణః** – సూర్యుడు ప్రాణం; **రయిరేవ చంద్రమా–** చంద్రుడు రయి; సూర్యుడు ప్రాణశక్తినిస్తే చంద్రుడు నీళ్ళలాగా చల్లదనాన్ని ఇస్తాడు. రయికి ఒక అర్థం నీరు అని చూసాం కదా. ఇక్కడినుంచి 8వ మంత్రం వరకూ ఉపనిషత్తు మళ్ళీ కొంత పక్కకు వెళుతోంది. రయి, ప్రాణం ఒకదాన్నొకటి పూర్తి చేసే జంట అయినా నిజానికి రెండింటి ప్రాథమిక లక్షణం ఒకటే. పైకి భేదం ఉన్నా కూడా, నిజానికి అన్నీ రయి లేదా అన్నీ ప్రాణం. ఈ మంత్రంలో అన్నీ రయి అన్న అర్థం వస్తే, 6–8 మంత్రాల్లో అన్నీ ప్రాణం అన్న అర్థం వస్తుంది.

ఉదాహరణకు, ఆవిరి, మంచుగడ్డ రెండూ ఒకటా, వేరా? ఏది చెప్పినా తప్పే. ఆవిరి అమూర్తం, మంచుగడ్డ మూర్తం. అమూర్తం ప్రాణం, మూర్తం రయి. ఇప్పుడు ఆవిరి, మంచుగడ్డ విషయాల్లో లోతుగా ఆలోచిస్తే, రెండూ నీరే అని తెలుస్తుంది. అలాగే రయి కూడా ప్రజాపతే. ప్రాణం కూడా ప్రజాపతే, రెండింటికీ తనే ఉపాదాన కారణం అయ్యాడు. కాబట్టి రయిపరంగా చూస్తే అంతా రయి, ప్రాణపరంగా చూస్తే అంతా ప్రాణం. ప్రజాపతి రూపేణ రయిః ఏవ సర్వం భవతి. కాని వీలుకోసం పైపైన విభిన్నంగా చూస్తున్నాము. అమూర్తాన్ని ప్రాణం అంటున్నాము కాబట్టి **తస్మాత్ మూర్తి రేవః రయిః** – మూర్త ప్రపంచం రయి. సృష్టి ప్రకరణంలో పక్క అంశం ఒకటి అయింది. ఏమిటది?

**రయిః సర్వాత్మకః ప్రజాపతిరూపత్వాత్**

6–8 మంత్రాలనుంచి ప్రాణం సర్వాత్మకం అని చెప్పాలి. కాని ఉపనిషత్తు అలా ప్రత్యక్షంగా చెప్పదు. వేరే పద్ధతి వాడుతోంది. సూర్యుడు సర్వాత్మకం అంటోంది. సూర్యుడు ప్రాణం అని ఈ మంత్రంలో చూశాం. అందువల్ల సూర్యుడు సర్వాత్మకం, సూర్యుడు ప్రాణం కాబట్టి, ప్రాణం సర్వాత్మకం.

**మంత్రం - 6**

**అథాదిత్య ఉదయన్యత్ప్రాచీం దిశం ప్రవిశతి తేన**
**ప్రాచ్యాన్ప్రాణాన్రశ్మిషు సన్నిధత్తే। యద్దక్షిణాం యత్ప్రతీచీం యదుదీచీం**
**యదధో యదూర్ధ్వం యదన్తరా దిశో యత్సర్వం ప్రకాశయతి తేన,**
**సర్వాన్ప్రాణాన్రశ్మిషు సన్నిధత్తే ॥ 6 ॥**

**ప్రతిపదార్థం:** అథ – ఇప్పుడు; ఆదిత్యః ఉదయన్ – సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు; ప్రాచీం దిశం ప్రవిశతి – తూర్పు దిశలో ప్రవేశిస్తున్నప్పుడు; తేన ప్రాచ్యాన్ ప్రాణాన్ – తూర్పున ఉన్న అన్ని జీవరాశులనూ; రశ్మిషు– తన కిరణాలతో; సన్నిధత్తే– ఐక్యం చేస్తున్నాడు; యత్ దక్షిణా – దక్షిణ దిక్కు; ప్రతీచీ– పడమరదిక్కు; ఉదీచీ– ఉత్తరదిక్కు; అధః – కింద; ఊర్ధ్వమ్ – పైన; యత్ అంతరాదిశః – మధ్యభాగంలో; యత్ సర్వం ప్రకాశయతి – అన్నింటినీ ప్రకాశింప చేస్తున్నాడు; తేన – అందువల్ల; సర్వాన్ ప్రాణాన్ – అన్ని ప్రాణాలనూ, రశ్మిషు సన్నిధత్తే – తనలో ఐక్యం చేసుకుంటున్నాడు.

**తాత్పర్యం:** సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు అంటే తూర్పు దిశలో ప్రవేశిస్తున్నప్పుడు తూర్పున ఉన్న అన్ని జీవరాశులనూ తన కిరణాలతో తనలో ఐక్యం చేస్తున్నాడు. అలాగే దక్షిణ దిక్కు, పడమర, ఉత్తర దిక్కులలో ఉన్న జీవరాశులను, పైన, కింద, మధ్యభాగంలో ఉన్న అన్నింటినీ ప్రకాశింపచేస్తున్నాడు. అందువల్ల అన్ని ప్రాణులనూ తనలో ఐక్యం చేసుకుంటున్నాడు.

**వివరణ:** ఇంతకు ముందు మంత్రంలో రయి సర్వవ్యాపకం అన్నాము. ఇప్పుడు ప్రాణం సర్వవ్యాపకం అన్నదాన్ని ఉపనిషత్తు సూర్యునిద్వారా చూపిస్తున్నది. సూర్యుడు ఉదయించినప్పుడు సూర్యకిరణాలు క్రమంగా అన్ని దిశల్లో వ్యాపిస్తాయి. సూర్యప్రకాశం సర్వత్రా వ్యాపించి అన్ని జీవరాశులమీద పడి, వాటితో ఏకమవుతోంది. సూర్యునివల్లే ఉనికి కాబట్టి, సూర్యుడు లేకుండా ఉనికి లేదు. ఆహారంవల్లే శక్తి వస్తోంది అనుకున్నా, దానికి శక్తి సూర్యునివల్లే వస్తుంది. సూర్యుడు సర్వవ్యాపకం అని చాటటానికి ఈ మంత్రంలో నాలుగు దిక్కులూ – తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం – పేర్కొన్నాడు. **'ప్రాణాన్ రశ్మిషు సన్నిధత్తే'** – అన్నింటికి ప్రాణాన్ని లేతకిరణాలతో ఇస్తున్నాడు అనే మాటలను ఒక్కొక్క దిశకీ కలుపుకోవాలి. అదికాక పైన, కింద, మధ్యలో కూడా సర్వం ప్రకాశయతి అని చెబుతున్నాడు.

**మంత్రం - 7**

**స ఏష వైశ్వానరో విశ్వరూపః ప్రాణోఽగ్నిరుదయతే।**
**తదేతదృచాఽభ్యుక్తమ్ ॥ 7 ॥**

**ప్రతిపదార్థం:** సః – అతను (సూర్యుడు); ఏషః వైశ్వానరః – ఈ వైశ్వానరుడు; విశ్వరూపః – విశ్వరూపుడు; ప్రాణః – ప్రాణం, అగ్నిః – అగ్ని; ఉదయతే – ఉదయిస్తాడు; తత్ ఏతత్ – ఈ ప్రత్యేక భావన;– ఋచా – ఋగ్వేద మంత్రంలో; అభ్యుక్తమ్ – చెప్పబడింది.

**తాత్పర్యం:** సూర్యుడు వైశ్వానరుడు, విశ్వరూపుడు, ప్రాణం, అగ్ని (అనే నాలుగురూపాల్లో) ఉదయిస్తాడు. (అంటే సూర్యుడు సర్వాత్మకుడు). ఈ ప్రత్యేక భావన – (సూర్యుడే సృష్టిరూపంలో సర్వాత్మకుడు) – ఋగ్వేదమంత్రంలో చెప్పబడింది.

**వివరణ:** సూర్యుడు లేకపోతే జీవి లేదు. గ్రీష్మతాపం ఎక్కువైనా మరణిస్తారు. అసలు సూర్యరశ్మి లేకుండా గజగజలాడించే చలి ఎక్కువైనా మరణిస్తారు. సూర్యుడు అంటే – **సుష్ఠు ఈరయతి ప్రేరయతి సర్వాన్ ఇతి సూర్యః** అంటే ఆరోగ్యం ఇచ్చేది, ప్రేరణ కలిగించేది సూర్యుడే. అందుకే సూర్యునికి నాలుగు పేర్లు వచ్చాయి ఈ మంత్రంలో.

1. **వైశ్వానరుడు** అంటే అన్ని జీవుల్లోనూ ఉన్నాడు.
2. **విశ్వరూప** అంటే జడపదార్థాలను కూడా ప్రకాశింపజేస్తాడు.
3. **ప్రాణం** అంటే అందరిలో ప్రాణం అతనే. అందుకే ముందు మంత్రంలో **ఆదిత్యో హ వై ప్రాణః** అని వచ్చింది.
4. **అగ్ని** అంటే అగ్నిరూపంలో ఉన్నాడు. పైన ఉంటే సూర్యుడు – దివిస్థ అగ్నిః, కింద భూమీమీద ఉంటే అగ్నితత్త్వం – భువిస్థ అగ్నిః వేడి. దేనిద్వారా అయినా, అనుభవం మాత్రం ఒకటే.

దీని సారాంశం ఏమిటి? సూర్యుడు సర్వాత్మకుడు. సంధ్యావందనంలో సూర్యస్తుతి వస్తుంది. చరాచరసృష్టిలో సూర్యుడే ఆత్మ అని అర్థం వస్తుంది. దీని ముందు మంత్రంలో సూర్యోదయ వర్ణనలో కూడా అదే అర్థం. పిప్పలాద ఈ వాదనను నిరూపించటానికి, ఋగ్ మంత్రం తీసుకుంటున్నాడు. ఒక ఉపనిషత్తు ఇంకో ఉపనిషత్తులోని వాక్యాలను చెబుతూ ఉంటుంది. తైత్తిరీయంలో **తదప్యేష శ్లోకో భవతి** అని మధ్యమధ్యలో వస్తూ ఉంటుంది. అలా సూర్యుడే సృష్టిరూపంలో సర్వాత్మకుడు అని నిరూపించటానికి ఋగ్వేదమంత్రం చెబుతున్నాడు ఇప్పుడు.

**మంత్రం - 8**

**విశ్వరూపం హరిణం జాతవేదసం పరాయణం జ్యోతిరేకం తపన్తమ్।**
**సహస్రరశ్మిః శతధా వర్తమానః ప్రాణః ప్రజానాముదయత్యేష సూర్యః॥ 8 ॥**

**ప్రతిపదార్థం:** విశ్వరూపమ్ – విశ్వరూపుడు; హరిణమ్ – కిరణాలు గలవాడు; జాతవేదసమ్ – సర్వజ్ఞుడు; పరాయణమ్ – సకల ప్రాణులకూ ఆధారుడు; ఏకమ్ – ఒకటి; జ్యోతిః– జ్యోతి; తపన్తమ్– ప్రకాశవంతుడు; ప్రాణః ప్రజానామ్ – ప్రాణులకు ప్రాణమైనవాడు; సహస్రరశ్మిః – వేయి కిరణాలు; శతధా వర్తమానమ్ – నూరు రూపాలు గల; ఏషః సూర్యః – ఈ సూర్యుడు; ఉదయతి–ఉదయిస్తున్నాడు.

**తాత్పర్యం:** విశ్వరూపుడు, కిరణాలు గలవాడు; సర్వజ్ఞుడు, సకలప్రాణులకూ ఆధారుడు, ఏకైక జ్యోతి ఉండి, ప్రకాశవంతుడు, ప్రాణులకు ప్రాణమైనవాడు, వేయి కిరణాలు, నూరు రూపాలుగలవాడైన ఈ సూర్యుడు ఉదయిస్తున్నాడు.

**వివరణ:** సూర్యుని వర్ణన; అనేక విశేషణాలతో, ఒక్కొక్క పేరూ సూర్యుని గొప్పతనాన్నీ, సర్వాత్మకత్వాన్నీ చూపిస్తోంది.

1.**విశ్వరూపమ్** – ముందు మంత్రంలో కూడా వచ్చింది. మొత్తం సృష్టిరూపంలో ఉన్నాడు.

2.**హరిణమ్** – హరిః అంటే రశ్మి, కిరణాలు. ఇక్కడ కిరణాలు.

3.**జాతవేదసమ్** – జాతం జాతం వేదం. వస్తువుగా చూస్తే అన్నీ ప్రకాశింపజేసేవాడు; దేవతగా చూస్తే చైతన్యం, మనం దేవతగా చూస్తున్నాము.

మనం కూడా శరీరపరంగా చూస్తే జడం, చైతన్యపరంగా చూస్తే జీవి. మనుష్యుల్లో ఉన్న చైతన్యం, హిరణ్యగర్భుడు ఒకటే. ఇక్కడ ఆదిత్యుణ్ణి ప్రాణం గానూ, ప్రాణాన్ని హిరణ్యగర్భగానూ చూస్తున్నాం అంటే ఆదిత్యుడే హిరణ్యగర్భ.

4.**పరాయణమ్** – సూర్యుడే అన్ని జీవాలకూ ఆధారం ఇచ్చేవాడు.

5.**జ్యోతిః** – ప్రకాశస్వరూపం, వస్తువుగా చూస్తే ప్రకాశత్వం, దేవతగా చూస్తే చైతన్యస్వరూపం.

6.**ఏకమ్** – ఒకటే.

7.**తపన్తమ్** – ఎల్లప్పుడూ మెరుస్తూ ఉంటాడు.

**ఋషయః విదుః** అని మనం కలుపుకోవాలి. అంటే ఈ విషయాలు ఋషులకు తెలుసు. ఇప్పుడు సూర్యునికి ఉండే మరికొన్ని విశేషణాలు తెలుసుకుందాం.

8.**సహస్రరశ్మిః** – వేలాది కిరణాలు కలవాడు.

9.**శతధా వర్తమానః** – వందలాది రూపాలు ఉన్నవాడు – అంటే వివిధ ప్రాణులరూపేణా ప్రకటిత మవుతున్నాడు.

10.**ప్రాణః ప్రజానామ్** – జీవరాశులన్నిటికీ జీవం పోసేవాడు.

ఎవరు? **ఏషః సూర్యః** – అతను సూర్యుడు.

అటువంటి సూర్యుడు ఉదయించి, వారిలో ఒకడిగా కలిసి పోతున్నాడు కాబట్టి వారికీ, అతనికీ భేదం లేదు. అందువల్ల సర్వాత్మకుడు. ఇంతకు ముందు 5వ మంత్రంలో

రయిర్వా ఏతత్ సర్వం అన్నాము. ఇప్పుడు ఈ మూడు మంత్రాలద్వారా ప్రాణం సర్వాత్మకం అనటానికి, సూర్యుణ్ణి తీసుకుని, సూర్యునిద్వారా ప్రాణం సర్వాత్మకం అంటున్నాము.

**ప్రాణః సర్వాత్మకః ప్రజాపతిరూపత్వాత్.**

దీనితో లోకసృష్టి అయింది. సూర్యలోకాన్ని బ్రహ్మలోకం అనీ, చంద్రలోకాన్ని స్వర్గలోకమనీ వ్యవహరిస్తారు. ఇప్పుడు కాలసృష్టి.

**మంత్రం - 9**

**సంవత్సరో వై ప్రజాపతిస్తస్యాయనే దక్షిణం చోత్తరం చ । తద్యే హ వై తదిష్టాపూర్తే కృతమిత్యుపాసతే తే చాన్ద్రమసమేవ లోకమభిజయన్తే। త ఏవ పునరావర్తన్తే తస్మాదేత ఋషయః ప్రజాకామా దక్షిణం ప్రతిపద్యన్తే। ఏష హ వై రయిర్యః పితృయాణః ॥ 9 ॥**

**ప్రతిపదార్థం:** సంవత్సరో వై – సంవత్సరమే; ప్రజాపతిః – ప్రజాపతి లేదా హిరణ్యగర్భ; తస్య – ఆయనకు; అయనే – అయనాలు; దక్షిణం చ – దక్షిణాయనం; ఉత్తరం చ – ఉత్తరాయణం; తద్యే హ వై – ఇక్కడ ఎవరు; ఇష్టం – యాగాలు; పూర్తమ్ – సంఘసేవ; కృతమిత్యుపాసతే – శ్రేష్ఠమైనవి చేస్తారో; తే చాంద్రమసం లోకః ఏవ – చంద్రలోకం మాత్రమే; అభిజయన్తే– పొందుతారు; త ఏవ – వారు; పునరావర్తన్తే – తిరిగి పుడతారు; తస్మాత్ – అందువల్ల; ఏత ఋషయః – ఇక్కడ ఈ గృహస్థులు; ప్రజాకామా – సంతానాన్ని కోరేవారు; దక్షిణమ్ –దక్షిణాయనం; ప్రతిపద్యన్తే – పొందుతారు. యః – ఏది; పితృయాణమ్– పితృయానమో; ఏష హ వై – అదే; రయిః – రయి.

**తాత్పర్యం:** సంవత్సరమే ప్రజాపతి లేదా హిరణ్యగర్భ. ఆయనకు దక్షిణాయనం, ఉత్తరాయణం అని రెండు మార్గాలు ఉన్నాయి. ఇక్కడ ఎవరు ఇష్టం, పూర్తం, కృతం చేస్తారో, వారు చంద్రలోకం మాత్రమే పొందుతారు; వారు మళ్ళీ తిరిగి పుడతారు. అందువల్ల ఈ గృహస్థులు, సంతానాన్ని కోరేవారు దక్షిణాయనాన్ని పొందుతారు. ఏది పితృయానమో అదే రయి.

**వివరణ:** 3. **కాలసృష్టి .** ఎందుకు? కాలాన్ని సూర్యచంద్రుల గమనంవల్ల కొలుస్తాము కాబట్టి. **సూర్య చంద్ర నిర్వతితః కాలః** సూర్యుని గమనంవల్ల రాత్రి, పగలుతో కూడిన రోజు ఏర్పడుతుంది. **సూర్య నిర్వతితః అహోరాత్రః** అమావాస్యనుంచి పౌర్ణమికి, పౌర్ణమినుంచి అమావాస్యకీ చంద్రుని గమనంవల్ల తిథి ఏర్పడుతుంది. **చంద్ర నిర్వతితః తిథిః** పదిహేను రోజుల తిథిని కలిపితే పక్షం, రెండు పక్షాలు కలిపి మాసం, రెండు మాసాలు కలిపి ఋతువు, రెండు ఋతువులు కలిపి అయనం, రెండు అయనాలు కలిపి ఒక సంవత్సరం – ఇది కాలతత్త్వం.

**సంవత్సరో వై ప్రజాపతిః** ఇప్పుడే సూర్యచంద్రులనుంచి అన్నాం. ఈ పదంలో సంవత్సరం మొత్తం ప్రజాపతి అంటున్నాం. ఏది సరియైనది? రెండూ సరియైనవే. వెంటనే చూస్తే కాలసృష్టికి కారణం సూర్యచంద్రులు. కాని వారినే ప్రజాపతి దృష్ట్యా చూస్తే వారు కార్యం, ప్రజాపతి కారణం. **ఆదిత్యో హ వై ప్రాణః రయిరేవ చంద్రమా** అని వచ్చింది. కార్యంలోంచి కారణంలోకి వెళితే చివరగా ప్రజాపతి వస్తుంది– వంశవృక్షంలో మూలపురుషుని వదలకూడదు.

ప్రజాపతి రయి, ప్రాణాల మిథునం అని ముందే చూసాం. అలాగే ఇక్కడ సంవత్సరానికి రెండు అయనాలు ఉన్నాయి. ఉత్తరాయణం, దక్షిణాయనం – దక్షిణాయనం రయి, ఉత్తరాయణం – ప్రాణం.

పిప్పలాద రయి, ప్రాణాల సృష్టి గురించి చెప్పినప్పుడు దేనికదే సర్వాత్మకం అనే విషయాన్ని అదనంగా చెప్పాడు. ఇప్పుడు అలాగే ఉత్తరాయణ, దక్షిణాయనాల సృష్టి తర్వాత శుక్లగతి, కృష్ణగతులను వివరిస్తున్నాడు. గతి అంటే మార్గం, గతులు సూక్ష్మమైన మార్గాలు. జీవి మరణం తర్వాత సూర్యలోకం లేదా చంద్రలోకానికి వెళ్ళే గతులు. ఒకే దానికి రకరకాల పదాలున్నాయి.

దక్షిణాయనం – కృష్ణగతి – పితృయానం – చంద్రలోకం – స్వర్గలోకమ్.

ఉత్తరాయణం – శుక్లగతి – దేవయానం – సూర్యలోకం – బ్రహ్మలోకమ్.

ఎవరికి ఏది? దేనికదే.

కర్మిణః (కృష్ణగతిద్వారా) చంద్రలోకం ప్రాప్నుయాత్.

ఉపాసకః (శుక్లగతిద్వారా) సూర్యలోకం ప్రాపోృతి.

జ్ఞానికి ఏ మార్గం? ఏదీ లేదు. జ్ఞానికి ప్రయాణం లేదు. అతని సూక్ష్మశరీరం సమష్టి సూక్ష్మశరీరంలో కలిసిపోతుంది. మనం ఇంకా అపరావిద్యలోనే ఉన్నాము. జ్ఞానం విషయం వస్తేనే పరా విద్య, ఈ మంత్రంలో కేవలం కర్మ చేసిన వారి గతిని వివరిస్తున్నాడు.

అవి ఏ కర్మలు? **ఇష్టాపూర్తే** – ఇష్టం అంటే మనకిష్టమైనది కాదు. ఇష్టం అంటే వైదిక కర్మలు– అగ్నిహోత్రం, తపస్సు, వేదాధ్యయనం, అతిథులను కొలవటం వంటివి. పూర్తం అంటే సాంఘిక కార్యక్రమాలు. వాపీకూపతటాకాదులు కట్టించిన వారు, అంటే బావులు, చెరువులు తవ్వించటం, గుడులు కట్టించటం, అన్నసత్రాలను ఏర్పరచటంవంటి పుణ్యకార్యాలు. దత్తం కలుపుకోవాలి.

దత్తం అంటే భూతదయ చూపటం, శరణాగతులను రక్షించటం,యజ్ఞశాల బయట దానం చేయటం (లోపల చేస్తే అది దక్షిణ అవుతుంది) **ఉపాసతే**– ఉపాసతే అంటే ఉపాసన కాదు, ఎవరు ఈ ఇష్టం, పూర్తం, దత్తం, కర్మలు చేస్తారో, **తే చాంద్రమసమేవ లోకమభిజయన్తే** – వారు చంద్రలోకం అంటే స్వర్గలోకం వెళతారు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన।–ముండకమ్**

కర్మలద్వారా స్వర్గలోకం పొందుతారు. కాని జ్ఞానం పొందరు అని అర్థం. ఇక్కడ కూడా ప్రత్యక్షంగా చెప్పటం లేదు. కృతం ఏవ అని కలుపుకుంటే కర్మలు మాత్రమే చేసినవారు జ్ఞానం పొందరు అని అంతర్లీనంగా చెబుతోంది.

అలా నీవు కర్మచేస్తూ పోతే, అది నీ పనిచేస్తూ పోతుంది. అంటే పునరపి జననం – పునరపి మరణంద్వారా లోకాల చుట్టూ తిప్పుతుంది. అలా తిప్పుతుందని ఎలా తెలుసు? తర్వాత వచ్చిన పదం – **తే పునరావర్తన్తే ఏవ** – (ఏవ చివర వేసుకోవాలి) వారు తిరిగి పుడతారు.

**ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయన్తే ప్రమూఢాః।**
**నాకస్య పృష్ఠే తే సుకృతేఽనుభూత్వా ఇమం లోకం హీనతరం వా విశన్తి॥–ముండకమ్ 1.2.10**

కర్మలే చేసేవారిని ప్రమూఢాః అంటోంది ఉపనిషత్తు. వారు స్వర్గలోకంలో కర్మఫలం అనుభవించాక, భూమి లేదా ఇంకా హీనమైన లోకాలను పొందుతారు. ఇది ముండకోపనిషత్తులో వ్యాఖ్యానం కాబట్టి ఇందులో దాని వివరణ వచ్చింది. స్వర్గలోకాన్ని పొందేది ఎవరు? **ఏతే ఋషయః** – మామూలుగా ఋషయః అంటే ఋషి(ఋషతి జానాతి ఇతి ఋషి) జ్ఞానం పొందిన వ్యక్తి అని అర్థం. కాని ఇక్కడ గృహస్థు.ఇక్కడ గృహస్థుకు తెలిసినదేమిటి? స్వర్గం ద్రష్టారః ఋషయః – స్వర్గం గురించిన వివరాలన్నీ తెలుసు. గృహస్థు అని ఎలా చెప్పగలం? తర్వాత వచ్చిన పదం **ప్రజాకామాః** – పిల్లలమీద ఇష్టం ఉన్నవారు. దీన్నిబట్టి గృహస్థు అర్థం వస్తుంది. సన్యాసులకిది వర్తించదు. వీరు కృష్ణగతిద్వారా చంద్రలోకం వెళతారు. దక్షిణాయనం కృష్ణగతిని సూచిస్తుంది. ఎందుకు?

**ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే ॥ గీత 8.25**

సకామకర్మయోగులు, ధూమ్రమార్గంద్వారా స్వర్గాదిలోకాలను చేరతారు. వీరిని రాత్రి, కృష్ణపక్ష, దక్షిణాయన అభిమానదేవతలు తీసుకొని పోతారు. అక్కడ కర్మఫలాలను అనుభవించి, తిరిగి భూలోకానికి చేరతారు– **ఏష హ వై రయిర్యః పితృయాణః** అంటే అదే అర్థం.

**మంత్రం - 10**

**అథోత్తరేణ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా**
**విద్యయాఽఽత్మానమన్విష్యాదిత్యమభిజయన్తే । ఏతద్వై**
**ప్రాణానామాయతనమేతదమృతమభయమేతత్పరాయణమేతస్మాన్న**
**పునరావర్తన్త ఇత్యేష నిరోధః । తదేష శ్లోకః ॥ 10 ॥**

**ప్రతిపదార్థం:** అథ ఉత్తరేణ – ఇక ఉత్తరాయణం, శుక్లగతి; తపసా – క్రమశిక్షణ; బ్రహ్మచర్యేణ – ఇంద్రియ నిగ్రహం; శ్రద్ధయా– శాస్త్రంమీద శ్రద్ధ; విద్యయా – (జ్ఞానం కాదు) ఇక్కడ ఉపాసన; ఆత్మానమ్ – ఇక్కడ సూర్యాత్మను; అన్విష్య – అన్వేషించి; ఆదిత్యమ్ అభిజయన్తే– సూర్యలోకాన్ని పొందుతారు. ఏతద్ వై ప్రాణానామ్ ఆయతనమ్ – ఇదే అన్ని ప్రాణులకు అంతిమ ఆశ్రయం ; ఏతద్ అమృతమ్ – ఇది అమృత లోకం; అభయమ్– (ఇక్కడ) భయం లేదు; ఏతత్ పరాయణమ్ – ఈ బ్రహ్మలోకం అంతిమ ఆశ్రయం; ఏతస్మాత్ న పునః ఆవర్తన్తే – దీనినుంచి మళ్ళీ జన్మించరు; ఏషః నిరోధః ఇతి – ఇది కేవలం కర్మ చేసేవారికి లేదు; తదేషః శ్లోకః – దీని గురించి ఋగ్ మంత్రంలో ఉంది.

**తాత్పర్యం:** ఇక ఉత్తరాయణం, శుక్లగతి. తపస్సు, బ్రహ్మచర్యం, శ్రద్ధతో ఉపాసన చేసినవారు సూర్యాత్మను అన్వేషించి సూర్యలోకాన్ని పొందుతారు. ఇదే అన్ని ప్రాణులకు అంతిమ ఆశ్రయం. ఇది అమృతలోకం. ఇక్కడ భయం లేదు. దీనినుంచి మళ్ళీ జన్మించరు. కాని ఇది కేవలకర్మ చేసేవారికి లేదు. దీని గురించి ఋగ్మంత్రంలో ఉంది.

**వివరణ:** ఈ మంత్రంలో శుక్లగతి గురించి వస్తుంది. ఆదిత్యలోకం, బ్రహ్మలోకం, సత్యలోకం – ఏ పేరు చెప్పినా ఒకటే. శుక్లగతికి ఇంకో పేరు దేవయానం. ఇందులో ప్రయాణం చేసినవారు ఆదిత్యలోకం పొందుతారు.ఆ ప్రయాణీకులు ఎవరు? కర్మ, ఉపాసనసముచ్చయవాదులు లేదా తీవ్రంగా ఉపాసన చేసినవారు. వారు ఉత్తరాయణ ఉపలక్షిత ద్వారేన **ఆదిత్యమ్ అభిజయన్తే** – ఉత్తరాయణ ద్వారంగుండా సూర్యుని చేరతారు. దానికి చేయాల్సిన సాధనలు ఏమిటి? తపస్సు, బ్రహ్మచర్యం, శ్రద్ధ, ఉపాసన. **తపసా** అంటే క్రమశిక్షణ పాటించటం. **బ్రహ్మచర్యేణ** అంటే ఇంద్రియ నిగ్రహం, **శ్రద్ధయా** అంటే శాస్త్రంమీద శ్రద్ధ. **విద్యయా** అంటే జ్ఞానం కాదు, ఇక్కడ ఉపాసన.

**తపః శ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే శాన్తా విద్వాంసో భైక్షచర్యాం చరన్తః**
**సూర్యద్వారేణ తే విరజాః ప్రయాన్తి యత్రామృతః స పురుషో హి అవ్యయాత్మా –ముండకమ్ 1.2.11**

తపస్సు, శ్రద్ధ, భిక్షాటన చేస్తూ, ఉపాసన ఎవరు చేస్తారో వారు ఉత్తరాయణ మార్గంద్వారా మరణరహితమైన, అవినాశియైన భగవంతుణ్ణి పొందుతారు.

ఇది చేసినవారు ఏం పొందుతారు?

**ఆత్మానమ్**– మన మంత్రంలో ఆత్మానమ్ అంటే సచ్చిదానంద ఆత్మ కాదు. ఇక్కడ చర్చనీయాంశం ఉపాసన, దాని గతి. అందుకని సూర్యుడు ఆత్మ అవుతుంది. ఎలా అనవచ్చు? సూర్యుణ్ణి అన్ని జీవాల ఆత్మగా వర్ణిస్తారు. సూర్యతత్త్వం లేనిదే జీవులు లేవు. సూర్యుడే ప్రాణం. సూర్యః అంటే సూర్యదేవుడు లేదా హిరణ్యగర్భ దేవత లేదా బ్రహ్మదేవుడు.

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ –గీత 8.24**

ఉపాసన చేసిన వారు జ్యోతిర్మయ మార్గంద్వారా బ్రహ్మలోకం చేరతారు. ఈ యోగులను దిన,శుక్లపక్ష, ఉత్తరాయణ అభిమానదేవతలు పరమపదానికి చేరుస్తారు. **ఆదిత్యమ్ అభిజయన్తే** – సూర్యలోకాన్ని పొందుతారు. 14 లోకాల్లోనూ అన్నిటికన్నా ఊర్ధ్వలోకం. **ఏతద్ వై ప్రాణానామ్ ఆయతనమ్** – అన్ని ప్రాణులకూ ఇదే అంతిమ ఆశ్రయం.

**ఆప్నోతి స్వారాజ్యమ్ । ఆప్నోతి మనసస్పతిమ్ । వాక్పతిశ్చక్షుష్పతిః । – తైత్తరీయమ్**

**ఏతద్ అమృతమ్** – అమృత లోకం, **అభయమ్** – భయం లేదు. వీటికి రెండు అర్థాలు ఉన్నాయి. ఈ రెండు పదాలనూ ఆపేక్షిక అమృతత్వం – ఆపేక్షిక అభయంగా తీసుకోవాలి. రెండో అర్థం అక్కడనుంచి క్రమముక్తి పొందుతాడు. క్రమముక్తి పొందుతాడు కాబట్టి **ఏతస్మాత్ న పునః ఆవర్తన్తే** అంటున్నది ఉపనిషత్తు. అక్కడినుంచి తిరిగిరారు అంటున్నది.

ఇక్కడ ఇంకో గమనిక కూడా చెబుతున్నది. ముందు మంత్రంలో కేవలకర్మ చేసినవారు **తే ఏవ పునరావర్తన్తే** తిరిగి వస్తారు అని చెప్పింది. ఇప్పుడేమో కేవలకర్మ చేసినవారు బ్రహ్మలోకానికి వెళ్ళలేరు అంటున్నది, **ఏషః నిరోధః** అన్న మాటలద్వారా. **తదేష శ్లోకః** – ఇక్కడ ఋగ్ మంత్రాన్ని చెబుతున్నది ఉపనిషత్తు. **తత్** అంటే **తస్మిన్ అర్థే– సూర్యస్య మహిమా విషయే** –అంటే సూర్యలోకం గొప్పదనాన్ని వర్ణించటానికి చెబుతున్నది.

**ప్రత్యేక విశ్లేషణ:-**

**శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే**
**ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయావర్తతే పునః –గీత 8.26**

ఈ రెండు మార్గాలనూ శుక్ల, కృష్ణగతులనీ లేదా దేవయాన పితృయాన మార్గాలనీ అంటారు. దేవయాన మార్గాన వెళ్ళిన వారు పరమగతిని పొంది తిరిగిరారు. పితృయాన మార్గాన వెళ్ళినవారు తిరిగివచ్చి జననమరణచక్రంలో పడతారు.

అలా ఈ మంత్రంలో, ప్రశ్నోపనిషత్తులో, ముండకోపనిషత్తులో బ్రహ్మలోకానికి వెళ్ళినవారు తిరిగిరారు అని వస్తుంది.

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ -గీత 8.16**

పద్నాలుగు లోకాల్లో ఏ లోకానికి వెళ్ళినా, బ్రహ్మలోకంతో సహా, వెనక్కి తిరిగి వస్తారు. ఇవన్నీ కాలానికి పరిమితమైనవి. కాని నేను కాలాతీతుణ్ణి, నన్ను చేరినవారికి పునర్జన్మ ఉండదు. నన్ను చేరినవారికి అంటే బ్రహ్మజ్ఞానం పొందిన వారికి అని అర్థం. అంటే మోక్షం పొందాలంటే బ్రహ్మలోకానికి వెళ్ళినా పూర్తి నమ్మకం లేదు, బ్రహ్మజ్ఞానం పొందటమే మార్గం. **కేవల జ్ఞానేన మోక్షః**

బ్రహ్మలోకం వెళ్ళినా, నమ్మకం లేదు అని శ్రీకృష్ణపరమాత్మ ఎందుకంటున్నాడంటే, బ్రహ్మలోకం కూడా కాలానికి అతీతమైనది కాదు. ప్రళయం వస్తే అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. లోకస్తులు, లోకేశులు, లోకపాలకులు ఎవరూ శాశ్వతం కాదు. బ్రహ్మ కూడా శాశ్వతం కాదు. అదొక ఉన్నత పదవి. బ్రహ్మలోకానికి వెళ్ళాడు అంటేనే అది శాశ్వతం కాదు. దానికీ పరిమితి ఉందనే అర్థం. ప్రయాణం ఉన్నదేదీ శాశ్వతం కాదు.

అలాంటప్పుడు బ్రహ్మలోకం వెళ్ళినవాడు **న పునరావర్తన్తే** అనీ, **ఏతద్ అమృతం** అనీ శాస్త్రం ఎందుకు చెబుతున్నది? దానికి రెండు కారణాలు ఉన్నాయి. అమృతం అంటే అక్షరాలా కాదు. ఆపేక్షిక, న తు ముఖ్యం అమృతత్త్వం. అన్ని లోకాల్లోకి అది అత్యంత ఊర్ధ్వలోకం. భూలోకంతో చూస్తే అక్కడ ఎక్కువ కాలం ఉంటాము. కేడీయమ్ గోల్డ్‌కి 99.9 స్వచ్ఛత ఉంది అని చెప్పినట్టుగా అక్కడ భయం 0.00001 శాతం ఉంటుంది. అంటే దాదాపు లేనట్టే.

రెండో అర్థం, బ్రహ్మలోకానికి వెళ్లినవారు 99.9 శాతం అక్కడనుంచి క్రమముక్తి పొందుతారు. అక్కడ చెప్పేది సాక్షాత్తూ బ్రహ్మదేవుడు. ఎయిర్ కండిషన్ క్లాసులు,శిష్యులు సూక్ష్మబుద్ధి పొందిన వారు, భయాలు, దుఃఖాలు లేనివారు. అందుకని అక్కడ ఆత్మజ్ఞానం పొంది క్రమముక్తి పొందుతారు. అలా బ్రహ్మలోకం వెళ్ళినవారు తిరిగిరారు అని అర్థం. అక్కడకెళ్ళి కూడా జ్ఞానం పొందని వారు 0.0001లో ఉంటారు. వారు తిరిగివస్తారు. అది లెక్కలోకి రాదు కాబట్టి సామాన్య నియమాన్ని తీసుకోవచ్చు.

**క్రమముక్తి :** క్రమముక్తి గురించి కూడా కొన్ని అపోహలు ఉన్నాయి. జీవన్ముక్తి అంటే జ్ఞాని జ్ఞానం పొందాక బ్రతికి ఉండగానే ఇప్పుడే, ఇక్కడే ముక్తి పొందుతాడు. అంటే బంధాలనుంచి విముక్తి పొంది, మరణానికి అతీతుడవుతాడు. అంటే మరణ భయం ఉండదు. అతను ప్రారబ్ధకర్మ ముగిసి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. ఇక క్రమముక్తి అంటే, ఇందాక చూసినట్టు, ఉపాసన లేక కర్మ, ఉపాసన సముచ్చయం చేసి బ్రహ్మలోకానికి వెళ్ళి, బ్రహ్మద్వారా జ్ఞానం పొంది ముక్తి పొందటం.

అంతేగానీ, ఊర్ధ్వలోకాల్లో ఒక్కొక్క లోకానికి వెళ్ళి, అక్కడ కొంత పుణ్యం చేకూర్చుకుని, ఇంకో లోకానికి వెళ్ళి క్రమంగా బ్రహ్మలోకం చేరుకుని ముక్తి పొందటం కాదు. ఎందుకు? అంటే దేవతలది కర్మభూమి కాదు. మనుష్య లోకమే కర్మభూమి. ఇతర లోకవాసులకు కర్మ చేసే హక్కు లేదు. వారు భోక్తలే కాని, కర్తలు కాదు. అందుకే దేవతలకన్నా మనుష్యులే గొప్ప అంటారు కూడా. కాకపోతే అన్ని లోకాల్లోనూ, నరకలోకంతో సహా, జ్ఞానబోధ కలిగే అవకాశం ఉంది. అది పొందాలి అంతే. ఇంద్రుడు, అగ్ని, వాయువు, యమధర్మరాజు వీరంతా కూడా జ్ఞానం పొందారు అని కేన ఉపనిషత్తులో వస్తుంది. అక్కడ నేర్చుకుంటే క్రమముక్తి దొరుకుతుంది.

సాలోక్యం, సారూప్యం, సామీప్యం, సాయుజ్యం పొందుతారని అంటారు. అంటే బ్రహ్మలోకం వెళ్ళి, బ్రహ్మరూపం పొంది, బ్రహ్మ సామీప్యంలో ఉండి, ఎప్పుడో బ్రహ్మలో ఐక్యం అవుతాడని అర్థం. కాని జీవన్ముక్తి అలా కాదు. ఇక్కడే బ్రహ్మజ్ఞానం పొంది, జీవేశ్వర ఐక్యభావనతో – అహం బ్రహ్మాస్మి భావనలో బ్రహ్మనిష్ఠలో ఉంటారు.

క్రమముక్తి విషయంలో ఇంకో అంశం. బ్రహ్మలోకంలో జ్ఞానం పొందాక వెంటనే బ్రహ్మలో ఐక్యం అయిపోదు. ఇక్కడ జ్ఞానం పొందిన వ్యక్తి జీవన్ముక్తుడుగా ఎలా వ్యవహారం నడుపుతాడో, ఎలా జీవిస్తాడో, అక్కడ అలాగే అతని ప్రారబ్ధకర్మ ముగిసేదాకా అలాగే చరిస్తాడు. అక్కడ ప్రారబ్ధకర్మ ముగిసాక స్థూలశరీర పతనానంతరం స్థూలశరీరం స్థూలప్రపంచంతో, సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంతో, కారణశరీరం కారణప్రపంచంతో కలిసిపోతుంది.

**మనుష్య జన్మ ఉన్నతి**

**యథాదర్శే తథాత్మని యథా స్వప్నే తథా పితృలోకే।**
**యథాప్సు పరీవ దదృశే తథా గంధర్వలోకే ఛ్చాయాతపయోరివ బ్రహ్మలోకే॥ – కఠ 2.3.5**

మనుష్యలోకంలో అద్దంలోలాగా స్పష్టంగా, పితృలోకంలో కలలోలాగా, గంధర్వలోకంలో నీటిలోలాగా అస్పష్టంగా, బ్రహ్మలోకంలో నీడ, ఎండలాగా స్పష్టంగా ఆత్మజ్ఞానం కలుగుతుందని సాక్షాత్తూ యమధర్మరాజే చెబుతున్నాడు. దీన్నిబట్టి అన్ని

లోకాల్లోనూ బ్రహ్మజ్ఞానం పొందే అవకాశం ఉందని తెలుస్తున్నది. కాని అంతర్లీనంగా, మనుష్యలోకంలోనే సాధ్యమని చెబుతున్నది. పితృలోకంలో స్వప్నంలా ఉంటుందంటే, కల కరిగిపోయినట్టు, ఇదీ కరిగిపోతుంది. గంధర్వలోకంలో నీళ్ళలో లాగా అస్పష్టంగా ఉంటుంది. అలాంటి వాతావరణంలో శ్రద్ధగా నేర్చుకోలేము. నేర్చుకున్నా అది స్పష్టంగా ఉండదు. అందుకని ఈ రెండు లోకాలూ లాభం లేదు. ఇక మిగిలింది మనుష్యలోకం, బ్రహ్మలోకం. బ్రహ్మలోకంలో ఎండకీ, నీడకీ ఉన్న భేదం స్పష్టంగా తెలిసినట్టుగా స్పష్టమైన జ్ఞానం కలుగుతుంది.

మరయితే ఏమిటి సమస్య? అక్కడికి వెళతామో లేదో అన్నదే సమస్య. బ్రహ్మలోకానికి వెళ్ళటానికి అనేక షరతులు ఉన్నాయి. అవన్నీ కుదిరి ఒక వేళ వెళితే, అక్కడ బుద్ధిపుడితే– అప్పుడు! మరి మనుష్యజన్మలో సాధ్యమా? మనం మనుష్య జన్మలోనే ఉన్నాము. ఉపనిషత్తు గురించి తెలుసుకోవడానికి వచ్చాము. అదే గొప్పలాభం. ఏ మతమూ ఇవ్వని హామీ మన మతం ఇస్తుంది దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే. ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతాము.

మనకు ఆకలి వేస్తుంటే, ఎదురుగుండా ఉన్నదేదో తీసుకుని వండుకుంటామా, పదిరోజుల తర్వాత ఎవరో వచ్చి పంచభక్ష్యపరమాన్నాలు చేసి పెడతారని ఆగుతామా? ఇదీ అంతే. ఆలూ లేదు, చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టు ప్రవర్తించకూడదు. నేనింత ఉపాసన చేస్తున్నా కదా, బ్రహ్మదేవుడు నన్ను కనికరించి, ఇలా రా అని నాకోసం ప్రత్యేకంగా ఇంకో తలుపు తీయడా అని ఆలోచించకూడదు.

కర్మలు, ఉపాసనలు చేయాలి నిజమే. కాని వాటినుంచి ఎదగాలి. జ్ఞానం పొందటానికి ప్రయత్నించాలి.

**కర్మ, ఉపాసన చేయనిదే జ్ఞానం అసాధ్యం**
**జ్ఞానం పొందనిదే కర్మ, ఉపాసన అసంపూర్ణం**

## మంత్రం - 11

**పంచపాదం పితరం ద్వాదశాకృతిం దివ ఆహుః పరే అర్ధే పురీషిణమ్।**
**అథేమే అన్య ఉ పరే విచక్షణం సప్తచక్రే షడర ఆహురర్పితమితి ॥ 11 ॥**

**ప్రతిపదార్థం:** పంచపాదమ్ - ఐదుపాదాలు (ఋతువులు) గలవాడు; ద్వాదశాకృతిమ్– పన్నెండు రూపాలు (మాసాలు) ధరించినవాడు; పితరం– తండ్రి; దివః పరే అర్ధే– సువర్లోకాన్ని దాటి ఉన్న స్థానంలో ఉన్నవాడు; పురీషిణమ్ – వర్షాన్ని కురిపించేవాడు; ఆహుః – (కొందరు) చెబుతున్నారు; విచక్షణమ్ – సర్వజ్ఞుడు; సప్తచక్రే–

ఏడు రథాలతో; షడరే– ఆరు ఆకులతో; అర్పితమ్ – సమస్త జగత్తుకూ ఆధారం; ఇతి– అని; అథ ఇమే అన్యే ఉ పరే – మరికొందరు వేరేగా చెబుతున్నారు.

**తాత్పర్యం:** ఐదు పాదాలు (ఋతువులు) గలవాడు; పన్నెండు రూపాలు (మాసాలు) ధరించినవాడు; తండ్రి; సువర్లోకాన్ని దాటి ఉన్న స్థానంలో ఉన్నవాడు; వర్షాన్ని కురిపించే వాడు అని కొందరు చెబుతున్నారు. సర్వజ్ఞుడు, ఏడు రథాలతో, ఆరు ఆకులతో, సమస్త జగత్తుకూ ఆధారం అని మరికొందరు వేరేగా చెబుతున్నారు.

**వివరణ:** ఇందులో సూర్యస్తుతి ఉంది. ఇంతకుముందు ప్రాణంగా స్తుతి. ఇప్పుడు శుక్లగతి, క్రమముక్తి గురించి. శంకరభాష్యం లేకపోతే ఇదంతా చాలా క్లిష్టంగా ఉంటుంది.

**పంచపాదమ్** – పంచపాదాలతో తిరుగుతున్నాడు అంటే దీన్ని పంచఋతువులుగా అన్వయించు కోవాలి. ఋతుకర్తా సూర్యః (ఆదిత్యహృదయం) నిజానికి మనకున్నవి ఆరు ఋతువులు. అవి వరుసగా వసంతఋతువు, గ్రీష్మఋతువు, వర్షఋతువు, శరద్ఋతువు, హేమంతఋతువు, శిశిరఋతువు. ఇంగ్లీషులోకి వచ్చేసరికి వారికి నాలుగు ఋతువులే ఉన్నాయి. అవి స్ప్రింగ్, సమ్మర్, ఆటమ్, వింటర్. వసంత – స్ప్రింగ్, గ్రీష్మ– సమ్మర్; వర్ష – (ఇది విడిగా లేదు). శరద్ – ఆటమ్ (ఫాల్ అని కూడా అంటారు) హేమంత, శిశిర కలిపి వింటర్. ఒకటి ప్రీవింటర్; ఇంకోటి వింటర్, ఇందులో కూడా హేమంత, శిశిరఋతువులను ఒకటిగా తీసుకున్నారు.

**ద్వాదశాకృతిమ్** –12 రూపాలు – అంటే 12 నెలలు, ప్రతి నెలలో సూర్యోదయకాలం కొంచెంగా మారుతుంది.

**పితరమ్** – తండ్రి; అందరికీ అతనే ప్రాణం ఇస్తాడు, అందరినీ రక్షిస్తాడు. పితః అంటే పాతి ఇతి పితః పాలించేవాడు. మాతః అంటే మాతి ఇతి మాతః కొలత ప్రకారం ఆహారం పెట్టేది.

**దివః పరే అర్ధే** – సువర్లోకాన్ని దాటి ఉన్నస్థానంలో ఉన్నాడు. మామూలుగా శాస్త్రాల్లో మనుష్యలోకాన్ని భూలోకమనీ, అంతరిక్షాన్ని భువర్లోకమనీ, అన్నిటికన్నా పైలోకాన్ని బ్రహ్మలోకమనీ అంటారు.

**భూరితి వా అయం లోకః। భువ ఇత్యన్తరిక్షమ్। సువరితి అసౌ లోకః। మహ ఇత్యాదిత్యః। ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయన్తే ॥ – శీక్షావల్లీ – తైత్తిరీయమ్**

అన్ని లోకాల్లోకీ ఆదిత్యలోకం గొప్పది.

**పురీషిణమ్ –** పురీషిణమ్ అంటే జలం. అంటే ఎక్కువ జలం ఉన్నవాడు. తమాషాగా లేదూ? ఆదిత్యునికి వేడి ఎక్కువ అంటాం. మరి ఎలా? ఆదిత్యా జాయతే వృష్టిః

సముద్రంలోని **నీరును ఆవిరి చేసి మేఘాలద్వారా వాన కురిపిస్తాడు. ఒక్కముక్కలో వర్షానికి కారణం.**

**విచక్షణమ్** – సర్వజ్ఞం – అన్నిటినీ ప్రకాశింపచేస్తాడు. అన్నిటినీ ప్రకాశింప చేస్తాడు అంటే అన్నీ తెలుసు అని ఒక అర్థం. మరో అర్థం ఏమిటంటే, సమష్టిబుద్ధి – సూర్యుడు అంటే హిరణ్యగర్భ. హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మప్రపంచం. సమష్టి సూక్ష్మప్రపంచం అంటే సమష్టిబుద్ధి. సమష్టిబుద్ధి ఉంటే సమష్టిజ్ఞానం ఉన్నట్టే కదా. అందుకే సర్వజ్ఞం.

**సప్తచక్రః** – ఏడు చక్రాలు. ముందు పంచపాదాలు అన్నారు. ఇప్పుడు ఏడు చక్రాలు, దీనికి అనేక అర్థాలు చెప్పవచ్చు. ఏడు రథాలు ఉన్నవాడు అని ఒక అర్థం.

సప్తాశ్వరథ...నమస్కారమ్ (సూర్య నమస్కారం). ఇంకోటి ఏడు రంగులు ఉన్నట్టు.

**షడరే** – చక్రంలో ఉన్న ఆరు ఆకులు; ఇంకో అర్థం ఆరు ఋతువులు. అరవయి ఏళ్ళు గడిచాయి అనటానికి, అతను అరవై వసంతాలను చవిచూశాడండి అంటాం. అలా కాలాన్ని సూచించే సూర్యుడు ఋతువుల రూపంలో కదులుతున్నాడు. ఈ వర్ణనను అర్థం చేసుకోవటానికి కవి హృదయం ఉండాలి.

**అర్పితమ్** – సమస్త జగత్తుకూ ఆధారం సూర్యభగవానుడు. ఈ మార్గాన్ని ఉత్తరాయణంద్వారా చూపిస్తారు. ఇది ఋగ్మంత్రంలోది. సంవత్సరసృష్టి అయింది. కాని కాలసృష్టి పూర్తి అవలేదు. తరువాత మాససృష్టి. దినసృష్టి.

### మంత్రం - 12

**మాసో వై ప్రజాపతిస్తస్య కృష్ణపక్ష ఏవ రయిః శుక్లః ప్రాణస్తస్మాదేత ఋషయః శుక్ల ఇష్టం కుర్వన్తీతర ఇతరస్మిన్ ॥ 12 ॥**

**ప్రతిపదార్థం:** మాసో వై – మాసమే; ప్రజాపతిః – ప్రజాపతి; తస్య – ఆయనకి; కృష్ణపక్ష ఏవ రయిః – కృష్ణపక్షమే రయి; శుక్లః ప్రాణః – శుక్లపక్షం ప్రాణం; శుక్ల ఇష్టం కుర్వన్తి– శుక్లపక్షాన్ని ప్రాణంగా ఉపాసన చేసిన; ఋషయః – ఋషులు; తస్మాత్ – ప్రాణ ఉపాసన చేయటంవల్ల (శుక్లపక్షంలో చేసినట్టు); ఇతరే – ఈ ఉపాసన చేయనివారు; ఇతరస్మిన్ – కృష్ణపక్షంలో చేసినట్టు అవుతుంది.

**తాత్పర్యం:** మాసమే ప్రజాపతి. కృష్ణపక్షం రయి, శుక్లపక్షం ప్రాణం. శుక్లపక్షాన్ని ప్రాణంగా ఉపాసన చేసిన ఋషులు (ప్రాణ ఉపాసన చేయటంవల్ల) వారు ఎప్పుడు చేసినా అది శుక్లపక్షంలో చేసినట్టు అవుతుంది. ఈ ఉపాసన చేయనివారు కృష్ణపక్షంలో చేసినట్టు అవుతుంది.

**వివరణ:** ఇప్పుడు మాససృష్టి. అదే ప్రజాపతి ఇప్పుడు మాసరూపంలో ప్రకటితమవుతున్నాడు. ప్రజాపతే ఉపాదాన కారణం. మాసం కూడా మిథునాత్మకం. కృష్ణపక్షం రయి, శుక్లపక్షం ప్రాణం. రెండూ కలిపి నెల అవుతుంది.

**ప్రత్యేక విషయం:** ఇక్కడ మళ్ళీ ఇంకో విషయం అదనంగా చెబుతున్నాడు. శుక్లపక్షాన్ని ప్రాణంగా ఉపాసన చేసినవారికి కలిగే ప్రయోజనం ఏమిటంటే,వారు ఎప్పుడు ఏ యజ్ఞం చేసినా దానికి శుక్లపక్షంలో చేసినంత ఫలితం వస్తుంది. మామూలుగా అయితే ఉత్తరాయణం, దక్షిణాయనాల్లో ఉత్తరాయణానికి ఫలితం ఎక్కువ; కృష్ణపక్ష, శుక్లపక్షాలలో, శుక్ల పక్షంలో చేస్తే, ఏదైనా, దానికి ఫలితం ఎక్కువ. కాని ఉపాసన, కర్మ సముచ్చయం చేసినవారు, శుక్లపక్ష ప్రాణంమీద ఉపాసన చేస్తే, కృష్ణపక్షంలో చేసినా, శుక్లపక్షంలో చేసినంత శక్తివంతమవుతుంది. **శుక్లే ఇష్టం కుర్వన్తి** – అంటే వారు చేసిన యాగాలు శుక్లపక్షంలో చేసినట్టుగా పరిగణించబడుతున్నాయి. **ఇతరే** – ఈ ఉపాసన చేయనివారు, కేవలం కర్మచేసేవారు, **ఇతరస్మిన్** – ఎప్పుడు చేసినా కృష్ణపక్షంలో చేసినట్టు అవుతుంది.

అంటే దీని అర్థం, ఉపాసన కర్మ ఫలితాన్ని పెంచుతుంది. అందుకే విష్ణుసహస్రనామం, విష్ణుధ్యానం తర్వాత చేస్తే ఫలితం బాగుంటుంది. అంటే ఈ మంత్రంలో కర్మ ఉపాసనసముచ్చయ వాదం వచ్చింది. ఇప్పుడు ఇంకో సృష్టి.

### మంత్రం - 13

**అహోరాత్రో వై ప్రజాపతిస్తస్యాహరేవ ప్రాణో రాత్రిరేవ రయిః ప్రాణం వా ఏతే ప్రస్కన్దన్తి యే దివా రత్యా సంయుజ్యన్తే బ్రహ్మచర్యమేవ తద్యద్రాత్రౌ రత్యా సంయుజ్యన్తే ॥ 13 ॥**

**ప్రతిపదార్థం:** అహోరాత్రిః – రాత్రిపగలు; ప్రజాపతిః – ప్రజాపతి; తస్య– ఆయన; అహరేవ ప్రాణ: – పగలు ప్రాణం; రాత్రిః ఏవ రయిః – రాత్రి రయి; యే దివా– ఎవరు పగటి వేళలో; రత్యా– స్త్రీ సంయోగంలో; సంయుజ్యన్తే – పాల్గొంటారో; ఏతే – వారు; ప్రాణమ్ – ప్రాణాన్ని; ప్రస్కన్దన్తి– వ్యర్థం చేసుకుంటారు; తద్యద్రాత్రౌ – ఎవరు రాత్రి; సంయుజ్యన్తే రత్యా – సంయోగంలో పాల్గొంటారో; తత్ – అది; బ్రహ్మచర్యం ఏవ – అది బ్రహ్మచర్యంతో సమానం.

**తాత్పర్యం:** రాత్రి, పగలు కూడా ప్రజాపతే– పగలు ప్రాణం, రాత్రి రయి. ఎవరు పగటి వేళలో స్త్రీ సంయోగంలో పాల్గొంటారో వారు ప్రాణాన్ని వ్యర్థం చేసుకుంటారు. ఎవరు రాత్రి సంయోగంలో పాల్గొంటారో అది బ్రహ్మచర్యంతో సమానం.

**వివరణ:** ఇప్పుడు ఒక రోజు సృష్టి. రాత్రి, పగలు కలిసి రోజు, ఒక రోజు అంటే కేవలం పగలు కావచ్చు లేదా పగలు, రాత్రి రెండూ కలిపి పూర్తి రోజు కావచ్చు. అందుకని ఎలాంటి అయోమయం లేకుండా, అహోరాత్రి అని చెప్పింది ఉపనిషత్తు. రాత్రి రయి, పగలు ప్రాణం.

**ప్రత్యేక విషయం:** ఇక్కడ కూడా ఒక ప్రత్యేక విషయాన్ని చెబుతున్నది శాస్త్రం. గృహస్థుకు స్త్రీ సంయోగ నియమాన్ని బోధిస్తున్నది. అందుకే మనశాస్త్రాన్ని ధర్మశాస్త్రమని కూడా అంటారు. మన జీవితవిధానంలో ప్రతి చిన్న విషయాన్ని వివరంగా బోధిస్తుంది. **యే దివా రత్యా సంయుజ్యన్తే** – ఎవరు భార్యతో పగలు సంయోగంలో పాల్గొంటారో, వారు ప్రాణశక్తిని నష్టపోతారు. అందుకే పగటిపూట సంయోగం నిషిద్ధం. అందుకే పూర్వం పెద్దవారు పగటి పూట భార్యాభర్తలను ఏకాంతంగా ఉండనిచ్చేవారు కాదు. అదే సంయోగం రాత్రిపూట చేస్తే అది బ్రహ్మచర్యంతో సమానం.

**మంత్రం - 14**

**అన్నం వై ప్రజాపతిస్తతో హ వై తద్రేతస్తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి ॥14॥**

**ప్రతిపదార్థం:** అన్నం వై ప్రజాపతిః – ఆహారమే ప్రజాపతి; తతో హ వై తద్రేతః – అన్నంనుంచే మనుష్యబీజం ఉత్పత్తి అవుతుంది; తస్మాత్ – ఆ బీజంనుంచే; ఇమాః ప్రజాః ప్రజాయన్తే ఇతి – మనుష్యసృష్టి జరుగుతుంది.

**తాత్పర్యం:** ఆహారమే ప్రజాపతి. అన్నంనుంచే మనుష్యబీజం ఉత్పత్తి అవుతుంది. ఆ బీజంనుంచే మనుష్యసృష్టి జరుగుతుంది.

**వివరణ:** 4. **అన్నసృష్టి.** మిథునసృష్టి, లోకసృష్టి, కాలసృష్టి అయ్యాయి. ఇప్పుడు అన్నసృష్టి. అన్నం కూడా ప్రజాపతే. ప్రజాపతే దేశః కాలః, అన్నః. అన్నం అంటే అద్యతే ఇతి అన్నః– తినేదేదో అది అన్నం.

ఇక్కడ రయి, ప్రాణం ఏవో ఇవ్వలేదు, కాని ఊహించుకోవచ్చు.
**అన్నం వై తద్రేతః** – ఆ అన్నంనుంచే మనుష్యబీజం వస్తుంది. ఈ మనుష్యబీజం రెండుగా ఉంటుంది. పురుషునిలో శుక్రమని, స్త్రీలో శోణితమనీ అంటారు.

**శుక్రశోణిత సంయోగమేవ సృష్టిః**

స్త్రీ, పురుషులలోని శుక్ర, శోణితాలు కలిస్తే సృష్టి జరుగుతుంది.

**శుక్రశోణితరూప బీజసంయోగాత్ ఇమాః ప్రజాః ప్రజయన్తే –**
మనుష్య సృష్టి జరుగుతుంది అంటే ప్రాణకోటి పుట్టింది. మరి ప్రశ్న ఏమిటి?

**కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయన్తే**

ఎక్కడ మొదలో మనం మర్చిపోయినా, పిప్పలాదుడు మర్చిపోలేదు. అందుకే అదే పదాలతో ముగించాడు – **తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి**

**కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయన్తే –** ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?

**తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి –** ప్రజాపతినుంచి ప్రజాసృష్టి వస్తుంది

అనేక దశల తరువాత చివరికి ప్రజాసృష్టి వస్తుంది. సృష్టి అంతటికీ అంతిమ కారణం ప్రజాపతి, కాని ప్రత్యక్షంగా కాదు. మిథునసృష్టి,లోకసృష్టి,కాలసృష్టి,అన్నసృష్టి, రేతస్సు సృష్టిద్వారా మనుష్యసృష్టి జరిగింది. దీనితో కబంధీ కాత్యాయనుడు అడిగిన ప్రశ్నకు జవాబు అయిపోయింది. ఫలస్తుతి వస్తుంది ఇప్పుడు.

**మంత్రం - 15**

**తద్యే హ వై తత్ప్రజాపతివ్రతం చరన్తి తే మిథునముత్పాదయన్తే। తేషామేవైష బ్రహ్మలోకో యేషాం తపో బ్రహ్మచర్యం యేషు సత్యం ప్రతిష్ఠితమ్ ॥ 15 ॥**

**ప్రతిపదార్థం:** తత్– ఈ విధంగా; యే – ఎవరు; తత్ప్రజాపతివ్రతమ్ – ఆ బ్రహ్మచర్యవ్రతం; చరన్తి – పాటిస్తారో; తే – వారు; మిథునముత్పాదయన్తే – ఇద్దరు పిల్లలను కంటారు; యేషామ్– ఎవరు; తప: – తపసు చేసి; బ్రహ్మచర్యమ్ – బ్రహ్మచర్యం పాటించి; ఏషు సత్యం ప్రతిష్ఠితమ్ – సత్యమే పలుకుతారో; తేషామేవైష బ్రహ్మలోకః – వారు (ఇక్కడ) స్వర్గలోకానికి వెళతారు.

**తాత్పర్యం:** ఈ విధంగా ఎవరు ఆ బ్రహ్మచర్య వ్రతం పాటిస్తారో, వారు ఇద్దరు పిల్లలను కంటారు. ఎవరు తపస్సు చేసి, బ్రహ్మచర్యం పాటించి, సత్యమే పలుకుతారో, వారు (ఇక్కడ)స్వర్గలోకానికి వెళతారు.

**వివరణ:** ఉపనిషత్తులు సనాతన ధర్మాన్ని బోధిస్తాయనీ, ధర్మసూక్ష్మాలను బోధిస్తాయనీ ఇంతకు ముందే చూసాము. అందుకే బోధలో భాగంగా కొన్ని వ్రతాలు చెబుతాయి. వాటిని నియమంగా పాటించాలి. ఉదాహరణకు,

**అన్నం న నిన్ద్యాత్। తద్ వ్రతమ్।**

**అన్నం న పరిచక్షీత। తద్ వ్రతమ్।**

**అన్నం బహుకుర్వీత। తద్ వ్రతమ్।**

**న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్ వ్రతమ్ ॥ –భృగువల్లీ, తైత్తరీయమ్**

ఈ ఉపనిషత్తులో ప్రజాపతి వ్రతం – గృహస్థుకు భార్యతో సంయోగ విషయంలో నియమం. ఇది ఆత్మసంయమనంకోసం చెప్పబడింది. గృహస్థుగా గౌణబ్రహ్మచర్యం చేస్తే తర్వాత ముఖ్యబ్రహ్మచర్యం చేయటం సులువవుతుంది. దానికి ఇది మొదటి మెట్టు. అలా పాటించిన వారు ప్రజాపతి మిథునసృష్టి చేసినట్టుగా, వారు కూడా మిథునసృష్టి చేస్తారు.

అంతేకాదు ఇంకా కొన్ని నియమాలను కూడా ఈ మంత్రం బోధిస్తున్నది. అంతకు ముందు ఏమంది? కేవలకర్మ చేసినవారు స్వర్గలోకానికి, కర్మ + ఉపాసన చేసినవారు బ్రహ్మలోకానికీ వెళతారంది. కాని కండిషన్స్ అప్లై అని ఇప్పటి ప్రకటనలకి జోడించినట్టుగా ఉపనిషత్తు కూడా కండిషన్స్ అప్లై అంటున్నది. ఏమిటవి? **తేషామేవ** – బ్రహ్మచర్య వ్రతం పాటించినవారికే బ్రహ్మలోకం అంటున్నది. ఇక్కడ బ్రహ్మలోకం అంటే స్వర్గలోకం. అసలు బ్రహ్మలోకం గురించి తరువాత మంత్రంలో వస్తుంది. అంతేకాదు వారు తపస్సు చేయాలి. బ్రహ్మచర్యం పాటించాలి. సత్యం పలకాలి. తపస్సు అంటే క్రమశిక్షణ, బ్రహ్మచర్యం అంటే ఇంద్రియ నిగ్రహం. పిప్పలాద గురువు ఆ ఆరుగురు శిష్యులకీ ఒక ఏడాదిపాటు తపస్సు చేసి, బ్రహ్మచర్యం పాటిస్తేనే విద్య బోధిస్తానని షరతు పెట్టాడు కదా! అంటే ఇవన్నీ చేస్తేనే ఏదైనా ఫలం – స్వర్గలోక ప్రాప్తి అయినా, బ్రహ్మజ్ఞానం అయినా.

### మంత్రం - 16

**తేషామసౌ విరజో బ్రహ్మలోకో న యేషు జిహ్మమనృతం న మాయా చేతి ॥ 16 ॥**

**ప్రతిపదార్థం:** తేషామ్ – ప్రజాపతి వ్రతం పాటించిన వారే; విరజః – దుఃఖరహితమైన; అసౌ బ్రహ్మలోకః – ఆ బ్రహ్మలోకం (వెళతారు); యేషు – ఎవరిలో; జిహ్మమ్ – వక్రబుద్ధి; అనృతమ్ – అబద్ధం; మాయా చ – వంచన ; న – లేవో; ఇతి– అని.

**తాత్పర్యం:** ప్రజాపతి వ్రతం పాటించిన వారే దుఃఖరహితమైన ఆ బ్రహ్మలోకం వెళతారు. ఎవరిలో వక్రబుద్ధి లేదో, ఎవరు అబద్ధం ఆడరో, ఎవరు వంచన చేయరో, వారే బ్రహ్మలోకానికి వెళతారు.

**వివరణ:** ప్రజాపతి వ్రతం పాటించినవారికే శుక్లగతి సాధ్యం. బ్రహ్మలోకం దుఃఖరహితమైంది. బ్రహ్మానందం ఎన్నో రెట్లు గొప్పది. ఒక మనిషి ఆనందానికన్నా వందరెట్లు గొప్పది, మనుష్య గంధర్వ ఆనందం. అలా ఒక్కొక్క లోకంయొక్క ఆనందం

వందరెట్లుగా పెరుగుతూ వస్తుంది. చివరికి బ్రహ్మానందం దగ్గరికి వచ్చేసరికి అది మనుష్య ఆనందానికి $10^{20}$ అవుతుంది. అటువంటి లోకానికి వెళ్ళాలంటే కేవలం బ్రహ్మచర్యవ్రతం పాటిస్తే చాలదు. వారు ఎలా ఉండాలి? మూడు పాపాలకు దూరంగా ఉండాలి. **జిహ్మమ్** అంటే వక్రబుద్ధి; **అనృతమ్** – అబద్ధం; **మాయ** – వంచన ఉండకూడదు. అంటే మనసా, వాచా, కర్మణా సత్యప్రవృత్తినే కలిగి ఉండాలి. అలా లేకపోతే శుక్లగతి ఉండదు. బ్రహ్మలోకప్రాప్తి కలుగదు.

అలా ప్రజాపతి వ్రతాన్ని, గతులను ఒకసారి గుర్తుచేసి, ఉపనిషత్తు ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నది. ఇక్కడితో మొదటి శిష్యుని ప్రశ్న ముగిసింది. కబంధీ కాత్యాయనుడు వెళ్ళి కూర్చున్నాడు.

## అధ్యాయం - 1 టూకీగా - సృష్టి ప్రకరణం

| సృష్టి | 1 | 2 |
|---|---|---|
| 1. మిథునసృష్టి | రయి | ప్రాణ |
| | మూర్తప్రపంచం | అమూర్తప్రపంచం |
| 2. లోకసృష్టి | చంద్రుడు | ఆదిత్యుడు |
| 3. కాలసృష్టి | | |
| సంవత్సరం | దక్షిణాయనం | ఉత్తరాయణం |
| నెల | కృష్ణపక్షం | శుక్లపక్షం |
| రోజు | రాత్రి | పగలు |
| 4. అన్న సృష్టి–రేతస్సు | శోణితం | శుక్రం |
| 5. మనుష్యసృష్టి | స్త్రీ | పురుషుడు |

| మార్గాలు | సూక్ష్మ సూచనలు |
|---|---|
| కేవల కర్మ చేస్తే కృష్ణగతిద్వారా స్వర్గలోకప్రాప్తి | – పునర్జన్మ |
| తపస్సు, బ్రహ్మచర్యం | – నిబంధనలు |
| ఉపాసన చేస్తే శుక్లగతిద్వారా బ్రహ్మలోకప్రాప్తి | – కేవలకర్మ చేసిన వారికి ప్రవేశం లేదు |
| అది కూడా ఆపేక్షిక అమృతత్వం | |
| వక్రబుద్ధి, అసత్యం, వంచన తగదు | – నిబంధనలు |

**ప్రత్యేక విశ్లేషణ:-**

ఇక్కడ సృష్టి గురించి ప్రత్యేక విధానంలో చెప్పబడింది. దీన్ని మిథునసృష్టి అంటారు. ఇలా వేరే ఏ ఉపనిషత్తులోనూ చూడము. మిథునం అంటే జంట. మామూలుగా జంటను ద్వంద్వం అంటాము. ఒకే దానికి అవి రెండు విభిన్న అంశాలు. ఉదాహరణకు, పగలుకూ, రాత్రికీ చాలా భేదాలున్నాయి. కాని రెండూ కలిపితేనే రోజు పూర్తి అవుతుంది. అందుకని వాటిని విడివిడిగా చూస్తే మనకు వాటిమీద రాగద్వేషాలు ఏర్పడుతాయి. రెండూ కలిపి మొత్తంగా చూస్తే ఆ భేదం కనబడదు. జన్మ, మరణం ఒక విడిపోని జంట. అలా దాన్ని చూడగలిగితే మరణమంటే భయం వేయదు. 'పెరుగుట తరుగుట కొరకే,' అంటారు పెద్దలు. అంటే రెండింటినీ సమభావంలో చూడగలిగితే పరిపూర్ణదృక్పథం ఏర్పడుతుంది.

మన శాస్త్రాల్లో సృష్టి గురించి రకరకాలుగా వర్ణనలున్నాయి.

**బృహదారణ్యకం**: బృహదారణ్యకంలో మను, శతరూప అనే జంటసృష్టి ముందు జరుగుతుంది. శతరూపకి తాము ఒక చోటినుంచే పుట్టామంటే అన్నాచెల్లెళ్ళ కింద లెక్క అని నచ్చక తను ఆవుగా మారుతుంది. మను ఎద్దుగా మారుతాడు. అలా ఒక్కొక్క జంతువుగా, సూక్ష్మక్రిములదాకా ముందు శతరూప, దాని పురుషభాగంగా మను పుట్టటంద్వారా అనేక జీవరాసులొచ్చాయని ఒక కథ.

**ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యో ఽన్నమ్। అన్నాత్పురుషః। - తైత్తిరీయమ్**

అంటే ముందు ఆకాశం పుట్టింది. ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి పృథివి; పృథివినుంచి ఓషధులు, ఓషధులనుంచి అన్నం, అన్నంనుంచి పురుషుడు వచ్చాడని చెబుతుంది. ఇలా సాగుతుంది సృష్టిక్రమం.

**బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్। బాహూ రాజన్యః కృతః।**
**ఊరూ తదస్య యద్వైశ్యః। పద్భ్యాగ్ం శూద్రో అజాయత ॥ - పురుషసూక్తమ్**

హిరణ్యగర్భ ముఖంలోంచి బ్రాహ్మణుడు, బాహువులనుంచి క్షత్రియుడు, ఊరువులనుంచి వైశ్యుడు, పాదాలనుంచి శూద్రుడు పుట్టారని అర్థం.

సృష్టి గురించి ఎందుకు ఇన్నిరకాలుగా చెప్పారు? ఎందుకంటే జగత్‌మిథ్య, బ్రహ్మ సత్యం కాబట్టి. శాస్త్రం సృష్టి కూడా స్వప్నమే అంటుంది. సచ్చిదానంద ఆత్మపై ఆరోపించిన స్వప్నమిది. అందుకని శాస్త్రం సృష్టి గురించి చెప్పటానికి అధ్యారోప, అపవాదన్యాయం వాడుతుంది. దీన్ని చివరి అధ్యాయంలో వివరంగా చూడవచ్చు.

# అధ్యాయం - 2

ముండకోపనిషత్తు మంత్రోపనిషత్తు అయితే, ప్రశ్నోపనిషత్తు దానికి బ్రాహ్మణోపనిషత్తు (మంత్రోపనిషత్తుకు వ్యాఖ్యానం). ముండకోపనిషత్తులో పరావిద్య, అపరావిద్యల గురించి వచ్చింది కాని అపరావిద్య గురించి వివరణలేదు. అపరావిద్య రెండురకాలు - కర్మ, ఉపాసన. రెండూ కలిసి అపరావిద్యే అయినా, ఉపాసన గురించి ఎక్కువగా లేదు. తొమ్మిది మంత్రాల దాకా కర్మ గురించే ఉంటుంది.

**ఓం తదేతత్సత్యం, మంత్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యం -**
**స్తాని త్రేతాయాం బహుధా సన్తతాని ।**
**తాన్యాచరథ నియతం సత్యకామాః**
**ఏష వః పన్థాః సుకృతస్య లోకే ॥ ముండకమ్ - 1.2.1.**

మంత్రాలలో ఋషులు దర్శించిన కర్మలన్నీ సత్యమే. వాటిని మూడు వేదాలూ ఎంతో ప్రశంసించాయి. సత్యప్రియులు వాటిని ఆచరిస్తే స్వర్గలోకానికి వెళతారు. అందుకోసం అన్ని కర్మలూ చేయాలి.

**కాలీ కరాలీ చ మనోజవా చ సులోహితా యా చ సుధూమ్రవర్ణా ।**
**స్ఫులింగినీ విశ్వరుచీ చ దేవీ లేలాయమానా ఇతి సప్తజిహ్వాః ॥ ముండకమ్ - 1.2.4**

యజ్ఞకుండంలో ఏడునాలుకలతో అగ్ని ప్రకాశవంతంగా మండుతుంది.

**ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః**
**సూర్యస్య రశ్మిభిర్యజమానం వహన్తి।**
**ప్రియాం వాచమభివదన్త్యోఽర్చయన్త్యః**
**ఏష వః పుణ్యః సుకృతో బ్రహ్మలోకః॥ ముండకమ్- 1.2.6**

సాధకుని మరణం తర్వాత దేవతలు స్వయంగా ఎదురొచ్చి స్వాగతం పలికి, స్వర్గలోకాలకు తీసుకువెళతారు. ఇంతగా యాగాలు చేయాలనీ, స్వర్గలోకానికి వెళతారనీ దేవతలు ఎదురొచ్చి తీసుకువెళతారనీ చెప్పాక, మళ్ళీ ఒక సూక్ష్మ(ముఖ్య)సూచన చేస్తుంది.

**ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయన్తే ప్రమూఢాః ।**
**నాకస్య పృష్ఠే తే సుకృతేఽనుభూత్వా ఇమం లోకం హీనతరం వా విశన్తి॥**
**ముండకమ్ - 1.2.10**

ఈ పరమమూఢులు, యాగాలు, సత్కర్మలే సమస్తం అని భావిస్తారు. కాని స్వర్గలోకంలో పుణ్యఫలాలను అనుభవించాక, ఈ భూమ్మీదో లేకపోతే అంతకంటే హీనమైన జన్మలనో పొందుతారు.

అలా అవకాశం దొరికినప్పుడల్లా కేవలకర్మను ఉపనిషత్తు నిందిస్తుంది. దాన్నించి ఎదగాలని ఎప్పటికప్పుడు బోధిస్తుంది. అలా ముండకోపనిషత్తు పది మంత్రాల్లో కర్మ గురించి చెప్పి, ఒక్క మంత్రంలో ఉపాసన గురించి చెబుతుంది.

**తపః శ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే శాన్తా విద్వాంసో భైక్షచర్యాం చరన్తః।**
**సూర్యద్వారేణ తే విరజాః ప్రయాన్తి యత్రామృతః స పురుషో హి అవ్యయాత్మా॥**
**ముండకమ్ - 1.2.11**

ఉపాసన చేసినవారు ఉత్తరాయణ మార్గంద్వారా బ్రహ్మలోకం చేరుకుంటారు. ముండకంలో ఒక్క మంత్రంలో ఉన్న ఉపాసన గురించి ఇక్కడ ప్రశ్నోపనిషత్తులో 2,3 అధ్యాయాల్లో వివరంగా వస్తుంది. రెండు అధ్యాయాలు ఎందుకు? ఒకటి చాలదా? మీమాంస సూత్రం ప్రకారం ఏ దేవత ఉపాసన గురించి చెపితే, ఆ దేవతస్తుతి చేయాలి. ఉపాసనకు స్తుతి ఎందుకు? ఏ దేవతనన్నా ప్రార్థించాలంటే భక్తి ఏర్పడాలి. ఒక సభలో కూడా చూడండి, ఒక వ్యక్తి ప్రసంగం ఇచ్చేముందు అతని గురించి ఇంతవాడు, అంతవాడు అని నిర్వాహకులు మెచ్చుకుంటారు. ఎందుకంటే అతను ప్రసంగం ఇవ్వబోయే గంటసేపూ, సభికులు అతని మాటలను శ్రద్ధగా వినాలి. అంటే అతనిమీద ఉపాసన చేయాలన్నమాట.

అందువల్ల మనకు రెండవ అధ్యాయంలో హిరణ్యగర్భ స్తుతి ఉంటే, మూడవ అధ్యాయంలో హిరణ్యగర్భ ఉపాసన వస్తుంది. స్తుతి ఎలా వస్తుంది? హిరణ్యగర్భ ఎవరు? అతని నిర్వచనం మర్చిపోకూడదు. సమష్టి సూక్ష్మశరీరం హిరణ్యగర్భ. ఆ సమష్టి సూక్ష్మశరీరమే అన్ని జీవాల్లోని సూక్ష్మశరీరంలో ప్రాణం రూపంలో ప్రకాశిస్తుంది. స్థూలశరీరం, సూక్ష్మశరీరం లేనిదే లేదు. సూక్ష్మశరీరం హిరణ్యగర్భ లేనిదే లేదు.

సూక్ష్మశరీరంలో 24 భాగాలు ఉన్నాయి. (పంచ భూతాలు + పంచ ప్రాణాలు+ పంచజ్ఞానేంద్రియాలు + పంచకర్మేంద్రియాలు + నాలుగు అంతఃకరణలు). కాని ఎక్కువగా వాటిలో 19 అని చెబుతారు. పంచభూతాలను లెక్కలోకి తీసుకోరు. ఏది ముఖ్యం? ప్రాణం. ఎందుకు? జీవిని ప్రాణి అంటాము. ప్రాణం పనిచేయకపోతే మనకి ఉనికి లేదు.

ఇంకో కారణం - నిద్రలో అన్నీ పడుకున్నా ప్రాణం మాత్రం పనిచేస్తూనే ఉంటుంది. శ్వాస పీలుస్తూనే ఉంటాము. మనిషి ఉన్నాడా, లేదా అని పరీక్షించటానికి ముక్కు దగ్గర చేయిపెట్టి చూస్తాము. అందుకే ఈ ఉపాసనను ప్రాణోపాసన అంటారు. బుద్ధి లేకపోయినా జీవితం బాగానే సాగిపోతుంది. ప్రాణం లేకుండా సాగదు.

**మంత్రం -1**

**అథ హైనం భార్గవో వైదర్భిః పప్రచ్ఛ। భగవన్ కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే? కతర ఏతత్ప్రకాశయన్తే? కః పునరేషాం వరిష్ఠ ఇతి ॥ 1 ॥**

**ప్రతిపదార్థం:** అథ – ఆ తర్వాత; భార్గవో వైదర్భిః – విదర్భ దేశానికి చెందిన భార్గవుడు; పప్రచ్ఛ – అడిగాడు; భగవాన్– ఓ దేవర్షీ; ప్రజాం – ఒక వ్యక్తికి, కతి ఏవ దేవాః – ఏ దేవతలు; విధారయన్తే– స్థితికారకులు? కతరే– వారిలో ఎవరు; ఏతత్ – దీనిని; ప్రకాశయన్తే– గొప్పలు చెబుతున్నారు; పునః – మళ్ళీ; ఏషాం – వారిలో; కః – ఎవరు, వరిష్ఠ – శ్రేష్ఠుడు; ఇతి – అని.

**తాత్పర్యం:** ఆ తర్వాత భార్గవో వైదర్భి పిప్పలాద మహర్షిని ఇలా అడిగాడు, 'ఓ దేవర్షీ! ఒక వ్యక్తికి ఏ దేవతలు స్థితికారకులు? వారిలో ఎవరు గొప్పలు చెబుతున్నారు? మళ్ళీ వారిలో ఎవరు శ్రేష్ఠుడు?

**వివరణ:** కబంధీకాత్యాయనుడు ప్రశ్న అడిగి, గురువు జవాబు చెప్పాక, రెండవ శిష్యుడు– **భార్గవో వైదర్భి** ప్రశ్న అడిగాడు. **ఏనమ్** – ఆ గురువును అడిగాడు. గురువు ఒకరే కాబట్టి గురువు పేరు రాయలేదు. అతను మూడు ఉపప్రశ్నలు అడిగాడు. అవి–

1. **కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే?** – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు?
2. **కతర ఏతత్ప్రకాశయన్తే?** – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?
3. **కః పునరేషాం వరిష్ఠః?** – వారిలో ఎవరు శ్రేష్ఠులు?

సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉన్నాయి. 19 అంగాలే కాక పంచభూతాలు కూడా ఉన్నాయి. కాని ఇక్కడ వాటిని దేవతలుగా పేర్కొన్నాడు శిష్యుడు. ఎందుకు? దానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. అంగాలుగా, పదార్థంగా మాత్రమే తీసుకుంటే అవి జడం అవుతాయి. కాని శాస్త్రంలో చైతన్యం మాట ఎత్తకుండా ఏదీ మాట్లాడము. ప్రతి జడం వెనకా చైతన్యం ఉంది. సూర్యుణ్ణి ఒక పదార్థంగా చూడము. సూర్యదేవతగా చూస్తాము. అలాగే వరుణదేవుడు అంటాము.

2. ప్రాణం గొప్పదేవత అని నిరూపించటానికి పిప్పలాదగురువు సూక్ష్మశరీరంలోని దేవతల మధ్య పోట్లాట జరిగినట్టుగా, ఒక ఊహాజనితమైన కథను అల్లాడు. పురాణాల్లో అలా కామ, క్రోధాలకీ, ప్రేమకీ, రోగాలకీ అన్ని భావాలకీ ఒక ఆకారాన్ని ఇస్తారు. దాన్ని ఇంగ్లీషులో పర్సానిఫికేషన్ అంటారు.

**మంత్రం - 2**

**తస్మై స హోవాచ। ఆకాశో హ వా ఏష దేవో వాయురగ్నిరాపః పృథివీ వాఙ్మనశ్చక్షుః శ్రోత్రం చ। తే ప్రకాశ్యాభివదన్తి వయమేతద్బాణమవష్టభ్య విధారయామః ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** తస్మై – అతడితో; సః – పిప్పలాద; ఉవాచ – చెప్పాడు; ఆకాశో హ వై – ఆకాశం; వాయురగ్నిరాపః పృథివీ – వాయువు, అగ్ని, నీరు, పృథివి, (పంచభూతాలు); వాక్– వాక్కు (పంచకర్మేంద్రియాలు) మనః–మనస్సు (చత్వారీ అంతఃకరణాని); చక్షు, శ్రోత్రం చ – కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు) వయం విధారయామ– మేమే శరీరాన్ని భరిస్తున్నాము; ఏతద్ బాణమ్ – శరీరం; అవష్టభ్య– కలిపి; విధారయామః– ఉంచుతున్నాము; తే ప్రకాశ్య అభివదంతి– ఈ 19 దేవతలూ వాటి పనిని స్తుతి చేస్తున్నాయి.

**తాత్పర్యం:** అతనితో పిప్పలాద ఇలా చెప్పాడు – 'ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివి (పంచభూతాలు), వాక్కు, (పంచకర్మేంద్రియాలు), మనస్సు (చత్వారీ అంతః కరణాని), కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు) అనే మేమే ఈ శరీరాన్ని భరిస్తున్నాము; మేమే ఈ శరీరాన్ని కలిపి ఉంచుతున్నాము,' అని ఈ 19 దేవతలూ వాటి పనిని స్తుతి చేస్తున్నాయి.

**వివరణ:** ఈ మంత్రంలో మొదటి రెండు ప్రశ్నలకీ జవాబులు వచ్చేస్తాయి. మొదటి ప్రశ్న – 1. **కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే**? – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు? – 24 దేవతలు భరిస్తున్నాయి.

| | |
|---|---|
| ఎ) పంచభూతాలు | – ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివి |
| బి) చత్వారి అంతఃకరణాని | – మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం |
| సి) పంచకర్మేంద్రియాలు | – వాక్కు, కాళ్ళు, చేతులు,పాయు,ఉపస్థ |
| డి) పంచజ్ఞానేంద్రియాలు | – కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, చర్మం |

వీటన్నింటినీ కూడితే 19 అవుతాయి. పంచప్రాణాలు లెక్కవేయలేదు. అవి – ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదాన. వీటి గురించి ఈ మంత్రంలో చెప్పలేదు. అవి తర్వాత వస్తాయి. అవి కూడా కలుపుకోవాలి. అప్పుడు 24 అవుతాయి.

2. **కతర ఏతత్ప్రకాశయన్తే**? – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?

**తే ప్రకాశ్యః అభివదన్తి –** 19 దేవతలూ వాటి పనిని స్తుతి చేసుకుంటున్నాయి.

ఏ దేవతలు తమ గురించి గొప్పలు చెప్పుకుంటున్నాయి? 19 దేవతలూ వాటి పనిని స్తుతి చేసుకుంటున్నాయి. '**వయం విధారయామః**' అంటున్నాయి. అంటే మేమే శరీరాన్ని భరిస్తున్నాము అంటున్నాయి. **బాణమ్** అంటే శరీరం.

ఇంక మూడో ప్రశ్న మిగిలింది. అది చాలా ముఖ్యమైంది. మిగతా అధ్యాయమంతా దానికి జవాబే.

**3.కః పునరేషాం వరిష్ఠ?** – వారిలో ఎవరు శ్రేష్ఠులు?

**మంత్రం - 3**

**తాన్ వరిష్ఠః ప్రాణ ఉవాచ। మా మోహమాపద్యథాహమేవై తత్పఞ్చధా ఽ ఽ త్మానం ప్రవిభజ్యైతద్బాణమవష్టభ్య విధారయామీతి తేఽ శ్రద్దధానా బభూవుః ॥ 3 ॥**

**ప్రతిపదార్థం:** తాన్ – వాటిలో; వరిష్ఠః – శ్రేష్ఠమైన; ప్రాణః ఉవాచ– ప్రాణం అన్నది; మోహం– ఎవరు గొప్ప అన్న భ్రాంతిలో: మా ఆపద్యథ– పడకండి; అహమ్ ఏవ నన్ను నేనే; పఞ్చధా ఆత్మానం ప్రవిభజ్య – ఐదుగా విభజించుకుని; ఏతద్బాణం– ఈ శరీరాన్ని; అవష్టభ్య– స్తంభంలాగా; విధారయామి – నిలబెడుతున్నాను; ఇతి– అని; తే అశ్రద్దధానాః బభూవుః – ఆ 19 దేవతలు నమ్మలేదు.

**తాత్పర్యం:** వాటిలో శ్రేష్ఠమైన ప్రాణం అన్నది; 'ఎవరు గొప్ప అన్న భ్రాంతిలో పడకండి; నన్ను నేనే ఐదుగా విభజించుకుని, స్తంభంలాగా ఈ శరీరాన్ని నిలబెడుతున్నాను.' కాని ఆ 19 దేవతలు నమ్మలేదు.

**వివరణ:** గర్వమున్న చోట గర్వభంగం తప్పదు. అందుకని ప్రాణం వాటిని పిలిచి చక్కగా చెప్పింది,'నేను చేస్తున్నాను,' అని భ్రాంతి చెందకండి. ఎందుకు? '**అహమేవ ఏతద్బాణం ఆత్మానం పఞ్చధా ప్రవిభజ్య**' – నన్ను నేను ఐదుగా విభజించుకుని ఈ శరీరాన్ని సమైక్యపరచి, శరీరనిర్వహణ అంతా చేస్తున్నాను,' అని చెప్పింది.

అంతకు ముందు మంత్రంలో దేనికవే, 19 దేవతలు '**వయమేతద్బాణమవష్టభ్య విధారయామః**' అన్నాయి. అందుకని ప్రాణం అవే పదాలని వాడి '**అహమేవ తద్బాణమవష్టభ్య విధారయామి**' అని చెప్పింది. అంటే అక్కడితో ప్రాణం మాటలు ముగిసినట్లే.

ప్రాణం విభజించుకున్న భాగాలు – ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదాన. అవి ఎక్కడ ఉంటాయి? ఎలా భరిస్తాయి వివరంగా తక్కిన మంత్రాల్లో వస్తుంది. అప్పుడు చూద్దాము.

**అవష్టభ్య**- స్తంభం. పెద్ద భవనాన్ని ఒక స్తంభం ఎలా నిలిపి ఉంచుతుందో, అలా ప్రాణం అక్షరాలా స్తంభంలా పనిచేస్తుంది. స్తబ్ధ అన్న పదం కూడా దీన్నించే వచ్చింది- ఎవరైనా కొంచెం కూడా కదలకుండా, అలా నిటారుగా నిల్చుంటే, ఎందుకలా స్తబ్ధుగా నిలుచున్నావు అంటారు. తక్కిన భాగం ఉపనిషత్తు చెబుతుంది. అలా ప్రాణం చెప్పిన విషయాన్ని అది నిజమైనా, ఈ 19 దేవతలూ గర్వంతో ఒప్పుకోవు. అప్పుడు అది నిజమని ప్రాణం నిరూపించాలి. వాటికొక గుణపాఠం నేర్పించాలి. అది తరువాత మంత్రంలో వస్తుంది.

**మంత్రం - 4**

**సోఽభిమానాదూర్ధ్వముత్క్రామత ఇవ తస్మిన్నుత్క్రామత్యథేతరే సర్వ ఏవోత్క్రామన్తే తస్మిగ్ంశ్చ ప్రతిష్ఠమానే సర్వ ఏవ ప్రాతిష్ఠన్తే। తద్యథా మక్షికా మధుకరరాజానముత్క్రామన్తం సర్వా ఏవోత్క్రామన్తే తస్మిగ్ంశ్చ ప్రతిష్ఠమానే సర్వా ఏవ ప్రాతిష్ఠన్త ఏవం వాఙ్మనశ్చక్షుశ్శ్రోత్రం చ తే ప్రీతాః ప్రాణం స్తున్వన్తి॥4॥**

**ప్రతిపదార్థం:** సః అభిమానాత్ - అది అభిమానంతో; ఊర్ధ్వమ్ -పైకి, ఉత్క్రామతే ఇవ - వెళ్ళినట్టుగా చేసింది; తస్మిన్ ఉత్క్రామతి - ప్రాణం వెళ్తూంటే; అథ ఇతరే సర్వే ఏవ- తక్కినవన్నీ; ఉత్క్రామన్తే- వెళుతున్నాయి; తస్మిన్ చ ప్రతిష్ఠమానే- ప్రాణం వెనక్కివస్తే; సర్వే ఏవ ప్రాతిష్ఠంతే- తక్కినవన్నీ వెనక్కి వస్తున్నాయి; తత్ యథా- ఎలా; మక్షికా మధుకరరాజానామ్ - తేనెటీగల రాజు; ఉత్క్రామన్తమ్ - వెళితే; సర్వాః ఏవ- తక్కినవన్నీ; ఉత్క్రామన్తే- వెళతాయో; తస్మిన్ చ ప్రతిష్ఠమానే- అతను ఒక చోట ఉంటే; సర్వాః ఏవ ప్రాతిష్ఠన్తే - అన్నీ అక్కడ ఉంటాయో; ఏవమ్ - అదే విధంగా; వాక్- వాక్కు (పంచకర్మేంద్రియాలు); మనః - మనస్సు(నాలుగు అంతఃకరణాలు); చక్షుః శ్రోత్రం చ - కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు); తే- అవి; ప్రీతాః - ప్రీతి చెంది; ప్రాణమ్- ప్రాణాన్ని; స్తున్వన్తి- స్తుతించాయి.

**తాత్పర్యం:** ప్రాణం అభిమానంతో పైకి వెళ్ళినట్టుగా చేసింది. ప్రాణం వెళుతూంటే తక్కినవన్నీ కూడా వెళుతున్నాయి. ప్రాణం వెనక్కి వస్తే తక్కినవన్నీ వెనక్కి వస్తున్నాయి. ఎలా తేనెటీగల రాజు వెళితే, తక్కినవన్నీ వెళతాయో, అతను ఒకచోట ఉంటే తక్కినవన్నీ అక్కడ ఎలా ఉంటాయో అదే విధంగా వాక్కు (పంచకర్మేంద్రియాలు), మనస్సు(నాలుగు అంతఃకరణాలు), కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు), (పంచభూతాలను కలుపుకోవాలి) (అన్నీ ప్రాణం వెంట వెళతాయి. వస్తాయి. అందుకే ప్రాణం శ్రేష్ఠమని వాటికి అర్థమయి) ప్రీతి చెంది ప్రాణాన్ని స్తుతించాయి.

**వివరణ:** ప్రాణం ఏం చేసింది? వాకౌట్ చేయబోయింది. ఇవ అన్నపదం ముఖ్యం. వెళ్ళినట్టుగా చేసింది, అభిమానంతో. ఊర్ధ్వం ఉత్క్రమత్ ఇవ – వర్తమానంలో ఉంది. మనం భూతకాలంలోకి మార్చుకోవాలి. ప్రాణం నిజంగా వెళితే, మనిషి ఉండడు. అందుకని అది వెళ్ళినట్టు చేస్తుంది. తక్కినవి సంతోషంగా ఉండవచ్చు అనుకున్నాయి. కాని వాటి ప్రమేయం లేకుండా అవి కూడా వెళ్ళిపోతున్నాయి. ఎందుకంటే వాటి ఉనికి, కార్యకలాపాలు అన్నీ ప్రాణంమీదే ఆధారపడి ఉన్నాయి. అప్పుడు ప్రాణం ఏం చేసింది? వెనక్కి తిరిగింది. వెంటనే తక్కినవన్నీ వెనక్కి వచ్చాయి. అలా ప్రాణం కదిలితే, తక్కినవి కూడా పైకీ, కిందకీ కదులుతున్నాయి.

అవునా, కాదా? ఎవరికన్నా జ్వరం వచ్చి, ప్రాణశక్తి తగ్గితే, వాక్‌శక్తి తగ్గుతుంది. మామూలుగా పది ఊళ్ళకు వినిపించేలా అరిచే వ్యక్తి నూతిలోంచి మాట్లాడినట్టు మాట్లాడుతాడు. కళ్ళు, నోరు, అన్నీ అలసిపోతాయి. ప్రాణశక్తి వస్తే, అన్నీ తిరిగి వస్తాయి. ఛాందోగ్యోపనిషత్తులో గురువు శ్వేతకేతుని పదిహేను రోజులు అన్నం తినకుండావుండి రమ్మంటాడు. అప్పుడు అతనికి తను నేర్చుకున్నవి ఏవీ గుర్తులేవు. అంటే బుద్ధి కూడా ప్రాణశక్తిమీద ఆధారపడి ఉంది. అంటే దశ ఇంద్రియాలే కాదు, అంతఃకరణలు కూడా ప్రాణశక్తిమీదే ఆధారపడి ఉన్నాయి.

ఉపనిషత్తు మధుకరరాజును దీనికి దృష్టాంతంగా ఇస్తున్నది. తేనెటీగల్లో కూడా నాయకుడు, పనివారు, వ్యాపారస్తుడు ఇలా తెగలు ఉన్నాయి. నాయకుడు కదిలితే, తక్కినవి నోరు మెదపకుండా, అతని వెంట కదులుతాయి. అతను కూర్చుంటే కూర్చుంటాయి. ఎంత పరిశీలనో చూడండి.

అలా వాక్కు(పంచకర్మేంద్రియాలు), మనస్సు(నాలుగు అంతఃకరణాలు), కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు) ప్రాణం వెంట వెళతాయి. పంచభూతాలు కూడా అని మనం కలుపుకోవాలి. అలా అన్నీ ప్రాణం ఉంటే ఉంటున్నాయి. ప్రాణం లేకపోతే లేవు. అన్వయ వ్యతిరేకపద్ధతి. మట్టి ఉంటే కుండ ఉంది. మట్టి లేకపోతే కుండ లేదు. అంటే కుండ మట్టిమీద ఆధారపడి ఉంది.

అందువల్ల తక్కిన 19 దేవతలు – తమకు విడిగా ఉనికి లేదనీ, ప్రాణమే శ్రేష్ఠమని అర్థమయి, తృప్తి చెందాయి. ఇంక రాబోయే మంత్రాలన్నీ ప్రాణస్తుతి (5–13). రెండవ అధ్యాయం ఉద్దేశ్యమే ప్రాణస్తుతి. ఇదంతా దానికోసం సిద్ధం చేయటం. అందుకే ప్రాణాయామానికి అంత ప్రాముఖ్యతనిస్తున్నారు. ప్రాణశక్తిని పూజల్లో కూడా ఆవాహనం చేస్తాము.

**ప్రత్యేక విశ్లేషణ:–**

ప్రాణం శ్రేష్ఠం అని ఇక్కడ వచ్చింది కాని అది పారమార్థిక దృష్ట్యా కాదు. ఆపేక్షిక దృష్ట్యా అది గొప్పది. అలాగని ఇక్కడ అంగీకరిస్తాము కాని, దీనికి ఆత్యంతిక గొప్పతనం ఇవ్వకూడదు. వేదాంతంలో ఇవ్వము. ఆ విషయం కొన్ని మంత్రాల్లో సూచన ప్రాయంగా వస్తుంది.

## మంత్రం - 5

**ఏషోఽగ్నిస్తపత్యేష సూర్య ఏష పర్జన్యో మఘవానేష వాయురేష పృథివీ రయిర్దేవః సదసచ్చామృతం చ యత్ ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** ఏషః – సమష్టి ప్రాణమే; అగ్నిః తపతి –అగ్నిశక్తిగా మండుతున్నది; ఏషః సూర్యః – సూర్యునిలా ప్రకాశిస్తున్నది; ఏషః పర్జన్యః – వానలా కురుస్తున్నది; మఘవాన్ – ఇంద్రుడు; వాయుః – వాయువు; ఏషః పృథివీ – భూమి; రయిః – (ఇక్కడ) చంద్రుడు; దేవః – హిరణ్యగర్భ; సత్ – రూపు ఉన్నవి (మూర్తం); అసత్ – రూపు లేనివి (అమూర్తం); యత్ – అది; అమృతం చ – దేవతలకు అన్నం.

**తాత్పర్యం:** సమష్టి ప్రాణమే అగ్నిశక్తిగా మండుతున్నది; సూర్యునిలా ప్రకాస్తున్నది; వానలా కురుస్తున్నది; ఇంద్రుడు, వాయువు, పృథివీ, చంద్రుడులా విరాజిల్లుతున్నది. ఆ ప్రాణమే మూర్త ప్రపంచంగానూ, అమూర్త ప్రపంచంగానూ, ఆ దేవతల అన్నంగానూ భాసిల్లుతున్నది.

**వివరణ:** ప్రాణస్తుతి ఇక్కడ్నుంచీ మొదలవుతుంది. ఇందులో సమష్టిస్థాయిలో స్తుతి జరుగుతోంది. ప్రాణశక్తి రెండు స్థాయిల్లో ఉంది – వ్యష్టిలో, సమష్టిలో. దాన్నే వ్యష్టిలో ప్రాణం అనీ, సమష్టిలో హిరణ్యగర్భ అనీ అంటారు.

వ్యష్టిలో కంటికి చూపు – దర్శనశక్తి. చెవుకి వినికిడి – శ్రవణశక్తి; ముక్కుకి వాసన – ఘ్రాణశక్తి, చర్మానికి స్పర్శ – స్పర్శనశక్తి అలా జ్ఞానేంద్రియాలకు శక్తినిస్తుంది ప్రాణం. అలాగే కర్మేంద్రియాలకు గమనశక్తి, వదనశక్తి ఇస్తుంది. అలాగే మనస్సుకు చింతనశక్తినిస్తుంది.

**ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి – లలితా సహస్రనామం**

వ్యష్టిలో ఉన్న ఈ 19 అంగాలకి, సమష్టిలో అధిష్ఠానదేవతలు ఉంటారు. ఉదాహరణకు, కంటికి అధిష్ఠానదేవత – సూర్యుడు. ఈ అధిష్ఠానదేవతలకందరికీ శక్తినిచ్చేది ప్రాణశక్తి అని ఈ మంత్రం అర్థం.

**ఏషః అగ్నిః తపతి**– సమష్టిప్రాణం అని తీసుకోవాలి. సమష్టిప్రాణం అంటే హిరణ్యగర్భ అని ముందే చూసాము. అందువల్ల అగ్నిలా మండుతున్నది.

**ఏషః సూర్యః**– సూర్యునికి ప్రకాశకశక్తి – సూర్యునిలా ప్రకాశిస్తున్నది.

**ఏషః పర్జన్యః**– వాన కురిపించటంద్వారా ప్రకటితమవుతున్నది.

**కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ ।**
**దేశోఽయం క్షోభరహితః బ్రాహ్మణాః సంతు నిర్భయాః ॥ – స్వస్తి మంత్రం**

వర్షాలు సకాలంలో పడి, భూమి సస్యశ్యామలంగా ఉండాలి. దేశంలో ఎటువంటి క్షామం లేకుండా ఉండాలి.

**మఘవాన్** – ఇంద్రుని పాలనలో ప్రకటితమవుతున్నది.

**ఏషః వాయుః** – వాయువు శక్తిలో. వాయువు శక్తిని ఆవః ప్రవః అంటారు. ఆవః అంటే సుతారంగా వీచే గాలి, ప్రవః అంటే పెనుతుఫాను. రెండు శక్తుల్లోనూ హిరణ్యగర్భశక్తి ప్రకటితమవుతున్నది.

**ఏషః పృథివీః** – భూమికున్న ఆకర్షణశక్తిద్వారా ప్రకటితమవుతున్నది.

ఏషః ని ప్రతిచోటా దేవఃతో కలుపుకోవాలి. హిరణ్యగర్భ దేవత అని అర్థం.

పై శక్తులన్నింటినీ కేవలం శక్తిగా చూస్తే జీవం లేని పదార్థం అవుతుంది. వాటిని చైతన్యతత్త్వంతో చూడాలి. కనబడే అనాత్మ వెనుక కనబడని ఆత్మ ఉంది.

**దేవః** – ఈశ్వరుడు అంటే హిరణ్యగర్భుడు

**రయిః** – ఇక్కడ చంద్రుడు(మొదటి అధ్యాయంలో వచ్చింది కదా).

**రయిరేవ చన్ద్రమా 1.5**

**సత్, అసత్** – మూర్తం, అమూర్తంలో కూడా. **యత్ చ అమృతం** – దేవతలకు అన్నం. అది కూడా ప్రాణశక్తే. ఈ శక్తులన్నీ ఒకటే. అదే ప్రాణశక్తి.

**మంత్రం - 6**

**అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**ఋచో యజూంషి సామాని యజ్ఞః క్షత్రం బ్రహ్మ చ ॥ 6 ॥**

**ప్రతిపదార్థం:** రథనాభౌ – రథ చక్రపు ఇరుసులో; అరా ఇవ– ఆకులు కూడి ఉన్నట్లు; ప్రాణే – సమష్టి ప్రాణంలో; ఋచః – ఋగ్వేదం; యజూంషి – యజుర్వేదం; సామాని – సామవేదం ; యజ్ఞః – యజ్ఞం; క్షత్రం – క్షత్రియుడు; బ్రహ్మ చ – బ్రాహ్మణుడు; సర్వమ్– సమస్త జగత్తు; ప్రతిష్ఠితమ్– నెలకొని ఉన్నాయి.

**తాత్పర్యం:** రథచక్రపు ఇరుసులో ఆకులు కూడి ఉన్నట్టు సమష్టి ప్రాణంలో ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, యజ్ఞం, క్షత్రియుడు, బ్రాహ్మణుడు, సమస్త జగత్తు నెలకొని ఉన్నాయి.

**వివరణ:** అన్నీ ప్రాణంలోనే ఉన్నాయి. సృష్టిలయమైతే ప్రాణంలో లయమవుతుంది. కాని ఇంతకు ముందు చూసినట్టుగా, ఇది పారమార్థిక సత్యం కాదు. ప్రాణం కూడా జడమే. ప్రాణం కూడా ఆత్మనుంచి పుట్టింది.

**ప్రాణం దేవా అనుప్రాణన్తి । మనుష్యాః పశవశ్చ యే । ప్రాణో హి ।**
**భూతానామాయుః । తస్మాత్సర్వాయుషముచ్యతే । సర్వమేవత ఆయుర్యన్తి ॥**

సర్వం అందులో ఉన్నాయి. ఏమిటవి?

**ఋచో యజూంషి సామాని–** అన్ని వేదాలు. నాలుగు వేదాలు ఉన్నా ఇక్కడ మూడే చెప్పారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం మాట రాలేదు. కాని దాన్ని కూడా కలుపుకోవాలి.

**తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వవేదః ।–ముండకమ్ 1.1.5.**

ఇక్కడ వేదాల గురించి కాక వేదమంత్రాల గురించి చెప్పినట్టు తీసుకోవాలి. ఋగ్ మంత్రాలు, పద్యంలా ఉంటాయి; యజుర్ మంత్రాలు వచనంలా ఉంటాయి. సామమంత్రాలను గానం చేయవచ్చు. అందుకే సామగానం అంటారు.

**యజ్ఞః క్షత్రం బ్రహ్మ చ** – యాగాలు, క్షత్రియులు, బ్రాహ్మణులు.

ఇక్కడ బ్రహ్మ అంటే చతుర్ముఖబ్రహ్మ కాదు. సత్యం జ్ఞానం, అనంతం బ్రహ్మ కాదు. బ్రాహ్మణజాతి. యజ్ఞాలను చేసేది బ్రాహ్మణులు. వాటిని పరిరక్షించేది, వాటికి ఆర్థిక సహాయం చేసేది క్షత్రియులు. అందుకని వాళ్ళిద్దరినీ పేర్కొనటం జరిగింది. ఆ రోజుల్లో సుబాహు, మారీచులవంటి వారి బారినుంచి యజ్ఞాలను కాపాడుకోవాల్సి వచ్చింది.

వీటన్నింటినీ మనం గౌరవిస్తాం. అందుకే పిప్పలాదఋషి చెబుతున్నాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ముందే చెప్పినట్టుగా ప్రాణం లేకుండా ఏదీ లేదు. దీనికి ఉదాహరణగా సాధారణంగా ఉపనిషత్తు – అరా ఇవ రథనాభౌ అంటుంది.

**అరా ఇవ రథనాభౌ సంహతా యత్ర నాడ్యః – ముండకమ్ 2.2.6**

నాడుల గురించి వివరణ వచ్చినప్పుడు అందులో వాడింది. రథచక్రం ఇరుసునుంచి అనేక ఆకులు వస్తాయి. ఒక్కో ఆకును ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, దర్శనశక్తి మొదలైనవి అనవచ్చు. సృష్టిని రథచక్రంగా తీసుకుంటే, దానిలో ఉన్న ఒక్కొక్క శక్తిని ఒక్కొక్క ఆకుతో

పోలిస్తే, వాటికి ఆ శక్తినిచ్చిన ప్రాణాన్ని ఇరుసుతో పోల్చవచ్చు. ఎందుకంటే ఏ శక్తి అయినా ప్రాణంనుంచే వస్తుంది. అంటే సమష్టి ప్రాణశక్తివల్ల సమష్టి ప్రపంచం నడుస్తోంది. ప్రాణశక్తిని ప్రాపంచిక శక్తిగా పూజిస్తే, అంటే వ్యావహారిక శక్తిగా పూజిస్తే, వ్యావహారిక దృష్టిలోనే ఉంటాము. సూర్యశక్తి ప్రాపంచిక శక్తి కాదు. అదొక ఆధ్యాత్మికశక్తి. అందువల్ల ప్రాణశక్తి జడం కాదు. చైతన్యం ఉన్నశక్తి.

ఇంకొక కారణం ఏమిటంటే, ప్రాణశక్తి లేదా హిరణ్యగర్భ ఉపాసన చేయటానికి వచ్చింది ఈ స్తుతి. ఉపాసన ఎప్పుడూ ఉత్కృష్ట వస్తువుమీద ఉంటుంది. అందువల్ల ప్రాణశక్తి జగత్తులో ప్రాథమికశక్తి.

## మంత్రం - 7

**ప్రజాపతిశ్చరసి గర్భే త్వమేవ ప్రతిజాయసే । తుభ్యం ప్రాణ ప్రజాస్త్విమా బలిం హరన్తి యః ప్రాణైః ప్రతితిష్ఠసి ॥ 7 ॥**

**ప్రతిపదార్థం:** ప్రజాపతిః – నువ్వే ప్రజాపతివి; త్వమ్ ఏవ గర్భే చరసి – గర్భంలో ఉండేది నువ్వే; త్వమేవ ప్రతిజాయసే– తల్లిదండ్రుల ప్రతిరూపంగా పుట్టేది నువ్వే. ప్రాణ– ఓ ప్రాణమా; తుభ్యమ్ – నీకు; ఇమాః ప్రజాః – (ఇక్కడ) ఇంద్రియాలు; బలిమ్ – ఆహుతులను; హరన్తి– తీసుకుని వస్తాయి; యః – నువ్వే, ప్రాణైః – (మళ్ళీ) ఇంద్రియాలలో; ప్రతితిష్ఠసి – నెలకొని ఉన్నది నువ్వే.

**తాత్పర్యం:** నువ్వే ప్రజాపతివి; గర్భంలో ఉండేది నువ్వే; తల్లిదండ్రుల ప్రతిరూపంగా పుట్టేది నువ్వే. ఓ ప్రాణమా, నీకు అన్ని జీవాలు ఇంద్రియాలద్వారా ఆహుతులను తీసుకుని వస్తాయి. మళ్ళీ ఇంద్రియాలలో నెలకొని ఉన్నది నువ్వే.

**వివరణ:** 5వ మంత్రంనుంచి ప్రాణస్తుతి కొనసాగుతోంది. త్వం ప్రజాపతిః నువ్వే ప్రజాపతివి. నువ్వు సృష్టికర్తవి. ప్రజాపతి అంటే ప్రజానాం పతిః ఏం చేశావు? సమష్టి శక్తివైన నువ్వు పునరుత్పత్తి శక్తిగా గర్భంలో ఉన్నావు. అంటే అంతకుముందు అధ్యాయంలో వచ్చినట్టుగా శుక్రమూ నువ్వే, శోణితమూ నువ్వే. శుక్రశోణిత రూప బీజసంయోగాత్, పిల్లలు పుడతారని చూశాము. అంతేకాదు – **త్వమేవ ప్రతిజాయసే** – నువ్వే మళ్ళీ పుడతావు – కొందరు పిల్లలను, తల్లిదండ్రులను అచ్చుగుద్దినట్టు పోలి ఉంటారు అంటాము కదా. కాని అది నువ్వే. అన్ని జీవాలు నీకు ఇంద్రియాలద్వారా ఆహుతులను ఇస్తున్నాయి. నువ్వే ఆ ఇంద్రియాలలో నెలకొని ఉన్నావు. ఇంద్రియాలలో ఉన్న ఒక్కొక్క శక్తి – ఉదాహరణకు, దర్శన శక్తి, గ్రహణశక్తి కూడా నువ్వే. అంటే ప్రాణశక్తి వాటిద్వారా ప్రకటితమవుతోంది.

**సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్ సప్తార్చిషః సమిధః సప్త హెూమాః ।**

**సప్త ఇమే లోకా యేషు చరన్తి ప్రాణా గుహాశయా నిహితాః సప్త సప్త ॥-ముండక 2.1.8**

ఇందులో కూడా ఇంద్రియాలకు ప్రాణః అన్న పదం వాడారు. ఏడు ఇంద్రియాలు, ఏడు మాలలని చేసి, ఏడు ఆహూతులను ఇస్తున్నాయి. ఏడు ఇంద్రియాలంటే రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒక నోరు. ఇంద్రియాలకు ప్రాణశక్తే దర్శనశక్తిలాంటివి ఇస్తోంది కాబట్టి అది లేకపోతే, అవి పనిచేయవు.

**మంత్రం - 8**

**దేవానామసి వహ్నితమః పితౄణాం ప్రథమా స్వధా ।**

**ఋషీణాం చరితం సత్యమథర్వాఙ్గిరసామసి ॥ 8 ॥**

**ప్రతిపదార్థం:** దేవానామ్ – దేవతలకు; వహ్నితమః – శ్రేష్ఠతమమైన దూతవుగా; అసి– ఉన్నావు; పితౄణామ్ – పితృదేవతలకు; ప్రథమా స్వధా – మొదటి ఆహారానివి; అథర్వాఙిరసాం ఋషీణాం– అథర్వ, అంగిరస ఋషుల; చరితం సత్యమ్– సత్యజీవనంలో; అసి– ఉన్నావు;

**తాత్పర్యం:** దేవతలకు శ్రేష్ఠతమమైన దూతవుగా ఉన్నావు; పితృదేవతలకు మొదటి ఆహారానివి, అథర్వ, అంగీరసలాంటి ఋషుల సత్యజీవనంలో ఉన్నావు.

**వివరణ:** యజ్ఞాలలో అగ్నిదేవతవు నువ్వే. అగ్ని కొరియర్ సర్వీసులాంటిది. ఏ దేవతకోసం పూజచేస్తే ఆ దేవతకు తీసుకువెళ్ళి మనం వేసిన ఆహుతులనిస్తుంది. అంతేకాదు పితృదేవతలకు ప్రథమ ఆహారం కూడా నువ్వే.

పితృదేవతలకు యజ్ఞం చేయటం మన సాంప్రదాయంలో ఉంది. ఇంట్లో ఏ శుభకార్యం తలపెట్టినా పెళ్ళి, ఉపనయనం – ముందుగా నాందీశ్రాద్ధం చేస్తారు. దాన్నించే నాందీ అనే పదం వచ్చింది. మన పూర్వీకులకు పూజ చేస్తే – వారి ఆశీర్వచనం పొందుతాము. అలా చేయటంవల్ల కులధర్మం పెంపొందించినట్లు ఉంటుంది. వారిని గుర్తుపెట్టుకోవటంవల్ల వారిలా ఉండటానికి ప్రయత్నిస్తాము. పితృదేవతలకిచ్చే ప్రథమ ఆహారాన్ని స్వధా అంటారు.

యజ్ఞం చేసేటప్పుడు ఇంద్రాయ స్వాహా, ప్రజాపతయే స్వాహా అంటాము కాని, పితౄణాం వచ్చినప్పుడు స్వధా అనాలి. ఈ స్వధా కూడా ప్రాణశక్తే.

**ఋషీణాం చరితం సత్యమథర్వాంగిరసామసి** – దీనికి రెండు అర్థాలు ఉన్నాయి.

అసలు అర్థం తీసుకుంటే, ఋషుల జీవనవిధానం సత్యవంతంగా ఉంటుంది. ఎలా తెలుసు? వారిని ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నాము కాబట్టి. ఇక్కడ మనకు ఉదాహరణగా ఇచ్చిన ఋషుల పేర్లు అథర్వ, అంగిరస ఋషులు.

శంకరాచార్యులవారు చెప్పిన రెండో అర్థం – ఋషి అంటే ఇంద్రియాలు. దానికి ఆయన ఇచ్చిన కారణం ఋషతీ జానాతి ఇతి ఋషిః. ఇంద్రియాలు చూస్తాయి. అథర్వ, అంగిరస పదాలు ఇంద్రియాలకి విశేషణాలు. ఇంద్రియాలకు శక్తి కూడా ప్రాణశక్తే అని అర్థం వస్తుంది.

**మంత్రం - 9**

**ఇన్ద్రస్త్వం ప్రాణ తేజసా రుద్రోऽసి పరిరక్షితా ।**
**త్వమన్తరిక్షే చరసి సూర్యస్త్వం జ్యోతిషాం పతిః ॥ 9 ॥**

**ప్రతిపదార్థం:** ప్రాణః – హే ప్రాణమా; త్వం తేజసా– నువ్వు శక్తిలో; ఇంద్రః అసి– ఇంద్రుడివి; రుద్రోऽసి పరిరక్షితా – (ఇక్కడ) రుద్రుడిగా స్థితికారకుడివి, త్వమ్– నువ్వు; అంతరిక్షే చరసి – ఆకాశంలో వాయురూపంలో సంచరిస్తావు; త్వమ్ ఏవ సూర్యః జ్యోతిషాం పతిః – నువ్వే సూర్యదేవునిగా ప్రకాశిస్తున్నావు.

**తాత్పర్యం:** హే ప్రాణమా, నువ్వు శక్తిలో ఇంద్రుడివి; రుద్రుడిగా స్థితికారకుడివి; నువ్వు ఆకాశంలో వాయురూపంలో సంచరిస్తావు; నువ్వే సూర్యదేవుడిగా ప్రకాశిస్తున్నావు.

**వివరణ: త్వం తేజసా ఇంద్రః అసి**– నీ శక్తివల్ల ఇంద్రుడివి.

**రుద్రోऽసి పరిరక్షితా** – రుద్రుడు లయకారకుడు. ఇక్కడ రక్షిస్తున్నాడు అంటే స్థితికారకుడిగా తీసుకున్నాము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను వరుసగా సృష్టి, స్థితి, లయకారకులుగా కీర్తించినా, పారమార్థిక దృష్ట్యా వారు వేరు వేరు కాదు.

**మా నో మహాన్తముత మా నో అర్భకం మా న ఉక్షంతముత మా న ఉక్షితమ్ ।**
**మా నోऽవధీః పితరం మోత మాతరం మానః ప్రియాస్తన్వో రుద్ర రీరిషః ॥ రుద్రమ్**

అన్నింటినీ రక్షించమన్న ప్రార్థన ఇది. తల్లి గర్భంలో ఉన్న పిల్లవానితో సహా రక్షించమని ప్రార్థన. వాహనాలని, జంతువులనీ వేటినీ వదల్లేదు.

**ఓం త్ర్యయంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ ।**
**ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మాऽమృతాత్ ॥**

అమృతత్వ సిద్ధికొరకు ప్రార్థన ఇది – రుద్రం అంటే రుం ద్రావయతి ఇతి రుద్రం– అంటే దుఃఖాలు పోయేలాగ చేసేది.

ఇంకో అర్థం – రోదయతి ఇతి రుద్రః మనని ఏడిపించేది. మన మరణసమయంలో మనకి తెలుస్తుంటే మనం రోదిస్తాము. లేదా ఎవరో ఒకరు ఏడుస్తారు. అందుకే నువ్వు రుద్రుడిలా రక్షించే వాడివి అని అర్థం.**త్వమ్ అన్తరిక్షే చరసి** – దీనికి రెండు అర్థాలు –
**1. త్వమ్ అన్తరిక్షే సూర్యః సన్ చరసి** – నువ్వు ఆకాశంలో సూర్యదేవునిలాగా చరిస్తున్నావు.
**2. త్వమ్ అన్తరిక్షే వాయురూపేణ చరసి** – ఆకాశంలో వాయురూపేణ చరిస్తున్నావు. తర్వాత వర్ణనలో సూర్యుడు వచ్చింది కాబట్టి, ఇక్కడ నువ్వే వాయువురూపంలో ఉన్నావు అని అర్థం తీసుకోవచ్చు.
**సూర్యస్త్వం జ్యోతిషాం పతిః** – నువ్వే సూర్యదేవుడివి. సూర్యుడు ప్రకాశించే వాటికి దేవుడు. ఆ దేవుడికి నువ్వే ఆధారం.

**ప్రత్యేక విశ్లేషణ: –**

బ్రహ్మనుంచి ఎన్నో కార్య, కారణాలున్నాయి. మృత్తికా సూక్తం అని ఒక సూక్తం ఉంది.'మృత్తికే మయందేవి' అని వస్తుంది. అందులో కార్యం కుండ అని, కారణం మట్టి అనీ కారణస్తుతి ఉంటుంది. దానికి కారణం పృథివి. పృథివినుంచి జలానికి వెళితే, పృథివి కార్యం, జలం కారణం అవుతుంది. అలా మధ్యలో వన్నీ ఒక వైపు కార్యం, ఇంకోవైపు కారణం అవుతాయి. అలా వెనక్కి సూక్ష్మంలోకి వెళుతూ వస్తే ప్రాణం కూడా అంతిమ కారణం కాదు. చివరి కారణం బ్రహ్మ.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥ – కైవల్యమ్–19**

నా యందే సమస్తమూ పుట్టి, నాయందే ఉండి, నాలోనే సర్వం లయం అవుతున్నాయి. ఆ చైతన్యాన్ని నేనే. కాని ఆ చైతన్యం దాకా వెళ్ళకముందే, ప్రతి కారణానికి స్తుతి ఒకటే– నువ్వే సృష్టి, స్థితి,లయ కారణం అని వస్తుంది. కాని ఆ స్తుతులన్నీ ఆపేక్షిక స్తుతులు. చివరి స్తుతి బ్రహ్మది. ఈ విషయం మనం మర్చి పోకూడదు. ఇప్పటి స్తుతి ప్రాణానికి వర్తిస్తుంది.

## మంత్రం 10

**యదా త్వమభివర్షస్యథేమాః ప్రాణతే ప్రజాః ।**
**ఆనన్దరూపాస్తిష్ఠన్తి కామాయాన్నం భవిష్యతీతి ॥**

**ప్రతిపదార్థం:** ప్రాణః – హే ప్రాణమా!; యదా త్వమ్ అభివర్షసి – ఎప్పుడు నువ్వు వానరూపంలో కురుస్తావో; అథ – అప్పుడు; ఇమాః తే ప్రజా – ఈ నీ ప్రజలందరూ;

ఆనందరూపాః కామాయ – కోరినంత మేరకు; అన్నం భవిష్యతి – అన్నం దొరుకుతుంది; ఇతి–అని; తిష్ఠన్తి– ఆనందిస్తారు.

**తాత్పర్యం:** హే ప్రాణమా! ఎప్పుడు నువ్వు వానరూపంలో కురుస్తావో, అప్పుడు ఈ నీ ప్రజలందరూ, కోరినంత మేరకు అన్నం దొరుకుతుంది అని ఆనందిస్తారు.

**వివరణ:** ఇక్కడ ప్రాణాన్ని వర్షంగా స్తుతిస్తున్నాయి ఇంద్రియాలు. వాన కురిస్తే ప్రజలు ఆనందిస్తారు.

**తృప్తిరితి వృష్టౌ – భృగువల్లీ, తైత్తిరీయమ్**

ప్రాణతే – జీవులు వానవల్ల జీవిస్తారు. ప్రాణాన్ని ఇన్ని రకాలుగా వర్ణిస్తున్నది ఉపనిషత్తు.

టూకీగా తీసుకుంటే – ప్రాణమే సర్వాత్మకం అని అన్ని మంత్రాలు చెబుతున్నాయి.

## మంత్రం 11

**వ్రాత్యస్త్వం ప్రాణైకర్షిరత్తా విశ్వస్య సత్పతిః ।**
**వయమాద్యస్య దాతారః పితా త్వం మాతరిశ్వ నః ॥**

**ప్రతిపదార్థం:** ప్రాణః – హే ప్రాణమా!; త్వమ్ – నువ్వు; వ్రాత్యః – (మామూలు అర్థం అస్పృశ్యుడవు) నిత్యశుద్ధస్వరూపుడవు; ఏకర్షిః – అగ్నికి మరో పేరు; అత్తా – భోక్తవు; విశ్వస్య– మొత్తం సృష్టికి; సత్పతిః – మంచి పతివి; వయం– మేము; ఆద్యం – హవిస్సులు; అస్య – నీకు; దాతారః– ఇచ్చేవారము; మాతరిశ్వ నః – వాయువుకు మరో పేరు; పితా త్వమ్ – తండ్రివి నువ్వే.

**తాత్పర్యం:** హే ప్రాణమా నువ్వు నిత్యశుద్ధస్వరూపుడవు. ఏకర్షివి. భోక్తవు. మొత్తంసృష్టికి మంచి పతివి. మేము నీకు బలి లేదా హవిస్సులు ఇచ్చేవారము. వాయువుకి తండ్రివి నువ్వే.

**వివరణ:** ఇక్కడ కూడా ప్రాణస్తుతి జరుగుతోంది. కాని ఇక్కడ నిందాస్తుతి జరిగింది. అయోధ్యలో దాతలు లేరు అంటే అక్కడ బీదవారు లేరన్నట్టు అర్థం.

ఉపనయనం అయ్యేదాకా రాగద్వేషాల ప్రకారం నడుచుకుంటారు. ఉపనయనం అయ్యాక, శాస్త్రవిధినిషేధాల ప్రకారం నడుచుకుంటారు. అది కావాలని చేస్తారు, బలవంతంగా కాదు. ఈ ఉపనయనానికి కూడా శాస్త్రప్రకారం వయస్సు పరిమితి ఉంది. బ్రాహ్మణకుమారునికి 5–7 ఏళ్ళ మధ్యలో, క్షత్రియకుమారునికి 9–11 ఏళ్ళ మధ్యలో, వైశ్యకుమారునికి 11–13 ఏళ్ళ మధ్యలో చేయాలి. అలా చేయకపోతే ద్విజః

హోదా ఉండదు. పుట్టుకతో బ్రాహ్మణుడు అయినా, శూద్రునిగా ఉండటానికి ఎన్నుకున్నట్టవుతుంది. అటువంటి వ్యక్తిని వ్రాత్యః అంటారు. అంటే సంస్కరించబడని వాడు అని అర్థం.

ఇది స్తుతి ఎలా అవుతుంది? అందుకే నిందాస్తుతి కింద వస్తుంది. ప్రాణం అంటే హిరణ్యగర్భ అని చూస్తూనే ఉన్నాం. (ఈ విషయం మర్చిపోకూడదు) హిరణ్యగర్భని వ్రాత్యః అనటానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. బ్రహ్మ దేవానాం ప్రథమః సంబభూవ – హిరణ్యగర్భ సత్యం జ్ఞానం, అనంతం బ్రహ్మనుంచి పుడతాడు. అంటే నిరాకార బ్రహ్మనుంచి రూపుదిద్దుకున్న ప్రథముడు. కాబట్టి అతనికి సంస్కారం చేయటానికి బ్రాహ్మణుడు లేడు.

2. హిరణ్యగర్భుడు నిత్యసంస్కృతికి చెందినవాడు. నిర్వచనం ప్రకారం వ్రాత్యః అయినా స్వభావం ప్రకారం శుద్ధః ఆ విధంగా నిత్యశుద్ధస్వరూపుడు.

**ఏకర్షిః** – అగ్నికి ఇదొక పేరు. అగ్నిని వాడే తీరునిబట్టి, వెలిగించే పద్ధతినిబట్టి ఈ పేర్లు ఉంటాయి.

**ప్రత్యేక విశ్లేషణ:–**

బ్రహ్మచారి గృహస్థు అయినప్పటినుంచి అతని ఇంట్లో నిత్యాగ్ని వెలుగుతూ వుండాలి. దాన్ని గార్హపత్య అగ్ని అంటారు. దాన్ని అతని పెళ్ళిలో వెలిగిస్తారు. ఒకవేళ అతని జీవితకాలంలో మధ్యలో ఆ అగ్ని ఆరిపోతే, దాన్ని ఇంకో గృహస్థు ఇంటినుంచి తెచ్చుకోవాలి. అది కూడా ప్రాయశ్చిత్తంచేసి మరీ తేవాలి.

**ఆహవనీయ అగ్నిః** ఈ అగ్నిని నిత్యపూజలకు లేదా శ్రౌతకర్మలకు వాడతారు. దీన్ని గార్హపత్య అగ్నినుంచి ఆవాహనం చేస్తారు కాబట్టి ఆహవనీయ అగ్ని అంటారు. దాని పని అయిపోగానే, మళ్ళీ దాన్ని గార్హపత్య అగ్నిలో కలిపేస్తారు.

**ఏకర్షిః** – ఇది ఇంకోరకం అగ్ని. ముండకోపనిషత్తులో చివర్లో దీని గురించి వస్తుంది.

**క్రియావన్తః శ్రోత్రియా బ్రహ్మనిష్ఠాః**
**స్వయం జుహ్వత ఏకర్షిం శ్రద్ధయన్తః ।**

ఏకర్షి కూడా ప్రాణరూపమే – ఇన్ని పేర్లు ఉండగా ఎందుకు ఏకర్షి పేరు చెప్పారు? ఇది ప్రశ్నోపనిషత్తు. ఇది అథర్వణవేదానికి చెందింది. శిష్యులకు వారి వేదానికి సంబంధించింది చెప్తే సంతోషిస్తారు కదా.

దీని సారాంశం – అన్ని అగ్నులూ ప్రాణశక్తులే. అత్తా – భోక్త – ఏకర్షి రూపంలో అన్ని హవిష్షులనూ స్వీకరిస్తాడు.

**విశ్వస్య సత్పతిః** – విశ్వానికి ఆధారం నువ్వే. ఇంద్రియాలైన మేము నీకు ఆహారాన్ని ఇస్తున్నాము.

**పితా త్వం మాతరిశ్వ నః** – వాయువుకి తండ్రి అని ఒక అర్థం. నువ్వే వాయువు అని ఇంకో అర్థం.

### మంత్రం - 12

**యా తే తనూర్వాచి ప్రతిష్ఠితా యా శ్రోత్రే యా చ చక్షుషి ।**

**యా చ మనసి సన్తతా శివాం తాం కురు మోత్క్రమీః ॥ 12 ॥**

**ప్రతిపదార్థం:** యా తే తనూః – (శరీరం) ఇక్కడ నీ శక్తే; వాచి ప్రతిష్ఠితా– వాగింద్రియంలో ఉంది; యా శ్రోత్రే– శ్రోత్రేంద్రియంలో; యా చ చక్షుషి– చక్షురింద్రియంలో; యా చ మనసి– మనస్సులో; సంతతా – వ్యాపించి ఉంది; తామ్–వాటిని; మా ఉత్క్రమీః – వెళ్ళిపోనీయకు; శివాం కురు – నువ్వు శాంతించు.

**తాత్పర్యం:** హే ప్రాణమా, నీ శక్తే వాగింద్రియంలో, శ్రోత్రేంద్రియంలో, చక్షురింద్రియంలో, మనస్సులో వ్యాపించి ఉంది. వాటిని వెళ్ళిపోనీయకు. నువ్వు శాంతించు.

**వివరణ: నమస్తస్యై నమస్తస్యై నమః – దుర్గాసప్తశతి**

మనస్సులో ఉన్నావు అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహం అన్నిటిలో ఉన్నావు అని అర్థం.

19 కరణాలూ కలిసి, అన్ని ఇంద్రియాలలోని శక్తివి నువ్వే అంటున్నాయి. వాక్ ఇంద్రియం అంటే పంచకర్మేంద్రియాలు వస్తాయి. చక్షు, శ్రోతం అంటే పంచజ్ఞానేంద్రియాలు వస్తాయి. మనస్సు అంటే నాలుగు అంతఃకరణాలు వస్తాయి. పంచభూతాలు కూడా అన్నట్టుగా మనం కలుపుకోవాలి.

### మంత్రం 13

**ప్రాణస్యేదం వశే సర్వం త్రిదివే యత్ప్రతిష్ఠితమ్ ।**

**మాతేవ పుత్రాన్రక్షస్వ శ్రీశ్చ ప్రజ్ఞాం చ విధేహి న ఇతి ॥ 13 ॥**

**ప్రతిపదార్థం:** త్రిదివే– మూడు లోకాలలో; యత్ ప్రతిష్ఠితమ్– ఏవి ఉన్నాయో; ఇదం సర్వం– అవన్నీ; ప్రాణస్య వశే– (ప్రాణం) నీ అధీనంలో ఉన్నాయి. మాతా ఇవ పుత్రాన్– తల్లి తన పుత్రుడిని రక్షించినట్లుగా; రక్షస్వ– రక్షించు; నః– మాకు; శ్రీః చ– సంపదలు; ప్రజ్ఞాం చ– వివేకశక్తి; విధేహి– ప్రసాదించు; ఇతి–అని.

**తాత్పర్యం:** (ఓ ప్రాణమా!) మూడు లోకాల్లో ఏవి ఉన్నాయో, అవన్నీ నీ అధీనంలో ఉన్నాయి. తల్లి తన పుత్రుణ్ణి రక్షించినట్లుగా నువ్వు మమ్మల్ని రక్షించు. మాకు సంపదలను, ప్రజ్ఞను ప్రసాదించు.

**వివరణ:** ఉపసంహారం. ప్రాణస్తుతి ముగింపుకు వస్తోంది. 5వ మంత్రంలో మొదలైంది ఇది. ఇహలోకం, పరలోకం అన్నీ నీ ఆధీనంలోనే ఉన్నాయి. అంటే మేము కూడా నీ ఆధీనంలోనే ఉన్నామని ఇంద్రియాలు పరోక్షంగా చెబుతున్నాయి. అందుకని మమ్మల్ని రక్షించడం నీ బాధ్యత. అంతకు ముందేమో, నువ్వు మాకు 'పితరం' (తండ్రివి) అన్నాయి. ఇప్పుడేమో తల్లిలాగా రక్షించు అంటున్నాయి. ఎందుకు? క్షమాగుణం వచ్చేసరికి, తండ్రికన్నా తల్లిదే ఒక మెట్టు పైన ఉంటుంది. తల్లి తిడుతూనే ఉంటుంది. ఎప్పుడైనా మరీ కోపం వచ్చినప్పుడు, తండ్రికి చెబుతుంది. 'బాబుని బాగా తిట్టండి. బొత్తిగా తల్లి భయం ఉండటం లేదు. చెప్పినమాట వినటం లేదు.' అవన్నీ విని శివాలెత్తి బెల్టు తీసుకుని సిద్ధంగా ఉంటాడు తండ్రి. తీరా అతను బెల్టు ఎత్తబోతుంటేనే అడ్డంపడిపోయి, పిల్లవాణ్ణి కౌగలించుకుని ఆపేస్తుంది తల్లి. అందుకని తల్లిలా రక్షించు. దీనితో ప్రాణస్తుతి అయిపోతుంది.

మూడవ ప్రశ్న – జవాబు చూద్దాము.

**3. కః పునరేషాం వరిష్ఠః –** వారిలో ఎవరు శ్రేష్ఠులు?

ప్రాణం.

### అధ్యాయం - 2 టూకీగా

టూకీగా: భార్గవో వైదర్భిః ప్రాణం గురించి మూడు ప్రశ్నలు అడిగాడు.

**1. కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు?**

24 దేవతలు భరిస్తున్నాయి. పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు. పంచప్రాణాలు కూడా కలుపుకోవాలి.

**2. కతర ఏతత్ప్రకాశయన్తే – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?**

19 దేవతలూ వాటి పనిని స్తుతి చేసుకుంటున్నాయి. (పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు.)

**3. కః పునరేషాం వరిష్ఠః – వారిలో ఎవరు శ్రేష్ఠులు?**

ప్రాణం.

# అధ్యాయం - 3

**మంత్రం - 1**

**అథ హైనం కౌసల్యశ్చాశ్వలాయనః పప్రచ్ఛ। భగవన్ కుత ఏష ప్రాణో జాయతే కథమాయాత్యస్మిఞ్ఛరీరే? ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే? కేనోత్క్రమతే? కథం బాహ్యమభిధత్తే? కథమధ్యాత్మమితి ॥ 1 ॥**

**ప్రతిపదార్థం:** అథ – తర్వాత; ఏనం – పిప్పలాద మహర్షిని; కౌసల్య ఆశ్వలాయనః పప్రచ్ఛ – కౌసల్య ఆశ్వలాయన అడిగాడు; భగవన్ – దేవర్షీ; కుతః ఏషః ప్రాణః జాయతే – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది? కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి? – వ్యష్టి శరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది? ఆత్మానం వా ప్రవిభజ్య – తనను తాను విభజించుకొని; కథం ప్రాతిష్ఠతే – ఎలా ఆధారం అయింది? కేన ఉత్క్రమతే – ఎలా బయటకు వెళుతుంది (మరణం తర్వాత)? కథం బాహ్యమ్ అభిధత్తే – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది? కథమ్ అధ్యాత్మమ్ (అభిధత్తే కలుపుకోవాలి) – ఎలా వ్యష్టికి ఆధారమయింది? ఇతి – అని.

**తాత్పర్యం:** తర్వాత, పిప్పలాదమహర్షిని కౌసల్య ఆశ్వలాయన ఇలా ప్రశ్నించాడు. 'భగవాన్ ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది? వ్యష్టి శరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది? తనను తాను విభజించుకుని ఎలా ఆధారం అయింది? ఎలా బయటకు వెళుతుంది (మరణం తర్వాత)? ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది? ఎలా వ్యష్టికి ఆధారమయింది?'

**వివరణ:** కౌసల్యః ఆశ్వలాయనః రెండు పేర్లూ ఒకరివే. అశ్వలాయన పుత్రుడు అయిన కౌసల్యుడు అడిగాడు. ఇంతవరకూ ఉపనిషత్తు చెబుతున్నది. 'భగవన్' నుంచి 'ఇతి' దాకా అతని ప్రశ్నలు.

అతను అథ అంటే ఇక్కడ రెండు ప్రశ్నలు, వాటికి జవాబులు అయ్యాక అడిగాడు అని అర్థం. అంటే ఒకరి తర్వాత ఒకరు అడుగుతున్నారు. ప్రతి ఒక్కరు గురువును భగవన్ అని సంబోధిస్తున్నారు. ఆ అడిగే తీరులోనే గురువుమీద గౌరవం, అడిగే ప్రశ్నమీద శ్రద్ధ తేటతెల్లమవుతుంది.

కౌసల్య కూడా ప్రాణం గురించే అడిగాడు. రెండు, మూడు అధ్యాయాలు ప్రాణస్తుతి గురించి. అతను అడిగింది ప్రాణం గురించే అయినా, వాటిని 6 చిన్న ప్రశ్నలుగా తీసుకోవచ్చు.

1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?

ఏషః అంటే ముందు అధ్యాయంలో స్తుతి చేసిన ఈ ప్రాణం ఎక్కడిది? ప్రాణం అంటే వ్యష్టి, సమష్టి రెండు స్థాయిల్లోనూ తీసుకోవాలి. సమష్టిస్థాయిలో హిరణ్యగర్భ అంటారనీ, బ్రహ్మ (సచ్చిదానందబ్రహ్మ కాదు, చతుర్ముఖబ్రహ్మ) అంటారనీ చూశాం. హిరణ్యగర్భయొక్క కారణం ఏది? అంటే హిరణ్యగర్భ పుట్టుక గురించి ఈ ప్రశ్న.

2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి**? వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది? శరీరంలో – శరీరం– స్థూలశరీరం, ప్రాణ – సూక్ష్మశరీరం.

3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే**? – తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది? ఆత్మానాం అంటే తనను తాను విభజించుకున్న ప్రాణం. దీన్ని ఇంగ్లీషులో రిఫ్లెక్సివ్ ప్రొనౌన్ అంటారు.

4. **కేన ఉత్క్రమతే**– ఎలా బయటకు వెళుతుంది? ఉత్క్రమతే అంటే మరణం తర్వాత అని అర్థం.

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?

6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

ఇవీ ప్రశ్నలు. ఈ అధ్యాయంలో ముఖ్యవిషయం ప్రాణ ఉపాసన. అయినా ఉపాసన గురించి ఒక్క వాక్యంలో చివర్లో వస్తుంది.

**య ఏవం విద్వాన్ ప్రాణం వేద**

**ప్రత్యేక విశ్లేషణ:–**

ప్రాణ ఉపాసన గురించి చెప్పాల్సిన చోట మధ్యలో ప్రాణం జాతకం ఎందుకు?

దీనికి ఒక ప్రత్యేకత ఉంది.

**1.**ప్రాణం అంటే శక్తికి నిర్వచనం. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి – ఇవేవీ ఆత్మకుచెందినవి కావు. ప్రాణానికి చెందినవి. ఎందుకు ఆత్మకు చెందినవి కావు? శక్తి అంటేనే ఎక్కువ, తక్కువ అవుతుంటుంది. శక్తి మార్పు చెందుతూ ఉంటుంది.ఆత్మ నిర్వికారం.

**2.** రెండో అధ్యాయంలో ప్రాణస్తుతి జరిగినప్పుడు వచ్చిన వర్ణన చూడండి.

**ఏషో ఉగ్ని స్తపత్యేష సూర్యః ఏష పర్జన్యో మఘవానేష వాయుః ... 2.5**

**అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్**

**ఋచో యజూగ్ంషి సామాని యజ్ఞః క్షత్రం బ్రహ్మ చ 2.6**

ప్రాణమే సూర్యుడు. ప్రాణమే వేదాలు అంటూ సాగుతుంది ఈ వర్ణన. ఇదంతా ఆత్మవర్ణనకి సరిపోతుంది. అంటే ప్రాణమే ఆత్యంతిక అధిష్ఠానం కాదు. అది ఆపేక్షిక అధిష్ఠానం మాత్రమే. ఉదాహరణకి భూమి చెట్లకు, జంతువులకు అధిష్ఠానం. కాని అది ఆపేక్షిక అధిష్ఠానం మాత్రమే. భూమి జలంనుంచి పుట్టింది. అంటే ఇక్కడ భూమి కార్యం, జలం కారణం అవుతుంది. మళ్ళీ జలం దృష్ట్యాచూస్తే జలం కార్యం, అగ్ని కారణం అవుతుంది. అలా కార్యకారణసంబంధం చూసుకుంటూ పోతే, ప్రాణం లేదా హిరణ్యగర్భ లేదా బ్రహ్మకూడా కార్యమే. బ్రహ్మ లేదా హిరణ్యగర్భ జగత్తునంతా సృష్టించినా, ఆయన కూడా శాశ్వతం కాదు. ఆయనను సృష్టించినది పరమాత్మ.

**బ్రహ్మోదేవానాం ప్రథమః సంబభూవ విశ్వస్య కర్తా భువనస్య గోప్తా। -ముండకమ్**

అందుకే పురాణాల్లో బ్రహ్మను దేవతలు, అసురులు కీర్తిస్తే, ఆ గొప్పతనాన్ని తనకు ఆపాదించుకోకుండా తన సృష్టికర్తని తాను కీర్తిస్తాడు.

అందుకని ఇక్కడ గురువు ప్రాణస్తుతి చేస్తున్నాడు. ఎందుకు? ఇది ఉపాసనాకాండ. హిరణ్యగర్భ ఉపాసన గురించి చెప్పాలి. జ్ఞానకాండలో సచ్చిదానంద ఆత్మ గురించిన జ్ఞానం ఉంటుంది. కాని ఇక్కడ గురువుకు ఒక అదనపు బాధ్యత ఉంది. ఏమిటది? ప్రాణమే ఆత్యంతిక కారణం కాదు. దానిపైన ఇంకో కారణం ఉంది అని చూపాలి. అదెలా చూపగలడు? దానికి ఒక్కటే పద్ధతి ఉంది. ప్రాణం దేనినుంచో పుట్టిందని చెప్పాలి.

అలా ఈ అధ్యాయంలో ప్రాణం పుట్టుక గురించి చెప్పటంద్వారా దానిపైన వేరే ఉంది అని చెప్పకనే చెప్పినట్టవుతుంది.

## మంత్రం - 2

**తస్మై స హోవాచాతిప్రశ్నాన్ పృచ్ఛసి బ్రహ్మిష్ఠోఽసీతి తస్మాత్తేఽహం బ్రవీమి ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** తస్మై– కౌసల్య అనే శిష్యునితో; సః హ – పిప్పలాద; ఉవాచ – జవాబు చెప్పాడు; అతి ప్రశ్నాన్– కఠినమైన ప్రశ్నలను; పృచ్ఛసి – అడుగుతున్నావు; బ్రహ్మిష్ఠః – బ్రహ్మజ్ఞానివిగా; అసి– ఉన్నావు; తస్మాత్ – అందువల్ల; తే– నీకు; అహమ్– నేను; బ్రవీమి– చెబుతున్నాను; ఇతి – అని;

**తాత్పర్యం:** కౌసల్య అనే శిష్యునితో పిప్పలాద ఇలా చెప్పాడు. 'నువ్వు కఠినమైన ప్రశ్నలను అడుగుతున్నావు. కానీ నువ్వు బ్రహ్మజ్ఞానివిగా ఉన్నావు. అందువల్ల నీకు నేను చెబుతున్నాను.'

**వివరణ:** నువ్వు సూక్ష్మమైన విషయాలను అడుగుతున్నావు. ఎందుకంటే ప్రాణం దాకా అర్థమవుతుంది. ఇంకా పైపైకి వెళితే ఇంకా కష్టం. సచ్చిదానంద ఆత్మ అనిర్వచనీయం. కాని నేను చెపితే, నువ్వు వినటానికి సిద్ధంగా ఉన్నావు. నువ్వు బ్రహ్మజ్ఞానివి కాబట్టి నీకు చెబుతాను. **బ్రహ్మిష్ఠ** అంటే బ్రహ్మజ్ఞాని. అతను సగుణ ఈశ్వరఉపాసన చేసి ఉన్నాడు కాబట్టి అతనికి సూక్ష్మబుద్ధి పెరిగి ఉంటుంది.

ఇంకో అర్థం కూడా ఉంది. ఈ విద్య నేర్చుకున్నాక, అతను సూక్ష్మగ్రాహి కాబట్టి, ఎలాగూ బ్రహ్మజ్ఞాని అవుతాడు కాబట్టి ముందే ఆ పదం వాడుతున్నాడు. అంటే ఇప్పుడు కాకపోయినా త్వరలోనే అవుతావని విద్యార్థిని స్తుతిస్తున్నాడు. నువ్వు అర్హుడవు కాబట్టి ఆ సూక్ష్మమైన ప్రశ్నలకు జవాబు చెబుతాను అంటాడు. ఇదీ ఉపోద్ఘాతం. ఇంక జవాబులు మొదలవుతాయి.

**మంత్రం - 3**

**ఆత్మన ఏష ప్రాణో జాయతే । యథైషా పురుషే ఛాయైతస్మిన్నేతదాతతం మనోకృతేనాయాత్యస్మిఞ్ఛరీరే ॥ 3 ॥**

**ప్రతిపదార్థం:** ఆత్మనః – ఆత్మనుంచి (సచ్చిదానంద ఆత్మనుంచి) ఏషః – ఈ; ప్రాణో జాయతే – ప్రాణం పుట్టింది; యథా – ఎలా; ఏషా పురుషే – ఈ పురుషునివల్ల; ఛాయా –(ఏర్పడిన) నీడలా; ఏతస్మిన్– దానినుంచి (ఆత్మనుంచి); ఏతద్ ఆతతం – ఆత్మనుంచి పుట్టింది; మనోకృతేన – కర్మలవల్ల; అస్మిన్ శరీరే – ఈ శరీరంలో; ఆయాతి – వస్తుంది.

**తాత్పర్యం:** ఆత్మనుంచి (సచ్చిదానంద ఆత్మనుంచి) ఈ ప్రాణం పుట్టింది. పురుషునివల్ల ఏర్పడిన నీడలా, దానినుంచి (ఆత్మనుంచి) పుట్టింది. కర్మలవల్ల ఈ శరీరంలోకి వస్తుంది.

**వివరణ:** సృష్టిప్రకరణం గురించి ఏ ఉపనిషత్తు కూడా చెప్పని ఒక ముఖ్యమైన విషయం ఇందులో స్పష్టమవుతుంది. **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా** అనే వేదాంత వాక్యానికి ఇక్కడ మనకు ఆధారం దొరుకుతుంది.

1. ఇంతకు ముందు అధ్యాయంలో సృష్టి గురించి వచ్చినప్పుడు ఒక్కొక్క చోట ఒక్కొక్కలా సృష్టి గురించి చెప్పబడిందని చూసాం. ఇక్కడ ప్రశ్నోపనిషత్తులో మిథునసృష్టిద్వారా, ఐదు దశలుగా జీవసృష్టి జరిగిందనీ చూసాము.

2. ఆత్మనిర్వచనం చెప్పేటప్పుడు రెండు విధాలుగా చెబుతుంది శాస్త్రం – తటస్థలక్షణం, స్వరూపలక్షణం. ఉదాహరణకు, దేవదత్తుని ఇల్లు ఎక్కడా అంటే, కాకి వాలిన ఇల్లు అంటారు. కాకి ఎప్పుడూ ఆ ఇంటిమీద ఉండదు. అది తటస్థలక్షణం (తాత్కాలికం). స్వరూపలక్షణం అంటే ఇంటిని గురించి వర్ణించటం. తెల్లగా

ఉందనీ, రెండతస్తుల మేడ అనీ అలా రకరకాలుగా వర్ణన. ఆత్మ అనిర్వచనీయం కాబట్టి ముందు తటస్థలక్షణం చెప్పి, తర్వాత రెండో దానిలోకి వెళతారు. బ్రహ్మసూత్రంలో కూడా జగత్ కారణం బ్రహ్మ అని వస్తుంది. దాన్ని వివరించుకుంటూ పోతే అభిన్న నిమిత్త వివర్త ఉపాదానకారణం బ్రహ్మ లేదా ఆత్మ అని తెలుస్తుంది.

**అభిన్నం** – ఆత్మకు భిన్నంగా ఏమీ లేదు.

**నిమిత్తకారణం** – కార్యం ప్రకటమవటానికి కావలిసిన జ్ఞానం.

**వివర్తం** – కారణం ఏ మార్పుకూ లోను కాకుండా కార్యం ప్రకటితమవుతుంది. (ఉదా– కల)

**ఉపాదానకారణం** – కార్యం ప్రకటమవటానికి కావలిసిన ముడిసరుకు.

3. **అభిన్న నిమిత్త వివర్త ఉపాదానకారణం బ్రహ్మ** అని స్థిరపరిచాక, **బ్రహ్మ కార్య, కారణ విలక్షణం** అంటుంది శాస్త్రం.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ ।**
**నాయం భూత్వా భవితా వా న భూయః ॥** **–గీత – 2.20.**

ఆత్మనుంచి ప్రాణం పుడుతున్నది అంటే, ఏమిటి సమస్య? ఆత్మ కారణం అయితే, ఆత్మ పుట్టుకకు కారణం ఉండాలి. ఆత్మ దేనినుంచి పుట్టింది? ఆత్మకు పుట్టుక లేదు, చావు లేదు, భావవికారాలు లేవు. అందువల్ల ఆత్మ నిజంగా కారణం కాదు. ఆత్మ పరిణామి ఉపాదానకారణం కాదు వివర్త ఉపాదానకారణం. ఆత్మ నిజంగా కారణం కాకపోతే, కార్యం కూడా నిజంగా లేదు. సృష్టి మిథ్య అన్నది పారమార్థిక దృష్ట్యా వస్తుంది.

**ఆత్మనః ఆకాశః సంభూతః – తైత్తిరీయం**

ఆకాశం ఆత్మనుంచి పుట్టిందని చెబుతూ జగత్ మిథ్య అని, పుట్టినట్టుగా ఉంది అని ఎలా చెబుతారు అని విశిష్టాద్వైతులు అద్వైతులను అడుగుతుంటారు. దానికి జవాబు ఈ ఒక్క పాదంలో ఉపనిషత్తు ఎంత అందంగా చెప్పిందో చూడండి.

**యథా ఏషా పురుషే ఛాయా**

ఛాయలాగా పుట్టింది – అంటే జగత్ మిథ్య అని చెబుతున్నది. అంతకు ముందు చూసిన అధ్యారోప, అపవాద పద్ధతిని అన్వయించుకోవాలి. జగత్‌ను కార్యంగా, ఆత్మను కారణంగా నిరూపించాక, జగత్‌ను మిథ్యగా, ఆత్మను సత్యంగా నెలకొల్పి, కార్యకారణ విలక్షణం ఆత్మ అని అసలు లక్షణంద్వారా నిర్వచించాలి.

**వివరణ:** ఈ మంత్రంలో మొదటి రెండు ప్రశ్నలకీ జవాబు వచ్చింది.

1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?

**ఆత్మనః ఏష ప్రాణో జాయతే యథైష పురుషే ఛాయా** – ఆత్మనుంచి ఛాయలాగా పుట్టింది. ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మ.

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణి చ ।**
**ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ ॥ – ముండకమ్ 2.1.3**

ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు, ఆకాశం, గాలి, నిప్పు, నీరు, భూమి అన్నీ ఆత్మనుంచే పుట్టాయి. అవి ఎలా పుట్టాయి?

**తదేతత్ సత్యమ్ యథా సుదీప్తాత్ పావకాద్ ।**
**విస్ఫులింగాః సహస్రశః ప్రభవన్తే సరూపాః ॥ – ముండకమ్ 2.1.1**

నిప్పునుంచి అనేకవేల నిప్పురవ్వలు లేచినట్టుగా పుట్టాయి.ఆ పుట్టుకని ఇక్కడ యథా ఏషా పురుషే ఛాయా అని వర్ణిస్తోంది. పురుషునిలో నీడలాగా. అంటే పురుషునివల్ల ఏర్పడిన నీడలాగా చెబుతున్నారు. దీనివల్ల సృష్టి వితథం లేదా మాయికం అని తెలుస్తోంది. అంటే మాయ.

ఛాయ అన్న పదం వాడటంవల్ల కొన్ని విషయాలు స్పష్టమవుతాయి.

1. ఛాయ మనిషికి దగ్గరగా ఉంది. కాని మనిషికి దానితో సంగత్వం లేదు. అతనేమీ ఛాయా ఛాయా, ఇలా రా అని పిలవలేదు. అంటే ఆత్మ, అనాత్మకు దగ్గరగా ఉంది కాని, అనాత్మతో సంగత్వం లేదు.

2. మనిషి లేకపోతే ఛాయ లేదు. అంటే నీడకి, మనిషి లేకుండా, తనంతట తానుగా ఉనికి లేదు. అంటే ఆత్మ లేనిదే, అనాత్మకు ఉనికి లేదు. అనాత్మ జడం. ఆత్మవల్ల చైతన్యం పొందుతున్నది.

**అజాయమానో బహుధా విజాయతే – పురుష సూక్తమ్**

పుట్టకుండా పుట్టినట్టుగా ఉంది.

3. ఒక్క దీపంనుంచి ఎన్ని నీడలు వచ్చినా, దీపం బరువు తగ్గదు.

**అజోఽ పి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽ పి సన్ – గీత**

అలా మననుంచి కొన్ని నీడలు వస్తే మన బరువు తగ్గేటట్టు ఉంటే చూస్తూ చూస్తూ మెరుపు తీగలమయిపోమూ? కాని బ్రహ్మనుంచి ఎన్ని వచ్చినా అక్షరబ్రహ్మ తగ్గదు, పెరగదు.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**

ఏతస్మిన్ ఏతదాతతం – బ్రహ్మనుంచి ప్రాణం వచ్చింది.
ఇక్కడితో మొదటి ప్రశ్న అయిపోయింది.
1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?
**ఆత్మనః ఏష ప్రాణో జాయతే యథైష పురుషే ఛాయా –** ఆత్మనుంచి ఛాయలాగా పుట్టింది.
2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి**? వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?

శరీరంలోకి ఎలా వచ్చింది? పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది. మనస్సు అంటే సంకల్ప వికల్పాత్మకం మనః – సంకల్పం అంటే లక్షణం అంటాము. అంటే చివరి అర్థం కర్మ.

ఒక పెద్దమనిషిని మీ అల్లుడికి ప్రమాదం ఎలా జరిగింది అని అడిగితే, చెట్లకు నీళ్ళు పోయకపోవటంవల్ల అన్నాడుట. చెట్లకు నీళ్ళు పోయటానికీ, ప్రమాదానికీ ఏమిటి సంబంధం? చెట్లకు నీళ్ళు పోస్తే, కాస్త వ్యాయామం చేసినట్టు అవుతుంది. దానివల్ల శరీరం అదుపులో ఉంటుంది. దానివల్ల ప్రమాదం జరగబోతుంటే చటుక్కున ముందుకు కదలగలడు. అదీ సంబంధం.

అలా సంకల్పం అంటే కోరిక, కోరిక ఉంటే కర్మ చేస్తాము. అంటే మనస్సుకు పిల్లవాడు కోరిక అనుకుంటే, కర్మ మనవడన్నమాట. మనస్సువల్ల చేసిన కర్మ ప్రభావంవల్ల ప్రారబ్ధకర్మ ఏర్పడుతుంది. అందువల్ల కర్మద్వారా శరీరంలోకి వచ్చి, ప్రారబ్ధకర్మ ఉన్నన్నాళ్ళు ఉంటుంది.

కర్మ ఉంటే కర్మణః ఆయాతి, అయిపోతే కర్మణః నిర్యాతి.

ఇక్కడితో రెండవ ప్రశ్న అయిపోయింది.

2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి**? వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?
**మనోకృతేన –** పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది.

### మంత్రం -4

**యథా సమ్రాడేవాధికృతాన్ వినియుంక్తే। ఏతాన్ గ్రామానేతాన్ గ్రామానధితిష్ఠస్వేత్యేవమేవైష ప్రాణ ఇతరాన్ ప్రాణాన్ పృథక్ పృథగేవ సన్నిధత్తే ॥ 4 ॥**

**ప్రతిపదార్థం:** యథా సమ్రాడ్ ఏవ – ఎలా ఒక చక్రవర్తి; అధికృతాన్ – అధికారులను; వినియుంక్తే – నియమించి; ఏతాన్ గ్రామాన్ – ఈ గ్రామాలను; అధితిష్ఠస్వ –పాలించండి; ఇతి ఏవమ్ – అని చెబుతాడో; ఏవమేవైష ప్రాణః – అలా

ఈ ప్రాణం; ఇతరాన్ ప్రాణాన్ – తక్కిన ప్రాణాలను; పృథక్ పృథగేవ- విడివిడిగా; సన్నిధత్తే- నియమించింది.

**తాత్పర్యం:** ఎలా ఒక చక్రవర్తి అధికారులను నియమించి, ఈ గ్రామాలను పాలించండి అని చెబుతాడో అలా ఈ ప్రాణం తక్కిన ప్రాణాలను విడివిడిగా నియమించింది.

**వివరణ:** ఈ మంత్రంలో 3వ ప్రశ్నకు జవాబు మొదలవుతుంది.

3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే?** – తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది?

**యథా సమ్రాడేవాధికృతాన్ వినియుంక్తే!** – సామ్రాట్‌లాగా ఒక్కొక్క ప్రాణానికి ఒక్కొక్క అధికారం ఇచ్చింది. ఇది ఇందులో జవాబు. ఇక్కడ ఉపనిషత్తు ఒక దృష్టాంతాన్ని ఇస్తోంది. చక్రవర్తికి అంతులేని అధికారాలు ఉంటాయి. తన అధికారాన్ని తక్కిన మంత్రులకు పంచుతాడు. వారి అధికారాలు పదవిలో ఉన్నంతవరకే సాగుతాయన్నది జగమెరిగిన సత్యం. 'ఉద్యోగానంతరము చూడవలెనమ్మ ఆ అయ్య సౌభాగ్యముల్' అని ఉంది సామెత. స్థానభ్రష్టాన్ న శోభంతే దంతాన్, కేశాన్ అని వస్తుంది. వాటి వాటి స్థానంలో ఉన్నంతవరకే దంతాలకు, కేశాలకూ పోషణ చేయగలము.

**ప్రాణ ఇతరాన్ ప్రాణాన్ –** తక్కిన అపాన, సమాన, వ్యాన, ఉదానాలకు కొన్ని పదవులు ఇచ్చి, ముఖ్యమైన పదవి తాను ఉంచుకుంది.

**పృథక్ పృథగేవ సన్నిధత్తే** – వీటి మధ్య అయోమయం లేకుండా విడివిడిగా నియోగించింది.

### మంత్రం - 5

**పాయూపస్థేఽపానం చక్షుశ్శ్రోత్రే ముఖనాసికాభ్యాం ప్రాణస్స్వయం ప్రాతిష్ఠతే మధ్యే తు సమానః । ఏష హ్యేతద్ధుతమన్నం సమం నయతి తస్మాదేతాస్సప్తార్చిషో భవన్తి ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** పాయూపస్థే అపానమ్ – పాయు, ఉపస్థ స్థానాలలో (విసర్జన, జననేంద్రియాలలో) అపానం ఉంది; చక్షుశ్శ్రోత్రే – కళ్ళలో, చెవులలో; ముఖనాసికాభ్యామ్– నోరు, ముక్కులో; ప్రాణః – ప్రాణం; స్వయం ప్రాతిష్ఠతే – తానే నెలకొని ఉంది; మధ్యే తు – మధ్యలో (జీర్ణకోశంలో) సమానః – సమానం; ఏషః హి ఏతత్ – ఈ సమానం; హుతమ్ – హోమాగ్నిలాగా అర్పించబడిన; అన్నమ్– ఆహారాన్ని; సమమ్– సమానంగా విభజించి; నయతి – తీసుకుపోతుంది; తస్మాత్– దానినుంచి; ఏతాః – ఈ; సప్తార్చిషః– ఏడు జ్వాలలు (ఏడు ఇంద్రియాలు); భవన్తి– పుడతాయి.

**తాత్పర్యం:** పాయు, ఉపస్థ స్థానాలలో అపానం ఉంది; కళ్ళు, చెవులు, నోరు, ముక్కులలో ప్రాణం తానే నెలకొని ఉంది; మధ్యలో (జీర్ణకోశంలో) సమానం ఉంది. ఈ సమానం హోమాగ్నిలాగా అర్పించబడిన ఆహారాన్ని సమానంగా విభజించి తీసుకుపోతుంది. దానినుంచి ఏడు జ్వాలలు (ఏడు ఇంద్రియాలు) పుడతాయి.

**వివరణ:** మూడవ ప్రశ్న ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతేకి దృష్టాంతం ముందు మంత్రంలో వచ్చింది. ఇప్పుడు ద్రాష్టాంతం.

| **వ్యష్టి ప్రాణం** | **స్థానం** | **అధికారం** |
|---|---|---|
| అపానం | పాయు, ఉపస్థ | విసర్జన క్రియ,జీవోత్పత్తి |
| ప్రాణం | చక్షు శ్రోత్రే ముఖనాసికాభ్యాం | శ్వాసక్రియ |
| సమానం | మధ్యే తు (జీర్ణకోశం) | జీర్ణక్రియ |
| వ్యానం | ప్రతిశాఖానాడీ సహస్రాణి | రక్తప్రసరణ క్రియ |
| ఉదానం | ఊర్ధ్వః (మెడ, మెడపైన) | తిరోగమన క్రియ, లోకం నయతి |

**గమనిక–** ఈ మంత్రంలో సమానం వరకే వస్తుంది. 6,7లలో వ్యానం, ఉదానంల గురించి వస్తుంది. అపానం పాయు, ఉపస్థలో ఉండి విసర్జన క్రియ, జీవోత్పత్తి చేస్తుంది. చక్షుశ్రోతే ముఖ నాసికాభ్యాం– కళ్ళు, చెవులు, నోరు, ముక్కులో ఉండి ప్రాణం శ్వాసక్రియను చేస్తుంది. అది తనకు తానుగా నియమించుకుంది. సమానం మధ్యభాగంలో అంటే జీర్ణకోశంలో ఉండి, జీర్ణక్రియను చేస్తుంది. దాని గురించి ఉపనిషత్తు కొంత వివరణ ఇచ్చింది. జీర్ణకోశంలోకి వచ్చిన ఆహారాన్ని ఉతం అన్నం అన్నది ఉపనిషత్తు. ఉతం అంటే హోమాగ్నిలాంటిది. లోపల ఉన్న వైశ్వానర అగ్నికి అన్నాన్ని హోమాగ్నిగా వేస్తే, సమానం దాన్ని అనేక పోషకాహారాలుగా విభజించి, సమానంగా అన్నిటికీ పంచుతుంది. అగ్నిలో ఆహుతి వేస్తే ఏమవుతుంది? ఏడు అగ్నిజ్వాలలు వస్తాయి. వీటికి ఏడు పేర్లు

**కాళీ కరాళీ చ మనోజవా చ సులోహితాయా చ సుధూమ్రవర్ణా**
**స్ఫులింగినీ విశ్వరుచీ చ దేవీ లేలాయమానా ఇతి సప్త జిహ్వాః – ముండకమ్ 1.2.4**

ఈ ఏడు జ్వాలలు, ఏడు ఇంద్రియాలని సూచిస్తాయి. మనకి తెలిసి ఇంద్రియాలు ఐదు కదా! ఈ ఏడూ ఏమిటి? అదే ముండకలో ఏడు ఇంద్రియాలేమిటో వస్తుంది.

**సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్సప్తార్చిషః సమిధః సప్త హోమాః ।**
**సప్త ఇమే లోకా యేషు చరన్తి ప్రాణా గుహాశయా నిహితాః సప్త సప్త ॥**

ఏడు ఇంద్రియాలు, ఏడు జ్వాలలు, ఏడు ఇంధనాలు, ఏడు ఆహూతులు అన్నీ బ్రహ్మనుంచి పుట్టాయి. ఇవన్నీ ఇంద్రియాలకు సంబంధించిన వివరాలే. ఏడు

ఇంద్రియాలంటే - 2 కళ్ళు, 2 చెవులు, 2 ముక్కు రంధ్రాలు, 1 నాలుక. అగ్నిజ్వాల ఉంటే ఈ ఇంద్రియాలు బాగా పనిచేస్తాయి. అందమైన సిద్ధాంతం! అగ్నిని ఆహారం జ్వలింపచేస్తున్నది. అది ఇంద్రియాలను ప్రజ్వలింపచేస్తున్నది. ఆహారం పడకపోతే ఇంద్రియాలకు బలం ఉండదు.

## మంత్రం - 6

**హృది హ్యేష ఆత్మా। అత్రైతదేకశతం నాడీనాం తాసాం శతం శతమేకైకస్యా ద్వాసప్తతిర్ద్వాసప్తతిః ప్రతిశాఖానాడీసహస్రాణి భవన్త్యాసు వ్యానశ్చరతి ॥ 6 ॥**

**ప్రతిపదార్థం:** హృది హి - హృదయంలో; ఏషః ఆత్మా- ఈ ఆత్మ (అపరోక్ష ఆత్మ); (తిష్ఠతి) ఉంది. అత్ర - ఈ హృదయంనుంచి; నాడీనాం ఏతత్ ఏకశతమ్ (భవతి) - నూటొక్క నాడులు వస్తాయి. తాసామ్ - వాటిలో; ఏకైకస్యాః- ఒక్కొక్కదానికీ; శతం శతమ్ - నూరు (శాఖానాడులు ఉన్నాయి); ప్రతిశాఖానాడీసహస్రాణి ద్వాసప్తతిః ద్వాసప్తతిః -ప్రతిశాఖా నాడికీ 72000 (ఉపశాఖా నాడులు); భవన్తి-ఉన్నాయి; ఆసు - వీటిలో; వ్యానః - వ్యానం; చరతి-సంచరిస్తుంది.

**తాత్పర్యం:** ఈ ఆత్మ (అపరోక్ష ఆత్మ) హృదయంలో ఉంది. ఈ హృదయంనుంచి 101 నాడులు వస్తాయి. వాటిలో ఒక్కొక్కదానికీ నూరు శాఖానాడులు ఉన్నాయి. ప్రతిశాఖా నాడికీ 72000 ఉపశాఖా నాడులు ఉన్నాయి. వీటిలో వ్యానం సంచరిస్తుంది.

**వివరణ:** ఈ మంత్రంలో వ్యానం గురించి వస్తుంది. శరీరమంతటా అనేక నాడులు ఉన్నాయి. అవి అన్నీ హృదయంనుంచి మొదలవుతాయి. వాటిలో వ్యానం సంచరిస్తుంది. హృదయంనుంచి వచ్చే ప్రధాన నాడులు- **ఏకశతం** - 101

**శతం చ ఏకా చ హృదయస్య నాడ్యః - కఠ**

అందుకని ఇక్కడ కూడా 101 సంఖ్య తీసుకోవచ్చు. ఈ ప్రధాన నాడినుంచి ఒక్కొక్కదానికీ **శతం శతమ్** - వంద వస్తాయి. మళ్ళీ ప్రతిదానికీ **ద్వాసప్తతిః ద్వాసప్తతిః సహస్రాణి** - 72,000 శాఖానాడులు వస్తాయి. **ఆసు వ్యానః చరతి** - వీటన్నిటిలోనూ వ్యానం సంచరిస్తుంది. రక్తప్రసరణం చేస్తుంది.

**ప్రత్యేక విశ్లేషణ:-**

అధ్యాయంలో ఆత్మ గురించిన చర్చ లేకపోయినా ఆత్మ మాట వస్తుంది. ఆత్మ అంటే అపరోక్ష ఆత్మ, అహం ప్రత్యయ విషయ ఆత్మ, నేను. ఈ ఆత్మ హృదయంలో ఉంది. శాస్త్రం ప్రకారం హృదయం అంటే అసలు హృదయమే. ఇది స్థూలశరీరంలో ఉంటుంది. హృదయం అంటే జంతువుని కోసినప్పుడు కనబడే మాంసపిండం.

స్థూలశరీరంలో ఉన్న హృదయంలో సూక్ష్మశరీరంలో ఉన్న మనస్సు ఉంటుంది. విజ్ఞానశాస్త్రం ప్రకారం మనస్సు మెదడులో ఉంటుంది. కాని శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంటుంది. గోళకాలు స్థూలశరీరంలోనూ, వాటి ఇంద్రియాలు సూక్ష్మశరీరంలోనూ ఉంటాయి. హృదయం గోళకం అయితే, దాని ఇంద్రియం మనస్సు. అలాంటప్పుడు హృది ఆత్మ అని ఎందుకన్నారు? హృది మనః లేదా హృది అంతఃకరణః అనవచ్చు కదా! ఎందుకంటే, మనస్సులో చైతన్యం ప్రకటితమవుతుంది. అందువల్ల ఆత్మ హృదయంలో ఉంది అని వచ్చింది. **చిదాభాసరూపేణ ఆత్మా ఉపలభ్యతే.**

## మంత్రం - 7

**అథైకయోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యం లోకం నయతి ।**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకమ్ ॥ 7 ॥**

**ప్రతిపదార్థం:** అథ – ఇప్పుడు; ఊర్ధ్వః – పైభాగం (మెడ మరియు మెడపైన); ఏకయా – ముఖ్యమైన నాడి (సుషుమ్న నాడి)ద్వారా ;ఉదానః – ఉదానం; పుణ్యేన పుణ్యం లోకమ్ – (తక్కిన వారిని) పుణ్యం చేస్తే పుణ్యలోకానికి; నయతి – తీసుకుని వెళుతుంది; పాపేన పాపమ్ (నయతి) – పాపం చేస్తే నరకానికి తీసుకుని వెళుతుంది. ఉభాభ్యామ్ – రెండూ చేస్తే, మనుష్యలోకమ్ నయతి – మనుష్య లోకానికి తీసుకుని వెళుతుంది.

**తాత్పర్యం:** ఇప్పుడు ఆ నాడులలో పైకి వెళ్ళే ముఖ్యమైన నాడి, సుషుమ్న నాడిద్వారా, ఉపాసన చేసినవ్యక్తిని, ఉదానం తీసుకుని వెళుతుంది. తక్కిన వారిని వారి పారబ్ధకర్మఫలం– పుణ్యం చేస్తే పుణ్యలోకానికి తీసుకుని వెళుతుంది; పాపం చేస్తే నరకానికి తీసుకుని వెళుతుంది. రెండూ చేస్తే మనుష్య లోకానికి తీసుకుని వెళుతుంది.

**వివరణ:** ప్రాణం ఎలా విభజించుకుంటుంది అన్న 3వ ప్రశ్నకు జవాబుగా, తక్కిన నాలుగూ ముందు మంత్రాల్లో వచ్చాయి. ఉదానం గురించి ఇక్కడ వచ్చింది. ఉదానం ఎక్కడ ఉందో ప్రత్యక్షంగా చెప్పలేదు. అర్థం చేసుకోవాలి. ఊర్ధ్వ అని వచ్చింది కాబట్టి పైభాగంలో ఉన్నట్టు అంటే మెడ, మెడపై భాగం. ఉదానం పని వ్యక్తి జీవించి ఉండగా, తిరోగతి క్రియ – అంటే పడని వస్తువును ఇటు వాంతుల రూపంలో గానీ, అటు విరోచనాల రూపంలో గాని బయటకు పంపుతుంది. మరణం సమయంలో ప్రాణాన్ని తీసుకువెళుతుంది.

ఉదానం పనిద్వారా మనకు 4వ ప్రశ్నకు జవాబు వచ్చేస్తుంది.

4. **కేన ఉత్క్రమతే** – ఎలా బయటకు వెళుతుంది?

**ఏకయోర్ధ్వ ఉదానః** – సుషుమ్న నాడిద్వారా ఉదానం తీసుకుని వెళుతుంది.

ప్రాణం ఎలా పోతుంది? ముఖ్యమైన నాడి అయిన సుషుమ్న నాడిద్వారా పై భాగంనుంచి పోతుంది. ఇది ఉపాసకుని గురించి ప్రత్యేకంగా చెబుతోంది. జ్ఞాని విషయంలో ప్రయాణం ఉండదు. ఉపాసకుడు ఊర్ధ్వలోకానికి వెళతాడు. తక్కిన వారు తక్కిన నాడులద్వారా వివిధ లోకాల్లో తిరుగుతుంటారు. ఇదే అర్థం ఈ క్రింది మంత్రంలో చూడండి.

**శతం చైకా చ హృదయస్య నాఢ్యః**
**తాసాం మూర్ధానమభినిః సృతైకా ।**
**తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి**
**విష్వంగన్యా ఉత్క్రమణే భవన్తి ॥ – కఠ 2.3.16**

తక్కిన ప్రాణాలు – అంటే ప్రాణ, అపాన, సమాన, వ్యానలు, ఉదానలో కలిసిపోతాయి. అందుకనే జీర్ణక్రియ సరిగా పనిచేయదు. ఊపిరి సరిగా ఆడదు.

ఉదానం ఎక్కడికి తీసుకువెళ్తుంది? **పుణ్యేన పుణ్యం లోకం నయతి**– పుణ్యం చేస్తే స్వర్గలోకానికి, **పాపేన పాపం (నయతి)** – పాపం చేస్తే నరకంలోకి తీసుకుని వెళుతుంది. **ఉభాభ్యామేవ** మనుష్యలోకమ్ **(నయతి)**– రెండూ చేస్తే మనుష్యలోకానికి తీసుకుని వెళుతుంది.

పుణ్యం చేస్తే, పాపం చేస్తే అన్న పదాలను చూస్తే – ఏ మనిషీ పూర్తిగా పుణ్యం చేయడు, ఏ మనిషీ పూర్తిగా పాపం చేయడు. అంటే రెండింటిలోనూ ఏది ఎక్కువగా ఉంటే అది చేసినట్టు లెక్క. రెండూ చేసిన వాడు అంటే, ఇంచుమించు రెండూ సరిసమానంగా ఉన్నవాడు మనుష్యలోకంలోనే వెంటనే మరుజన్మ పొందుతాడు. మనం మనిషిగా పుట్టామంటే రెండూ ఇంచుమించు ఒకటిగా చేసామన్నమాట. అది గ్రహించి, మనం పుణ్యాన్ని ఎక్కువ చేసి, తర్వాత జ్ఞానమార్గంలోకి వచ్చి మోక్షం పొందాలి.ఇక్కడ నాలుగవ ప్రశ్నకు జవాబు వచ్చింది. ప్రాణం ఎలా పోతుంది? సుషుమ్ననాడి ద్వారా పోతుంది.

కాని దీనికి మరికాస్త వివరణ మళ్ళీ 9,10 మంత్రాల్లో వస్తుంది.

సెల్‌ఫోన్‌లోలాగా ప్రీపెయిడ్ కార్డు ఉంటుంది. అది అవగానే సెల్ సూచనలిచ్చినట్టు శరీరం కూడా సూచనలిస్తుంది, ఏదో ఒక రూపంలో. మళ్ళీ ఊర్ధ్వలోకాలకు వెళ్ళి అదే సిమ్ కార్డు (అదే సూక్ష్మశరీరం) తీసుకుని వస్తుంది. ఈ శరీరానికి కాదు; మనిషి కొత్త ఫోను కొనుక్కున్నట్టుగా, కొత్త శరీరంలోకి వెళుతుంది.

**మంత్రం - 8**

**ఆదిత్యో హ వై బాహ్యః ప్రాణ ఉదయత్యేష హ్యేనం చాక్షుషం ప్రాణమనుగృహ్ణానః। పృథివ్యాం యా దేవతా సైషా పురుషస్యాపానమవష్టభ్యాన్తరా యదాకాశస్స సమానో వాయుర్వ్యానః॥ 8 ॥**

**ప్రతిపదార్థం:** ఆదిత్యో హ వై – సూర్యుడే; బాహ్యః ప్రాణః– బాహ్య రూపంలో ప్రాణం; ఏషః హి – అతడే; అనుగృహ్ణానః – అనుగ్రహించి; ఏనమ్ – ఈ; చాక్షుషం – కళ్ళలో; ప్రాణః – ప్రాణంగా; ఉదయతి – నెలకొని ఉన్నాడు; పృథివ్యాం యా దేవతా– పృథివిలో ఉన్న దేవత; ఏషా – ఈ; పురుషస్య అపానమ్ అవష్టభ్య– మనిషిలో ఉన్న అపానాన్ని నియంత్రిస్తోంది; యద్ అన్తరా ఆకాశః –అంతరిక్షం; స సమానః – సమానాన్ని నియంత్రిస్తోంది. వాయుర్వ్యానః – వాయువే వ్యానం.

**తాత్పర్యం:** సూర్యుడే బాహ్యరూపంలో ప్రాణం. అతడే అనుగ్రహించి కళ్ళలో ప్రాణంగా నెలకొని ఉన్నాడు. పృథివిలో ఉన్న దేవత మనిషిలో ఉన్న అపానాన్ని నియంత్రిస్తోంది. అంతరిక్షం సమానాన్ని నియంత్రిస్తోంది. వాయువు వ్యానాన్ని నియంత్రిస్తోంది.

**వివరణ:** 5,6 ప్రశ్నలకు జవాబు వస్తుంది.

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?
6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

| **సమష్టి / అధిదైవం** | **వ్యష్టి / అధ్యాత్మం** |
|---|---|
| ఆదిత్యదేవత | ప్రాణం |
| పృథివి | అపానం |
| అంతరిక్షం | సమానం |
| వాయువు | వ్యానం |
| అగ్ని / తేజః | ఉదానం |

వ్యష్టి ప్రాణం ఐదుగా విభజించుకుందని ముందు మంత్రాల్లో చూసాము. వాటి పేర్లు ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదానం. ఈ మంత్రంలో కొత్తగా తెలుసుకునేది వాటికి అనుగుణంగా సమష్టి ప్రాణం ఏది అన్నది చూస్తాము. వ్యష్టిప్రాణం వ్యష్టికి స్థితికారకం. సమష్టిప్రాణం సమష్టి స్థితికి కారణం. అంతేకాదు, సమష్టిప్రాణం వ్యష్టి స్థితికి కూడా కారణం. అంటే సమష్టినుంచి శక్తిని పొందుతుంది వ్యష్టి.

1. **ఆదిత్యో హ వై బాహ్యః ప్రాణః** – ఆదిత్యుడే బాహ్యరూపంలో ప్రాణం. ఆదిత్యుడు ఉదయించి, సమష్టికే కాక వ్యష్టికి కూడా శక్తినిస్తాడు. అందుకే **ఏనం చాక్షుషం ప్రాణమనుగృహ్ణానః** – కళ్ళలో ఉన్న ప్రాణాన్ని అనుగ్రహిస్తాడు.

2. **పృథివ్యాం యా దేవతా సైషా పురుషస్య అపానమవష్టభ్య**– పృథివిలో ఉన్న దేవత వ్యష్టి అపానంకి శక్తినిస్తుంది. మనం కింద నిలిచి ఉన్నామంటే అది పృథివిదేవతవల్లే. భూమ్యాకర్షణశక్తిని తర్వాత కనుగొన్నారు. అది లేకపోతే, హైడ్రోజన్ బెలూన్ పైకి ఎగిరినట్టు, మనని ఉదానం పైకి తీసుకువెళ్ళిపోయేది.

3. **అంతరా యదాకాశః స సమానః** – మధ్యలో ఉన్న ఆకాశం వ్యష్టిలోని సమానంతో సమానం.

4. **వాయుర్వ్యానః** – ప్రతి పదానికీ బాహ్య కలుపుకుంటూ రావాలి. బాహ్యవాయువు వ్యష్టి వ్యానం. ఉదానం గురించి చెప్పలేదు. తరువాత మంత్రంలో వస్తుంది.

## మంత్రం - 9

**తేజో హ వా ఉదానస్తస్మాదుపశాన్తతేజాః పునర్భవమిన్ద్రియైర్మనసి సమ్పద్యమానైః ॥ 9॥**

**ప్రతిపదార్థం:** తేజః హ వై– నిజానికి అగ్ని; ఉదానః – ఉదానం; తస్మాత్–కనుక; ఉపశాంతతేజాః – ఏ శరీరంలో అగ్నితత్త్వం వెళ్ళిపోతుందో; ఇంద్రియైః – (అందులో) ఇంద్రియాలు; మనసి – మనస్సులో; సంపద్యమానైః – లీనమైపోతాయి; పునర్భవమ్ – (అతడు) మళ్ళీ జన్మిస్తాడు.

**తాత్పర్యం:** నిజానికి అగ్ని ఉదానం. కనుక ఏ శరీరంలో అగ్ని తత్త్వం వెళ్ళిపోతుందో, అందులో ఇంద్రియాలు మనస్సులో లీనమైపోతాయి. అతడు తిరిగి జన్మిస్తాడు.

**వివరణ:** ఉదానం గురించి వివరణ ముందు మంత్రంలోరాలేదు.

5. **తేజో హ వా ఉదానః** – అగ్నితత్త్వమే ఉదానం. వా అంటే నిజానికి అని అర్థం.

విరాట్ ఈశ్వరునికి ఆకారం ఊహించుకుంటే –

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్ర సూర్యౌ చ నేత్రే**
**కర్ణావాశాః శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః॥**

అంటే భూమి – పాదం, అంతరిక్షం – నాభి, సూర్యచంద్రులు– కళ్ళు, దిశలు– చెవులు, ముఖమ్ – స్వర్గలోకం. ఇక్కడితో 5,6 ప్రశ్నలకి జవాబు అయిపోయింది.

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?
సమష్టి ప్రపంచంలో ఆదిత్య, పృథివి, అంతరిక్షం, వాయువు, అగ్ని.

6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?
వ్యష్టిలో ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదానం.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రాణం అనాత్మకు శక్తినిస్తుంది. ఆత్మకు కాదు. ప్రాణానికి శక్తినిచ్చేది ఆత్మ. అది ఇక్కడ అప్రస్తుతం. అధ్యాత్మం అంటే జడరూప స్థూలశరీరం. బాహ్యప్రపంచాన్ని అధిభూతం అంటారు. ప్రాణమే రెండింటికీ స్థితికారకం. వ్యష్టిస్థాయిలో ప్రాణమనీ, సమష్టిస్థాయిలో హిరణ్యగర్భ అనీ అంటారు.

4. **కేన ఉత్క్రమతే –** ఎలా బయటకు వెళుతుంది? 7లో ఒక జవాబు వచ్చింది.

**ఏకయోర్ధ్వ ఉదానః –** సుషుమ్న నాడిద్వారా ఉదానం తీసుకుని వెళుతుంది.

ఉదానంతో ఏవి వెళతాయి? తక్కిన నాలుగు ప్రాణాలు. ఇందులో కొన్ని వివరాలు వస్తాయి. తక్కిన 4 ప్రాణాలు – ప్రాణ, అపాన, వ్యాన, సమానాలు ఉదానంలో లీనమై పోతాయి. అందుకే మరణసమయంలో ఊపిరాడదు. రక్తప్రసరణ సరిగా ఉండదు. జీర్ణం సరిగ్గా కాదు. అన్నీ ఉదానం అనే పెట్టెలో సర్దుకుంటాయి, ప్రయాణానికి సిద్ధంగా. శరీరంలోంచి అగ్ని తత్త్వం వెళ్ళిపోతుంది. అందువల్ల శరీరం మంచుకన్నా చల్లగా అవుతుంది. ఎందుకు వెళ్ళిపోతుంది? **పునర్భవమ్** – పునర్జన్మ పొందటానికి.

**ఇంద్రియైః మనసి సంపద్యమానైః**– ఉదానం వెళ్ళిపోయేటప్పుడు ఇంద్రియాలు కూడా వెళ్ళిపోతాయి. ఎలా వెళతాయి? అవి మనస్సనే ఇంకో పెట్టెలో సర్దుకుంటాయి. మనం ఇల్లు మారినప్పుడు ఒక గదికి సంబంధించినవన్నీ ఒక పెట్టెలో ఎలా వేస్తామో, అలా మరణమనే ప్రయాణానికి మనస్సు అధీనంలో ఉన్న ఇంద్రియాలన్నీ మనస్సు అనే పెట్టెలో సర్దుకుంటాయి. ఇంకో ఇంటికి వెళ్లగానే, ఎక్కడ పెట్టాల్సినవి అక్కడ పెట్టినట్టుగా, ఇంకో శరీరం చేపట్టగానే, అన్ని ఇంద్రియాలూ వాటి వాటి స్థానాల్లో సర్దుకుంటాయట. ఎంత అద్భుతమైందీ సృష్టి!

అంతేనా, ఇంకేదైనా వెళుతుందా? బయటకి వచ్చాక ఉదానం ఎటువైపు తీసుకు వెళుతుంది? ఇంటి బయటకి వచ్చాక మీరు ఏ బస్సు లేదా ఏ రైలు ఎక్కుతారు? దానికి మీ మనస్సులో ఒక సంకల్పం ఉంటుంది. అలాగే మరణించే వ్యక్తిలో కూడా సంకల్పం ఉంటుంది. దీని గురించి తరువాత మంత్రంలో వస్తుంది.

**మంత్రం - 10**

**యచ్చిత్తస్తేనైష ప్రాణమాయాతి ప్రాణస్తేజసా యుక్తః ।**
**సహాత్మనా యథాసఙ్కల్పితం లోకం నయతి ॥ 10 ॥**

**ప్రతిపదార్థం:** యత్ చిత్తః – (మామూలుగా మనస్సు), ఇక్కడ మనస్సులో ఉన్న సంకల్పం; ఏష ప్రాణమాయాతి– (ఇక్కడ) నాలుగు ప్రాణాలు; ప్రాణః తేజసా యుక్తః – ఉదానంతో పాటు; ఆత్మనా సహ– (ఇక్కడ) జీవాత్మను; యథాసంకల్పితం– అతనికున్న సంకల్పం ప్రకారం; లోకం నయతి– లోకానికి తీసుకుపోతుంది.

**తాత్పర్యం:** మనస్సులో ఉన్న సంకల్పం; నాలుగు ప్రాణాలను, ఉదానంతో పాటు, జీవాత్మను అతనికున్న సంకల్పం ప్రకారం లోకానికి తీసుకుపోతుంది.

**వివరణ:** మరణకాలంలో ఉన్న సంకల్పం గురించిన వివరణ వస్తుంది.

**అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ – గీత 8.5**

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ – గీత 8.6**

మరణకాలంలో నన్ను తలచుకున్న వారు నన్నే పొందుతారు అన్నాడు శ్రీకృష్ణభగవానుడు. ఆ భావన ఎలా వస్తుంది? సదా తత్ భావ భావితః. దాని గురించే తదేక ధ్యానంలో ఉంటే వస్తుంది.

**ఏషః ప్రాణమాయాతి** – ఉదానం ముముక్షువును ఊర్ధ్వలోకాలకు తీసుకుని వెళుతుంది. ఉదానంతో తక్కిన నాలుగు ప్రాణాలు లయమవుతాయి. **ఆత్మనా సహ** – ఆత్మ అంటే జీవాత్మ. జీవాత్మ ప్రాణాల దగ్గరకు వస్తుంది. ప్రాణాలు ఉదానం దగ్గరకు తీసుకుని వెళతాయి. ఉదానం, **లోకం నయతి** – లోకాలకు ఆత్మని తనతో తీసుకుని వెళుతుంది.

ఇంద్రియాలు, మనస్సనే పెట్టెలో లయమయ్యాయని ముందే చూసాము.

**యత్ చిత్తః యథా సంకల్పితమ్** – మనస్సులో ఉన్న సంకల్పం ప్రకారం తీసుకుని వెళుతుంది. సంకల్పం దిశను సూచిస్తుంది. ఇప్పుడు అంతఃకాల ప్రయాణానికి అన్నీ సిద్ధంగా ఉన్నాయి. జీవాత్మ + 4 ప్రాణాలూ ఉదానంలో, ఇంద్రియాలు మనస్సులో ఉన్నాయి. ముఖ్యమైనది సంకల్పం. అది మన దిశను నిర్దేశిస్తుంది. ఉదానం ఎక్కడికి అని అడుగుతుంది. సంకల్పం చెబుతుంది. కాని జీవన్ముక్తుని విషయంలో ఉదానంకు అయోమయం కలుగుతుంది. ఎందుకంటే అతనికి కోరికలు లేవు. ప్రయాణం లేదు. అహం సర్వగతః నిత్యః స్థాణుః అని అర్థం చేసుకుంటాడు.

ఇక్కడితో శిష్యుని ప్రశ్నలన్నింటికీ జవాబులు వచ్చేసాయి. **మరణసమయంలో పంచప్రాణాలు, ఆత్మ, ఇంద్రియాలు, మనస్సు, సంకల్పబలాన్నిబట్టి వెళతాయి.**

ఇప్పుడు ముఖ్యవిషయానికి వస్తున్నాము. అదే ఉపాసన. ప్రాణం ముఖ్యం కాబట్టిప్రాణ ఉపాసన మనను దీవిస్తుంది. ముందు అధ్యాయం,ఈ అధ్యాయం ఇప్పటివరకూ ప్రాణ ఉపాసనకి మనని సిద్ధం చేస్తున్నది. ఎందుకు? ఉపాసన ఉత్కృష్ట వస్తువుమీద చేయాలి కాబట్టి.

**ప్రత్యేక విశ్లేషణ:-**

**అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।**
**యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ – గీత**

శ్రీకృష్ణభగవానుడు చివరి దశలో ఎవరు నన్ను తలుస్తారో, వారు నన్ను పొందుతారు అన్నాడు. ఇక్కడ ఒక చిన్న తిరకాసు పెట్టాడు. ఏమిటది? మరణకాలంలో అన్నాడు కదా అని అప్పటిదాకా ఆడేసి పాడేసి, జీవితాన్ని వ్యర్థం చేసుకుని అప్పుడు గట్టిగా కృష్ణా అని తలచుకోవచ్చులే అని అనుకుంటారు చాలామంది. పైగా వారు సమర్థించుకోవడానికి ఈ పద్యం కూడా ఉంది.

**క్రూరాత్ముడజామీళుడు నారాయణ**
**యనుచు నాత్మనందుని బిలవన్**
**ఏరీతి మేలుకొంటివి ఏరీ**
**నీసాటి వేల్పులెందును కృష్ణా॥**

వృద్ధాప్యంలో ఆధ్యాత్మిక చింతన ఉండాలి, ఇప్పుడెందుకు అనుకుంటారు. కాని వృద్ధాప్యంలో కృష్ణా అని పిలవగలగాలంటే కృష్ణునిమీద తదేక ధ్యానం ఉంటేనే అది సాధ్యం. అసలు దేవుని పేరే తలవని మహాపాపికి ఒక్క రోజైనా స్వర్గప్రాప్తి కలగాలని అతని బంధువులు, అతని అంత్య దశలో గడ్డిపరకను చూపించి అదేమిటని అడిగారు. 'నార' అంటే నారాయణ అన్నాడని పాపం ఆ భగవంతుడు భ్రాంతి చెందుతాడేమో అని వారు భ్రమపడ్డారు. అతను 'పీచు' అన్నాడు తేలికగా. దీనికి విరుద్ధంగా హఠాత్ మరణం పొందిన గాంధీ ఏమన్నారు? హే రామ్ అన్నారు. ఎలా అనగలిగారు అంత హఠాత్తుగా? ఎందుకంటే ఆయన నిత్యమూ రాముని చింతలోనే ఉండేవారు.

**రఘుపతి రాఘవ రాజారామ్ పతిత పావన సీతారామ్**
**ఈశ్వర్ అల్లా తేరో నామ్ సబ్‌కో సన్మతి దే భగవాన్**

ఇది నిత్యం పాడుతూ ఉండేవారు.

**ఇంకో విషయం** – అంతకాలే అని ఊర్కోలేదు. వ్యాసభగవానుడు అంతకాలే చ అని 'చ' కారం వేసాడు. అసలు వ్యాసాచార్యులమీద అతని కుక్షిలో 'చ' కారాలు చాలా ఉన్నాయి, తోచినప్పుడల్లా వాటిని వదులుతారన్న ఒక అపప్రథ ఉన్నా, ఇక్కడ అలా వదలలేదు. అంత్యకాలంలో కూడా అని ప్రత్యేకించి చెప్పాడు. కాకపోతే ఆ 'కూడా' మన దృష్టిని దాటిపోతుంది అంతే. అందుకని పుణ్యలోకాలకు వెళ్ళాలన్న కోరిక ఉంటే చాలదు. దాని గురించి తపన ఉండాలి, దానికి తగ్గ సాధన (ఉపాసన) చేయాలి.

**మంత్రం - 11**

**య ఏవం విద్వాన్ ప్రాణం వేద। న హాస్య ప్రజా హీయతేఽమృతో భవతి। తదేష శ్లోకః । 11**

**ప్రతిపదార్థం:** యః – ఎవరు; ప్రాణమ్ – ప్రాణం గురించి; ఏవమ్ – ఈ విధంగా; విద్వాన్– అర్థం చేసుకుని; వేద – ఉపాసన చేస్తారో; అస్య – అతని; ప్రజాః – సంతతి; న హీయతే – ఎన్నటికీ నశించదు; అమృతః భవతి – (అతను) బ్రహ్మలోకానికి వెళతాడు; తదేష శ్లోకః – దాని గురించి శ్లోకం ఉంది.

**తాత్పర్యం:** ఎవరు ప్రాణం గురించి చక్కగా ఈ విధంగా అర్థం చేసుకుని, ఉపాసన చేస్తారో అతని సంతతి ఎన్నటికీ నశించదు. అతను బ్రహ్మలోకానికి వెళతాడు. దీని గురించి శ్లోకం ఉంది.

**వివరణ:** ఇందులో ఉపాసన గురించి వస్తుంది. కేవలం ఉపాసన చేయమంటే ఎవరికీ శ్రద్ధ ఉండదు. అందుకని ఇందులో ఫలశ్రుతి కూడా ఉంది. ప్రాణం గురించి ఈ విధంగా తెలుసుకున్నవాడు, హిరణ్యగర్భమీద ఉపాసన చేస్తే, అతనికి ఇహలోకఫలం, పరలోకఫలం రెండూ దక్కుతాయి. ఇహలోకఫలం – అతని సంతతికి అపమృత్యువు ఉండదు. అతనికి పరలోకఫలం బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది. అది కూడా శుక్లగతిద్వారా కలుగుతుంది. అక్కడ జ్ఞానం పొంది క్రమముక్తి పొందుతాడు. ముందు బ్రహ్మలోకం పొందటం ఆపేక్షిక అమృతత్వం, దాన్నించి క్రమముక్తి ఆత్యంతిక అమృతత్వం.

**ఫలం:**– ప్రాణ ఉపాసన చేసినవారికి –
ఇహలోక ఫలం – సంతతికి అపమృత్యువు రాదు.
పరలోక ఫలం – బ్రహ్మలోక ప్రాప్తి, క్రమముక్తి.

**తదేష శ్లోకః** – ప్రశ్నోపనిషత్తు బ్రాహ్మణోపనిషత్తు. ముండకోపనిషత్తు మంత్రోపనిషత్తు. ఇది ముండకోపనిషత్తును విశ్లేషణ చేస్తుంది. బ్రాహ్మణోపనిషత్తు కాబట్టి ఇంకో ఉపనిషత్తులోని మంత్రాన్ని ఇక్కడ చెబుతున్నది. అలా తైత్తిరీయంలో **తదప్యేష శ్లోకో భవతి** అని పదే పదే వస్తుంది. వేదాలని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. మంత్రభాగం, బ్రాహ్మణభాగం, ఆరణ్యకం, ఉపనిషత్తు. బ్రాహ్మణభాగం మంత్రభాగంలోంచి చెబుతూ వస్తుంది.

**మంత్రం - 12**

**ఉత్పత్తిమాయతిం స్థానం విభుత్వం చైవ పఞ్చధా । అధ్యాత్మం చైవ ప్రాణస్య విజ్ఞాయామృతమశ్నుతే విజ్ఞాయామృతమశ్నుత ఇతి ॥ 12 ॥**

**ప్రతిపదార్థం:** ప్రాణస్య– ప్రాణం; ఉత్పత్తిం– ఎలా పుట్టింది; ఆయతిమ్– శరీరంలోకి ఎలా వచ్చింది? స్థానమ్– శరీరంలో ఎక్కడ ఉంది; విభుత్వమ్– ఎలా పరిపాలిస్తోంది? ఏవ– మరియు; అధ్యాత్మమ్– వ్యష్టిపరంగా; చైవ ప్రాణస్య– (ఇక్కడ) సమష్టిపరంగా; పఞ్చధా– ఐదుగా (ఎలా విభజించుకుంది); విజ్ఞాయ– తెలుసుకుని ఉపాసన చేసిన వ్యక్తి; అమృతమ్– అమరత్వాన్ని; అశ్నుతే– పొందుతాడు; విజ్ఞాయామృతమశ్నుత ఇతి– ఆమరత్వాన్ని పొందుతాడు అని;

**తాత్పర్యం:** ప్రాణం ఎలా పుట్టింది? శరీరంలోకి ఎలా వచ్చింది? శరీరంలో ఎక్కడ ఉంది? ఎలా పరిపాలిస్తోంది? వ్యష్టిలో, సమష్టిలో ఐదుగా ఎలా విభజించుకుంది? ఇవన్నీ తెలుసుకుని ఉపాసన చేసిన వ్యక్తి అమరత్వాన్ని పొందుతాడు.

**వివరణ:** ఈ అధ్యాయం సారాంశం అంతా ఈ ఒక్క మంత్రంలో వచ్చేసింది. కౌసల్య ఆశ్వలాయన ఆరు ప్రశ్నలు ప్రాణానికి సంబంధించి అడిగాడు. అవన్నీ ఒక్కొక్క పదంలో వచ్చేసాయి. అంతేకాదు దాని ఫలం కూడా వచ్చింది.

**1. ఉత్పత్తిమ్ – ప్రాణం ఎలా పుట్టింది?**

జవాబు: ఆత్మనుంచి, నీడ పుట్టినట్టుగా పుట్టింది.

**2. ఆయతిమ్ – శరీరంలోకి ఎలా వచ్చింది?**

జవాబు: మనోకృతేన – మన పూర్వజన్మకర్మలవల్ల వచ్చింది.

**3. స్థానమ్ – శరీరంలో ఎక్కడ ఉంది?**

| | | | |
|---|---|---|---|
| జవాబు: | ప్రాణం | – | కన్ను, చెవి, ముక్కు, నోరు |
| | అపానం | – | పాయు, ఉపస్థ |
| | వ్యానం | – | నాడులద్వారా అంతటా |
| | సమానం | – | మధ్యలో, జీర్ణకోశంలో |
| | ఉదానం | – | ఊర్ధ్వభాగంలో |

**4. విభుత్వమ్ – ఎలా విభజించుకుంది?**

జవాబు: సామ్రాట్‌లాగా విభజించుకుంది.

**5. పఞ్చధా ప్రాణస్య – బాహ్యప్రపంచానికి ఎలా శక్తినిస్తోంది?**

జవాబు: ఆదిత్య, పృథివి, అంతరిక్షం, వాయువు, తేజోరూపంలో ఇస్తోంది.

**6. అధ్యాత్మం - వ్యష్టికి ఎలా శక్తినిస్తోంది?**

జవాబు: ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానాల రూపంలో ఇస్తోంది.

**ఫలం:- విజ్ఞయామృతమశ్నుతే** - ఇది తెలుసుకుని ఉపాసన చేసినవాడు అమరత్వాన్ని పొందుతాడు.

బ్రహ్మజ్ఞానవిషయంలో జ్ఞానం పొందితే చాలు. మిగతా అన్ని జ్ఞానాలకీ కాయిక లేదా మానసిక చర్య చేయాలి. విజ్ఞయా అంటే తెలుసుకుని ఉపాసన చేస్తే- అమృతం అశ్నుతే- క్రమముక్తి పొందుతాడు. ఇలా రెండుసార్లు చెప్పటం ఈ అధ్యాయం ముగిసింది అని చెప్పే సూచన.

**శ్రీరామరామ రామేతి రమే రామే మనోరమే ।**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥**
**రామనామ వరానన ఓం నమ ఇతి ।**

ఈ ఫలం ఎవరికి? సకామ ఉపాసకునికి. అతనికి క్రమముక్తి కలుగుతుంది. క్రమముక్తి వద్దు, జీవన్ముక్తి కావాలనుకుంటే, నిష్కామ ఉపాసన చేయవచ్చు. దానికి ఫలం చిత్తశుద్ధి, చిత్తనైశ్చల్యం, గురుప్రాప్తి. గురువు దొరికాక వేదాంతబోధ విని జీవన్ముక్తి పొందుతాడు.

ఈ అధ్యాయం వరకూ అపరా విద్య గురించి బోధ వచ్చింది.

## అధ్యాయం - 3 టూకీగా

కౌసల్యః ఆశ్వలాయనః ప్రాణం గురించి 6 ప్రశ్నలు అడిగాడు.

1. **కుత ఏష ప్రాణో జాయతే** - ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?

**ఆత్మనః ఏష ప్రాణో జాయతే యథైష పురుషే ఛాయా** - ఆత్మనుంచి ఛాయలాగా పుట్టింది.

2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి?** వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?

**మనోకృతేన** - పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది.

3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే?** - తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది?

**యథా సమ్రాడేవాధికృతాన్ వినియుంక్తే!** సామ్రాట్‌లాగా ఒక్కొక్క ప్రాణానికి ఒక్కొక్క అధికారం ఇచ్చింది.

| **వ్యష్టి ప్రాణం** | **స్థానం** | **అధికారం** |
|---|---|---|
| అపానం | పాయు, ఉపస్థ | విసర్జన క్రియ,జీవోత్పత్తి |
| ప్రాణం | చక్షు శ్రోత్రే ముఖనాసికాభ్యాం | శ్వాసక్రియ |
| సమానం | మధ్యేతు (జీర్ణకోశం) | జీర్ణక్రియ |
| వ్యానం | ప్రతిశాఖానాడీ సహస్రాణి | రక్తప్రసరణ క్రియ |
| ఉదానం | ఊర్ధ్వః (మెడ, మెడపైన) | తిరోగమన క్రియ, లోకం నయతి |

4. **కేన ఉత్క్రమతే**– ఎలా బయటకు వెళుతుంది?

**ఏకయోర్ధ్వ ఉదానః –** సుషుమ్న నాడిద్వారా ఉదానం తీసుకుని వెళుతుంది.

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?

6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

| **బాహ్యం / అధిదైవం** | **వ్యష్టి / అధ్యాత్మం** |
|---|---|
| ఆదిత్యదేవత | ప్రాణం |
| పృథివి | అపానం |
| అంతరిక్షం | సమానం |
| వాయువు | వ్యానం |
| అగ్ని / తేజః | ఉదానం |

**ఫలం:**– ప్రాణ ఉపాసన చేసినవారికి –

ఇహలోక ఫలం – సంతతికి అపమృత్యువు రాదు.

పరలోక ఫలం – బ్రహ్మలోక ప్రాప్తి, క్రమముక్తి.

# అధ్యాయం - 4

**మంత్రం - 1**

**అథ హైనం సౌర్యాయణీ గార్గ్యః పప్రచ్ఛ। భగవన్నేతస్మిన్ పురుషే కాని స్వపన్తి కాన్యస్మిఞ్జాగ్రతి। కతర ఏష దేవస్స్వప్నాన్ పశ్యతి కస్యైతత్సుఖం భవతి। కస్మిన్ను సర్వే సమ్ప్రతిష్ఠితా భవన్తీతి ॥ 1 ॥**

**ప్రతిపదార్థం:** అథ – మూడవ ప్రశ్న తర్వాత; సౌర్యాయణీ గార్గ్యః – సౌర్యాయణీ గార్గ్యుడు ; ఏనం – గురువైన పిప్పలాదునితో; పప్రచ్ఛ– అడిగాడు; భగవన్ – ఓ దేవర్షీ; ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి – ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి; కాని అస్మిన్ జాగ్రతి– ఏవి మేలుకుని ఉంటాయి; కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి – ఏ దేవత (కరణం) కలలను చూస్తుంది; కస్యైతత్సుఖం భవతి– ఈ సుఖం ఎవరికి చెందుతుంది; కస్మిన్ను సర్వే– ఎందులో అన్నీ; సంప్రతిష్ఠితా భవన్తి– లయమవుతాయి; ఇతి – అని.

**తాత్పర్యం:** మూడవ ప్రశ్న తర్వాత సౌర్యాయణి గార్గ్యుడు, గురువైన పిప్పలాదుని ఇలా అడిగాడు, ' ఓ దేవర్షీ, ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి? ఏవి మేలుకుని ఉంటాయి? ఏ దేవత కలలను చూస్తుంది? ఈ సుఖం ఎవరికి చెందుతుంది? ఎందులో అన్నీ లయమవుతాయి?

**వివరణ:** ఒక్కొక్క విద్యార్థికీ రెండేసి పేర్లు ఉన్నాయన్న విషయం మనం మర్చిపోకూడదు. ఇప్పుడు నాలుగవ విద్యార్థి సౌర్యాయణీ గార్గ్య ప్రశ్నలు అడిగాడు. ఇప్పటివరకూ అపరావిద్య గురించి వచ్చింది. ఇక్కడ్నుంచి పరావిద్య మొదలవుతుంది. ఇతను కూడా ఐదు ప్రశ్నలు అడిగాడు. ఇవి శరీరత్రయానికి చెందినవి.

1. **ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** – ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?
2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?
3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?
4. **కస్యైతత్సుఖం భవతి?** – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?
5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?**– ఎందులో అన్నీ లయమవుతాయి?

ఈ ప్రశ్నల్లో కొన్ని పదాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

**పురుషే** – మొదటి ప్రశ్నలో పురుషే అంటే ఇక్కడ ఆత్మకాదు, శరీరం. **కాని అస్మిన్** – రెండవ ప్రశ్నలో కాని అస్మిన్ మధ్యలో కరణాలని కలుపుకోవాలి. ఏ కరణాలు మేలుకొని ఉంటాయి? అంటే పనిచేస్తూ ఉంటాయి. **దేవః** – మూడవ ప్రశ్నలో ఏ కరణం స్వప్నాలను

చూస్తున్నది అని అడగకుండా ఏ దేవత చూస్తున్నది అని అడిగాడు. ప్రశ్నలోనే జవాబు ఉంది. చేతనతత్త్వం మాత్రమే చూడగలదు అని అర్థం. స్వప్నాన్ – స్వప్నాలు. బహువచనం వాడబడింది. ఎందుకంటే స్వప్నపదార్థాలు ఎన్నో. ఈ మూడు ప్రశ్నలు స్వప్నావస్థకు చెందినవి. **కస్య ఏతత్ సుఖం భవతి?** – ఇక్కడ స్వప్నం ముగిసి సుషుప్తి సుఖం వచ్చాక అని కలుపుకోవాలి.

**సుషుప్తి కాలే సకలే విలీనే తమో ఽభిభూతః సుఖరూపమేతి ॥ – కైవల్యమ్ –13**

సుషుప్తిలో సర్వం విలీనమైనప్పుడు, ఈ సుఖం ఎవరికి చెందుతుంది? నాలుగవ ప్రశ్న సుషుప్తికి చెందినది.

**కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి** – ఎందులో అన్ని లయమవుతాయి? అధిష్ఠానం ఎవరు? ఐదవ ప్రశ్న తురీయానికి సంబంధించినది.

స్వప్నం, సుషుప్తి, తురీయం ఉన్నాయి. జాగ్రదావస్థ కలుపుకుంటే, అవస్థాత్రయ వివేకం గురించిన ప్రశ్నలివి. కాకపోతే ప్రత్యేక భాషలో ఉంది. చివరి ప్రశ్న తురీయం గురించి వచ్చింది కాబట్టి, ఈ చిన్న భాగం, ఈ అధ్యాయాన్ని పరావిద్యకు చెందినదిగా చేస్తుంది.

**మంత్రం - 2**

**తస్మై స హోవాచ । యథా గార్గ్య మరీచయోఽర్కస్యాస్తం గచ్ఛతస్సర్వా ఏతస్మింస్తేజోమణ్డల ఏకీభవన్తి । తాః పునః పునరుదయతః ప్రచరన్త్యేవం హ వై తత్సర్వం పరే దేవే మనస్యేకీభవతి । తేన తర్హ్యేష పురుషో న శృణోతి న పశ్యతి న జిఘ్రతి న రసయతే న స్పృశతే నాభివదతే నాదత్తే నానన్దయతే న విసృజతే నేయాయతే స్వపితీత్యాచక్షతే ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** తస్మై – గార్గ్యునితో; స హ– పిప్పలాద; ఉవాచ – చెప్పాడు; గార్గ్య– హే గార్గ్యా; యథా – ఎలాగైతే; అర్కస్య – సూర్యుడు; అస్తం గచ్ఛతః – అస్తమిస్తున్నప్పుడు; సర్వా మరీచయః – అన్ని కిరణాలు; ఏతస్మిన్ తేజోమండలే – ఆ సూర్యమండలంలో; ఏకీభవన్తి – ఐక్యం అవుతున్నాయో; పునః – మళ్ళీ; ఉదయతః; – ఉదయిస్తున్నప్పుడు; తాః పునః ప్రచరన్తి – అవే కిరణాలు మళ్ళీ ఎలా విస్తరిస్తాయో; ఏవం హ వై – ఆ విధంగానే, తత్ సర్వమ్ – అవి అన్నీ; పరే దేవే – గొప్ప ప్రకాశవంతమైన; మనసి ఏకీభవన్తి – మనస్సులో ఐక్యమవుతాయి. తేన – కనుక; తర్హి– తర్వాత (స్వప్నకాలంలో); ఏష పురుషః – ఈ వ్యక్తి; న శృణోతి – వినడు; న పశ్యతి–చూడడు; న జిఘ్రతి – వాసన చూడడు; న రసయతే – రుచి చూడడు; న స్పృశతే– స్పర్శించడు; నాభివదతే– మాట్లాడడు;

నాదత్తే– తీసుకోదు; నానందయతే– ఆనందించదు; న విసృజతే– విసర్జించదు; నేయాయతే– కదలడు; స్వపితి – నిద్రిస్తున్నాడు; ఇతి –అని; ఆచక్షతే– చెబుతారు.

**తాత్పర్యం:** గార్గ్యునితో పిప్పలాద చెప్పాడు; 'హే గార్గ్యా, ఎలాగైతే సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు అన్ని కిరణాలు ఆ సూర్యమండలంలో ఐక్యం అవుతున్నాయో; మళ్ళీ ఉదయిస్తున్నప్పుడు అవే కిరణాలు మళ్ళీ ఎలా విస్తరిస్తాయో, ఆ విధంగానే అవి అన్నీ, గొప్ప ప్రకాశవంతమైన మనస్సులో ఐక్యమవుతాయి. కనుక తర్వాత ఈ వ్యక్తి వినడు, చూడడు, వాసనచూడడు, రుచి చూడడు. స్పర్శించడు, మాట్లాడడు, తీసుకోడు, ఆనందించడు, విసర్జించడు, కదలడు. అతను నిద్రిస్తున్నాడు అని చెబుతారు.

**వివరణ:** ఈ మంత్రంలో మొదటి ప్రశ్నకు జవాబు వస్తుంది.

1. **ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** – ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?

దానికి టూకీగా జవాబు – దశ ఇంద్రియాణి (పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు). అవి ఎక్కడ నిద్రిస్తున్నాయి? వాటి అధిష్ఠానదేవత అయిన మనస్సులో నిద్రిస్తాయి. ఇక్కడ మనకు అదనంగా ఒక విషయం తెలుస్తున్నది. అవి శాశ్వతంగా నిద్రించటం లేదు. మర్నాడు మళ్ళీ లేస్తాయి అన్న విషయం. శాశ్వతంగా నిద్రిస్తే, మనం లేవలేము. ఈ విషయం వివరించటానికి ఉపనిషత్తు ఒక అందమైన ఉదాహరణను తీసుకుంది.

సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు, కిరణాలు అప్పుడప్పుడే బయటకు వస్తాయి. అప్పుడు మనం తేజోమండలాన్ని చూడగలుగుతాము. మళ్ళీ సాయంకాలం అస్తమిస్తున్నప్పుడు సూర్యుడు నెమ్మదిగా ఆ కిరణాలను వెనక్కి తీసుకుంటాడు. అది మనకు ఎలా తెలుసు? భూమ్మీద నెమ్మదిగా చీకట్లు అలుముకుంటాయి.

అలాగే ఉదయాన్నే ఇంద్రియాలు మనస్సునుంచి బయటకొచ్చి వాటి పనులను అవి చేస్తున్నాయి. రాత్రి అయ్యేసరికి నెమ్మదిగా మనస్సులో లీనమవుతాయి. అందుకే పడుకునేటప్పుడు పుస్తకం చదువుదామనుకున్నా అక్షరాలు అలికేసినట్టుగా ఉంటాయి. ఇదీ విషయం. ఇక్కడ అస్తమిస్తున్న సూర్యుడితో మొదలయి, ఉదయిస్తున్న సూర్యుడితో ముగుస్తుంది.

**మరీచియోఽ ర్కస్యాస్తం గచ్ఛతః సర్వా ఏతస్మిన్ తేజోమణ్డల ఏకీభవన్తి** – అస్తమిస్తున్న సూర్యుని కిరణాలన్నీ తేజోమండలంలో లయమవుతాయి. మర్నాడు ఉదయించినప్పుడు తాః అవే కిరణాలు మళ్ళీ ప్రసరిస్తాయి.

**పరే దేవే మనసి ఏకీభవన్తి** – అన్నీ మనస్సులో లీనమవుతాయి. పరే దేవే అంటే పరమాత్మ అనుకోకూడదు.అది మనస్సుకు విశేషణం.మనస్సు ఎలా ప్రకాశవంతమైంది? అది

జడవస్తువు కదా! పంచభూతాలనుంచి వచ్చింది కదా! మనస్సు జడమే కాని, దాన్ని చేతన ఆత్మ, చిదాభాస, ప్రకాశవంతం చేస్తుంది.

3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** దానికి జవాబు మనసు. మనస్సు ప్రకాశవంతమైనది అన్న సూచన మనకు మొదటి ప్రశ్నలోనే వచ్చేసింది. మనస్సు జడమైనా దానికి చైతన్యాన్ని ప్రతిబింబించే లక్షణం ఉంది. దానివల్ల అది ప్రకాశవంతమై, ఇంద్రియాలను ప్రకాశింపజేస్తుంది. ఎలా తెలుసు? ఇంద్రియాల వెనుక మనస్సు లేకపోతే ఇంద్రియాలు సరిగా పనిచేయలేవు. కంటి ఎదురుగా అందమైన వస్తువున్నా మనస్సుపెట్టి చూడలేకపోతే, దాని అందాన్ని ఆస్వాదించలేము.

మనస్సులో ఇవి లీనమైనట్టు ఎలాతెలుసు? దశ ఇంద్రియాలు చేసే కార్యక్రమాలన్నీ ఆగిపోతాయి. అవి ఒక్కొక్కటీ చెప్పుకు వచ్చింది ఉపనిషత్తు. **న శృణోతి, న పశ్యతి, న జిఘ్రతి, న రసయతే, న స్పృశ్యతే** – శబ్ద, స్పర్శ, రస, రూప, గంధాలు (క్రమం మారింది) ఇచ్చే పంచజ్ఞానేంద్రియాలు చెవి, చర్మం, నాలుక, కన్ను, ముక్కు – ఇవేవీ పనిచేయవు. అలాగే **న అభివదతే, న ఆదత్తే, న ఆనన్దయతే, న విసృజతే, న ఈయాయతే**– వాక్, పాణి, పాదౌ, పాయు, ఉపస్థ (క్రమం మారింది)ల ద్వారా చేసే క్రియలు చేయడు. అంటే మాట్లాడడు, ఏమీ తీసుకోడు, నడవడు, విసర్జించడు, ఆనందించడు.

**స్వపితి ఇత్యాచక్షతే** – అటువంటి వ్యక్తిని లేచి ఉన్నవారు నిద్రపోతున్నాడు అంటారు. ఇక్కడితో మొదటి ప్రశ్న జవాబు ముగిసింది.

1. **ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** – ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?

**పరేదేవే మనస్యేకీభవన్తి** – దశ ఇంద్రియాలు (పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు) మనస్సులో నిద్రిస్తాయి.

## మంత్రం - 3

**ప్రాణాగ్నయ ఏవైతస్మిన్ పురే జాగ్రతి। గార్హపత్యో హ వా**
**ఏషో<u>ఽ</u>పానో వ్యానో<u>ఽ</u>న్వాహార్యపచనో యద్గార్హపత్యాత్ప్రణీయతే**
**ప్రణయనాదాహవనీయః ప్రాణః ॥ 3 ॥**

ప్రతిపదార్థం:– ప్రాణాగ్నయః – ప్రాణం రూపంలో ఉన్న అగ్నులు; ఏవ– మాత్రమే; ఏతస్మిన్ పురే – ఈ శరీరంలో; జాగ్రతి – మేలుకుని ఉంటాయి; గార్హపత్యో హ వా ఏష అపానః – గార్హపత్య అగ్ని అపానం; వ్యానః అన్వాహార్యపచనః – వ్యానం దక్షిణాగ్ని; యత్ గార్హపత్యాత్ ప్రణీయతే – ఇది గార్హపత్యాగ్నినుంచి పుట్టినది – ప్రణయనాత్ – గార్హపత్యాన్నినుంచి పుట్టినది కనుక; ఆహవనీయః– ఆహవనీయాగ్ని; ప్రాణః – ప్రాణం.

**తాత్పర్యం:** ప్రాణం రూపంలో ఉన్న అగ్నులు మాత్రమే ఈ శరీరంలో మేలుకుని ఉంటాయి. గార్హపత్యాగ్ని అపానం, వ్యానం అన్వాహార్య పచనాగ్ని (దక్షిణాగ్ని), గార్హపత్యాగ్నినుంచి పుట్టినది కనుక ఆహవనీయాగ్ని ప్రాణం.

**వివరణ:** 3,4 మంత్రాల్లో రెండవ ప్రశ్నకి జవాబు వస్తుంది.

2. **కాన్యస్మిన్ జాగ్రతి?** ఏవి మేలుకుని ఉంటాయి?

నిద్రపోతున్నాయి అంటే పనిచేయకపోవటం. నిర్వ్యాపారాః భవంతి. **జాగ్రతి** అంటే పనిచేస్తాయి. స వ్యాపారాః తిష్ఠంతి. టూకీగా పంచప్రాణాలు + మనస్సు అని చెపితే సరిపోయేది. కాని ఉపనిషత్తు ఒక ఊహాజనిత వర్ణనద్వారా చెబుతున్నది. వీటిని అగ్ని హోత్ర యజ్ఞంతో పోలుస్తున్నది. ఇక్కడ ఆరుఅంశాలు ఉన్నాయి. యజ్ఞం అంటే అగ్ని ఉండాలి. అగ్ని 3 రకాలు(5 రకాలు ఉన్నా, ఇక్కడ మూడే చెప్పబడ్డాయి). ఒక్కో రకమైన యజ్ఞానికి, అగ్నిని ఒక్కోరకంగా వెలిగించాలి. వేరే వేరే యజ్ఞాలకు హోమగుండం వేరే, చదివే మంత్రం వేరే ఉంటుంది. మూడురకాల అగ్నులు -

1. **గార్హపత్య అగ్నిః** - ఒక వ్యక్తికి పెళ్ళవగానే వెలిగించాల్సిన అగ్ని. అప్పుడు దాన్ని అగ్ని ఆధానం అంటారు. ఈ అగ్ని అతని జీవితకాలం వెలుగుతూనే ఉండాలి. దానితో ఆ గృహస్థు 21 రకాల యాగాలను చేయాలి. ఈ అగ్నిని రెండుసార్లు మాత్రమే తీసేయాలి. ఆ గృహస్థు సన్యాసం స్వీకరిస్తే అగ్ని ఉండదు. ఆ గృహస్థు మరణించినప్పుడు అతని శరీరాన్ని కాల్చటంతో ముగుస్తుంది. దీన్ని అంత్యేష్టి సంస్కారం అంటారు. సన్యాసిని కాల్చరు. పూర్వం అతని శరీరాన్ని నదిలో వదిలి వేసేవారు. ఈ గార్హపత్య అగ్ని నిత్యం వెలుగుతూనే ఉండాలి. మధ్యలో ఆగకూడదు. ఒకవేళ ఆగితే, ఆ అగ్ని వెలుగుతున్న ఇంకో గృహస్థు ఇంటినుంచి తెచ్చుకోవాలి. అది కూడా ప్రాయశ్చిత్తం చేసాక తెచ్చుకోవాలి.

2. **ఆహవనీయాగ్నిః**- ఇది రోజువారీ పూజలకో లేదా శ్రౌతకర్మలకో వెలిగించే అగ్ని. గార్హపత్య అగ్నినుంచి వెలిగించి, మిగిలిన అగ్నిని మళ్ళీ అందులోనే కలపాలి.

3. **దక్షిణాగ్నిః** - కొన్ని యజ్ఞాలు చేసేటప్పుడు, యజమాని కుడిచేతివైపు వెలిగిస్తారు. యజమాని తూర్పుముఖంగా కూర్చుంటే, అతని కుడిచేతివైపు అంటే దక్షిణం వైపు ఈ అగ్నిని పెడతారు కాబట్టి దీన్ని దక్షిణాగ్ని అంటారు. దీనికి ఇంకోపేరు అన్వాహార్యపచనః. అంటే ఆహుతిని అన్వాహార్యం అంటారు. దాన్ని యజ్ఞం అగ్నిలో వండుతారు (తక్కిన రెండు అగ్నుల పేర్లు సభ్య, ఆవసథ్య).

4. **హోతా** - బ్రాహ్మణుడు - జుహోతి ఇతి హోతా - ఆహుతి వేసేవాడు.

5. **యజమాని** - గృహస్థు - యజ్ఞాన్ని చేసి, ఫలితం పొందేవాడు.

6. **పుణ్యం** –తక్షణ పుణ్యం. ఈ పుణ్యఫలంవల్ల వెళ్ళే గమ్యం – స్వర్గం.
ఇప్పుడు ఈ ఆరు అంశాలను, పంచప్రాణాలు, మనస్సుతో జత కలపాలి.

| **అగ్ని** | **పంచప్రాణాలు** | **క్రియ** |
|---|---|---|
| 1.గార్హపత్య అగ్ని | అపానం | కిందకు వెళ్ళే గాలి (ఉచ్ఛ్వాస) |
| 2.ఆహవనీయాగ్ని | ప్రాణం | లోపలినుంచి బయటికి వదిలే గాలి(నిశ్వాస) |
| 3.దక్షిణాగ్ని | వ్యానం | దక్షిణద్వారంద్వారా హృదయంనుంచి వస్తుంది. |
| 4.హెూతా | సమానం | ఉచ్ఛ్వాస నిశ్వాసలనే ఆహూతులను సమానం చేస్తుంది. |
| 5.యజమాని | మనస్సు | మనస్సు చేసిన యజ్ఞంబట్టి ఉదానం ఉంటుంది. |
| 6.పుణ్యఫలం | ఉదానం | సుషుప్తి ఆనందానికి తీసుకు వెళుతుంది. |

ఇప్పుడు వీటిని వివరంగా చూద్దాము. ఈ మంత్రంలో మూడే చెప్పబడ్డాయి.

1. **అపానం** – అపానాన్ని గార్హపత్య అగ్నితో పోల్చారు. మామూలుగా అపానం పని విసర్జన క్రియ. కాని ఇక్కడ అపానం పైన ముక్కు రంధ్రంనుంచి కిందదాకా గాలి వెళ్ళేలాగా చేసేది అనే అర్థంలో తీసుకోవాలి.

2. **ప్రాణం** – దీన్ని ఆహవనీయాగ్నితో పోల్చారు. ఎందుకు? అదే అందులోని అందం. గార్హపత్య అగ్ని మొదట వెలిగించిన అగ్ని. ఆ అగ్ని గుండంలోంచి ఆహవనీయాగ్ని వెలిగిస్తారు. అలా లోపలికి పీల్చిన గాలిలోనుంచి బయటకి వదిలే గాలి ప్రాణం – అంటే నిశ్వాస.

ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ప్రాణ, అపానాలద్వారా కొనసాగుతాయని కఠోపనిషత్తులో వస్తుంది.

**ఊర్ధ్వం ప్రాణమున్నయతి అపానం ప్రత్యగస్యతి ।**
**మధ్యే వామనమాసీనం విశ్వే దేవా ఉపాసతే ॥** **– కఠ 2.2.3**

3. **వ్యానం** – దక్షిణాగ్నితో పోల్చారు. ఎందుకు? వ్యానం మధ్యభాగం అంటే హృదయంనుంచి వస్తుంది. రక్తప్రసరణ క్రియను నాడులద్వారా చేస్తుంది వ్యానం. ఇంకో ఉపనిషత్తులో హృదయంనుంచి ఐదుద్వారాలున్నాయని, వ్యానం దక్షిణ ద్వారంద్వారా వస్తుందనీ వస్తుంది.

**మంత్రం - 4**

**యదుచ్ఛ్వాసనిశ్శ్వాసావేతావాహుతీ సమం నయతీతి స సమానః। మనో హ వావ యజమానః। ఇష్టఫలమేవోదానస్స ఏనం యజమానమహరహర్బ్రహ్మ గమయతి ॥ 4 ॥**

**ప్రతిపదార్థం:** యత్– ఎలా; ఉచ్ఛ్వాసనిశ్శ్వాసౌ– ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలు; ఏతౌ – రెండూ; ఆహుతీ సమం – ఆహుతులను సమానంగా ; నయతీతి – జరిపిస్తోంది; స సమానః – సమానం; మనో హ వావ యజమానః – మనస్సే యజమాని; ఇష్టఫలమేవ ఉదానః – యజ్ఞఫలమే ఉదానం; స ఏనం యజమానం – ఈ ఉదానం మనసనే యజమానిని; అహరహః – ప్రతిరోజూ; బ్రహ్మ గమయతి – సుషుప్తి అనే బ్రహ్మలోకానికి తీసుకువెళుతుంది.

**తాత్పర్యం:** సమానం ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలనే రెండు ఆహుతులను సమానంగా జరిపిస్తుంది. మనస్సే యజమాని. యజ్ఞఫలమే ఉదానం. ఈ ఉదానం మనసనే యజమానిని సుషుప్తి అనే బ్రహ్మలోకానికి తీసుకుని వెళుతుంది.

**వివరణ:** ఈ మంత్రంలో తక్కిన మూడింటి వివరణ వస్తుంది.

4.**సమానం** (సమానవాయువు) – హోతాతో పోల్చారు. సమానం పని జీర్ణక్రియ. ఆరోగ్యాన్ని బాగా చూసేది. హోతా పని రెండు ఆహూతులను జాగ్రత్తగా సరియైన ప్రదేశంలో వేయటం.

**యదా లేలాయతే హ్యర్చిః సమిద్ధే హవ్యవాహనే।**
**తదాజ్యభాగావన్తరేణాహుతీః ప్రతిపాదయేత్॥ –ముండకమ్ 1.2.2**

జ్వలిస్తున్న అగ్నిలో జ్వాలలు ఎగసిపడినప్పుడు, రెండు పక్కల మధ్యా ఆహుతులను వేయాలి. ఇక్కడ ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలను ఆహూతులతోనూ, వాటి పనిని జాగ్రత్తగా చూసే హోతాతోనూ (సమానంతోను) పోల్చారు.

5. **మనస్సు** – యజమాని. యజమాని అన్ని పరిరకాలనీ వాడితే – మనస్సు అన్ని కరణాలనూ (దశ ఇంద్రియాలనీ) వాడుతుంది.

6.**ఉదానం** – పుణ్యఫలంతో పోల్చారు. యజ్ఞం చేస్తే కలిగే పుణ్యఫలం స్వర్గలోక ప్రాప్తి. ఇక్కడ సుషుప్తి ఆనందం. మనస్సనే యజమాని యజ్ఞం చేస్తే, ఉదానమనే పుణ్యఫలం కారణశరీరమనే బ్రహ్మలోకానికి తీసుకువెళ్తుంది. అంటే ఆనందం పొందేలా చేస్తుంది. స్వప్నలోకంనుంచి సుషుప్తికి అంటే సూక్ష్మశరీరంనుంచి కారణశరీరంలోకి తీసుకుపోతుంది.

**ప్రత్యేక విశ్లేషణ: –**

సుషుప్తిలో ఆత్మతో ఐక్యం అవుతారు అంటారు. ఎందుకు? సుషుప్తిలో అనాత్మలక్షణాలు లేవు. కాకపోతే అజ్ఞానం అలాగే ఉంది. అజ్ఞాన సహిత ఆనందం. జ్ఞానం అంటే సుషుప్తిలో మనకి తెలియకుండా పొందే ఆనందాన్ని (లేచాక కానీ హాయిగా పడుకున్నాను అనలేం) జాగ్రదా వస్థలోనే ప్రతి క్షణమూ పొందటం. సుషుప్తి ఆనందం కూడా శాశ్వతం కాదు. కాసేపయ్యాక నిద్రలేస్తే అది పోతుంది. అది ఆనందకోశం లోనిది. దాన్ని దాటి తురీయస్థితిలో పొందే ఆనందం బ్రహ్మానందం. బ్రహ్మలోకప్రాప్తి అందరికీ కలుగుతుందా? అందరూ స్వప్నంనుంచి సుషుప్తిలోకి వెళ్తారు కదా అంటే, శంకరాచార్యులు అందరికీ కాదు అంటారు. కేవలం ఉపాసకులకే కాని, అనుపాసకులకి చెప్పలేదు. ఉదాహరణకు, ఇద్దరు వ్యక్తులు కలిసి కొత్తగా ఒక గుడికి వెళితే, ఒక వ్యక్తి భక్తిగా దేవుణ్ణి కొలవవచ్చు. రెండవ వ్యక్తి ఆ గుడి శిల్పకళను, ఆ గుడి విశేషాలనూ గమనించవచ్చు.

ఇక్కడితో రెండవ ప్రశ్నకు జవాబు ముగిసింది.

2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?

**ప్రాణాగ్నయ ఏవ తస్మిన్ పురే జాగ్రతి। మనో హ వావ యజమానః॥** – పంచప్రాణాలు, మనస్సు మాత్రమే మేలుకొని ఉంటాయి.

**మంత్రం – 5**

**అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి । యద్ దృష్టం దృష్టమనుపశ్యతి శ్రుతం శ్రుతమేవార్థమనుశృణోతి। దేశదిగన్తరైశ్చ ప్రత్యనుభూతం పునః పునః ప్రత్యనుభవతి దృష్టం చాదృష్టం చ శ్రుతం చాశ్రుతం చానుభూతం చాననుభూతం చ సచ్చాసచ్చ సర్వం పశ్యతి సర్వః పశ్యతి ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** అత్రైష దేవః – ఇక్కడ ఈ మనస్సు (ప్రకాశవంతమైనది); స్వప్నే – కలలో; మహిమానమనుభవతి – మహిమను అనుభవిస్తుంది; యత్ దృష్టమ్ – తను చూసిన వాటిని; దృష్టం అనుపశ్యతి – మళ్ళీ చూస్తుంది; శ్రుతం శ్రుతమేవార్థమను శ్రుణోతి – విన్నది మళ్ళీ వింటుంది; దేశదిగన్తరైశ్చ– దేశ దేశాలలో; ప్రత్యనుభూతమ్ – అనుభవించిన ప్రతిదాన్నీ; పునఃపునః – మళ్ళీ మళ్ళీ చూస్తుంది; దృష్టం చాదృష్టం చ – చూసినవీ, చూడనివీ; శ్రుతం చాశ్రుతం చ– విన్నవీ, విననివీ; అనుభూతం చాననుభూతం చ – అనుభవించినవీ, అనుభవించనివీ; సచ్చాసచ్చ– నిజమైనవీ, నిజం కానివీ, సర్వమ్– అన్నింటినీ; పశ్యతి – చూస్తుంది; సర్వః పశ్యతి – అన్నింటినీ చూస్తుంది.

**తాత్పర్యం:** మనసనే ఈ దేవత కలలో తన మహిమను అనుభవిస్తుంది. జాగ్రదావస్థలో తను చూసిన వాటిని మళ్ళీ చూస్తుంది. విన్నది మళ్ళీ వింటుంది; దేశదేశాలలో అనుభవించిన ప్రతిదాన్నీ మళ్ళీ మళ్ళీ చూస్తుంది. చూసినవీ, చూడనివీ; విన్నవీ, విననివీ; అనుభవించినవీ, అనుభవించనివీ; నిజమైనవీ నిజం కానివీ అన్నింటినీ చూస్తుంది.

**వివరణ:** ఈ మంత్రం 3వ ప్రశ్నకు జవాబు.

3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?

**జవాబు– అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి.** ఏ దేవుడు (కరణం) కలను చూస్తున్నాడు? ప్రశ్నలోనే కేవలం కరణం చూడలేదు. దానికి చైతన్యం ఉండాలి అన్న సూచన ఉంది. ఇక్కడ మనస్సు అని చెప్పలేదు కాని ఈ దేవుడు చూస్తున్నాడు అని జవాబు. అంటే చిదాభాసతో కూడిన మనస్సు. మనస్సు మహిమాన్వితమైనది. ఎందుకంటే కలలో అన్నీ మనస్సు రూపొందించినవే. కొన్ని సినిమాలకు కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు అన్నీ ఒకరిపేరే ఉంటాయి. అలాంటి సినిమాకి ప్రేక్షకుడు కూడా అతనొక్కడే అవుతాడని పరిహాసం చేస్తారు కొందరు.

మన మనస్సు వేసే సినిమాకి కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు అన్నీ మనస్సువే, ప్రేక్షకుడు కూడా మనస్సే. వేరే ఎవరూ మన కలను చూడలేరు. త్రిపుటి మనసే. అంటే భోక్తా, భోగకరణం, భోగ్యవిషయం – మూడూ మనస్సే. చూసే మిమ్మల్ని, చూసే మీ కంటినీ, చూసే వస్తువునీ – మూడూ మనసే సృష్టిస్తుంది. జాగ్రదావస్థలో పనిచేసే ఇంద్రియాలు అప్పుడు పనిచేయవు. మనస్సు వేరే సృష్టిస్తుంది.

వేటిని సృష్టిస్తుంది? తను చూసినవీ, విన్నవీ, అనుభవించినవీ మళ్ళీ సృష్టిస్తుంది. **అనుపశ్యతి, అనుశ్రుణోతి** అనటంలో అర్థం మళ్ళీ చూస్తుంది. మళ్ళీ వింటుంది. ఎక్కడ? పలు స్థలాలలో తను అనుభవించినవాటిని. అనుభవాలంటే ఇంద్రియ అనుభవాలే కాదు, కోపం, భయంవంటి భావోద్రేకాలు కూడా.

ఒక పక్క చూసినవి అంటూ మళ్ళీ చూసినవి, చూడనివీ; విన్నవీ, విననివీ; అనుభవించినవీ, అనుభవించనివీ అంటోంది ఉపనిషత్తు. చూడనివీ, విననివీ, అనుభవించనివీ చూస్తోంది, వింటోంది, అనుభవిస్తోంది అంటే అంతకు ముందు జన్మలో చూసినవి ఉండవచ్చు. ఎందుకంటే 'అత్యంత అదృష్టే వాసనా అనుపపత్తే!'– అనుభవించక పోయుంటే వాసన అయ్యేది కాదు.

టేప్ రికార్డర్ ఎంత ప్రత్యేకమైనదైనా, అందులో మీరు రికార్డు చేయనిదాన్ని ప్లే చేయలేదు. మీరు రుద్రం విందామనుకుని పెడితే చెవులు బద్దలయ్యే పాట ఏదో

వచ్చిందంటే, మీకు తెలియకుండా ఎవరో ఆ పాటను రికార్డు చేసినట్టు అర్థం. అందుకని ఇప్పుడు చూడకపోతే గత జన్మలో చూసినట్టు లెక్క. రెండు జన్మలకీ మధ్య స్థూలశరీరం మాత్రమే భేదం.

కలలో రజ్జుసర్ప భ్రాంతి కలిగితే, కలలోనే గురువు వచ్చి ఆ భ్రమ తొలగించాలి. అలా మనస్సు **సర్వం పశ్యతి సర్వః పశ్యతి** అన్నీ చూస్తుంది.

**ప్రత్యేక విశ్లేషణ: –**

మనస్సు చూసినవే కలలోకి వస్తాయంటే ,మరి భవిష్యత్తు గురించి కల వస్తే దాని అర్థం ఏమిటి? శాస్త్రం దాన్ని కల అనదు. కల నిర్వచనం – వాసనా జనితః స్వప్నః– వాసనలనుంచి పుట్టినది కల. భవిష్యత్తు గురించి వస్తే అది సిక్త్స్‌సెన్స్‌లాంటిదేదో అనుకోవాలి.

ఈ మంత్రం మనస్సును స్తుతిస్తున్నది. సమష్టికారణశరీరంలో మాయకి ఉన్న శక్తి ఇక్కడ వ్యష్టి సూక్ష్మశరీరంలో మనస్సుకి ఉంది. మాయ ఎలా ఈ జగత్తును సృష్టిస్తుందో అలా మనస్సు స్వప్నజగత్తును సృష్టిస్తుంది. అద్వైత ఈశ్వరుడు ద్వైతప్రపంచంగా గోచరించినట్టు అద్వైతంగా జాగ్రదావస్థలో ఉన్న వ్యక్తి మనస్సు ద్వైతస్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. మామూలుగా కనబడే జగత్తంతా మిథ్య అని నిరూపించటానికి మనస్సు సృష్టించే స్వప్నాన్ని ఉదాహరణగా చెబుతుంది శాస్త్రం. ఇక్కడ మనం మనస్సు గొప్పతనాన్ని మాయతో కలిపి అర్థం చేసుకుంటున్నాము.

అందుకే మాండూక్యంలోని వైతథ్య ప్రకరణంలో స్వప్నం అంటే సర్వః పశ్యతి అనే బదులు – సర్వః సన్ పశ్యతి అని వస్తుంది. అంటే మనస్సు అన్నీ తానే అయి, అన్నిటినీ చూస్తుంది. రెండు పనులు చేస్తుంది. అందుకే **మహిమానమనుభవతి** అంటోంది ఉపనిషత్తు.

ఈ మంత్రంలో మూడవ ప్రశ్నకు జవాబు వచ్చింది. ఈ మూడు ప్రశ్నలూ స్వప్నావస్థకి చెందినవి.

3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?
**అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి –** మహిమానమైన మనస్సు చూస్తుంది.

## మంత్రం - 6

**స యదా తేజసాఽభిభూతో భవతి । అత్రైష దేవస్స్వప్నాన్న పశ్యత్యథ తదైతదస్మిఞ్ఛరీరే ఏతత్సుఖం భవతి ॥ 6 ॥**

**ప్రతిపదార్థం:** సః – అతడు; తేజసా – చైతన్యం; అభిభూతః భవతి – అధిగమించినప్పుడు; అత్ర – ఇక్కడ; ఏషః దేవః – ఈ మనస్సు; స్వప్నాన్ న పశ్యతి – ఏ కలనీ చూడదు; అథ తదా– అప్పుడు; ఏతస్మిన్ శరీరే– కారణ శరీరం; ఏతత్ సుఖం– సుషుప్తి సుఖం; భవతి – కలుగుతుంది.

**తాత్పర్యం:** బ్రహ్మచైతన్యం అధిగమించినప్పుడు, ఈ మనస్సు ఏ కలనీ చూడదు. అప్పుడు కారణశరీరం సుషుప్తి సుఖాన్ని అనుభవిస్తుంది.

**వివరణ:** ఇందులో నాలుగవ ప్రశ్నకు జవాబు వస్తుంది.

4. **కస్యైతత్సుఖం భవతి**? – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?

కారణశరీరం సుఖాన్ని అనుభవిస్తుంది. అంటే ప్రాజ్ఞ అనుభవిస్తుంది. దీన్ని వేరే విధంగా వివరించింది ఉపనిషత్తు.

**సః తేజసా అభిభూతః భవతి** – స్వప్నశాస్త్రసిద్ధాంతం ప్రకారం వాసనలు అంతఃకరణ నాడుల్లో నిక్షిప్తమై ఉంటాయి. స్వప్నంలో అవి బయటకొస్తాయి. ఈ నాడి అడ్డు తగిలినప్పుడు అవి బయటకు రావు. సః తేజసా అభిభూతః భవతికి రెండు అర్థాలు ఉన్నాయి. అవి –

1. వాసనలు నిలవ ఉన్న చిత్తానికి పిత్తం అడ్డు పడుతుంది. అందువల్ల కలలు ఆగుతాయి.
2. బ్రహ్మచైతన్యం అడ్డుపడుతుంది. సవిశేష చైతన్యాన్ని నిర్విశేషచైతన్యం అధిగమిస్తుంది.

అప్పుడు ఈ మనస్సు ఏ కలనీ చూడదు. అప్పుడు చత్వారి అంతఃకరణాని పనిచేయదు. మనస్సులో సంకల్ప వికల్పాలేమీ పొడచూపవు. బుద్ధిలో నిశ్చయాత్మక శక్తి పడుకుంటుంది, అహంకారం నిద్ర పోతుంది. చిత్తం వాసనలను బయటకి తేలేదు. అప్పుడు కరణం, కారణావస్థ అవుతుంది. మైనం బొమ్మ కరిగి మైనపు ముద్ద అయినట్టు అవుతుంది.

అప్పుడు మనస్సు ఏమవుతుంది? ద్వైతభావన పోయి, సుషుప్తి ఆనందం కలుగుతుంది. మనస్సు కూడా నిద్రిస్తుంది. కారణశరీరం ఆనందాన్ని అనుభవిస్తుందంటే, కేవలం కారణశరీరం కాదు. అది కూడా జడమే, కేవలం అంతఃకరణంలాగా. ఇక్కడ చైతన్యవ్యాప్తకారణశరీరం లేదా ప్రాజ్ఞః అనుభవిస్తుంది. ఈ మంత్రంలో నాలుగవ ప్రశ్నకు జవాబు వస్తుంది. ఈ ప్రశ్న సుషుప్తికి సంబంధించినది.

4. **కస్యైతత్సుఖం భవతి**? – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?

**ఏతస్మిన్ శరీరే ఏతత్సుఖం భవతి–** కారణశరీరం లేదా ప్రాజ్ఞ సుఖాన్ని అనుభవిస్తుంది.

**మంత్రం - 7**

**స యథా సోమ్య వయాంసి వాసోవృక్షం సమ్ప్రతిష్ఠన్తే। ఏవం హ వై తత్సర్వం పర ఆత్మని సమ్ప్రతిష్ఠతే ॥ 7 ॥**

**ప్రతిపదార్థం:** సః – అది; సోమ్య– సౌమ్యుడా; వయాంసి – పక్షులు; యథా– ఎలా; వాసోవృక్షం – తాము నివసిస్తున్న వృక్షాన్ని; సంప్రతిష్ఠన్తే– చేరుకుంటాయో; ఏవం హ వై– ఆ విధంగా; తత్ సర్వం – అవి అన్నీ; పర ఆత్మని – పరమాత్మలో (తురీయంలో) సంప్రతిష్ఠతే – లయమవుతాయి.

**తాత్పర్యం:** ఓ సౌమ్యుడా! పక్షులు ఎలా తాము నివసిస్తున్న వృక్షాన్ని సాయంకాలం చేరుకుంటాయో, అలా అవి అన్నీ పరమాత్మలో లయమవుతాయి.

**వివరణ:** ఈ మంత్రంనుంచి 5వ ప్రశ్నకు జవాబు మొదలవుతుంది.

5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?

**సర్వం పర ఆత్మని సంప్రతిష్ఠతే** – ఒక్క ముక్కలో చెప్పాలంటే అన్నీ పరమాత్మలో లయమవుతాయి. అవి అన్నీ ఏమిటో, ఆ పరమాత్మ అంటే ఏమిటో తరువాత రెండు మంత్రాల్లోనూ వివరంగా వస్తుంది. ఈ మంత్రంలో ఉపనిషత్తు ఒక దృష్టాంతం ఇస్తున్నది. ఎలా పక్షులు తాము నివాసం ఉన్న గూడు చేరుకుంటాయో, అలా అన్నీ పరమాత్మలో లయమవుతాయి. పక్షులు సాయంకాలం చేరుకుంటాయి, ఇక్కడ అన్నీ **పర ఆత్మని సంప్రతిష్ఠతే**– అంటే తురీయంలో లయమవుతాయి.

**సర్వమ్** – దృష్టాంతంలో కొంత మేరకే తీసుకోవాలి. ఒక చెట్టుమీదికి కొన్ని పక్షులే వచ్చి చేరతాయి. కాని పర ఆత్మను సంప్రతిష్ఠతే అన్నప్పుడు అన్నీ పరం బ్రహ్మలో, వాటి అధిష్ఠానంలో, లయమవుతాయి. దేశ, కాలాలు కూడా లయమవుతాయి. మొత్తం సృష్టి అన్నమాట.

**మాయాకల్పితదేశకాలకలనావైచిత్ర్యచిత్రీకృతమ్**

ఈ విషయాన్ని ఉపనిషత్తు ఇంకో రకంగా చెబుతున్నది. సృష్టి మొత్తాన్ని త్రిపుటిలో వర్ణిస్తోంది.

భోక్త, భోగకరణం, భోగ్యవిషయం – తెలుసుకునే వ్యక్తి, వాడే పరికరం, చూసే వస్తువు

ఈ పరంబ్రహ్మ – ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయ వికల్పః

కర్తృ, కర్మ, కరణ వికల్పః

ద్రష్టు, దర్శన, దృశ్య వికల్పః

శ్రోతృ, శ్రవణ, శ్రావ్య వికల్పః

రాబోయే రెండు మంత్రాలలో ఈ వివరాలు వస్తాయి.

**మంత్రం - 8**

**పృథివీ చ పృథివీమాత్రా చాపశ్చాపోమాత్రా చ తేజశ్చ తేజోమాత్రా చ వాయుశ్చ వాయుమాత్రా చాకాశశ్చాకాశమాత్రా చ చక్షుశ్చ ద్రష్టవ్యం చ శ్రోత్రం చ శ్రోతవ్యం చ ఘ్రాణం చ ఘ్రాతవ్యం చ రసశ్చ రసయితవ్యం చ త్వక్చ స్పర్శయితవ్యం చ వాక్చ వక్తవ్యం చ హస్తౌ చాదాతవ్యం చోపస్థశ్చానన్దయితవ్యం చ పాయుశ్చ విసర్జయితవ్యం చ పాదౌ చ గన్తవ్యం చ మనశ్చ మన్తవ్యం చ బుద్ధిశ్చ బోద్ధవ్యం చాహంకారశ్చాహంకర్తవ్యం చ చిత్తం చ చేతయితవ్యం చ తేజశ్చ విద్యోతయితవ్యం చ ప్రాణశ్చ విధారయితవ్యం చ ॥ 8 ॥**

**ప్రతిపదార్థం:** పృథివీ చ పృథివీమాత్రా చ – భూమి, భూమి తన్మాత్ర; ఆపశ్చ ఆపోమాత్రా చ– నీరు, నీటి తన్మాత్ర; తేజశ్చ తేజోమాత్రా చ– అగ్ని, అగ్ని తన్మాత్రా; వాయుశ్చ వాయుమాత్రా చ– వాయువు, వాయు తన్మాత్ర ; ఆకాశ్చ ఆకాశమాత్రా చ– ఆకాశం, ఆకాశ తన్మాత్ర; చక్షుశ్చ ద్రష్టవ్యం చ – కన్ను, కంటితో చూసే రూపం; శ్రోత్రం చ శ్రోతవ్యం చ – చెవి, చెవితో వినే శబ్దం; ఘ్రాణం చ ఘ్రాతవ్యం చ – ముక్కు, ముక్కుతో పీల్చే వాసన; రసశ్చ రసయితవ్యం చ – నోరు, నోటితో పొందే రుచి; త్వక్చ స్పర్శయితవ్యం చ – చర్మం, చర్మంతో కలిగే స్పర్శ; వాక్ చ వక్తవ్యం చ – నోరు, నోటితో మాట్లాడబడేది; హస్తౌ చాదాతవ్యం చ – చేతులు, చేతులతో తీసుకోబడేది; ఉపస్థ ఆనందయితవ్యం చ – జననేంద్రియం, దానితో ఆనందించబడేది; పాయుశ్చ విసర్జయితవ్యం చ – విసర్జేంద్రియం, విసర్జించబడేది; పాదౌ చ గన్తవ్యం చ – పాదాలు, పాదాలతో వెళ్ళగలిగేది; మనశ్చ మన్తవ్యం చ– మనస్సు, మనస్సుతో ఆలోచించబడేది; బుద్ధిశ్చ బోద్ధవ్యం చ – బుద్ధి, బుద్ధితో తెలుసుకోబడేది; అహంకారశ్చాహంకర్తవ్యం చ – నేను అనే స్ఫురణ, నేనుగా తెలుసుకోబడేది; చిత్తం చ చేతయితవ్యం చ – చిత్తం (జ్ఞాపకం), చిత్తంలో గుర్తుంచుకోబడేది; తేజశ్చ విద్యోతయితవ్యం చ – కాంతి, కాంతితో ప్రకాశింపబడేది; ప్రాణశ్చ విధారయితవ్యం చ – ప్రాణమూ, ప్రాణంతో ముడివడి ఉన్నవీ.

**తాత్పర్యం:** పృథివి, పృథివి తన్మాత్ర; నీరు, నీటి తన్మాత్ర; అగ్ని, అగ్ని తన్మాత్ర; వాయువు, వాయు తన్మాత్ర; ఆకాశం, ఆకాశ తన్మాత్ర (పంచస్థూల, సూక్ష్మభూతాలు); కన్ను, కంటితో చూసే రూపం; చెవి, చెవితో వినే శబ్దం; ముక్కు, ముక్కుతో పీల్చే వాసన; నోరు, నోటితో పొందే రుచి; చర్మం, చర్మంతో కలిగే స్పర్శ; (పంచ జ్ఞానేంద్రియాలు); నోరు, నోటితో మాట్లాడబడేది; చేతులు, చేతులతో తీసుకోబడేది; జననేంద్రియం, దానితో ఆనందించబడేది; విసర్జేంద్రియం, దానితో విసర్జింపబడేది; పాదాలు, పాదాలతో

వెళ్ళగలిగేది; మనస్సు, మనస్సుతో ఆలోచించబడేది; బుద్ధి, బుద్ధితో తెలుసుకోబడేది; నేను అనే స్ఫురణ, నేనుగా తెలుసుకోబడేది; చిత్తం, (జ్ఞాపకం) చిత్తంలో గుర్తుంచుకోబడేది (నాలుగు అంతఃకరణాలు); కాంతి, కాంతిచే ప్రకాశింపబడేది; ప్రాణమూ, ప్రాణంతో ముడిపడి ఉన్నవీ (పంచప్రాణాలు) అన్నీ పరం బ్రహ్మలో లయమవుతున్నాయి.

**వివరణ:** ఇంత పెద్ద పట్టిక చదివింది ఉపనిషత్తు. చాలా? అది ఉపనిషత్తు పద్ధతి. టూకీగా –

స్థూలపంచభూతాలూ, వాటి తన్మాత్రలూ (సూక్ష్మపంచభూతాలూ)
పంచజ్ఞానేంద్రియాలూ, తద్ విషయాలూ
పంచకర్మేంద్రియాలూ, తద్ విషయాలూ
చత్వారి అంతఃకరణాలూ, తద్ విషయాలూ
పంచప్రాణాలూ, తద్ విషయాలూ

అంటే చాలు. కాని ఉపనిషత్తుకు విడమరచి, మళ్ళీ మళ్ళీ చెప్పటం అలవాటు. అది కేవలం ఉత్తమ అధికారినే దృష్టిలో పెట్టుకోదు. మంద, మధ్యమ, అధికారుల గురించి కూడా తాపత్రయపడుతుంది. ఈ విధంగా చూస్తే సూక్ష్మశరీరంలో ఉన్న పంచభూతాలూ, పంచజ్ఞానేంద్రియాలూ, పంచకర్మేంద్రియాలూ, పంచప్రాణాలూ, చత్వారీ అంత:కరణాలు తురీయంలో లయమవుతాయని తెలుస్తుంది.

త్రిపుటి పరంగా చూస్తే భోక్త, భోగకరణం, భోగ్యవిషయం – మూడూ లయమవుతాయి. ఈ మంత్రం భోక్తను పక్కన పెట్టి భోగకరణం, దానితో చూసే భోగ్యవిషయం లయమవటం చెబుతున్నది.

**పంచభూతాలు** – పంచభూతాలూ, వాటి తన్మాత్రలూ లయమవుతాయి అంటుంది. తన్మాత్రలు అంటే ఏమిటి? అవి సూక్ష్మపంచభూతాలు. అంటే సూక్ష్మపృథివి తీసుకుంటే అందులో పృథివి మాత్రమే ఉంటుంది. అలాగే తక్కిన తన్మాత్రలు. కాని స్థూలపంచభూతాల దగ్గరకొచ్చేసరికి అవి పంచీకరణం చెందుతాయి. అంటే ఉదాహరణకు స్థూలపృథివి తీసుకుంటే, అందులో 1/2 సూక్ష్మపృథివి + 1/2 తక్కిన నాలుగు సూక్ష్మభూతాలూ కలిపి ఉంటాయి. అంటే తక్కిన నాలుగూ ఒక్కొక్కటీ 1/8 పాళ్ళలోనూ, పృథివి 1/2 పాళ్ళలోనూ ఉంటుంది.

అలాగే నీరు,అగ్ని, వాయువు, ఆకాశం. అంటే స్థూల భూతంలో ఐదూ వుంటాయన్నమాట. ఇప్పుడు తురీయంలో పృథివి తన్మాత్ర; ఆపః తన్మాత్ర; తేజః తన్మాత్ర; వాయుః తన్మాత్ర; ఆకాశః తన్మాత్ర – అంటే స్థూల, సూక్ష్మభూతాలు అన్నీ లయమయిపోతాయి. **సర్వం పర ఆత్మని సంప్రతిష్ఠతే** అని ముందు మంత్రంలోంచి ఇక్కడ

కలుపుకోవాలి. అన్నీ ఆత్మతో ముడిపడి ఉన్నాయి. ఇంక మిగిలింది ఒక్కటే. అది భోక్త. తరువాత మంత్రంలో వస్తుంది.

**మంత్రం - 9**

**ఏష హి ద్రష్టా స్ప్రష్టా శ్రోతా ఘ్రాతా రసయితా మన్తా బోద్ధా కర్తా విజ్ఞానాత్మా పురుషః। స పరేఽక్షర ఆత్మని సమ్ప్రతిష్ఠతే ॥ 9 ॥**

**ప్రతిపదార్థం:** ద్రష్టా- చూసేది; స్ప్రష్టా - స్పర్శించేది; శ్రోతా- వినేది; ఘ్రాతా- వాసన చూసేది; రసయితా - రుచి చూసేది; మన్తా-ఆలోచించేది; బోద్ధా - తెలుసుకునేది; (నాలుగు అంతః కరణాలద్వారా వ్యవహరించేది); కర్తా- కర్త; (పంచకర్మేంద్రియాలద్వారా వ్యవహరించేది); ఏష హి - ఈ; విజ్ఞానాత్మా పురుషః- జీవాత్మ; సః - అది; పరే ఆత్మని- పర ఆత్మలో; అక్షరే- అక్షర బ్రహ్మ; సంప్రతిష్ఠతే- ఐక్యం చెందుతుంది.

**తాత్పర్యం:** ద్రష్టా, స్ప్రష్టా, శ్రోతా, ఘ్రాతా, రసయితా (పంచజ్ఞానేంద్రియాల ద్వారా వ్యవహరించేది); మంతా, బోద్ధా (నాలుగు అంతఃకరణాలద్వారా వ్యవహరించేది); కర్తా (పంచకర్మేంద్రియాలద్వారా వ్యవహరించేది) ఈ విజ్ఞానాత్మ (జీవాత్మ). అది తన కరణాలు, భోగ్యవిషయాలతో సహా పర ఆత్మలో అంటే అక్షరబ్రహ్మలో ఐక్యం చెందుతుంది.

**వివరణ:** ఈ మంత్రం భోక్తను నిర్వచిస్తున్నది. ముందు మంత్రంలో భోగకరణాలు, దాని ద్వారా చూసే భోగ్యవస్తువులను నిర్వచించింది. ఇప్పుడు జీవాత్మ నిర్వచనం. ఇక్కడ పురుషః అంటే జీవాత్మ, పరమాత్మ కాదు. ఎలా తెలుసు? సందర్భాన్నిబట్టి తెలుసుకోవాలి. తర్వాత పదంలో - **పురుషః స పరే అక్షరే ఆత్మని సంప్రతిష్ఠతే** - అని వస్తుంది. పురుషః అంటే పరమాత్మ అనుకుంటే పరమాత్మ, పరమాత్మలో ఐక్యం అవలేదు కదా. అందుకని జీవాత్మ. ఈ జీవాత్మ -

**ద్రష్టా, స్ప్రష్టా, శ్రోతా, ఘ్రాతా, రసయితా - పంచజ్ఞానేంద్రియాలద్వారా**

**మన్తా, బోద్ధా - నాలుగు అంతకరణాలద్వారా**

**కర్తా - పంచ కర్మేంద్రియాలద్వారా వ్యవహరిస్తుంది.**

ఇది విజ్ఞానాత్మ. జీవాత్మ పేరు వాడరు. విజ్ఞానాత్మ అంటారు. జీవాత్మవల్లే ఈ కరణాలు భోగ్యవిషయాలని చూస్తాయి. ఈ మూడు ఎందులో ఐక్యం కావాలి? అవి వేటిలో ఐక్యమవుతాయో, దానిని అధిష్ఠానం అంటారు. ఆ అధిష్ఠానం భోక్తృ భోగ్య భోగ విలక్షణంగా ఉంటుంది. అటువంటి అధిష్ఠానం ఏమిటో దానిలో అన్నీ లయమవుతాయి. అది **పరే అక్షర ఆత్మ.**

పరమాత్మని అక్షర ఆత్మ అని ఎందుకన్నారు? – సత్యం, జ్ఞానం, అనంతం ఆత్మ అనవచ్చు కదా? ఎందుకంటే ప్రశ్నోపనిషత్తు ముండకోపనిషత్తుకు వ్యాఖ్యానం. అందులో పరమాత్మని అక్షర ఆత్మ అన్నారు. అందుకని అదే పదం వాడటం జరిగింది.

దీనితో 5వ ప్రశ్నకు జవాబు ముగిసింది. 7,8,9 మంత్రాల్లో దీనికి జవాబు ఇవ్వటమైంది.

5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?

**సర్వం పరే ఆత్మని సంప్రతిష్ఠతే** – అన్నీ పర అక్షర ఆత్మలో లయమవుతాయి. అన్నీ అంటే భోక్తా, భోగకరణం, భోగ్యవిషయం.

**ప్రత్యేక విశ్లేషణ:-**

భోక్తా, భోగకరణం, భోగ్యవిషయం – మూడూ లయమయిపోతే, బ్రహ్మ గురించి ఎలా తెలుసుకుంటాము? భోక్తా (తెలుసుకునే వ్యక్తి) లేకపోతే ఎలా తెలుసుకుంటాము? తెలుసుకోలేము.అద్దంలో కళ్ళు మూసుకుని మిమ్మల్ని మీరు చూడలేరు. తెరిస్తే మూసిన కళ్ళతో ఎలా ఉంటారో చూడలేరు.అలాగే త్రిపుటియొక్క అధిష్ఠానం గురించి మనిషి చెప్పలేడు. చెప్పాలంటే ద్రష్ట అవాలి. మళ్ళీ చూసే కన్ను, చూడబడే వస్తువు రావాలి. అందుకని నిర్వికల్పబ్రహ్మను మనం తెలుసుకోలేము. మూసిన కళ్ళతో ఎలా ఉంటామో, ఎవరో ఎలా చెప్పాలో, అలా అధిష్ఠానం ఎలా ఉంటుందో శ్రుతి చెప్పాలి. తెలుసుకునే నేనును లయం చేస్తే శుద్ధచైతన్యరూపం ఉంటుంది.శుద్ధచైతన్యరూపంలో ఎలా ఉంటాను అని అడగకూడదు. మళ్ళీ ప్రయత్నిస్తే మళ్ళీ భోక్తా అవుతాము. తెలుసుకునే వస్తువు సవికల్పబ్రహ్మ అవుతుంది. నిర్వికల్పబ్రహ్మ తెలుసుకునే వస్తువు కాదు, తెలుసుకోగోరే నేను.

బ్రహ్మ గురించి తెలుసుకోలేమని తెలుసుకోవటమే బ్రహ్మజ్ఞానం.

**అనుభవించే నేనే ఎప్పటికీ బ్రహ్మను, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

**మంత్రం - 10**

**పరమేవాక్షరం ప్రతిపద్యతే స యో హ వై**
**తదచ్ఛాయమశరీరమలోహితం శుభ్రమక్షరం వేదయతే యస్తు సోమ్య। స**
**సర్వజ్ఞస్సర్వో భవతి తదేష శ్లోకః ॥10॥**

ప్రతిపదార్థం:- సోమ్య – హే సౌమ్యుడా; అచ్ఛాయమ్ – నీడలేని(కారణంశరీరం లేని); అశరీరమ్ – శరీరం లేని(సూక్ష్మశరీరం లేని); అలోహితమ్ – రంగులేని (స్థూలశరీరం లేని); శుభ్రమ్– శుద్ధం; సః పరమేవ అక్షరమ్ – పరం అక్షరంబ్రహ్మ; యః హ వై –

ఎవరు; వేదయతే – తెలుసుకుంటారో; సః ఏవ– అతను మాత్రమే; ప్రతిపద్యతే – పొందుతాడు; సః సర్వజ్ఞః – అతడు సర్వమూ తెలిసినవాడు అవుతాడు; సర్వో భవతి– సమస్తమూ అవుతాడు; తదేష శ్లోకః – దాని గురించి ఈ శ్లోకం ఉంది.

**తాత్పర్యం:** హే సౌమ్యుడా, కారణశరీరం లేని, సూక్ష్మశరీరం లేని, స్థూలశరీరం లేని, పరం, అక్షరం బ్రహ్మను ఎవరు తెలుసుకుంటారో, అతను మాత్రమే పొందుతాడు. అతను సర్వమూ తెలిసినవాడు అవుతాడు, సమస్తమూ తానే అవుతాడు.దాని గురించి ఈ శ్లోకం ఉంది.

**వివరణ:** ఈ మంత్రంలో ఫలశ్రుతి. **బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి.** బ్రహ్మను తెలుసుకున్నవాడు తానే బ్రహ్మ అవుతాడు. అవుతాడు అంటే అర్థం తాను బ్రహ్మ అని గ్రహిస్తాడు. అంటే బ్రహ్మ ఏదో సాధ్యవస్తువు గాదు. సిద్ధవస్తువు అని గ్రహిస్తాడు.

**పరమేవాక్షరం** – పరమేవ అక్షరం అని ఎందుకు? అక్షరం బ్రహ్మ అనచ్చు కదా? అక్షరానికి ఇంకో అర్థం కూడా ఉంది. అక్షరం అంటే ఓంకారం అని కూడా అర్థం వస్తుంది. పరం అంటే బ్రహ్మ. ఓంకారం అపరం అక్షరం. ఈ బ్రహ్మ ఎటువంటి అక్షరం? నిర్వచనం వస్తుంది తక్కిన పదాలలో అచ్ఛాయమ్, అశరీరమ్, అలోహితమ్, శుభ్రమ్.
**అచ్ఛాయమ్** – ఛాయలేనిది. మాయ, అజ్ఞానం, అవిద్య, కారణశరీరం, ఇవన్నీ ఛాయకు పర్యాయపదాలు. మాయ అంటే సమష్టి కారణశరీరం. తురీయం మాయతో కలిస్తే వ్యష్టి స్థూలశరీరంలో విశ్వగా, సూక్ష్మశరీరంలో తైజసగా, కారణశరీరంలో ప్రాజ్ఞగా విరాజిల్లుతుంది.

ఛాయ అనే పదం 3వ అధ్యాయంలో సృష్టికారణం గురించి చెప్పేటప్పుడు వచ్చింది. **ఆత్మన ఏష ప్రాణో జాయతే యథైషా పురుషే ఛాయా** – పురుషునివల్ల ఏర్పడిన నీడలాగా ప్రాణం ఆత్మనుంచి ఉద్భవించింది.

### సత్ అసద్భ్యాం అనిర్వచనీయం మిథ్యా

సత్, అసత్‌కంటే అనిర్వచనీయమైనది మిథ్య అంటారు. నీడని కూడా లేదనీ అనలేము, కనిపిస్తోంది కాబట్టి. ఉందనీ అనలేము, దానికి ఉనికి విడిగా లేదు కాబట్టి. నీడలో ఏం ఉంది అంటే వెలుతురు లేదు అంటాం. అనుభవం బట్టి చూస్తే, నీడ సత్, విచారణ చేస్తే అసత్. అనుభవానికి అందీ, తర్కానికి అందకపోతే దాన్ని అనిర్వచనీయం (నిర్వచించలేనిది) అంటాము. ఈ కోవకి చెందినవే స్వప్నం, రజ్జుసర్ప భ్రాంతి, మాయ.

ఛాయను మాయ అని ఎందుకు అంటారు? ఛాయావత్ మిథ్యా స్వరూపం ఇత్యర్థః అచ్ఛాయం అంటే అమాయం. అంటే బ్రహ్మ కారణశరీరం లేనిది అని అర్థం.
**అశరీరమ్** – సూక్ష్మశరీరం లేనిది.

**అలోహితమ్** – వాచ్యార్థం తీసుకుంటే లోహితం అంటే ఎరుపు రంగు. అలోహితం అంటే ఎరుపు లేనిది. అంటే ఇక్కడ అర్థం రంగులు లేనిది అంటే అవర్ణం. స్థూలశరీరాన్ని వర్ణించేటప్పుడు తెలుపు, నలుపు, గోధుమ వర్ణం అంటూ చెబుతాము. అందువల్ల అలోహితం అంటే స్థూలశరీరం లేనిది.

బ్రహ్మ అంటే స్థూల, సూక్ష్మ, కారణశరీరాలకు వ్యతిరిక్తమైనది.

**శుభ్రమ్**– ఈ మూడు శరీరాలు లేనిది కాబట్టి శుద్ధం. ఎందుకు? అశుద్ధి ఈ మూడు శరీరాలకు చెందింది. స్థూలశరీరానికి శారీరక అశుద్ధి, సూక్ష్మశరీరానికి మానసిక అశుద్ధి. కారణశరీరానికి అజ్ఞాన అశుద్ధి. అజ్ఞానం కూడా అశుద్ధిలోనికి వస్తుంది.

**అక్షరమ్**– శుభ్రమ్ వరకూ వ్యష్టిస్థాయిలో నిర్వచనం. అంటే తురీయం. అక్షరం సమష్టిలో కలుపుతుంది. ఈ ప్రత్యగాత్మే ఆ పరమాత్మ. జీవాత్మనుంచి మూడు శరీరాలు వేరుచేస్తే జీవపోయి ఆత్మ మిగులుతుంది. అది పరమాత్మ అవుతుంది. విశేషణ ఆత్మ = జీవాత్మ, జీవాత్మ –విశేషణం = ఆత్మ, ఈ విశేషణం మూడు శరీరాలవల్ల ఏర్పడింది. ఇవి తీసేస్తే వచ్చే విశేషణ రహిత శుద్ధచైతన్యమే పరమాత్మ. ఇది ఎవరు తెలుసుకుంటారో, అతను అన్నీ తెలుసుకున్నవాడవుతాడు. తానే అన్నీ అవుతాడు. ఎందుకు? నేను బ్రహ్మను – బ్రహ్మ సర్వవ్యాపకం అంటే ఏమవుతుంది? నేను సర్వవ్యాపకం. ఇది ఫలశ్రుతి. ఇది బ్రాహ్మణోపనిషత్తు కాబట్టి, దీనికి అనుగుణంగా ఉన్న మంత్రాన్ని చెబుతున్నది.

**ప్రత్యేక విశ్లేషణ:–**

మూడు శరీరాలను తీసేస్తే అనేదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మోక్షం గురించి కొన్ని అపోహలున్నాయి. మరణం తర్వాత మోక్షం అనుకుంటారు. లేదా ఎప్పుడూ నిర్వికల్ప సమాధిలో కూర్చోవాలి అనుకుంటారు. సమాధిలో శూన్యత ఏర్పడుతుంది. శూన్యం బ్రహ్మ కాదు. శూన్యం అవతల ఏకాకృతిగా వెలిగేది బ్రహ్మ. ఈ భావనను పోతన పద్యం ఆధారంగా తీసుకుని చక్కగా విశ్లేషించారు పరిపూర్ణానంద స్వామి.

**లోకంబులు లోకేశులు**
**లోకస్థులుc దెగినcదుది నలోకం బగుపెం**
**జీcకటి కవ్వల నెవ్వం**
**దేకాకృతి వెలుcగు నతని నే సేవింతున్**

| | | |
|---|---|---|
| లోకంబులు | – | ఇంద్రియాలు చూసే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల జగత్తులు |
| లోకేశులు | – | ఆ ఇంద్రియాలకు అధిష్ఠానదేవతలు |
| లోకస్థులు | – | శరీరాలకు యజమానులు (విశ్వ, తైజస, ప్రాజ్ఞులు) |

| | | |
|---|---|---|
| తెగిన తుది నలోకంబగు | - | ఈ శరీరాలు తెగి అలోకం అయి |
| పెంజీకటి | - | అజ్ఞానం |
| అవ్వలనెవ్వండు | - | అవతల ఎవరు |
| ఏకాకృతి వెలుగు | - | ఏకైక పరంజ్యోతిగా వెలుగు చుండునో |
| నతని నే సేవింతున్ | - | ఆ పరమాత్మను నేను శరణు జొచ్చుదును |

అలా శరీరాన్ని అనుభవిస్తూ, శరీరం లేదని, శరీరం మిథ్య అనీ తెలుసుకోవాలి. పరిమితుల్లో ఉంటూ, పరిమితి లేదు అని తెలుసుకోవాలి. శరీరం నేను కాదని గుర్తిస్తే అక్షరాత్మ అవుతున్నాను. సర్వమూ తానవాలంటే అల్పత్వాన్ని విడిచిపోవాలి. యః సర్వత్యాగే సర్వోభవతి. నిద్రలో ఆనందం పొందాలంటేనే వీటన్నింటినీ వదలాలి. జీవితంలో ఆనందం పొందాలంటే ఏం చేయాలి? ఆనందం అవస్థ కాకూడదు. ఆనందం స్వరూపం అవ్వాలి. వీటన్నింటినీ వదలటం కాదు. ఇవన్నీ లేవని గుర్తిస్తే చాలు. మట్టి గురించి తెలుసుకోవటానికి కుండని పగులకొట్టనక్కరలేదు. మట్టి కుండ అని తెలుసుకుంటే చాలు.

**మంత్రం -11**

**విజ్ఞానాత్మా సహ దేవైశ్చ సర్వైః ప్రాణా భూతాని సమ్ప్రతిష్ఠన్తి యత్ర।**
**తదక్షరం వేదయతే యస్తు సోమ్య స సర్వజ్ఞస్సర్వమేవావివేశేతి।11।**

**ప్రతిపదార్థం:** విజ్ఞానాత్మా – జీవాత్మ; సర్వైః దేవైశ్చ సహ – దశ ఇంద్రియాలతో పాటు; ప్రాణాః– పంచప్రాణాలు; భూతాని – పంచభూతాలు; యత్ర– ఎందులో; సంప్రతిష్ఠన్తి– లీనమవుతాయో; తదక్షరం యస్తు వేదయతే– అది అక్షరంబ్రహ్మ అని తెలుసుకున్నవాడు; సః సర్వజ్ఞ భవతి – అతను సర్వజ్ఞుడు అవుతాడు; సర్వమేవ అవివేశ– సర్వవ్యాపకం చెందుతాడు; ఇతి – అని.

**తాత్పర్యం**: జీవాత్మ , దశ ఇంద్రియాలు, పంచప్రాణాలు, పంచభూతాలతో పాటు ఎందులో లీనమవుతాయో అది అక్షరం బ్రహ్మ అని తెలుసుకున్నవాడు, సర్వజ్ఞుడు అవుతాడు. సర్వవ్యాపకం చెందుతాడు.

**వివరణ:** ముందు మంత్రం అర్థమే మళ్ళీ ఇందులోనూ ఉంది. కాకపోతే ఇంకో ఉపనిషత్తునుంచి. అక్షరం బ్రహ్మను తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడు అవుతాడు. ఎలా తెలుసుకున్నవాడు? అక్షరమ్ ఆత్మత్వేన వేద – ఇది చాలా ముఖ్యం. ఆ అక్షరం బ్రహ్మను నేను అని అర్థం చేసుకుంటే, నిత్యముక్తుడనవుతాను. లేదా సంసారిగానే మిగిలిపోతాను.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥ - కైవల్యం-19**

**సర్వమేవ ఆవివేశ** – అన్నిట్లో ప్రవేశిస్తాడు. అంటే బ్రహ్మలో సర్వవ్యాపకం చెందుతాడు. శరీరత్రయవ్యతిరిక్త చైతన్యంగా మిగులుతాడు. ఈ అక్షరంబ్రహ్మ గురించిన నిర్వచనం మొదటి రెండు పాదాల్లో వస్తుంది. **విజ్ఞానాత్మా** – జీవాత్మ అని చూసాము. **సర్వైః దేవైశ్చ సహ** – దేవతలు అంటే దశ ఇంద్రియాలు, పంచప్రాణాలు, పంచ భూతాలు. అవి జీవాత్మతో ఎందులో ఐక్యమవుతాయో అదే అక్షరబ్రహ్మ. ఆవివేశ, నెమ్మదిగా వెళతాడు అనుకుంటే తప్పు. పరిమితి భావన వదులుకోవటమే సర్వవ్యాపకం చెందటం. ఇది జ్ఞానం. ఫలశ్రుతి కూడా అయిపోయింది.

**ఫలం** – ఇవి తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడు అవుతాడు. సమస్తమూ తానే అవుతాడు.

## అధ్యాయం - 4 టూకీగా

సౌర్యాయణీ గార్గ్యః అవస్థాత్రయం గురించి 5 ప్రశ్నలు అడిగాడు.

**1. ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?

**పరేదేవే మనస్యేకీభవన్తి** – దశ ఇంద్రియాలు (పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు) మనస్సులో నిద్రిస్తాయి.

2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?

**ప్రాణాగ్నయ ఏవ తస్మిన్ పురే జాగ్రతి। మనో హ వావ యజమానః॥** – పంచప్రాణాలు, మనస్సు మాత్రమే మేలుకొని ఉంటాయి.

3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?

**అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి** – మహిమానమైన మనస్సు చూస్తుంది.

4. **కస్యైతత్సుఖం భవతి?** – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?

**ఏతస్మిన్ శరీరే ఏతత్సుఖం భవతి.** కారణశరీరం లేదా ప్రాజ్ఞ సుఖాన్ని అనుభవిస్తుంది.

5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?

**సర్వం పరే ఆత్మని సంప్రతిష్ఠతే** – అన్నీ పర అక్షర ఆత్మలో లయమవుతాయి. అన్నీ అంటే భోక్తా, భోగకరణం, భోగ్యవిషయం.

**ఫలం** – ఇవి తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడు అవుతాడు. సమస్తమూ తానే అవుతాడు.

**ప్రత్యేక విషయం:–**

జీవాత్మ నిర్వచనం –విజ్ఞానాత్మా, ద్రష్టా, స్ప్రష్టా, శ్రోతా, ఘ్రాతా,
రసయితా – పంచజ్ఞానేంద్రియాలద్వారా
మన్తా, బోద్ధా – నాలుగు అంతఃకరణాలద్వారా
కర్తా – పంచకర్మేంద్రియాలద్వారా వ్యవహరించేది
పరమాత్మ – అక్షరం బ్రహ్మ

బ్రహ్మ నిర్వచనం –అచ్ఛాయమ్, అశరీరమ్, అలోహితమ్,– శరీర త్రయ వ్యతిరిక్తం. శరీర వ్యతిరిక్తం కాబట్టి. విజ్ఞానాత్మా, దేవైశ్చ, ప్రాణాభూతాని – జీవాత్మ దశ ఇంద్రియాలకి, పంచభూతాలకి, పంచప్రాణాలకి అధిష్ఠానం

| | **కరణం** | **భోగ్యవస్తువు** | **భోక్త (జీవాత్మ)** | **పరంబ్రహ్మ** |
|---|---|---|---|---|
| పంచ జ్ఞానేంద్రియాలు | కన్ను | రూపం | ద్రష్టా | అరూపం |
| | చెవి | శబ్దం | శ్రోతా | అశబ్దం |
| | ముక్కు | వాసన | ఘ్రాతా | అగంధం |
| | నోరు | రుచి | రసయితా | అరసం |
| | చర్మం | స్పర్శ | స్ప్రష్టా | అస్పర్శం |
| పంచకర్మేంద్రియాలు | వాక్కు | మాట | మాట్లాడేవాడు | |
| | పాణి | తీసుకోబడేది | తీసుకునేవాడు | అవ్యవహారీ |
| | ఉపస్థ | ఆనందమిచ్చేది | ఆనందించేవాడు | |
| | పాయువు | విసర్జింపబడేది | విసర్జించేవాడు | |
| | పాదము | నడిచేది | నడిచేవాడు | |
| చత్వారి అంతఃకరణాని | మనస్సు | ఆలోచన | మన్తా | |
| | బుద్ధి | నిశ్చయం | బోద్ధా | అమనస్కః |
| | చిత్తం | జ్ఞాపకాలు | కర్తా | |
| | అహంకారం | నేను చేస్తున్నాను | విజ్ఞానాత్మా | |

# అధ్యాయం - 5

**మంత్రం - 1**

**అథ హైనం శైబ్యః సత్యకామః పప్రచ్ఛ। స యో హ వై తద్భగవన్మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతీతి ॥ 1 ॥**

**ప్రతిపదార్థం:** అథ హ – దాని తర్వాత, ఏనమ్ – పిప్పలాద గురువును; శైబ్యః సత్యకామః – శైబ్య సత్యకామ అనే శిష్యుడు; పప్రచ్ఛ – అడిగాడు; సః యః హ వై తద్ భగవన్ – ఓ గురుదేవా; మనుష్యేషు – మనుష్యుల్లో ఎవరైనా; ప్రాయణాన్తమ్– మరణం వరకు; ఓంకారమభిధ్యాయీత – ఓంకార ధ్యానం చేస్తే; సః – అతడు; తేన – దానివలన; కతమం లోకమ్ – ఏ లోకానికి; జయతి – వెళతాడు; ఇతి – అని.

**తాత్పర్యం:** దాని తర్వాత పిప్పలాద గురువును శైబ్య సత్యకామ అనే శిష్యుడు అడిగాడు, ' ఓ గురుదేవా! మనుష్యుల్లో ఎవరైనా మరణం వరకు ఓంకారధ్యానం చేస్తే, అతడు దానివలన ఏ లోకానికి వెళతాడు?'

**వివరణ:** సత్యకామ అంటే సత్యాన్వేషి. ఇతను సత్యకామ జాబాల కాదు. ఓంకార ధ్యానం చేస్తే అతడు ఏ లోకాలకు వెళతాడు అన్నది ప్రశ్న. ముందు అధ్యాయాల్లో ప్రశ్నలు 5,6 ఉన్నాయి. ఒక్కొక్కదానికీ గురువు విడమర్చి చెప్పాడు. ఇక్కడ ప్రశ్న ఒకటే. పిప్పలాద గురువు, దానికి దశలవారీగా జవాబు చెప్పారు. ఆయన జవాబు చూసే ముందు కొన్ని విషయాలు మనం గ్రహించాలి.

ధ్యానం అన్నది అష్టాంగయోగలో ఒక భాగం. అవి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. ధ్యానం మొదటే రాదు. కొన్ని నియమాలు పాటించాక దానికి వస్తాము. యమ, నియమాలు– క్రియాస్థాయిలో నిగ్రహం; ఆసన – శరీరస్థాయిలో నిగ్రహం; ప్రాణాయామ – శ్వాసమీద ధ్యాస; ప్రత్యాహార– ఇంద్రియ నిగ్రహం; ధారణ– మనోనిగ్రహం, ఇవన్నీ సాధించాక ధ్యానం చేస్తే సమాధిలోకి వెళతాము. ఓంకారధ్యానమే కాదు, ఏ ధ్యానం చేయాలన్నా అన్ని నిగ్రహాలూ పాటించాల్సి ఉంటుంది.

ధ్యానం రెండు రకాలు. భేదధ్యానం, అభేదధ్యానం. భేదధ్యానంలో ఏ దేవుని గురించి ధ్యానం చేస్తున్నామో, ఆ దేవుడు వేరూ, నేను వేరూ అన్న భావనతో చేయటం. అభేదధ్యానం అంటే ఏ దేవుని గురించి ధ్యానం చేస్తున్నామో ఆ దేవునికీ నాకూ భేదం లేదని భావించుకోవటం.

**అరుణాం కరుణా తరంగితాక్షీం**
**ధృతపాశాంకుశ పుష్పబాణచాపామ్**
**అణిమాదిభిరావృతాం మయూఖైః**
**అహమిత్యేవ విభావయే భవానీమ్ – లలితాసహస్రనామం**

అహం ఇత్యేవ విభావయే భవానీమ్ – అని ధ్యానశ్లోకంలో అభేదభావం చూపిస్తున్నాం. ధ్యానానికీ, జ్ఞానానికీ సూక్ష్మభేదం ఉంది. పరమాత్మకీ, మనకీ అభేదభావం ఊహించుకుంటే అది ధ్యానం. పరమాత్మకీ, మనకీ అభేదభావం తెలిస్తే అది జ్ఞానం. అహం బ్రహ్మాస్మి అని రోజూ చెప్పనక్కరలేదు. ఇది ఒక సత్యం. ఎవర్నో పిలిచి నేను మనిషిని అని చెప్పనక్కరలేదు కదా! ఉపాసనకు విచారణ అక్కరలేదు. జ్ఞానానికి విచారణ కావాలి. అందువల్ల ఇక్కడ చేస్తున్నది అభేదజ్ఞానం కాదు– అభేద ఉపాసన. ఉపాసన చేస్తే క్రమముక్తి కలిగితే, జ్ఞానం కలిగితే సద్యోముక్తి కలుగుతుంది. **అభిధ్యాయీత** అనేదానికి ఇంత చెప్పాల్సి వచ్చింది.

సత్యకామ ఒకటే ప్రశ్న అడిగాడు.

**మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతి** – మనుష్యుల్లో ఎవరైనా మరణంవరకు ఓంకారధ్యానం చేస్తే ఏ లోకానికి వెళతారు?

**ప్రత్యేక విశ్లేషణ: –**

సత్యకామ ప్రశ్నలోనే మూడు విషయాలు మనకు తెలుస్తున్నాయి.

1. ఉపాసన ఎంతకాలం చేయాలి? జీవితాంతం చేయాలి.

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్ ॥ – గీత 8–7**

నీవు సర్వదా నన్నే స్మరిస్తూ, మనోబుద్ధులను నామీదే నిలిపి ఉంచితే నిస్సందేహంగా నన్నే పొందుతావు.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః – గీత 8–6**

కౌంతేయా! మనుష్యుడు అవసానదశలో ఏయే భావాలను స్మరిస్తూ దేహత్యాగం చేస్తాడో, అతను వచ్చే జన్మలో ఆయా స్వరూపాలనే పొందుతాడు.

అందుకని మరణకాలంలో బంధువులు రావాలి, వారిని చివరిసారిగా చూడాలి అనుకోకూడదు. వారికి చెప్పాల్సినవి ముందే చెప్పాలి. చివర్లో ఈశ్వరుణ్ణే తలచుకోవాలి. చివర్లో ఈశ్వరుణ్ణి తలచుకోవాలంటే, సర్వేషు కాలేషు – అన్ని కాలాల్లోనూ ఈశ్వరుణ్ణి తలుచుకోవాలి. ముందంతా ఆడిపాడేసి, చివర్లో తలచుకుందామనుకుంటే రాదు. అందుకని మరణకాలంవరకూ ఉపాసన చేయాలి. మరణకాలం సమీపించాక కాదు.

ఆ మాటకొస్తే, ఏదైనా మంచిపని ఒక్కరోజో, నెలరోజులో చేస్తే చాలదు. జీవితపర్యంతమూ చేయాలి. సత్యం చెప్పాలి అంటే, ఎంతకాలం అనకూడదు. ప్రకృతి సహజ ఆహారం తినాలి అంటే ఎంతకాలం అనకూడదు, అన్నీ జీవితాంతం చేయాలి. మనకు మండలం రోజులు హనుమాన్ చాలీసా చదవాలనీ, మండలం రోజులు అయ్యప్పదీక్ష తీసుకోవాలనీ ఎందుకు చెప్పారంటే, అక్కడివరకూ ప్రాణాలుగ్గబట్టుకుని చేసి, అదవగానే మర్చిపొమ్మని కాదు. స్వయంవికాసశిక్షణలో కూడా ఇదే చెబుతారు. ఒక కారణం ఏమిటంటే, 40 రోజులు చేస్తే గానీ ఫలితం కనబడదు. 40 రోజులు చేస్తే, అది మన అలవాటుగా మారి, అది చేయందే ఉండలేని స్థితికి వస్తామనేది అంతర్లీనంగా ఉన్న మరో కారణం.

2. **కతమం వావ స తేన లోకం జయతీతి?** – ఏ లోకానికి వెళతాడు, అని అడగటంలోనే ఉపాసన చేస్తే మోక్షంరాదు అని చెప్పకనే చెప్పినట్టయింది. అన్నిటికన్నా శ్రేష్ఠమైన, బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడికి వెళ్ళాక కూడా జ్ఞానంద్వారా ముక్తి పొందితే క్రమముక్తి కలుగుతుంది. న తు సాక్షాత్తు, పరం తు (జ్ఞానంద్వారా) క్రమముక్తి. సద్యోముక్తి పొందాలంటే జ్ఞాన మార్గమొక్కటే.

3. **ఇంకో విషయం**– ఉపాసన అపరావిద్యలోకి వస్తుంది. మొదటి మూడు అధ్యాయాలూ అపరావిద్య గురించి చెప్పాక, నాలుగో అధ్యాయంలో పరావిద్య గురించి చెప్పి, మళ్ళీ ఇప్పుడు అపరావిద్య గురించిన ప్రస్తావన ఎందుకు వచ్చింది? ఉపాసన అపరావిద్య అన్నమాట నిజమే, కాని ఫలితం క్రమముక్తి. అంటే ఫలం దృష్ట్యా పరావిద్యలోకి వస్తుంది కాబట్టి ఇది పరావిద్యలో చెప్పటం జరిగింది.

**మంత్రం - 2**

**తస్మై స హోవాచ। ఏతద్వై సత్యకామ పరం చాపరం చ బ్రహ్మ యదోంకారః। తస్మాద్విద్వానేతేనైవాయతనేనైకతరమన్వేతి ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** తస్మై స హోవాచ – అతనితో గురువు చెప్పాడు; సత్యకామ – హే సత్యకామా; ఏతత్ వై – ఇది (ఓంకారం); పరం చ – నిర్గుణ బ్రహ్మకి; అపరం చ – సగుణ బ్రహ్మకి కూడా; యదోంకారః – అది ఓంకారం; తస్మాత్ – ఓంకారం ఆలంబనం కనుక; విద్వాన్– (ఇక్కడ) ఉపాసకుడు; ఏతేనైవ ఆయతనేన ఏకతరమన్వేతి– ఏ మార్గం ఎన్నుకుంటే దాన్ని పొందుతాడు.

**తాత్పర్యం:** అతనితో గురువు చెప్పాడు. 'హే సత్యకామా ఓంకారం నిర్గుణబ్రహ్మకి, సగుణబ్రహ్మకీ కూడా ఆలంబనం కనుక ఉపాసకుడు ఏ మార్గం ఎన్నుకుంటే దాన్ని పొందుతాడు.

**వివరణ:** ఈ మంత్రంలో ఓంకారంయొక్క ప్రత్యేకత గురించి వస్తుంది. ఓంకారం అటు అపరం బ్రహ్మకి, ఇటు పరం బ్రహ్మకీ కూడా ప్రతీకగా ఉంటుంది.

**ఏతదాలమ్బనం శ్రేష్ఠమ్ ఏతదాలమ్బనం పరమ్ ।**
**ఏతదాలమ్బనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే ॥ – కఠ 1.2.17**

ఓంకారమనే ఆలంబనం అపరం బ్రహ్మకీ, పరంబ్రహ్మకీ కూడా ప్రతీక. ఈ విషయం తెలుసుకుని ఉపాసన చేసిన వ్యక్తి బ్రహ్మలోకానికి వెళతాడు. ఓంకారం రెండింటికీ ఎలా ప్రతీక అవుతుంది? ఓంకారంలో మూడు మాత్రలు ఉన్నాయి. అకార, ఉకార, మకార మాత్రలు. ఆ మాత్రలు సగుణ ఈశ్వరకి ప్రతీకలు. ఓంకారమ్ జపించినప్పుడు ఒక ఓం పదానికీ, మరో ఓం పదానికీ మధ్యలో ఏర్పడే నిశ్శబ్దాన్ని అమాత్రః అంటారు. **అమాత్రాః చతుర్థః – మాండూక్యమ్**

ఇది నిర్గుణం ఈశ్వరునికి ప్రతీక. అపరం బ్రహ్మ అంటే సగుణ ఈశ్వరుడు కాబట్టి సోపాధికం. ఇది ఇక్కడ మోక్షాన్ని ఇవ్వలేదు. బ్రహ్మలోకానికి తీసుకు వెళుతుంది. అలాగే పరంబ్రహ్మ అంటే నిర్గుణ ఈశ్వరుడు, కాబట్టి నిరుపాధికం. ఈ పరంబ్రహ్మ విచారణ చేస్తే మోక్షం పొందుతాడు.

ఈ ఓంకారం రెండింటికీ ఆలంబనం – ప్రతిమకి, ప్రతీకకి కూడా. ప్రతిమ అంటేరూపం.ఉదాహరణ రామ, కృష్ణ. ప్రతీక అంటే శివలింగం. సాలిగ్రామం. ఓంకారం పరం, అపరం బ్రహ్మకు ఆలంబనం కనుక, ఉపాసకుడు ఏ ఉపాసనచేస్తే అంటే, **ఏతేనైవ ఆయతనేన** – దానికి తగ్గ ఫలితాన్ని పొందుతాడు. ఏ లోకాలకు వెళతాడు అన్న ప్రశ్నకు అతను ఏ ఉపాసన చేస్తాడనే దానిమీద జవాబు ఆధారపడి ఉంది.

**ఏతైనైవ ఆయతనేన ఏకతరమన్వేతి** – ఏమార్గం ఎన్నుకుంటే దాన్ని పొందుతాడు. ఈ మంత్రాన్ని ప్రతిభరూపద్వారం అంటారు. దాని వివరాలు తరువాత మంత్రాల్లో వస్తాయి.

**మంత్రం - 3**

**స యద్యేకమాత్రమభిధ్యాయీత స తేనైవ సంవేదితస్తూర్ణమేవ జగత్యామభిసమ్పద్యతే। తమృచో మనుష్యలోకముపనయన్తే స తత్ర తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా సమ్పన్నో మహిమానమనుభవతి ॥ 3 ॥**

**ప్రతిపదార్థం:** సః – అతను; ఏకమాత్రమ్ – మొదటి మాత్రను; అభిధ్యాయీత – ప్రగాఢంగా ధ్యానించి; సః – అతను; తేనేవ సంవేదితః– ఉపాస్యవిషయంలో లీనమైనప్పుడు; తూర్ణం ఏవ– వెంటనే; జగత్యామ్ – భూమ్మీదకి; అభిసంవద్యతే– తిరిగి వస్తాడు (మళ్ళీ

జన్మిస్తాడు); తమ్ – అతన్ని; ఋచః – ఋగ్వేదదేవతలు; మనుష్యలోకమ్ – మనుష్యలోకానికి; ఉపనయన్తే – తీసుకుని వస్తారు; సః – అతడు; తత్ర– అక్కడ; తపసా – క్రమశిక్షణతోనూ; బ్రహ్మచర్యేన– ఇంద్రియనిగ్రహంతోనూ; శ్రద్ధయా – శాస్త్రంమీద నమ్మకంతోనూ; సంపన్నః– నిండినవాడై; మహిమానమ్ – మహత్వాన్ని; అనుభవతి– అనుభవిస్తాడు.

**తాత్పర్యం:** ఓంకారంయొక్క మొదటి మాత్రను ప్రగాఢంగా ధ్యానించి అతను ఉపాస్యవిషయంలో లీనమైనప్పుడు, వెంటనే భూమ్మీదకి తిరిగివస్తాడు. అతన్ని ఋగ్వేద దేవతలు మనుష్యలోకానికి తీసుకుని వస్తారు. అతడు అక్కడ క్రమశిక్షణతోనూ, ఇంద్రియ నిగ్రహం తోనూ, శాస్త్రంమీద నమ్మకం తోనూ నిండినవాడై, (మానవజన్మ) మహత్వాన్ని అనుభవిస్తాడు.

**వివరణ:** ఇక్కడ్నుంచి ఓంకార ఉపాసన మొదలు. మూడు రకాల ఉపాసన గురించి 3 మంత్రాల్లో వస్తుంది. ఇందులో మొదటి రకం –

**సః ఏక మాత్రమ్ అభిధ్యాయీత** – ఓంకారంలో ఏకమాత్ర ఉపాసన చేస్తే, అంటే అకార మాత్ర ఉపాసన చేస్తే, అతన్ని ఋగ్వేదదేవతలు భూలోకానికి తీసుకుని వస్తారు. ఉపాసన ఎంతవరకు చేయాలి? ఉపాసకుడు, ఉపాస్యవిషయంలో లీనమయ్యేదాకా చేయాలి. అప్పుడే ఫలప్రాప్తి కలుగుతుంది.

ఉదాహరణకు ఉపాసకుడు శ్రీరాముణ్ణి ఉపాసన చేయాలంటే రామధ్యాసే ఉండాలి. మిగతావన్నీ మర్చిపోవాలి. అష్టాంగయోగంలో ధ్యానం ఏడవ అంగమనీ, సమాధి ఎనిమిదవ అంగమనీ ఇంతకు ముందు చూసాము. ధ్యానం చేస్తే సమాధి స్థితికెళతారు. అందులో సవికల్పసమాధి అనీ, నిర్వికల్పసమాధి అనీ అంటారు. సవికల్పసమాధి కూడా చాలదు. ఎందుకంటే అక్కడ అన్నీ మర్చిపోయినా, తను ఉపాసకుడిగా విడిగానే ఉంటాడు.

నిర్వికల్పసమాధిలోకి వెళ్ళాలి. అంటే ధ్యేయవిషయంలో ఐక్యం అవాలి. ఉపాస్యదేవత సాక్షాత్కారమవ్వాలి. జ్ఞానకాండలో సాక్షాత్కారమంటే అహం బ్రహ్మాస్మి అన్న జ్ఞానోదయమవాలి. ఉపాసనాకాండలో సాక్షాత్కారమంటే ఉపాస్య, ఉపాసన భేదం ఉండకూడదు. అప్పుడే ఫలం. కొంతమంది సమాధిని వేదాంతజ్ఞానంతో ముడిపెడతారు. అది సరియైన పద్ధతి కాదు. శాస్త్రప్రమాణమే జ్ఞానాన్ని కలగచేస్తుంది.

**జగత్యామ్ అభిసంపద్యతే**– అలా అకార ఉపాసన, సాక్షాత్కార పర్యంతం చేస్తే, అతను మళ్ళీ భూలోకంలో జన్మిస్తాడు. అతల, వితల, సుతల, మహాతల, తలాతల, రసాతల, పాతాళలోకాల్లో పుట్టకుండా భూలోకంలో పుడతాడు. భూలోకంలో 84 లక్షల

జీవరాసులున్నాయి. అందులో ఏ జన్మ అన్న అనుమానం లేకుండా **మనుష్యలోకమ్ ఉపనయన్తే** – మనుష్యలోకానికి తీసుకుని వస్తారు అని ప్రత్యేకించి చెబుతోంది ఉపనిషత్తు. ఎప్పుడు? **తూర్ణమ్ ఏవ** – వెంటనే.

**తత్ర తపసా బ్రహ్మచర్యేన శ్రద్ధయా సంపన్నో మహిమానమనుభవతి** – భూలోకంలో, అదీ మనుష్యలోకంలో పుట్టగానే చాలా? అది ఎలాంటి జన్మో! మంచి లక్షణాలతో కూడిన సంపన్నుడవుతాడు అని హామీ ఇస్తున్నది. తపస్సు- క్రమశిక్షణ, బ్రహ్మచర్యేణ- ఇంద్రియనిగ్రహం, శ్రద్ధయా- శాస్త్రంమీద నమ్మకం ఉన్న సంపన్నుడవుతాడు. అటువంటివాడు మనుష్య జన్మయొక్క మహిమను అనుభవిస్తాడు. ఇన్ని మంచివిషయాలు చెప్పినా, పరోక్షంగా ఒక సూచన ఉంది. ఏమిటది? అతను మళ్ళీ తిరిగి పుడతాడు. మహిమానమనుభవతి – అతనికి కష్టాలు రావా? వస్తాయి, ఎందుకు రావు? కాని కష్టాలని తట్టుకునే ఆత్మస్థైర్యం ఉంటుంది. మనకందరికీ తెలుసు మనుష్య జన్మ అన్ని జన్మల్లోకీ శ్రేష్ఠమైనదని. కాని మనం గుర్తించము. ప్రతి చిన్నదానికీ వాపోతాము.

ఒక ఒలింపిక్ క్రీడాకారుడికి క్యాన్సర్ వ్యాధి వచ్చింది. పరామర్శకెళ్ళిన ఎవరో అతనిని, “నాకే ఎందుకు వచ్చింది అని అనుకున్నారా?’ అని అడిగితే, దానికి జవాబుగా అతను ‘కొన్ని లక్షల మంది మనుష్యులున్నారు. అందులో కొన్ని వేలమంది మాత్రమే క్రీడల్లో శ్రద్ధ చూపిస్తారు. అందులో వందల్లో మాత్రమే పైకి వస్తారు. పదుల్లో మాత్రమే ఒలింపిక్స్‌కి వస్తారు. అందులో ఒక్కడికే బంగారుపతకం వస్తుంది. నా ఒక్కడికే వచ్చింది. అప్పుడు నాకే ఎందుకు వచ్చింది అని నేను అనుకోలేదే? ఇప్పుడు మాత్రం ఎందుకు అనుకోవాలి?’ అన్నాడు. మహిమానమనుభవతి అంటే ఇదే. ఈ మంత్రంలో అకార మాత్ర ఉపాసన ఫలం వచ్చింది.

**అకారమాత్ర ఉపాసన చేసిన వారిని ఋగ్వేదదేవతలు మనుష్యలోకానికి తీసుకుని వస్తాయి.**

## మంత్రం - 4

**అథ యది ద్విమాత్రేణ మనసి సమ్పద్యతే సోఽన్తరిక్షం యజుర్భిరున్నీయతే సోమలోకమ్। స సోమలోకే విభూతిమనుభూయ పునరావర్తతే ॥ 4 ॥**

**ప్రతిపదార్థం:** అథ- ఇంకా; యది ద్విమాత్రేణ – రెండు మాత్రలు( అ,ఉ); మనసి- సంపద్యతే- భువర్లోకానికి వెళతాడు; సః – అతన్ని; యజుర్భిః – యజుర్వేద దేవతలు; అన్తరిక్షమ్- సోమలోకానికి; ఉన్నీయతే- తీసుకుని వెళతారు; సః – అతను; సోమలోకే – పితృలోకంలో; విభూతిమ్ – సుఖాలను; అనుభూయ- అనుభవించాక; పునరావర్తతే- మళ్ళీ జన్మిస్తాడు.

**తాత్పర్యం:** ఇంకా, ద్విమాత్ర (అ,ఉ) ఓంకార ఉపాసన చేసిన వ్యక్తి, భువర్లోకానికి వెళతాడు. అతన్ని యజుర్వేద దేవతలు సోమలోకానికి తీసుకువెళతారు. అతను పితృలోకంలో సుఖాలను అనుభవించాక, మళ్ళీ జన్మిస్తాడు.

**వివరణ:** ఇక్కడ ద్విమాత్ర ఓంకార ఉపాసన చేసిన వ్యక్తికి కలిగే ఫలం గురించి వర్ణిస్తున్నారు. **ద్విమాత్రేణ** ద్విమాత్రంగా చదవాలి. ముందు మంత్రంలో ఏకమాత్రం అని ఉంది. దానితో **ఓంకారమ్ అభిద్యాయీత** అని కలుపుకోవాలి. అప్పుడు యది ద్విమాత్రం ఓంకారం అభిద్యాయీత అవుతుంది.

**మనసి సంపద్యతే**– దాని ఫలమేమిటి? భువర్లోకానికి వెళతాడు. మనసి అంటే మధ్యలోకం అంటే భువర్లోకం అని ఏ నిఘంటువులో ఉంది? అలాంటప్పుడు అది ఎలా సరిపోతుంది? దానికి ఇచ్చే వివరణ అర్థం చేసుకోవటం కొంచెం కష్టం. శంకరాచార్యులు రెండు వివరణలు ఇచ్చారు. మనస్సు అంటే స్వప్నప్రధానం. జాగ్రదావస్థ స్థూలశరీరప్రధానం. స్వప్నావస్థ జాగ్రదావస్థకీ, సుషుప్తి అవస్థకీ మధ్యలో ఉంది కాబట్టి, అలాగే భూలోకానికీ, సువర్లోకానికీ మధ్య ఉన్న భువర్లోకమని అర్థం తీసుకోవాలి.

ఇంకో వివరణ – మనసో దేవతా చంద్రమా! మనస్సు అధిష్ఠానదేవత చంద్రుడు. సోమలోకం అంటే చంద్రలోకం– మధ్యలోకం, పితృలోకం, భువర్లోకం, స్వర్గలోకం ఇవన్నీ పర్యాయపదాలు. అలా ద్విమాత్ర ఉపాసన చేసిన వ్యక్తి భువర్లోకానికి వెళతాడు. ఎలా?

**యజుర్భిరున్నీయతే** – యజుర్వేదదేవతలు సోమలోకానికి తీసుకుని వెళతారు. ఇక్కడ మామూలుగా ఉన్న వ్యక్తి కూడా పితృలోకం వెళ్ళేసరికి దేవత అవుతాడు.

**తే యే శతం పితౄణాం చిరలోక లోకానామానందాః – తైత్తిరీయమ్**

అందువల్లనే మనవారు పితృదేవతల దీవెనలు పొందటానికి వారికి శ్రాద్ధకర్మలు చేస్తారు. అక్కడ హాయిగా ఉంటారు. కాని ఎన్నాళ్ళు? ఉపనిషత్తే ప్రత్యక్షంగా చెప్పేస్తున్నది. **పునరావర్తతే** – మళ్ళీ పుడతాడు అని. క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి అని కృష్ణ భగవానుడు కూడా చెప్పాడు.

ఈ మంత్రంలో ద్విమాత్ర ఓంకార ఉపాసన ఫలం వచ్చింది.

**ద్విమాత్ర ఓంకార ఉపాసన చేసిన వారిని యజుర్వేదదేవతలు భువర్లోకానికి తీసుకుని వెళతారు.**

**మంత్రం - 5**

**యః పునరేతం త్రిమాత్రేణోమిత్యేతేనైవాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత స తేజసి సూర్యే సమ్పన్నః । యథా పాదోదరస్త్వచా వినిర్ముచ్యత ఏవం హ వై స పాప్మనా వినిర్ముక్తస్స సామభిరున్నీయతే బ్రహ్మలోకం స ఏతస్మాజ్జీవఘనాత్పరాత్పరం పురిశయం పురుషమీక్షతే । తదేతౌ శ్లోకౌ భవతః ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** యః పునరేతమ్ – ఎవరు మళ్ళీ; త్రిమాత్రేణ– మూడు మాత్రలు; ఓమ్ ఇత్యేతేనైవ అక్షరేణ– పూర్తి ఓంకారం; పరం పురుషమ్ – సమష్టి కారణ ఈశ్వరుని; అభిధ్యాయీత– ప్రగాఢంగా ధ్యానం చేస్తారో; సః – అతడు; తేజసి– ప్రకాశ వంతమైన; సూర్యే సంపన్నః – సూర్యలోకాన్ని పొందుతాడు; యథా పాదోదరః – పాము ఎలా; త్వచా వినర్ముచ్యతే – తన చర్మంనుంచి విడివడుతుందో; ఏవం హ వై – ఆవిధంగా; సః– అతను; పాప్మనా వినిర్ముక్తః – పాపాలనుంచి విడివడతాడు; సః సామభిః –అతన్ని సామవేదదేవతలు; బ్రహ్మలోకమ్ – బ్రహ్మలోకానికి; ఉన్నీయతే – తీసుకువెళతారు; సః– అతను; ఏతస్మాత్ – అక్కడనుండి; జీవఘనాత్ – సమష్టి జీవాలకు; పరాత్పరమ్ – అధిష్ఠానం; పురిశయం – శరీరంలో ఉన్న; పురుషమ్ – నిర్గుణ బ్రహ్మను; ఈక్షతే – తెలుసుకుంటాడు; తత్ ఏతౌ – దాని గురించి రెండు; శ్లోకౌ భవతః – శ్లోకాలు ఉన్నాయి.

**తాత్పర్యం:** ఎవరు మళ్ళీ మూడు మాత్రల పూర్తి ఓంకారధ్యానం చేస్తారో, ఎవరు సమష్టి కారణ ఈశ్వరుని ప్రగాఢంగా ధ్యానం చేస్తారో, అతను ప్రకాశవంతమైన సూర్యలోకాన్ని పొందుతాడు. (అక్కడికి వెళ్ళేముందు) పాము ఎలా తన చర్మంనుంచి విడివడుతుందో, ఆ విధంగా అతను పాపాలనుంచి విడివడతాడు. అతన్ని సామవేదదేవతలు బ్రహ్మలోకానికి తీసుకుని వెళతారు. అతను అక్కడినుంచి సమష్టి జీవాలకు అధిష్ఠానం అయి శరీరంలో ఉన్న నిర్గుణబ్రహ్మను తెలుసుకుంటాడు. దాని గురించి రెండు శ్లోకాలు ఉన్నాయి.

**వివరణ:** ఏకమాత్ర ఉపాసన చేసిన వ్యక్తిని, ఋగ్వేదదేవతలు భూలోకానికీ, ద్విమాత్ర ఉపాసన చేసిన వ్యక్తిని యజుర్వేదదేవతలు భువర్లోకానికీ తీసుకువెళితే మిగిలిందేమిటి? త్రిమాత్ర, సామవేదం, సువర్లోకం.

**త్రిమాత్ర ఉపాసన చేసిన వ్యక్తిని సామవేదదేవతలు సువర్లోకానికి తీసుకుని వెళతారు.**

త్రిమాత్రేణ అంటే **త్రిమాత్రమ్ ఓంకారమ్ అభిధ్యాయీత** అని కలుపుకోవాలి. త్రిమాత్ర విశిష్ఠ ఓంకారం పూర్తి ఓంకారం. అకారం విరాట్‌ను, ఉకారం హిరణ్యగర్భను, మకారం ఈశ్వరుని సూచిస్తాయి.

**పరం పురుషం**– ఇక్కడ పరం పురుషం అంటే నిర్గుణబ్రహ్మ కాదు. ఈ మూడు ఉపాసనల్లోకీ ఇది శ్రేష్ఠం. సమష్టికారణ ఈశ్వరుని సూచిస్తుంది. ఇది చేసిన వ్యక్తి బ్రహ్మలోకానికి వెళతాడు. బ్రహ్మలోకం గొప్పదనం ఏమిటి? బంగారం స్వచ్ఛత గురించి చెప్పినప్పుడు 99.999% అని ఎలా అంటారో, అలా బ్రహ్మలోకంలో పాపాలు లేకుండా 99.999% ఉంటారు. అక్కడికి వెళ్ళే వ్యక్తి పాపాలనుంచి విముక్తి చెందుతాడు. ఎలా విముక్తి చెందుతాడు? **యథా పాదోదరః త్వచా వినిర్ముచ్యతే** – పాము తన కుబుసం విడిచినంత తేలికగా, ప్రయాస లేకుండా. పాముకి పాదోదరం అని ఒక పేరు – ఉదరః ఏవ పాదః

ఈ మూడు లోకాలూ అపరం బ్రహ్మ ఉపాసనకు చెందినవి. వాటిలో శ్రేష్ఠమైనది బ్రహ్మలోకం. మోక్షం కావాలంటే ఓంకార ఉపాసన కాదు, ఓంకార మీమాంస చేయాలి. అది ఎలా చేయాలో, మాండూక్య ఉపనిషత్తులో వివరంగా ఉంది.

మంత్రంలో బ్రహ్మలోకం వరకూ ఒక విషయం. తర్వాత అతను బ్రహ్మలోకంలో జ్ఞానం పొంది క్రమముక్తి పొందుతాడు అని అర్థం.

**పరాత్పరమ్**– స్థూల, సూక్ష్మ, కారణశరీర వ్యతిరిక్తః అవస్థాత్రయసాక్షి అని అర్థం. పరానికి అతీతమైన పరం – అంటే సగుణ ఈశ్వరునికన్నా పరమైనది నిర్గుణ ఈశ్వరుడు. ఒక్కముక్కలో చెప్పాలంటే బ్రహ్మలోకంలో నిర్గుణబ్రహ్మ గురించి సగుణబ్రహ్మద్వారా నేర్చుకుని, అక్కడ్నుంచి క్రమముక్తి పొందుతాడు.

దీన్ని వివరిస్తూ రెండు శ్లోకాలను చెబుతున్నది ఈ ఉపనిషత్తు. ఇది బ్రాహ్మణ ఉపనిషత్తు కాబట్టి, మంత్రోపనిషత్తులోంచి రెండు మంత్రాలను చెబుతున్నది.

**ప్రత్యేక విశ్లేషణ:–**

అకార ఉపాసన చేస్తే మనిషిగా పుడతాడు, పెద్దగా లాభం లేదు. ద్విమాత్ర విశిష్ఠ ఉపాసన చేస్తే స్వర్గలోకం వెళతాడు, సుఖాలను అనుభవిస్తాడు, బాగానే ఉంది, కాని మళ్ళీ తిరిగి వస్తాడు. పూర్ణ ఓంకార ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ సాక్షాత్తూ బ్రహ్మే బోధిస్తాడు. పరిస్థితులు అనుగుణంగా ఉంటాయి, పూర్తిగా ముగ్గిన పండు చెట్టునుంచి రాలినట్టు జ్ఞానం ఇట్టే కలుగుతుంది. అక్కడ్నుంచి క్రమముక్తి కలుగుతుంది.

ఇప్పుడు మనకు రెండు మార్గాలున్నాయి. ఓంకార ఉపాసన చేసి బ్రహ్మలోకం వెళ్ళి క్రమముక్తి పొందాలా, ఇక్కడ ఓంకార విచారణ చేసి ఇక్కడే సద్యోముక్తి పొందాలా? ఏది నయం? బ్రహ్మలోకంలో తేలికగా క్రమముక్తి పొందవచ్చు కాని, బ్రహ్మలోకం తేలికగా పొందగలమా? దానికి అనేక సమస్యలు, అడ్డంకులు ఉన్నాయి. నూటికో, కోటికో ఒక్కరు వెళ్ళగలరు. మీ చేతిలో కోటిరూపాయలు ఉంటే, ఇప్పుడు అనుభవిస్తారా, ఎప్పుడో, ఎక్కడో అనుభవిస్తానంటారా? ఇప్పుడే సద్యోముక్తే ఈ కోటిరూపాయలు.

**మంత్రం - 6**

**తిస్రో మాత్రా మృత్యుమత్యః ప్రయుక్తా అన్యోన్యసక్తా అనవిప్రయుక్తాః ।**
**క్రియాసు బాహ్యాభ్యన్తరమధ్యమాసు సమ్యక్ప్రయుక్తాసు న కమ్పతే జ్ఞః ॥ 6 ॥**

**ప్రతిపదార్థం:** తిస్రః మాత్రాః – ఈ మూడు మాత్రలు; ప్రయుక్తాః –విడిగా వాడితే; మృత్యుమత్యః – అనిత్యఫలం; అన్యోన్యసక్తాః – ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉండేలా; అనవిప్రయుక్తాః క్రియాసు – ధ్యానంలో సరిగా వాడితే; బాహ్యా– జాగృత్; అభ్యంతర– సుషుప్తి; మధ్యమాసు –స్వప్నావస్థలకు; సమ్యక్ ప్రయుక్తాసు –(ఇక్కడ) వ్యతిరిక్తమైన (బ్రహ్మలోకంలో) పరమాత్మను గుర్తించిన; జ్ఞ– జ్ఞాని; న కమ్పతే – చలించదు.

**తాత్పర్యం:** ఓంకారంయొక్క ఈ మూడు మాత్రలు విడిగా వాడితే, వాటివల్ల వచ్చేది అనిత్యఫలం. అవి ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉండేలా, ధ్యానంలో సరిగా వాడితే, జాగ్రత్, సుషుప్తి, స్వప్నావస్థలకు వ్యతిరిక్తమైన పరమాత్మను (బ్రహ్మలోకంలో) గుర్తించిన జ్ఞాని చలించడు.

**వివరణ:** ఇది ఋగ్వేదమంత్రం. ఈ ఉపనిషత్తు అథర్వణవేదానికి చెందింది. కేవలం అకార మాత్ర ఉపాసన చేస్తే, లేదా కేవలం అకార, ఉకార, మాత్ర ఉపాసన చేస్తే అది **మృత్యుమత్యః** అవుతుంది. మృత్యువుతో సమానం– ఎందుకంటే అకార మాత్రతో చేస్తే – వెంటనే మళ్ళీ మనుష్యలోకంలో జన్మిస్తాడంది ఉపనిషత్తు. అకార, ఉకార, ఉపాసనలు చేస్తే 'పునరావర్తతే' అంది. మళ్ళీ తిరిగి వస్తాడు అంది. అందుకని ఇవి రెండూ అనిత్య ఫలాలయ్యాయి.

**అన్యోన్యసక్తాః అనవిప్రయుక్తాః** – దాని బదులు అకార, ఉకార, మకార మాత్రలన్నింటినీ కలిపి వాటిని సరిగా ప్రయోగిస్తే నిత్యఫలం కలుగుతుంది.

సరిగా వాడితే అంటే, జాగ్రత్, స్వప్న, సుషుప్తి, అవస్థల వ్యతిరిక్తమైన పరమాత్మను గుర్తిస్తే (బ్రహ్మలోకంలో) అని అర్థం. అంతకుముందు ఈ పరమాత్మను స్థూల, సూక్ష్మ,

కారణశరీరాలకు వ్యతిరిక్తమైంది అని చెప్పటానికి **అలోహితం, అశరీరం, అచ్ఛాయమ్** అన్న పదాలు వాడింది. ఈ మూడు చెపితే వాటి అధిష్ఠానదేవతలు కూడా వస్తారు. వ్యష్టి స్థూల, సూక్ష్మ, కారణశరీరాలకు అధిష్ఠానదేవతలు వరుసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞులు అయితే, సమష్టి స్థూల, సూక్ష్మ, కారణశరీరాల అధిష్ఠానదేవతలు వరుసగా విరాట్, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు వస్తారు. మూడు మాత్రల పరిపూర్ణ ఓంకారధ్యానం చేస్తే బ్రహ్మలోకానికి వెళతారు. అక్కడ ఫలం ఏమిటి? **న కమ్పతే** – చలించదు; భయం తెలియదు. భయం సంసారికి చిహ్నం– భయం తెలియదు అంటే క్రమముక్తిని సూచిస్తున్నారు. ఇదే భావం తరువాత మంత్రంలో కూడా తేటతెల్లమవుతుంది.

### మంత్రం - 7

**ఋగ్భిరేతం యజుర్భిరన్తరిక్షం సామభిర్యత్తత్కవయో వేదయన్తే। తమోంకారేణైవాయతనేనాన్వేతి విద్వాన్ యత్తచ్ఛాన్తమజరమమృతమభయం పరం చేతి ॥ 7 ॥**

**ప్రతిపదార్థం:** ఋగ్భిరేతమ్ – ఋగ్దేవత వల్ల; అన్వేతి– వెళతాడు; యజుర్భిః – యజుర్వేద దేవతచేత; అన్తరిక్షమ్ – ఆకాశం; సామభిః – సామవేద దేవతవల్ల; యత్ తత్ – ఆ లోకం (బ్రహ్మలోకం); కవయో – ఋషులు; వేదయన్తే– తెలుసుకున్నారు; యత్ శాంతమ్– శాంతము; అజరమ్ – వృద్ధాప్యరహితమైన; అమృతమ్ – చావులేదు; అభయమ్ – భయం లేదు; పరమ్ – పరబ్రహ్మని; ఓంకారేణైవ– ఒక్క ఓంకారం; ఆయతనేన– ప్రతీక ఉపాసన చేస్తేనే; విద్వాన్ – ఉపాసకుడు; అన్వేతి– పొందుతాడు.

**తాత్పర్యం:** ఋగ్దేవతలవల్ల (మనుష్యలోకానికి) వెళతాడు; యజుర్వేద దేవతవల్ల అంతరిక్షానికీ, సామవేదదేవతవల్ల ఆ లోకం (బ్రహ్మలోకానికి) వెళతారని ఋషులు తెలుసుకున్నారు. ఓంకారప్రతీక ఉపాసన చేస్తేనే ఉపాసకుడు శాంతం, అజరం, అమృతం, అభయం అయిన పరంబ్రహ్మను పొందుతాడు.

**వివరణ:** మూడు రకాల ఉపాసనల ఫలం ఈ మంత్రంలో మళ్ళీ వస్తున్నది. మొదటి రెండు ఫలాలూ అసంపూర్ణం. ఋగ్వేద దేవతలవల్ల వెళతాడు. ఐతే, ఎక్కడికి, ఎవరు అనేది మనం అర్థం చేసుకోవాలి. అకారమాత్ర ఉపాసన చేసిన వ్యక్తిని ఋగ్వేద దేవతలు మనుష్యలోకానికి వెంటనే తీసుకువస్తారు. అంటే పునర్జన్మ ఉంది. అలాగే యజుర్వేద దేవతలు అంతరిక్షం తీసుకెళతారు. ఎందుకు? **ద్విమాత్రమ్ ఓంకారం అభిధ్యాయీత** అని మనం కలుపుకోవాలి. ద్విమాత్ర ఉపాసన చేసిన సాధకుణ్ణి ఆలోకం తీసుకెళతారుట. ఏ లోకానికి? భువర్లోకానికి. ఈ విషయాలు ఋషులు తెలుసుకున్నారు.

ఒక్క ఓంకారం ప్రతీకతో ఉపాసన చేస్తేనే బ్రహ్మలోకం వెళతాడు. అంతేకాదు బ్రహ్మలోకం వెళ్ళాక ఉపాసన కాదు, విచారణ చేసి నిర్గుణం బ్రహ్మని తెలుసుకుంటాడు. దాని ఫలం ఏమిటి?

శాంతం, అజరం, అమృతం, అభయం, పరం – శాంతమే తప్ప రాగద్వేషాలు లేవు, వృద్ధాప్యం లేదు. మరణం లేదు, భయం లేదు. అటువంటి పరమాత్మ అతను. కేవలం బ్రహ్మని తెలుసుకుంటావు అంటే శ్రద్ధ ఉండదు. ఎందుకంటే బ్రహ్మను అశబ్దం, అస్పర్శం, అరూపం అంటూ వర్ణిస్తారు. కంటికి కనబడని, చెవికి వినబడని, రూపం లేని, వర్ణించలేని బ్రహ్మను ఎలా తెలుసుకుంటామన్న భావన కలుగుతుంది. అందుకే పరమ పురుషార్థమైన బ్రహ్మను 'పొందితే' జరామృత్యు భయాలు లేవు.

ఇక్కడితో ఋగ్వేద మంత్రాలు కూడా అయిపోయాయి.

**మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతి –** మనుష్యుల్లో ఎవరైనా మరణం వరకు ఓంకారధ్యానం చేస్తే ఏ లోకానికి వెళతారు? భూలోక, భువర్లోక, సువర్లోకాలకు, వారు చేసిన ఉపాసనలనుబట్టి వెళతారు.

**గమనిక:** ఇక్కడ ఒక విషయాన్ని స్వామీజీ విశదపరుస్తున్నారు. ఏకమాత్ర, ద్విమాత్ర ఉపాసనలను నిజంగా బోధించటం లేదు ఉపనిషత్తు. అందులో తాత్పర్యం ఏమీ లేదు. కేవలం త్రిమాత్ర ఉపాసనను స్తుతించటానికి ఈ రెండింటి ప్రస్తావన వచ్చింది కాని దాని ప్రయోజనం ఏమీ లేదు. ఉపనిషత్తు మనం వాటిని చేయాలని కూడా ఆశించటం లేదని ఉపభాష్యకారులు చెబుతున్నారని అంటున్నారు. అలా ఒకటో, రెండో మాత్రలను మాత్రం ఉపాసన చేస్తే అది అంగవైకల్య ఉపాసన కిందికి వస్తుందని పరిపూర్ణానంద స్వామి కూడా చెబుతున్నారు.

**అధ్యాయం - 5 టూకీగా - ఓంకార ఉపాసన**

| మాత్ర | సూచించే వ్యష్టి | అధిష్ఠానదేవత సమష్టి | మాత్రసంఖ్య | వేదం | లోకం | ఇంకోపేరు |
|---|---|---|---|---|---|---|
| అ | విశ్వ | విరాట్ | ఏకమాత్ర | ఋగ్వేద | భూలోకం | మనుష్యలోకం |
| అ,ఉ | తైజస | హిరణ్యగర్భుడు | ద్విమాత్ర | యజుర్వేద | భువర్లోకం | సోమలోకం |
| అ,ఉ,మ | ప్రాజ్ఞ | ఈశ్వరుడు | త్రిమాత్ర | సామవేద | సువర్లోకం | బ్రహ్మలోకం |

# అధ్యాయం - 6

**మంత్రం - 1**

**అథ హైనం సుకేశా భారద్వాజః పప్రచ్ఛ। భగవన్ హిరణ్యనాభః కౌసల్యో రాజపుత్రో మాముపేత్యైతం ప్రశ్నమపృచ్ఛత। షోడశకలం భారద్వాజ పురుషం వేత్థ। తమహం కుమారమబ్రువం నాహమిమం వేద।**
**యద్యహమిమమవేదిషం కథం తే నావక్ష్యమ్ ఇతి। సమూలో వా ఏష పరిశుష్యతి యోఽనృతమభివదతి తస్మాన్నార్హామ్యనృతం వక్తుమ్ । స తూష్ణీం రథమారుహ్య ప్రవవ్రాజ । తం త్వా పృచ్ఛామి క్వాసౌ పురుషః ఇతి ॥1॥**

**ప్రతిపదార్థం:** అథ హైనమ్ – తర్వాత పిప్పలాదుని; భారద్వాజః సుకేశా – భారద్వాజ సుకేశా అనే శిష్యుడు; పప్రచ్ఛ – అడిగాడు; భగవన్ – గురుదేవా; కౌసల్య – కోశలదేశానికి చెందిన; రాజపుత్రః – యువరాజు; హిరణ్యనాభః – హిరణ్యనాభుడు; మాముపేత్య– నన్ను సమీపించి; ఏతం ప్రశ్నమ్ – ఈ ప్రశ్నను; అపృచ్ఛత – అడిగాడు; భారద్వాజ– ఓ భరద్వాజా; షోడశకలమ్ – పదహారు అంగాలుగల; పురుషమ్ – పురుషుడు; వేత్థ – తెలుసా; అహం తమ్ కుమారమ్– నేను ఆ యువరాజుతో; అబ్రువమ్ – చెప్పాను; నాహమిమం వేద– నాకు ఇది తెలియదు; యద్యహమిమమ్ – ఒకవేళ తెలిసి ఉంటే; తే – మీకు; కథమ్ – ఎలా; న అవక్ష్యమ్ – చెప్పకుండా ఉంటాను; యః సః – ఎవరు; అనృతమ్ అభివదతి– అబద్ధాన్ని చెప్తారో; ఏషః– వారు; సమూలః పరిశుష్యతి– సమూలంగా నశించిపోతారు, తస్మాత్ – అందువల్ల; అనృతం వక్తుమ్– అబద్ధం చెప్పటానికి; న అర్హామి – నాకు సామర్థ్యం లేదు; సః – అతను; తూష్ణీమ్ – మౌనంగా; రథః ఆరుహ్యః– రథాన్ని ఎక్కి; ప్రవవ్రాజ– వెళ్ళిపోయాడు. తం త్వా – దానిని మిమ్మల్ని; పృచ్ఛామి– అడుగుతున్నాను; క్వాసౌ పురుషః – ఈ పురుషుడు ఎక్కడ ఉన్నాడు? ఇతి – అని.

**తాత్పర్యం:** తర్వాత పిప్పలాదుని భారద్వాజ సుకేశా అనే శిష్యుడు ఇలా అడిగాడు; 'గురుదేవా! కోశల దేశానికి చెందిన యువరాజు; హిరణ్యనాభుడు, నన్ను సమీపించి ఈ ప్రశ్నను అడిగాడు, "ఓ భరద్వాజా, పదహారు అంగాలు గల పురుషుడు తెలుసా?' నేను ఆ యువరాజుతో చెప్పాను, "నాకు ఇది తెలియదు; ఒకవేళ తెలిసి ఉంటే, మీకు చెప్పకుండా ఎలా ఉంటాను?

ఎవరు అబద్ధాన్ని చెబుతారో, వారు సమూలంగా నశించిపోతారు. అందువల్ల అబద్ధం చెప్పటానికి నాకు సామర్థ్యం లేదు.' అతను మౌనంగా రథాన్ని ఎక్కి వెళ్ళిపోయాడు. దానిని మిమ్మల్ని అడుగుతున్నాను. ఈ పురుషుడు ఎక్కడ ఉన్నాడు అని.

**వివరణ:** 5వ ప్రశ్నకు జవాబు పిప్పలాద చెప్పాక, భారద్వాజ సుకేశుడు పిప్పలాదను ఒక ప్రశ్న అడిగాడు. మొదటి అధ్యాయంలో వీరిని పరిచయం చేసినప్పుడు ఇతని పేరు మొదట ఉంది. ప్రశ్నలు అడిగే క్రమం మారి, ఇతను చివరి శిష్యుడు అయ్యాడు.

అందరికీ రెండేసి పేర్లు ఉండటం చూస్తూనే ఉన్నాము. ఇతనికి కూడా రెండు పేర్లు-భరద్వాజ సుకేశుడు. అతను ప్రశ్న వెంటనే అడగకుండా ఒక సంఘటన చెప్పి అడిగాడు. హిరణ్యనాభః కౌసల్యః అనే ఒక రాజకుమారుడు తన దగ్గరికి వచ్చి అడిగిన ప్రశ్నను, మిమ్మల్ని అడుగుతున్నాను అన్నాడు. **షోడశకలం పురుషం వేత్థ?** అన్నది ప్రశ్న. 'పదహారు అంగాలుగల పురుషుడు మీకు తెలుసా?' ఈ శిష్యులను పరిచయం చేసినప్పుడు, ఉపనిషత్తు వారి గురించి **బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠా** అనే విశేషణాలు వాడింది.

కాని భారద్వాజ తనకు తెలియదని చెప్పాడు. అలా చెప్పగలగటానికి అణకువ, నిజాయితీ కావాలి. తెలియకపోయినా తెలిసినట్టు చెప్పేవారు వినేవారిని తప్పుదోవ పట్టిస్తారు. మనం కారులో వెళుతూ ఎవరినైనా దోవ అడిగితేనే కొంతమంది తెలియకపోయినా, 'నేరుగా వెళ్ళు,' అనేస్తారు. మనల్ని తిప్పలు పెడతారు. అలాంటిది జ్ఞానం విషయంలో, మిడిమిడి జ్ఞానంతో ఏదైనా చెప్తే, అది వారిని ఇబ్బందులు పెట్టటమవుతుంది.

గురువు నాకు తెలియదని చెప్పినా కొందరు నమ్మరు. గురువు సర్వజ్ఞుడనుకుంటారు. కాని సర్వజ్ఞుడవలేదు. ఎందుకంటే -

**అనంత శాస్త్రం బహువేదితవ్యం**

**అల్పశ్చకాలః బహ్వో విఘ్నాః**

తెలుసుకోవాల్సిన శాస్త్రమేమో ప్రకరణాలు, స్మృతులు, శ్రుతుల రూపంలో అనంతంగా ఉంది. ఉన్న కాలమేమో అతిస్వల్పంగా ఉంది. దాంట్లోనూ అనేక విఘ్నాలున్నాయి. అందుకని అందరికీ అన్నీ తెలియవు. భారద్వాజ అదే విషయం చెబుతాడు. నేను అబద్ధం చెపితే సమూలంగా నాశనమయిపోతాను అని చెబుతాడు. అబద్ధం చెపితే ఇహలోక, పరలోక సుఖం నశించిపోతుంది. విలువలు లేనివారు బ్రహ్మజ్ఞానాన్ని పొందలేరు. అసత్యానికీ, బ్రహ్మజ్ఞానానికీ లంకె కుదరదు.

**సత్యమేవ జయతే నానృతం సత్యేన పన్థా వితతో దేవయానః। -ముండక 3.1.6**

సత్యమొక్కటే మార్గం. వేరే ఏమీలేదు. సత్యం చెప్పిన వారికి దేవలోకమార్గం ఏర్పడుతుంది. అందుకని నాకు అబద్ధం ఆడటానికి అర్హత లేదు అంటున్నాడు.

అది విన్న రాజకుమారుడు నిశ్శబ్దంగా రథం ఎక్కి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఆ ప్రశ్న మిమ్మల్ని నేను అడుగుతున్నాను. ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు? (పప్రచ్ఛతో ఈ వాక్యాన్ని కలుపుకోవాలి)

**క్వాసౌ పురుషః?** – ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

పరోక్షంగా అడిగిన ప్రశ్న –

**షోడశకలం పురుషం వేత్థ? –** పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా?

**ప్రత్యేక విశ్లేషణ: –**

క్వాసౌ షోడశకలం పురుష? అని ప్రత్యక్షంగా అడిగేయవచ్చు కదా! ఎందుకు ఇంత వివరణ ఇచ్చాడు? దీనివల్ల మనకు, గురువు పిప్పలాదకు, కొన్ని విషయాలు చెప్పకనే చెబుతున్నది ఉపనిషత్తు.

1. ఈ శిష్యుడు సత్యం పలికే వ్యక్తి. నిజాయితీ, అణుకువ ఉన్న వ్యక్తి. తనకు తెలియని విషయం తెలియదని నిస్సంకోచంగా ఒప్పుకున్నాడు. తప్పు చెప్పేకన్నా అజ్ఞానం ఒప్పుకోవాలి.

2. తనకు తెలియదని చెప్పేసి ఊరుకోలేదు. అదేమిటో తెలుసుకోవాలని, వెంటనే పిప్పలాద దగ్గరకు వచ్చాడు. అంటే అతనిలో సత్యాన్వేషణ, జిజ్ఞాస ఉంది. ఇది మనుషుల్లో అరుదుగా ఉంటుంది. ఎక్కడో కొందరే తమకు తెలియని విషయం ఎవరైనా అడిగితే, అది తెలుసుకుని మరీ, అడిగిన వారికి చెబుతారు.

3. సుకేశ భారద్వాజుడు తెలివైనవాడు. అటువంటి వ్యక్తికే తెలియలేదు అంటే ఈ విద్య సాధారణమైనది కాదు. చాలా అరుదైన జ్ఞానం.

**శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః**
**శృణ్వన్తో ఽపి బహవో యం న విద్యుః ।**
**ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా**
**ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః ॥ – కఠ 1.2.7**

ఈ బ్రహ్మవిద్య వినటానికి సాధ్యం కాదు. విన్నా అర్థం కాదు. గురువుకీ, శిష్యునికీ కూడా అపూర్వభావన కలుగుతుంది.

## మంత్రం - 2

**తస్మై స హోవాచ। ఇహైవాన్తశ్శరీరే సోమ్య స పురుషో యస్మిన్నేతాష్షోడశ కలాః ప్రభవన్తీతి ॥ 2 ॥**

**ప్రతిపదార్థం:** తస్మై – అతనితో; సః హ ఉవాచ – మహర్షిచెప్పాడు; సౌమ్య– ప్రియమైన వాడా; సః పురుషః – ఆ పురుషుడు; ఇహ – ఇక్కడ; శరీరే– శరీరం లోపల;

అంతః – హృదయంలో; యస్మిన్ ఏతాః– ఆ బ్రహ్మనుంచే; షోడశకలాః – పదహారు అంశాల ప్రపంచం; ప్రభవన్తి– ఉద్భవించింది; ఇతి– అని.

**తాత్పర్యం:** అతనితో, మహర్షి ఇలా చెప్పాడు, 'ఓ సౌమ్యా, ఆ పురుషుడు ఇక్కడ ఈ శరీరం లోపల హృదయంలో ఉన్నాడు. ఆ బ్రహ్మనుంచే పదహారు అంశాల ప్రపంచం ఉద్భవించింది.'

**వివరణ:– తస్మై** అంటే భారద్వాజాయ, **శిష్యాయ** – ఆ శిష్యునికి, గురువు ఇలా చెప్పాడు, విద్యార్థికి అర్హత ఉంటే, జ్ఞానం ఇచ్చి తీరాలి. బ్రహ్మజ్ఞానం అడగనివాడికి ఎదురుపిలిచి మరీ బోధించకూడదు. అలా అని అడిగినవాడిని నిర్లక్ష్యం చేయకూడదు. శిష్యుడు ఇబ్బందిపడకుండా అతన్ని '**సౌమ్య**' అని సంబోధిస్తున్నాడు గురువు. సోమ్య అంటే చంద్రుడు, సోమతుల్య – అంటే చంద్రునిలా చల్లదనం వెదజల్లేవాడు అని అర్థం.

ఈ పురుషుడు హృదయగుహలోనే ఉన్నాడు. ఇది ఒక మహావాక్యంతో సమానం. హృదయగుహలోనే పురుషుడున్నాడు. పురుషుడు అంటే పరమాత్మ, బ్రహ్మ. ఆ బ్రహ్మశరీరంలో ఉన్నాడంటే మళ్ళీ పొరపాటు పడకూడదు. శరీరంలోనే లేదు, శరీరంలో కూడా ఉన్నాడు. శరీరంలో ప్రకటితమవుతున్నాడని అర్థం. కుండలో పండ్లు ఉన్నాయి అంటే కుండలోనే ఉన్నట్టు అర్థం. కాని కుండలో ఆకాశం ఉంది అంటే, కుండలో కూడా ఆకాశం ఉంది అని అర్థం. ఇక్కడితో మొదటి ప్రశ్నకు జవాబు వచ్చేసింది.

**క్వాసౌ పురుషః –** ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

**ఇహైవాన్తః శరీరే–** అంతః కరణంలో ఉన్నాడు.

పిప్పలాద గురువు శిష్యుడు చెప్పిన మాటల్లో ఇమిడి ఉన్న ప్రశ్నను కూడా తీసుకుని దానికి జవాబు చెబుతున్నాడు. పరోక్షంగా అడిగిన ప్రశ్న –

**షోడశకలం పురుషం వేత్థ? –** పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా?

విద్యార్థి షోడశకల పురుషుడన్నాడు. ఆ ప్రశ్నలోనే సమస్య ఉంది. పురుషః అంటే బ్రహ్మ– పూరయతి సర్వం ఇతి పురుషః ఆ బ్రహ్మ ఎలా ఉంటాడు?

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**

అవయవాలు లేవు, పాదాలు,చేతులు లేవు.నిష్కలం బ్రహ్మ అంటూ, షోడశకలం పురుష అని ఎలా చెబుతాడు? ఆ బ్రహ్మ ఒక బాహ్యవస్తువు కాదు. ప్రమాణాలకి అందదు.

**న తత్ర చక్షుః గచ్ఛతి, న వాక్ గచ్ఛతి నో మనః – కేన**

సర్వప్రమాణ అగోచరం. అందువల్ల దీన్ని మామూలు పద్ధతిలో వర్ణించలేము. అసాధారణ పద్ధతి కావాలి. దీన్ని అధ్యారోప అపవాదం అంటారు. దీనిద్వారా

**షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!** ఇది నిరూపించాలి.

**ప్రత్యేక విశ్లేషణ :- అధ్యారోప అపవాద న్యాయం**

1.**కార్య పరిచయం**–ప్రపంచాన్ని కార్యంగా పరిచయం చేయటం. కనబడే జగత్ శాశ్వతం అనుకుంటాము. కాని శాస్త్రం పని అది మిథ్య అని నిరూపించటం, దాన్ని కార్యంగా చూపించటం. ఉదా: కుండను చేయడం ఒక కార్యం.

2.**కారణ పరిచయం**–ఈశ్వరుణ్ణి కారణంగా పరిచయం చేయటం. కార్యం ఉంటే, కారణం ఎవరు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కారణం సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ. బ్రహ్మచైతన్యం కారణం. చైతన్యరూప బ్రహ్మ జడప్రపంచస్య కారణం అస్తి. **అచేతన ప్రపంచానికి చేతనబ్రహ్మ కారణం.** ఉదా: కుండ ఒక కార్యం అయితే, దానికి కారణం మట్టి. జగత్ కార్యం అయితే జగత్కారణం బ్రహ్మ. ఈ కార్యకారణ సంబంధాన్ని కార్యంనుంచి కాని, కారణంనుంచి గాని చూపుతాయి ఉపనిషత్తులు.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి ।** **–తైత్తరీయమ్ – భృగువల్లి**

ఇక్కడ కార్యంనుంచి కారణానికి వెళ్ళింది. ఈ రెండింటినీ కలిపి అధ్యారోపం అంటారు. ఇందులో సృష్టి ప్రకరణం వస్తుంది.

3. **కార్యనిషేధం** – కారణం లేకుండా కార్యం విడిగా లేదు అని తెలుసుకోవటం. **కారణ వ్యతిరిక్తేన కార్యం నాస్తి.** అంటే కార్యానికి నామరూపాలు ఉన్నాయి తప్ప, దానికంటూ ఉనికి లేదు. కుండలో మట్టి ఎక్కడ ఉంది అంటే కుండ అంతటా ఉంది. మట్టి లేకపోతే కుండకు ఉనికే లేదు. ఉనికి లేనిది మిథ్య; సత్యం కాదు.

4. **కారణత్వ నిషేధం** – కార్యాన్ని ఎప్పుడైతే నిషేధిస్తామో, అప్పుడే కారణం అనేదానికి కారణత్వం లేదు. కార్యబుద్ధి ఉన్నంతసేపే కారణ బుద్ధి. కార్య నిషేధంతో పాటు కారణ నిషేధం అనకూడదు. కారణం అయిన చైతన్యం ఉంటుంది. కారణం అనే హెూదా ఉండదు. అందుకని కారణత్వ నిషేధః అనాలి. కార్య, కారణత్వాలను నిషేధిస్తే, మిగిలింది ఏమిటి? **కార్యకారణ విలక్షణ శుద్ధచైతన్యమేవ అవతిష్టతే.** అంటే కార్యకారణ విలక్షణమైన శుద్ధ చైతన్యమే మిగులుతుంది. దాన్ని మాండూక్యంలో తురీయ చైతన్యం అంటారు. అదే సత్యం. ఉదా:– కుండకు మట్టి లేకపోతే ఉనికి లేదంటే, మట్టికి కారణత్వ హెూదా లేదు. ఈ రెండింటినీ కలిపి అపవాదం అంటారు.

టూకీగా – అధ్యారోపంలో బ్రహ్మను జగత్కారణంగా నిరూపిస్తాము. అపవాదంలో **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా** అని చూపిస్తాము.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్ –ఛాందోగ్యమ్**

మనం ఒక పదం సృష్టించి దాంట్లో కొట్టుకుంటున్నాం. ఈ భావాన్ని శంకరాచార్యులవారు అపరోక్షానుభూతిలో బాగా వివరించారు.

**కార్యే హి కారణం పశ్యేత్ పశ్చాత్ కార్యం విసర్జయేత్**

**కారణత్వం తతో గచ్ఛేదవశిష్టం భవేన్మునిః**

కార్యంలో కారణాన్ని చూడాలి. కారణాన్ని చూశాక కార్యాన్ని మిథ్యగా వదిలేయాలి. అప్పుడు కారణానికి కారణ స్వభావం పోతుంది. మిగతాది జడరహిత చైతన్యం. చైతన్యం కుండ ఏర్పడకముందూ ఉంది. కుండలోనూ ఉంది, కుండ లేకపోయినా ఉంది.

**సృష్టి ప్రకరణం –** ఉపనిషత్తులో సృష్టి ప్రకరణం అనేక రకాలుగా వస్తుంది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః । ఆకాశాద్వాయుః । వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః । ఓషధీభ్యోన్నమ్। అన్నాత్పురుషః ।**

**–తైత్తిరీయమ్ – బ్రహ్మానంద వల్లీ**

ఆత్మ (చైతన్యం)నుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీరునుంచి పృథివి, పృథివినుంచి ఔషధులు, ఔషధులనుంచి అన్నం, అన్నంనుంచి మనిషి పుట్టాడు.

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ ।**

**ఖం వాయుర్జ్యోతి రాపః పృథివీ విశ్వస్య ధారిణీ ॥ – ముండకమ్ 2.1.3**

ఆత్మ(చైతన్యం)నుంచి ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు, పంచభూతాలు పుట్టాయి. ఇలా సృష్టి గురించి రకరకాలుగా ఉంది. క్రమసృష్టి, అక్రమసృష్టి. విత్క్రమసృష్టి – ఒక క్రమపద్ధతిలో, పద్ధతి లేకుండా, వ్యతిరేక పద్ధతిలో వస్తుంది. ఇన్ని రకాలుగా ఎందుకు? ఉపనిషత్తు ప్రమాణం అయితే, ఈ భేదాలు ఎందుకు వచ్చాయి? ఎందుకంటే ఈ కార్యకారణ సంబంధాన్ని ఎలాగూ నిషేధిస్తాము. ఉదాహరణకి ఒక కట్టడం కడుతున్నప్పుడు అది నిలబడటానికి తాత్కాలికంగా దుంగలు పెడతారు. తర్వాత వాటిని తీసేస్తారు.

తాత్కాలికంగా పెట్టే ఆ దుంగలు ఏ రంగులో ఉండాలి, ఎంత అందంగా ఉండాలిలాంటి వివరాలు పట్టించుకోరు. అలాగే ఉపనిషత్తుకి బ్రహ్మ కారణత్వం తాత్కాలికం. గణితంలో × పెట్టి, తర్వాత తీసివేసినట్టు, ముందు కారణత్వం చూపించి, అది కూడా మాయికం, ఉన్నది నిర్గుణబ్రహ్మే అని నిరూపిస్తుంది. తెలియని బ్రహ్మని తెలిసిన జగత్ద్వారా చూపిస్తుంది. జ్ఞాతప్రపంచంద్వారా అజ్ఞాతబ్రహ్మ. దీన్ని తటస్థలక్షణం అంటారు.

**తటస్థ లక్షణం –** తటస్థలక్షణం అంటే తాత్కాలికంగా ఉన్న విషయాన్నిబట్టి ఒక వస్తువును వర్ణించటం. ఉదాహరణకి దేవదత్తుని గృహం ఎక్కడ అంటే కాకి వాలిన ఇల్లు అని చెప్పటం. కాకి ఇంటిలో ఒక భాగం కాదు. కాసేపయ్యాక ఎగిరిపోతుంది. బ్రహ్మ తటస్థలక్షణం నిర్వచనం – అభిన్న, వివర్త, నిమిత్త, ఉపాదానకారణం.

**ఉపాదానకారణం** – మెటీరియల్ కాజ్. కుండకి మట్టి మెటీరియల్ కాజ్.

**నిమిత్తకారణం** – ఇంటిలిజెంట్ కాజ్. మట్టి దానంతట అది కుండ అవలేదు. దానికొక కుమ్మరి కావాలి. కాని సృష్టి విషయంలో బ్రహ్మ ఉపాదానకారణం, బ్రహ్మ నిమిత్తకారణం కూడా.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ**
**యథా పృథివ్యామ్ ఓషధయః సంభవన్తి।**
**యథా సతః పురుషాత్ కేశలోమాని**
**తథాఽక్షరాత్ సంభవతీహ విశ్వమ్॥ – ముండకమ్ 1.1.7**

సాలె పురుగునుంచి సాలెగూడు వచ్చినట్టు, జీవమున్న మనిషినుంచి వెంట్రుకలు పుట్టినట్టు, బ్రహ్మనుంచే సమస్త జగత్తు పుట్టింది.

**వివర్త కారణం –** వివర్త ఎందుకంటే బ్రహ్మనుంచే సమస్త జగత్తూ పుట్టినా, బ్రహ్మ పరిణామం చెందదు. పాలు తోడుపెడితే పెరుగయినప్పుడు, పాలు పరిణామం చెందుతాయి. దాన్ని పరిణామకారణం అంటారు. కాని మనకు స్వప్నం వచ్చినప్పుడు, మననుంచే స్వప్నం పుట్టినా, మనం పరిణామం చెందము. అందుకని అది వివర్తకారణం లేదా అపరిణామకారణం అంటాము.

బ్రహ్మని వివర్తకారణం ఎందుకనాలి, పరిణామకారణం అనచ్చు కదా. అంటే రెండు లోపాలు ఉంటాయి. పరిణామకారణం అంటే దానికి మార్పు ఉన్నట్టు. అస్తి జాయతే లక్షణాలు బ్రహ్మకు ఆపాదించబడి బ్రహ్మ అశాశ్వతం అన్నట్టుగా అయిపోతుంది. రెండో కారణం జగత్తుకు బ్రహ్మలక్షణాలు వచ్చి జగత్తు కూడా సత్యం అవుతుంది. వివర్తకారణంలో కార్యం మిథ్య అవుతుంది. ఉదాహరణకు, స్వప్నం, ఎండమావులు. వివర్తకారణాన్ని అధిష్ఠానకారణం అని కూడా అంటారు.

**అభిన్నకారణం** – అభిన్న ఎందుకంటే భిన్నంగా కనిపించే ప్రపంచంలో అభిన్నంగా అంతటా ఏకంగా ఉన్నది బ్రహ్మ. **షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!**

**అభిన్న నిమిత్త వివర్త ఉపాదానకారణం –**ఇవన్నీ కలిపితే బ్రహ్మను **అభిన్న నిమిత్త వివర్త ఉపాదానకారణం** అంటారు. ఉపనిషత్తులలో స్వరూపలక్షణంకన్నా ఇదే ఎక్కువగా వస్తుంది. బ్రహ్మసూత్రములలో కూడా **రెండవ సూత్రం – జన్మాద్యస్య యతః**

ఇలా సృష్టి గురించి చెప్పటంవల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి. జ్ఞాతప్రపంచంద్వారా అజ్ఞాతబ్రహ్మను తెలుసుకోవటం. **విశ్వమే విష్ణువు!!** తెలియని బ్రహ్మను తెలిసిన ప్రపంచంద్వారా తెలుసుకోవాలి. సృష్టి, స్థితి, లయ కారకుడని అర్థం చేసుకోవటం.

2. **అద్వైత సిద్ధిః** – బ్రహ్మ ఉపాదాన కారణం అనేసరికి బ్రహ్మకు వ్యతిరిక్తంగా ఏదీ లేదు అని తేలికగా తెలుసుకుంటాము. జలం వ్యతిరిక్తం తరంగం నాస్తి, కారణం వ్యతిరిక్తం కార్యం నాస్తి. అది ఎప్పుడైతే అర్థమవుతుందో అప్పుడు మనలో అద్వైతభావన నెలకొంటుంది.

**మంత్రం వివరణ:-** ఈ మంత్రంలో సృష్టిని షోడశకలాః గా వివరిస్తోంది ఉపనిషత్తు. షోడశకల = నిష్కలం బ్రహ్మ అని నిరూపించాలి. ఎలా? షోడశకల ప్రపంచం నిష్కలం బ్రహ్మనుంచి పుట్టి(అధ్యారోపం) మళ్ళీ నిష్కలం బ్రహ్మలోకి లయమవుతుందని (అపవాదం) చూపించాలి. ఇందులో పరం బ్రహ్మకి కొత్త పేరు **షోడశ కలం పురుషమ్**. **యస్మిన్ ఏతాః షోడశకలాః ప్రభవన్తి** – బ్రహ్మనుంచి ఈ షోడశకలా ప్రపంచం ఉద్భవమైంది. తర్వాత ఆ షోడశకలలు అంటే ఏమిటో వివరణ వస్తుంది.

## మంత్రం - 3

**స ఈక్షాంచక్రే కస్మిన్నహముత్క్రాన్త ఉత్క్రాన్తో భవిష్యామి కస్మిన్ వా ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామీతి ॥ 3 ॥**

**ప్రతిపదార్థం:** కస్మిన్ – ఎవరు; ఉత్క్రాన్తే– బయటకు పోవటంచేత; అహమ్ – నేను; ఉత్క్రాంతో భవిష్యామి – బయటకు పోయిన వాడిలా అవుతాను; కస్మిన్– ఎవరు; ప్రతిష్ఠితే – నెలకొని ఉంటే; ప్రతిష్ఠాస్యామి – నేను నెలకొని ఉంటాను; ఇతి – అని; సః– ఆత్మ; ఈక్షాంచక్రే– ఆలోచించింది.

**తాత్పర్యం:** ఎవరు బయటకు పోవటంచేత నేను బయటకు పోయిన వాడిలా అవుతాను, ఎవరు నెలకొని ఉంటే, నేను నెలకొని ఉంటాను అని ఆత్మ ఆలోచించింది.

**వివరణ:** సృష్టిచేసేముందు ఆత్మ ఆలోచించింది. బ్రహ్మ కేవలం ఉపాదానకారణం అంటే నిమిత్తకారణం ఎవరు అన్న ప్రశ్న వస్తుంది. మట్టి కుండగానూ, బంగారం నగగానూ వాటంతట అవి తయారవలేవు కదా! వాటికొక సృష్టికర్త కావాలి. దాన్ని నిమిత్తకారణం అంటారు. నిమిత్తకారణం జడం కాదు. అది చూపించటానికే ఉపనిషత్తు స ఐక్షత, సోఽ కామయత, స తపోఽ తప్యత వంటి పదాలు వాడుతుంది. బ్రహ్మే నిమిత్తకారణం అనటానికి ముండకోపనిషత్తులో **యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ** అన్న ఉదాహరణ చూశాము.

ఏది ఉంటే నేను అనే చైతన్యం ఉండి, ఏది లేకపోతే నేను కనబడను అని ఆత్మ ఆలోచించిందిట. అలా ఆలోచించి ప్రాణాన్ని మొదట సృష్టించింది. ఎందుకంటే ముందు అధ్యాయాల్లో చూశాము. ప్రాణం బయటకి వెళ్ళినట్టు చేస్తే అన్నీ వెళ్ళినంత పని అయింది. ప్రాణం ఆగితే అన్నీ ఆగాయి.

**సోఽభిమానాదూర్ధ్వముత్క్రమత ఇవ తస్మిన్నుత్క్రామత్యథేతరే సర్వ**
**ఏవోత్క్రామన్తే తస్మిగ్ంశ్చ ప్రతిష్ఠమానే సర్వ ఏవ ప్రతిష్ఠన్తే। 2.4**

ప్రాణం వెళ్ళినట్టు చేస్తే 19 అంగాలు వెళ్ళాల్సినంత పని అయింది. పంచభూతాలూ, పంచజ్ఞానేంద్రియాలూ, పంచకర్మేంద్రియాలూ, చత్వారి అంతఃకరణాని కలిపి 19 అంగాలు అయ్యాయి. అవి పంచప్రాణాలమీద ఆధారపడ్డాయి. వాటితో కలిపితే 24 అంగాలు అవుతాయి సూక్ష్మశరీరంలో ఉన్నవి. కాని ఈ మంత్రంలో ప్రపంచంలో 16 అంగాలు ఏమిటో చూస్తాము.

అంతేకాదు మొదటి అధ్యాయంలో మిథునసృష్టిద్వారా సృష్టిప్రకరణం చెప్తే, ఇక్కడ షోడశకలా ప్రపంచరూపంలో సృష్టిప్రకరణం వస్తున్నది.

**మంత్రం - 4**

**స ప్రాణమసృజత ప్రాణాచ్ఛ్రద్ధాం ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీన్ద్రియం మనః।అన్నమన్నాద్వీర్యం తపో మన్త్రాః కర్మ లోకా లోకేషు చ నామ చ ॥4॥**

**ప్రతిపదార్థం:** సః – ఆత్మ; ప్రాణమ్ – ప్రాణాన్ని; అసృజత – సృష్టించింది; ప్రాణాత్ – ప్రాణంనుంచి; శ్రద్ధామ్ – శ్రద్ధ; ఖమ్ –ఆకాశం; వాయుమ్ – వాయువు; జ్యోతిః – అగ్ని; ఆపః – నీరు; పృథివీ– భూమి; ఇన్ద్రియమ్ – ఇంద్రియాలు; మనః – మనస్సు; అన్నమ్ – ఆహారం; అన్నాత్– ఆహారంనుంచి; వీర్యమ్ – శక్తి; తపః – తపస్సు; మన్త్రాః – మంత్రాలు; కర్మ – క్రియలు; లోకాః – లోకాలు; లోకేషు – లోకాలలో; నామ చ – పేర్లు.

**తాత్పర్యం:** ఆత్మ ప్రాణాన్ని సృష్టించింది. ప్రాణంనుంచి శ్రద్ధ, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి, ఇంద్రియాలు, మనస్సు, ఆహారం ఉద్భవించాయి. ఆహారంనుంచి శక్తి, తపస్సు, మంత్రాలు, క్రియలు, లోకాలు ఉద్భవించాయి. లోకాలలో పేర్లు సృష్టించబడ్డాయి.

**వివరణ:** 1. ప్రాణం 2. శ్రద్ధ 3. ఆకాశం, 4. వాయువు 5. అగ్ని. 6. నీరు, 7. భూమి, 8. ఇంద్రియాలు, 9. మనస్సు, 10.అన్నం, 11. వీర్యం,12.తపస్సు 13. మంత్రాలు, 14. కర్మ 15. లోకాలు, 16. లోకాలలో పేర్లను ఆత్మ సృష్టించింది.

1. **ప్రాణం:**- ఆత్మ మొదట ప్రాణాన్ని సృష్టించింది. ప్రాణం అంటే సమష్టి ప్రాణం. హిరణ్యగర్భ లేదా సూత్రాత్మ. దానినుంచి 15 కళలను సృష్టించింది.

2. **శ్రద్ధః** - తర్వాత మనుష్యులను, వేదాలనూ సృష్టించింది. వేదాలు ఉండగానే చాలదు, వాటిమీద శ్రద్ధ ఉంటేనే వాటి విధి, నిషేధాలను శ్రద్ధగా పాటించగలరు.

3-7 **ఆకాశంనుంచి భూమివరకూ** పంచభూతాలు. వాటిని ఒక్కొక్కటిగా పేర్కొంది.

8 **ఇంద్రియాలు**- పది. ఉపనిషత్తు అన్నింటినీ కలిపి ఒక్క ఇంద్రియంగా పేర్కొంది. అంతకుముందు ఆత్మలో ఏవి లయిస్తాయంటే ఒక్కొక్క ఇంద్రియాన్ని, దాని భోగ్య విషయాన్ని విడివిడిగా పేర్కొంది. **చక్షుశ్చ ద్రష్టవ్యం చ శ్రోత్రం చ శ్రోతవ్యం చ ఘ్రాణం చ ఘ్రాతవ్యం చ రసశ్చ రసయిత్వం చ, త్వక్చ స్పర్శయితవ్యం చ** - పంచజ్ఞానేంద్రియాలు, వాటి విషయాలు.

**వాక్ చ వక్తవ్యం చ, హస్తౌ చాదాతవ్యం చోపస్థశ్చానందయితవ్యం చ పాయుశ్చ విసర్జయితవ్యం చ పాదౌ చ గన్తవ్యం చ** - పంచ కర్మేంద్రియాలు, వాటి విషయాలు చెప్పుకొచ్చింది. ఇక్కడ టూకీగా ఇంద్రియాలు అంది.

9. **మనః** - మనస్సు అంటే చత్వారి అంతఃకరణాన్ని కలిపి ఒక్కటిగా పేర్కొంది. **మనశ్చ మన్తవ్యం చ బుద్ధిశ్చ బోద్ధవ్యం చాహంకారశ్చాహంకర్తవ్యం చ చిత్తం చ చేతయితవ్యం చ** - నాలుగు అంతఃకరణాలు, వాటి విషయాలు.

10. **అన్నమ్** - ఆహారం.

11. **వీర్యమ్** - శక్తి. అన్నాత్పురుష అని తైత్తిరీయలో వస్తుంది.

**అన్నం వై ప్రజాపతిస్తతో హ వై తద్రేతస్తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి॥ 1.14** ఆహారంనుంచి రేతస్సు, దాన్నించి ప్రాణులు ఉద్భవిస్తాయి.

12. **తపస్సు** - కర్మలు సరిగ్గా చేయకపోతేనో, ఏదైనా తప్పు చేస్తేనో ప్రాయశ్చిత్తంగా చేసేది తపస్సు. కర్మచేసే స్వేచ్ఛ ఉంటే మనుష్యులు తప్పులు చేస్తారు. దానికి ప్రాయశ్చిత్తం ఉంటే కొంచెం తగ్గుతారు. ఉదాహరణకు, సంధ్యావందనం చేయాల్సినప్పుడు చేయకపోతే, దానికి ప్రాయశ్చిత్తంగా మళ్ళీ ఎక్కువసార్లు చేయాల్సి ఉంటుంది.

13 **మంత్రః** - మంత్రాలు. కర్మలకీ, యజ్ఞయాగాదులకీ, ఉపాసనకీ వాడే మంత్రాలు.

14. **కర్మ** - కర్మ అంటే చేయాల్సిన పనులు చేయటం. అంటే యజ్ఞ, యాగాదులు చేయటం. ఉపాసన కూడా కలుపుకోవాలి.

15. **లోకాః** – కర్మ చేసినప్పుడు ఫలితం అనుభవించటానికి వెళ్ళే లోకాలు – భూః, భువః, సువః, మహః, తపః, జనః, సత్య ఊర్ధ్వలోకాలు, అతల, వితల,సుతల, రసాతల, మహాతల తలాతల పాతాళ అధోలోకాలు.

16. **నామః** – లోకాలలో పేర్లు. అన్ని లోకాలు, అన్ని వస్తువులూ ఉన్నప్పుడు వాటికి నామాలు ఉండాలి కదా. మనిషి పుట్టగానే పేరు పెడతారు, పోగానే ఆ మనిషినీ పేరునూ జనులు మర్చిపోతారు.

**మంత్రం - 5**

**స యథేమా నద్యః స్యన్దమానాః సముద్రాయణాః సముద్రం ప్రాప్యాస్తం గచ్ఛన్తి భిద్యేతే తాసాం నామరూపే సముద్ర ఇత్యేవం ప్రోచ్యతే । ఏవమేవాస్య పరిద్రష్టురిమా షోడశ కలాః పురుషాయణాః పురుషం ప్రాప్యాస్తం గచ్ఛన్తి భిద్యేతే చాసాం నామరూపే పురుష ఇత్యేవం ప్రోచ్యతే స ఏషోఽ కలోఽ మృతో భవతి తదేష శ్లోకః ॥ 5 ॥**

**ప్రతిపదార్థం:** సః యథా– ఎలా; ఇమాః నద్యః – ఈ నదులు; స్యన్దమానాః – కిందికి ప్రవహిస్తున్నవి; సముద్రాయణాః – సముద్రమనే గమ్యం; సముద్రం ప్రాప్య– సముద్రం చేరగానే; అస్తం గచ్ఛన్తి – అదృశ్యమైపోతాయి; తాసాం – వాటి; నామరూపే– నామరూపాలు; భిద్యేతే – నశిస్తాయి; సముద్రః ఇతి ఏవం – సముద్రం అని మాత్రమే; ప్రోచ్యతే – చెప్పబడుతున్నాయో; ఏవం ఏవ – ఆ విధంగానే; అస్య– ఈ; ఇమాః షోడశకలాః – ఆత్మనుంచి వచ్చిన పదహారు అంగాలు; పురుషాయణా– ఆత్మను కోరి; పురుషం ప్రాప్య– ఆత్మను చేరి, అస్తం గచ్ఛన్తి– అదృశ్యమవుతాయి; చాసాం – వాటియొక్క; నామరూపే – నామరూపాలు; భిద్యేతే– నశిస్తాయి; పురుషః– ఆత్మ; ఇతి ఏవం – అని మాత్రమే; ప్రోచ్యతే– చెప్పబడుతాయి; సః ఏషః అకలః – ఈ ఆత్మకు అంగాలు లేవు; అమృతో భవతి – అమరమైనదిగా అవుతుంది; తదేష శ్లోకః – దాని గురించి ఈ మంత్రం ఉంది.

**తాత్పర్యం:** ఎలా ఈ నదులు, కిందకి ప్రవహిస్తున్నవి, సముద్రమనే గమ్యం చేరగానే అదృశ్యమైపోయి, వాటి నామరూపాలు నశించిపోయి, సముద్రం మాత్రమే అని చెప్పబడుతున్నాయో, ఆ విధంగానే, ఈ ఆత్మనుంచి వచ్చిన పదహారు అంగాలు ఆత్మను కోరి, ఆత్మను చేరి, అదృశ్యమైపోయి; వాటి నామరూపాలు నశించి; ఆత్మ అని మాత్రమే చెప్పబడుతాయి. ఈ ఆత్మకు అంగాలు లేవు. అమరమైనదిగా అవుతుంది. దాని గురించి ఈ మంత్రం ఉంది.

**వివరణ:** ఇంతకు ముందు సృష్టి గురించి చూసాము. స్థితి గురించి ప్రత్యేకంగాచెప్పటం లేదు. లయ గురించి వస్తుంది. అధ్యారోపం అయిపోయింది. ఇప్పుడు అపవాదం. నదులన్నీ సముద్రంలో కలిసినప్పుడు అవి వాటి నామరూపాలను కోల్పోయి, సముద్రంగా పేరు పొందుతాయి. అలాగే నిష్కలబ్రహ్మనుంచి వచ్చిన సమస్త సృష్టి ప్రళయకాలంలో మళ్ళీ నిష్కలబ్రహ్మతో లయమయినప్పుడు, వాటి నామరూపాలను కోల్పోతుంది. షోడశకలాః ప్రపంచం కాస్తా షోడశకలః అధిష్ఠానం బ్రహ్మలో కలిసి నిష్కలంబ్రహ్మ అవుతుంది. బ్రహ్మకు కలలు లేవు. అక్కడే **సః ఏషః అకలః** అని ఒక పదం వేసింది ఉపనిషత్తు.

**షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!**

ఈ ప్రపంచం ప్రళయంలో బ్రహ్మతో లయమవుతుంది. జ్ఞానం పొందితే, జ్ఞానికి ప్రపంచమనే మిథ్య, పురుషః అనే సత్యంలో లయమవుతుంది. అలా జ్ఞాని జగత్‌మిథ్య, బ్రహ్మ సత్యం అని తెలుసుకుంటాడు. అతను అమృతం (ఆనందం) పొందుతాడు. ఈ విషయం వివరించటానికి ఉపనిషత్తు, మరో ఉపనిషత్తు మంత్రాన్ని చెబుతోంది.

**మంత్రం - 6**

**అరా ఇవ రథనాభౌ కలా యస్మిన్ ప్రతిష్ఠితాః ।**
**తం వేద్యం పురుషం వేద యథా మా వో మృత్యుః పరివ్యథా ఇతి॥6॥**

**ప్రతిపదార్థం:** రథనాభౌ – రథ చక్రపు ఇరుసులో; అరాః ఇవ– ఆకులలాగా; యస్మిన్ – ఎవరిలో; కలాః ప్రతిష్ఠితాః – పదహారు అంగాలు నెలకొని ఉన్నాయో; వేద్యమ్ – తెలుసుకోదగిన; తమ్ –ఆ; పురుషం వేద– ఆత్మను తెలుసుకోండి; యథా – అలా (తెలుసుకుంటే); వః – మిమ్మల్ని; మృత్యుః మా పరివ్యథాః– మరణం బాధించదు; ఇతి – అని.

**తాత్పర్యం:** రథచక్రపు ఇరుసులో ఆకులలాగా, ఎవరిలో పదహారు అంగాలు నెలకొని ఉన్నాయో, తెలుసుకోదగిన ఆ ఆత్మను తెలుసుకోండి. అలా (తెలుసుకుంటే) మిమ్మల్ని మరణం బాధించదు.

**వివరణ:** ఇది ఇంకో ఉపనిషత్తు మంత్రం. అరా ఇవ రథనాభౌ ఉదాహరణ చాలా ఉపనిషత్తులలో వస్తుంది. ఆ మాటకొస్తే ఇందులో కూడా ఉంది.

**అరా ఇవ రథనాభౌ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్ – 2.6**

ప్రాణస్తుతి చేస్తున్నప్పుడు, అక్కడ అన్నీ ప్రాణంలో నెలకొని ఉన్నాయంది. నిజానికి ప్రాణం కూడా ఆత్మలో నెలకొని ఉన్నది కదా! అది ఈ మంత్రంలో స్పష్టమవుతుంది. రథంలోని ఆకులు తిరుగుతాయి కాని, ఇరుసు తిరగదు. తిరగని ఇరుసు, తిరిగే ఆకులకు అధిష్ఠానం. అలా కదిలే ప్రపంచానికి కదలని ఆత్మ అధిష్ఠానం. లైటుహౌస్ దీపకాంతి మూడు రంగుల్లో తిరుగుతూ కనిపిస్తుంది. నిజానికి లైటుహౌస్‌లో చూస్తే, ఒక్కటే తెల్లకాంతి తిరక్కుండా ఉంటుంది. దాని ప్రతిబింబం మూడుగానూ, తిరుగుతూనూ కనిపిస్తుంది.
**పురుషం వేద**– ఉపనిషత్తు ఆత్మ గురించి తెలుసుకుని తీరాలని, ఒక విధిగా చెబుతోంది.
**మా వో మృత్యుః పరివ్యథాః**– మృత్యువు జ్ఞానిని బాధించదు.

పరోక్షంగా అడిగిన ప్రశ్న –
**షోడశకలం పురుషం వేత్థ?** – పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా?
**స ప్రాణమసృజత। ప్రాణాచ్ఛ్రద్ధాం ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీన్ద్రియం।**
**మనః అన్నమన్నాద్వీర్యం తపో మన్త్రాః కర్మలోకా లోకేషు చ నామ చ ॥**

ప్రాణం, శ్రద్ధ, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి, ఇంద్రియాలు, మనస్సు, అన్నం, వీర్యం, తపస్సు, మంత్రాలు, కర్మ, లోకాలు,లోకాలలో పేర్లు – పదహారు కళలు.

## మంత్రం - 7

**తాన్ హోవాచైతావదేవాహమేతత్పరం బ్రహ్మ వేద। నాతః పరమస్తీతి॥ 7॥**

**ప్రతిపదార్థం:** తాన్– వారితో; ఉవాచ హ – చెప్పాడు; అహమ్ – నాకు; ఏతత్పరంబ్రహ్మ– ఈ పరమమైన బ్రహ్మ గురించి; వేద– తెలిసింది; ఏతావత్ ఏవ–ఇంతే; అథః పరం– ఇంతకుమించి; న అస్తి– ఏదీ లేదు; ఇతి – అని.

**తాత్పర్యం:** వారితో చెప్పాడు; 'నాకు ఈ పరమమైన బ్రహ్మ గురించి తెలిసినది ఇంతే. ఇంతకుమించి ఏదీ లేదు.'

**వివరణ:** ఈ మంత్రంలో పిప్పలాద మహర్షి ఆరుగురు శిష్యులతోనూ చెప్పాడు. 'సర్వోత్కృష్టమైన ఆత్మ గురించి నాకు తెలిసిందింతే. నాకు తెలిసినదంతా చెప్పాను.' మీ ఇష్టప్రకారం ప్రశ్నలు అడగండి. నాకు తెలిస్తే తప్పకుండా నాకు తెలిసినదంతా చెబుతాను అని మాట ఇచ్చాడు. అలాగే 'ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను. నాకు తెలిసిందింతే,' అంటే, ఇంకా తెలుసుకోవాల్సింది ఉందా? వేరే గురువు దగ్గరకి వెళ్లాలా

అన్న ప్రశ్న ఉదయించవచ్చు. అందుకని దాన్ని ప్రస్ఫుటం చేసాదు. **నః అతః పరం అస్తి**– ఇంతకు మించి తెలుసుకోవాల్సింది లేదు అని స్పష్టం చేశాడు.

**మంత్రం - 8**

**తే తమర్చయన్తస్త్వం హి నః పితా యోఽస్మాకమవిద్యాయాః పరం పారం తారయసీతి । నమః పరమ ఋషిభ్యో నమః పరమఋషిభ్యః ॥8॥**

**ప్రతిపదార్థం:** తే – ఆ ఆరుగురు శిష్యులూ ; తం– మహర్షిని; అర్చయన్తః – పూజించి; త్వం హి– మీరే; నః పితా– మాకు తండ్రి; యః అస్మాకమ్ – మీరు మమ్మల్ని; అవిద్యాయాః – అజ్ఞాన సాగరంయొక్క; పరం పారం – పరమమైన ఆవలి తీరానికి; తారయసి– దాటించారు; పరమ ఋషిభ్యః – మీకు, మీ గురువులకు; నమః – నమస్సులు; పరమ ఋషిభ్యః – మీకు, మీ గురువులకు; నమః – నమస్సులు.

**తాత్పర్యం:** ఆ ఆరుగురు శిష్యులూ మహర్షిని పూజించి – మీరే మాకు తండ్రి. మీరు మమ్మల్ని అజ్ఞానసాగరంయొక్క పరమమైన ఆవలి తీరానికి దాటించారు, మీకు, మీ గురువులకు మా నమస్సులు; మీకు, మీ గురువులకు మా నమస్సులు.

**వివరణ:** అంత ఓపిగ్గా తమకువిద్య బోధించిన గురువును ఆ ఆరుగురు శిష్యులూ పూజించి, కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మీరే మా తండ్రి అన్నారు. ప్రతి పురుషునికీ ఐదుగురు పితృసమానులు ఉంటారు. జన్మనిచ్చిన తండ్రి, ఉపనయనం చేసిన బ్రాహ్మణుడు, విద్య బోధించిన గురువు, అన్నదాత, భయం పారద్రోలిన వ్యక్తి (అజ్ఞాన జనిత భయాన్ని పారద్రోలి జ్ఞానాన్ని బోధించిన గురువు). ఈ మంత్రంద్వారా మన సంప్రదాయం కూడా తెలుస్తుంది. ఆత్మవిద్య స్వయంగా నేర్చుకుంటే రాదు. అది గురుపరంపరగా వస్తుంది. వారి గురువు వారికి బోధిస్తే, ఆ గురువుకు ఇంకో గురువు ఉంటాడు. వారందరికీ నమస్కారం.

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥**

రెండుసార్లు **నమః పరమ ఋషిభ్యో నమః పరమ ఋషిభ్యః** అనటంలో రెండు కారణాలున్నాయి. మళ్ళీ చెప్పటంలో ఒక అర్థం, దాన్ని నొక్కి వక్కాణించటం.రెండోది ఇంతటితో ఈ ఉపనిషత్తు ముగిసిందని చెప్పకనే చెప్పటం.

**గురు పరంపరలో మాకు సాక్షాత్ గురువులైన పూజ్య స్వామి దయానంద సరస్వతి గారికి స్వామి పరమార్థానంద గారికి మా నమస్సుమాంజలులు.**

**అధ్యాయం - 6 టూకీగా**

సుకేశ భారద్వాజ అనే శిష్యుడు పిప్పలాద మహర్షిని అడిగాడు.

**క్వాసౌ పురుషః –** ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

**ఇహైవాన్తః శరీరే–** అంతః కరణంలో ఉన్నాడు

పరోక్షంగా అడిగిన ప్రశ్న –

**షోడశకలం పురుషం వేత్థ?** **–** పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా? .

**స ప్రాణమసృజత। ప్రాణాచ్ఛ్రద్ధాం ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీన్ద్రియం ।**
**మనః అన్నమన్నాద్వీర్యం తపో మన్త్రాః కర్మలోకా లోకేషు చ నామ చ ॥**

ప్రాణం, శ్రద్ధ, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి, ఇంద్రియాలు, మనస్సు, అన్నం, వీర్యం, తపస్సు, మంత్రాలు, కర్మ, లోకాలు, లోకాలలో పేర్లు– పదహారు కళలు.

**షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!**

షోడశకలా ప్రపంచం నిష్కలం పురుషుణ్ణుంచి పుట్టి, షోడశకళల అధిష్ఠానం పురుషునిలో లయం చెంది నిష్కల పురుషునిగా అవుతుంది.

## శాంతి పాఠం

**ఓం భద్రం కర్ణేభిశ్శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః ॥**

ఓ దేవతలారా! మేం చెవులతో మంచి విషయాలు విని, కన్నులతో మంచి దృశ్యాలను చూసాము. దృఢమైన అవయవాలతో కూడిన దేహాలతో మిమ్మల్ని స్తుతించాము. మాకు ఇంద్రుడు, సూర్యుడు, గరుత్మంతుడు, బృహస్పతి మేలుకలగజేసి మేము ప్రశ్నోపనిషత్తుని ఆసాంతం విని, చదివి, జ్ఞానం పొందగలిగేలా చేసినందుకు కృతజ్ఞతలు. అధిభౌతిక, అధిదైవిక, అధ్యాత్మిక విఘ్నాలు కలగనందుకు కృతజ్ఞతలు.

# సారాంశం

**ఉపోద్ఘాతం–**

శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తుల్లో ప్రశ్నోపనిషత్ ఒకటి. ఈ ఉపనిషత్ అథర్వణ వేదానికి చెందినది. ముండకోపనిషత్, మాండూక్యోపనిషత్ కూడా ఈ వేదానికి చెందినవే.

ముండకోపనిషత్‌ను సంహితోపనిషత్ అనీ, ప్రశ్నోపనిషత్‌ను బ్రాహ్మణోపనిషత్ అనీ అంటారు. సంహితోపనిషత్ వేదపూర్వభాగంలో వస్తే, బ్రాహ్మణోపనిషత్ వేద అంతభాగంలో వస్తుంది. సాధారణంగా బ్రాహ్మణోపనిషత్‌ను, సంహితోపనిషత్‌మీద వ్యాఖ్యానంగా పరిగణిస్తారు. ఆ విధంగా ప్రశ్నోపనిషత్‌ను ముండకోపనిషత్‌కు వ్యాఖ్యానం అని చెప్పవచ్చు.

ప్రశ్నోపనిషత్‌కు ఆ పేరెలా వచ్చింది? ఈ ఉపనిషత్ కూడా గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటుంది. గురువు పిప్పలాద ఋషి. ఆయనను ఆరుగురు శిష్యులు ప్రశ్నలు వేయటంవల్ల ప్రశ్నోపనిషత్ అనే పేరు వచ్చింది. ప్రశ్నలు అంటే జవాబులు కూడా ఉంటాయని అర్థం చేసుకోవాలి. ఒక్కొక్క శిష్యునితో గురువుయొక్క సంవాదం ఒక్కొక్క అధ్యాయంగా వచ్చింది. అందువల్ల ఇందులో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. అన్ని అధ్యాయాల్లోనూ గురువు ఒక్కరే, శిష్యులే మారతారు. శిష్యుల పేర్లు ఆయా అధ్యాయాలలోకి వెళ్ళినప్పుడు చూద్దాము. ఈ ఆరు అధ్యాయాలలో మొత్తం 67 మంత్రాలు ఉన్నాయి. అందువల్ల కొంచెం పెద్ద ఉపనిషత్తే అని చెప్పవచ్చు.

**శాంతిపాఠం–**

ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. అథర్వణ వేదానికి ఉన్న శాంతిపాఠం.

**ఓం భద్రం కర్ణేభిశ్శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్‌క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతుః॥**
**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః ॥**

ఈ శాంతిపాఠం సారాంశం మాత్రం చూద్దాము. దీని ద్వారా శిష్యుడు రెండు వరాలు కోరతాడు. రెండూ వేదాంత అధ్యయానికి తోడ్పడే వరాలు.

1. **జ్ఞానయోగ్యతా ప్రాప్తి** – వేదాంత అధ్యయనం చేయాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. అంటే ఇవి చాలా దీర్ఘకాలం చేయాలి. దానికోసం దీర్ఘాయుష్షు కావాలి. అందులోనూ వేదాంతానికి రావటమే చాలా ఆలశ్యంగా రావటం జరుగుతుంది.

**వ్యశేమదేవ హితం యుదాయుః**

ఆయురారోగ్యాభివృద్ధిరస్తు అని దీవిస్తారు కదా! అలా దీర్ఘాయుష్షుతోపాటు మంచి ఆరోగ్యం కూడా ఉండాలని కోరుతున్నాడు శిష్యుడు. ఆరోగ్యంలో ఒక్క శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, అన్ని అంగాలు విద్యను అందుకునేటట్టుగా ఉండాలి. చెవులతో మంచి విషయాలు వినాలి. కనులతో మంచి దృశ్యాలు చూడాలి.

2. **ప్రతిబంధ నివృత్తి** – ఆత్మజ్ఞానం పొందేటప్పుడు ఆటంకాలు లేకుండుగాక అంటున్నాడు.

**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః ...**

ఇంద్రుడు, సూర్యుడు, గరుత్మంతుడు, బృహస్పతి మాకు శుభం కలిగించాలి.

**విహంగ వీక్షణం**

ఇప్పుడు ఉపనిషత్తులోకి అడుగు పెడదాము. ఆరు అధ్యాయాల్లో మొదటి నాలుగు ఆత్మానాత్మ వివేకం చేస్తాయి. అనాత్మ అంటే శరీరత్రయం, ఆత్మ అంటే శరీరత్రయ విలక్షణంగా ఉన్న చైతన్యం. కాకపోతే ఇంత స్పష్టంగా ఈ ఆత్మానాత్మవివేకాన్ని వివరించలేదు. పరోక్షంగా వీటి భావం శరీరత్రయ విలక్షణ ఆత్మ వివేకం.

ఆరు అధ్యాయాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| అధ్యాయం | 1 | – స్థూలశరీర ప్రధానం |
| | 2, 3 | – సూక్ష్మశరీర ప్రధానం |
| | 4 | – కారణశరీర + ఆత్మ ప్రధానం |
| | 5 | – ఓంకార ఉపాసన – క్రమముక్తికోసం |
| | 6 | – బ్రహ్మ ప్రతిపాదనం – షోడశ కల పురుషః |

**అధ్యాయం 1 – స్థూల శరీర ప్రధానం – మంత్రాలు 16**

ఈ అధ్యాయంలో శిష్యుని పేరు కబంధీ కాత్యాయనః. ఈ శిష్యుడు పిప్పలాద ఋషిని సృష్టిప్రకరణం గురించి అడిగాడు.

**ఇమాః ప్రజాః ప్రజాయన్త ఇతి** – ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?

దీనికి జవాబుగా సృష్టిప్రకరణం వస్తుంది. అది చివరికి స్థూలశరీర సృష్టికి దారితీస్తుంది.

ఇందులో మిథునాత్మక సృష్టి గురించి వస్తుంది. ఇది చాలా ప్రత్యేకమైన పద్ధతి. మామూలుగా సృష్టిలో రెండు భిన్నవస్తువులు ఉన్నాయని చూస్తాము. వాటిని ద్వంద్వాలు అంటారు. లాభనష్టాలు, సుఖదుఃఖాలు, రాత్రీపగలు. కాని ఈ ఉపనిషత్ ఈ ద్వంద్వాలను రెండు భిన్నవస్తువులుగా చూడవద్దు అంటుంది. అవి చూడటానికి విభిన్నంగా, వ్యతిరేకంగా ఉన్నట్టు అనిపించినా, అవి రెండూ కలిస్తేనే ఆ వస్తువు పరిపూర్ణం అవుతుంది. పుట్టుక చావు కలిస్తేనే జన్మ; రాత్రీ పగలు కలిస్తేనే రోజు. రెండూ విరుద్ధస్వభావాలైనా ఒకటి లేనిదే ఇంకొకటి లేదు. అర్ధనారీశ్వరతత్త్వం అన్నమాట.

ఇలాంటి మిథున జంటలను కొన్ని ఇచ్చాడు పిప్పలాద గురువు.

1. **ప్రాణ–రయి మిథునం** – ప్రాణం భోక్తృప్రపంచాన్ని సూచిస్తే, రయి భోగ్యప్రపంచాన్ని సూచిస్తుంది. అంటే సబ్జెక్ట్–ఆబ్జెక్ల మధ్య సంబంధాన్ని సూచిస్తున్నది. ఆబ్జెక్టు లేకుండా సబ్జెక్ట్ మాత్రం ఉండి లాభం లేదు, సబ్జెక్ట్ లేకుండా ఆబ్జెక్ట్ ఉంటే అనుభవించేవారు ఉండరు.

2. **సూర్య–చంద్ర మిథునం** – సూర్యుడు భోక్తకు పోషణకారుడు. చంద్రుడు భోగ్యప్రపంచానికి, ముఖ్యంగా మనం తినే ఆహారానికి పోషణకారుడు. సూర్యుడు మనకు శక్తినిస్తే, చంద్రుడు ఆహారానికి శక్తినిస్తాడు.

3. **ఉత్తరాయణ–దక్షిణాయన మిథునం** – సూర్య, చంద్రుల గురించి వస్తే, కాలతత్త్వం గుర్తుకు రాకతప్పదు. సూర్యునివల్ల పగలు, రాత్రి ఏర్పడితే, చంద్రునివల్ల అమావాస్య, పౌర్ణమి తిథులు ఏర్పడతాయి.

ఈ సందర్భంలో పిప్పలాద ఋషి శుక్లగతి–కృష్ణగతుల మిథునం గురించి కూడా చెప్పటం జరిగింది.

కాలసృష్టిలో సంవత్సరపరంగా చూస్తే దక్షిణాయన–ఉత్తరాయణ మిథునం; మాసపరంగా చూస్తే కృష్ణపక్ష–శుక్లపక్ష మిథునం; రోజుపరంగా చూస్తే రాత్రి–పగలు మిథునం వస్తాయి.

4. **అన్న మిథునం** – ఇక్కడ అన్నంలో మిథునసృష్టి స్పష్టంగా ఇవ్వలేదు కాని మనం కలుపుకోవచ్చు. అన్నంనుంచి మనుష్యబీజం వస్తుంది. దాన్ని పురుషునిలో శుక్రమని, స్త్రీలో శోణితమనీ అంటారు. అంటే శోణిత–శుక్ర మిథునం.

**అన్నం వై ప్రజాపతిస్తతో హ వై తద్రేతస్తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి – 1.14**

స్త్రీ, పురుషులు తిన్న ఈ అన్నంనుంచి మనుష్యసృష్టి జరుగుతుంది. ఆ విధంగా సృష్టి గురించి మొదలుపెట్టి, స్థూలశరీర సృష్టివరకూ వచ్చాడు పిప్పలాద ఋషి. అందువల్లనే దీన్ని స్థూలశరీర ప్రధాన అధ్యాయం అన్నాము.

**కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయన్తే –** ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?

**తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి –** ప్రజాపతినుంచి ప్రజాసృష్టి వస్తుంది.

అనేక దశల తరువాత చివరికి ప్రజాసృష్టి వస్తుంది.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి మనం. పిప్పలాద ఋషి మిథునసృష్టి గురించి చెప్పినప్పుడు, భగవంతుడు సృష్టించాడు అనలేదు, భగవంతుడు మిథునం అయ్యాడు అన్నాడు అడుగడుగునా.

**సంవత్సరో వై ప్రజాపతిః, మాసో వై ప్రజాపతిః, అహోరాత్రో వై ప్రజాపతిః, అన్నం వై ప్రజాపతిః**

ప్రజాపతి అంటే హిరణ్యగర్భ అంటే భగవంతుడు. భగవంతుడే సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ జంట అయ్యాడు. దీన్ని ఒక పట్టికరూపంలో చూద్దాము.

**అధ్యాయం 1 టూకీగా – సృష్టి ప్రకరణం**

| సృష్టి | 1 | 2 |
|---|---|---|
| 1. మిథునసృష్టి | రయి | ప్రాణ |
| | మూర్తప్రపంచం | అమూర్తప్రపంచం |
| 2. లోకసృష్టి | చంద్రుడు | ఆదిత్యుడు |
| 3. కాలసృష్టి | | |
| సంవత్సరం | దక్షిణాయనం | ఉత్తరాయణం |
| నెల | కృష్ణపక్షం | శుక్లపక్షం |
| రోజు | రాత్రి | పగలు |
| 4. అన్నసృష్టి – రేతస్సు | శోణితం | శుక్రం |
| 5. మనుష్యసృష్టి | స్త్రీ | పురుషుడు |

| మార్గాలు | సూక్ష్మ సూచనలు |
|---|---|
| కేవల కర్మ చేస్తే కృష్ణగతిద్వారా స్వర్గలోకప్రాప్తి | – పునర్జన్మ |
| తపస్సు, బ్రహ్మచర్యం | – నిబంధనలు |
| ఉపాసన చేస్తే శుక్లగతిద్వారా బ్రహ్మలోకప్రాప్తి | – కేవలకర్మ చేసిన వారికి ప్రవేశం లేదు |
| అది కూడా ఆపేక్షిక అమృతత్వం | |
| వక్రబుద్ధి, అసత్యం, వంచన తగదు | – నిబంధనలు |

**అధ్యాయం 2 – సూక్ష్మశరీర ప్రధానం – మంత్రాలు 13**

ఇందులో భార్గవో వైదర్భిః పిప్పలాద ఋషిని అడిగి ప్రాణతత్త్వం గురించి తెలుసుకోవాలని అనుకున్నాడు. ఆ అర్థం వచ్చేలాగా మూడు ఉపప్రశ్నలు అడిగాడు. అవి –

1. **కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే?** – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు?
2. **కతర ఏతత్ప్రకాశయన్తే?** – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?
3. **కః పునరేషాం వరిష్ఠః?** – వారిలో ఎవరు శ్రేష్ఠులు?

రెండవ మంత్రంలో మొదటి రెండు ప్రశ్నలకూ జవాబులు వచ్చాయి.

**1. కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు?**

24 దేవతలు భరిస్తున్నాయి. పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు.పంచప్రాణాలు కూడా కలుపుకోవాలి.

**2. కతర ఏతత్ప్రకాశయన్తే – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?**

19 దేవతలూ వాటి పనిని స్తుతి చేసుకుంటున్నాయి. (పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు.)

**3. కః పునరేషాం వరిష్ఠః – వారిలో ఎవరు శ్రేష్ఠులు?**

ఈ ప్రశ్నకు జవాబుగా గురువు ఒక కథను చెబుతున్నాడు. ఈ ప్రశ్న అర్థం ధారణకర్త ఎవరు? అంటే ఏ దేవత ఉంటే, ప్రాణం ఉన్నట్టు? దీనికి జవాబు – ప్రాణతత్త్వం అని మనకు తెలుసు.

ప్రాణం శ్రేష్ఠం కాబట్టే ఎవరైనా మరణిస్తే అతనిలో ప్రాణం పోయింది అంటాము. ఎవరైనా మనని ఒకటే సతాయిస్తూంటే, నా ప్రాణం తీయకు అంటాము. ప్రాణశ్రేష్ఠత్వం చూడబోతున్నాము, కథ ద్వారా.

భార్గవో వైదర్భిఃకి వచ్చిన సందేహమే, మనిషిలో ఉన్న ఈ అంగాలకు కూడా ఒకసారి వచ్చాయిట. మాలో ఎవరు గొప్ప? అంటే అహంకార సమస్య. తమాషా చూశారా! ఈ అహంకార సమస్య కొత్తగా వచ్చింది కాదు, ఉపనిషత్తుల కాలంనుంచే ఉందన్నమాట. పంచప్రాణాలు తప్ప తక్కిన దేవతలు మేమే గొప్పవారము అంటున్నాయి.

**వయమేతద్బాణమవష్టభ్య విధారయామః – 2.2**

మేమే శరీరాన్ని భరిస్తున్నాము, మేమే ఈ శరీరాన్ని కలిపి ఉంచుతున్నాము అంటున్నాయి. మేము అంటే పంచభూతాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు, పంచజ్ఞానేంద్రియాలు.

**తాన్వరిష్ఠః ప్రాణ ఉవాచ। మా మోహమాపద్యథా – 2.3**

ప్రాణం అహం దెబ్బతిన్నది. తక్కిన దేవతలను మందలిస్తుంది. నేనే గొప్ప అనే మోహంలో మీరు పడకండి. నన్ను నేనే ఐదుగా విభజించుకుని ఈ శరీరాన్ని నిలబెడుతున్నాను అంటుంది. **తేఽ శ్రద్దధనా బభూవుః** – ఈ దేవతలు నమ్మలేదు. ప్రాణం లేనిపోని గొప్పలు చెప్పుకుంటున్నది అనుకున్నాయి. ఇలా మాటలతో లాభంలేదు, వాటికి గుణపాఠం చెప్పాలనుకుంది ప్రాణదేవత.

ప్రాణం పైకి వెళ్ళినట్టుగా చేసింది. నిజంగా వెళ్ళలేదు. వెళ్ళటానికి లేస్తేనే, తక్కినవన్నీ నీరసించిపోతున్నాయి. దానికి ఉపనిషత్తు ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నది. ఎలా తేనెటీగల రాజు వెళితే, తక్కినవన్నీ వెళతాయో, అతను ఒకచోట ఉంటే, తక్కినవన్నీ అక్కడ ఎలా ఉంటాయో, అలా వాక్కు (పంచకర్మేంద్రియాలు), మనస్సు (నాలుగు అంతఃకరణాలు), కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు) ప్రాణం వెంట వెళుతున్నాయి, వస్తున్నాయి. పంచభూతాలను ఇక్కడ చెప్పకపోయినా వాటిని కూడా కలుపుకోవాలి.

**తే ప్రీతాః ప్రాణం స్తున్వన్తి** – దీనివల్ల తక్కిన దేవతలకు గర్వభంగం అయి, అవి ప్రాణాన్ని స్తుతించసాగాయి. ఇక్కడ ప్రాణం అంటే సమష్టిప్రాణంగా తీసుకోవాలి. అన్నింటిలోనూ ఉన్న ప్రాణశక్తి. ఛాందోగ్యం, బృహదారణ్యక ఉపనిషత్తుల్లో కూడా ఈ కథ వస్తుంది. ఈ విధంగా ప్రాణాన్ని స్తుతించటం ద్వారా అహింస విలువయొక్క విలువ కూడా తెలుస్తుంది. ప్రాణం విలువ ప్రాణానిదే. అది ఒక సూక్ష్మక్రిమిలోని ప్రాణం అయినా కూడా.

తక్కిన దేవతలు ప్రాణస్తుతిని చేస్తాయి. సమష్టి ప్రాణమే అగ్నిశక్తిగా మండుతున్నది, సూర్యునిలా ప్రకాశిస్తున్నది, వానలా కురుస్తున్నది, ఇంద్రుడు, వాయువు, పృథివి, చంద్రుడులా విరాజిల్లుతున్నది. మూర్త, అమూర్త ప్రపంచంగా, దేవతల అన్నంగా భాసిల్లుతున్నది. నువ్వు వర్షం రూపంలో అన్నాన్ని తీసుకుని వస్తావు అని స్తుతిస్తాయి. 3వ ప్రశ్న మళ్ళీ చూస్తే –

3. **కః పునరేషాం వరిష్ఠః** – జవాబు – ప్రాణం.

ఈ విధంగా ఈ అధ్యాయంలో ప్రాణం శ్రేష్ఠత్వం నిరూపించబడి, ప్రాణస్తుతి కూడా జరుగుతుంది. ఈ దేవతలన్నీ, ప్రాణంతో సహా సూక్ష్మశరీరంలోని అంగాలు కాబట్టి, ఈ రెండవ అధ్యాయం సూక్ష్మశరీర ప్రధానం అని చూశాము.

**అధ్యాయం 3 – సూక్ష్మశరీర ప్రధానం – మంత్రాలు 12**

ఈ అధ్యాయంలో కౌసల్య ఆశ్వలాయనః పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. ఇతను కూడా ప్రాణం గురించే అడిగినా, వాటిని ఆరు ప్రశ్నలుగా తీసుకోవచ్చు.

1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?

2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి**? వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?

3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే**? – తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది?

4. **కేన ఉత్క్రమతే**– ఎలా బయటకు వెళుతుంది?

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?

6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

ఈ ప్రశ్నలకి జవాబులు చెప్పుకొస్తాడు గురువు.

ఆత్మనుంచి ఈ ప్రాణం పుట్టింది. ఈ ప్రాణం పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది.

**ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥ – గీత 15.10**

జీవితంలో జరిగే ప్రతి అనుభవం కూడా ఆత్మ అనుభవమే. ఆత్మ అంటే భగవంతుడు కాబట్టి జీవితంలో జరిగే ప్రతి అనుభవమూ, భగవంతుణ్ణి దర్శనం చేయిస్తుంది. నాస్తికుడు, 'భగవంతుడు లేడు,' అని చెప్పినా కూడా, భగవంతుడు లేడు అని చెప్పటానికి ఉన్న శక్తి ఎక్కడనుంచి వస్తున్నదనుకున్నారు? సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే. భగవంతుడు లేడు అనగలగటానికి కూడా భగవంతుని కృప ఉండాలి.

**ప్రాణస్య ప్రాణః శ్రోత్రస్య శ్రోత్రం** – కేన

ప్రాణానికి ప్రాణశక్తినిచ్చేది, చెవికి చెవిశక్తిని ఇచ్చేది ఆత్మ.

**ఆత్మన ఏష ప్రాణో జాయతే । యథైషా పురుషే ఛాయా**

ఆత్మనుంచి ప్రాణం పుట్టింది అని చెప్పే సందర్భంలో ఒక అద్భుతమైన మాట వేసింది ఉపనిషత్తు. పురుషునివల్ల ఏర్పడిన నీడలా, ఆత్మనుంచి ప్రాణం పుట్టింది అంటున్నది.

ఒక వ్యక్తి నిలుచున్నచోట అతని నీడ ఏర్పడుతుంది. ఛాయా అంటే నీడ. శంకరాచార్యులవారు ఈ వాక్యానికి భాష్యం చెబుతూ, ఛాయకు స్వతంత్రంగా ఉనికి లేదనీ, విడిగా ఉనికి లేనిది మిథ్య అనీ, అదే విధంగా ప్రాణం ఆత్మనుంచి నీడలా వచ్చింది అంటే ప్రాణం కూడా మిథ్య అనీ అంటారు.

1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?

**ఆత్మనః ఏష ప్రాణో జాయతే యథైష పురుషే ఛాయా** – ఆత్మనుంచి ఛాయలాగా పుట్టింది.

2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి** – వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?

**మనోకృతేన** – పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది.

ఇప్పుడు మూడవ ప్రశ్నకు జవాబు మొదలవుతుంది.

3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే?** – తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది?

**యథా సమ్రాడేవాధికృతాన్ వినియుంక్తే** – సామ్రాట్‌లాగా ఒక్కొక్క ప్రాణానికి ఒక్కొక్క అధికారం ఇచ్చింది. ఐదవమంత్రంలో వచ్చిన ఆ విభజనను, అవి ఉండే స్థానాలను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| **వ్యష్టి ప్రాణం** | **స్థానం** | **అధికారం** |
|---|---|---|
| అపానం | పాయు, ఉపస్థ | విసర్జన క్రియ, జీవోత్పత్తి |
| ప్రాణం | చక్షు శ్రోత్రే ముఖనాసికాభ్యాం | శ్వాసక్రియ |
| సమానం | మధ్యే తు (జీర్ణకోశం) | జీర్ణక్రియ |
| వ్యానం | ప్రతిశాఖానాడీ సహస్రాణి | రక్తప్రసరణ క్రియ |
| ఉదానం | ఊర్ధ్వః (మెడ, మెడపైన) | తిరోగమన క్రియ, లోకం నయతి |

మూడవప్రశ్నకు జవాబులో ఉదానం చేసే క్రియను కూడా చూశాము. ఉదానం పని ద్వారా మనకు ప్రశ్న 4కు జవాబు వచ్చేసింది.

4. **కేన ఉత్క్రమతే**– ఎలా బయటకు వెళుతుంది?

**ఏకయోర్ధ్వ ఉదానః** – సుషుమ్న నాడిద్వారా ఉదానం తీసుకుని వెళుతుంది.

ప్రాణం జీవికి ప్రాణశక్తిని ఆయా క్రియల ద్వారా ఇస్తుంది. ఎన్నాళ్ళు? ఆ జీవికి ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ. ప్రారబ్ధకర్మ క్షయమయిన వెంటనే ఉదానం తన పనిని మొదలు పెడుతుంది.

జీవి సూక్ష్మశరీరాన్ని స్థూలశరీరంనుంచి పైకి లేపి, ఇంకొక శరీరానికి తీసుకువెళుతుంది ఉదానం.

**పుణ్యేన పుణ్యం లోకం నయతి**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకమ్ – 3.7**

జీవిని ఊర్ధ్వలోకాలకో, అధోలోకాలకో, మనుష్యలోకానికో అతను చేసుకున్న పుణ్య పాపాలనుబట్టి తీసుకువెళుతుంది.

**యథా సంకల్పితం లోకం నయతి – 3.10**

మరణించిన జీవియొక్క సూక్ష్మశరీరం ఏ లోకానికి వెళుతుందనేది అతని చివరి సంకల్పాన్నిబట్టి ఉంటుంది.

**యం యం వాపి స్మరన్‌భావం త్యజత్యంతే కలేవరమ్ ।**

**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ – గీత 8.6**

గీతలో అధ్యాయం 8 ఈ భాగాన్ని ఆధారం చేసుకుని వచ్చినదే. తరువాత వచ్చే జన్మకు సంబంధించిన ప్రారబ్ధకర్మ, ఈ జన్మలో మరణిస్తున్నప్పుడే వచ్చి సిద్ధంగా ఉంటుంది. ఈ జన్మను ఈ జన్మలోని ప్రారబ్ధకర్మ నిశ్చయిస్తే, మరుజన్మను మరుజన్మలోని ప్రారబ్ధకర్మ నిశ్చయిస్తుంది. అది కూడా ఈ జన్మ ముగిశాక కాదు, అంత్యకాలంలో. ఆ ప్రారబ్ధకర్మే ఆలోచనాతీరును కూడా నిర్దేశిస్తుంది.

ఆలోచనాతీరు ఉన్నతంగా ఉండాలంటే, ఈ జన్మలో చాలా పుణ్యం చేసివుండాలి. ఆ పుణ్యం చేయకపోతే సంచితకర్మ ప్రబలంగా ఉంటుంది. ఒకవేళ పుణ్యం చేసుకుంటే, ఆగామికర్మలు సంచితకర్మను వెనక్కు త్రోసి, వచ్చే జన్మ మంచిది వచ్చేలాగా చేస్తుంది. దీని అర్థం చివరి సంకల్పం ఏదైతే ఉందో, అది తరువాత వచ్చే జన్మను నిర్ణయిస్తుంది.

ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో వారు బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ జ్ఞానం పొంది, క్రమముక్తి పొందుతారు అని ఉపనిషత్తు చెబుతున్నది. ఉదానప్రాణం అగ్నితత్త్వం. అందువల్ల ఉదానం వెళ్ళిపోతే, దానితోపాటు అగ్నితత్త్వం కూడా వెళ్ళిపోతుంది. అందువల్ల శరీరం చల్లగా అయిపోతుంది.

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?

6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

| **బాహ్యం / అధిదైవం** | **వ్యష్టి / అధ్యాత్మం** |
|---|---|
| ఆదిత్యదేవత | ప్రాణం |
| పృథివి | అపానం |
| అంతరిక్షం | సమానం |
| వాయువు | వ్యానం |
| అగ్ని / తేజః | ఉదానం |

**ఫలం:** – ప్రాణ ఉపాసన చేసినవారికి –

ఇహలోక ఫలం – సంతతికి అపమృత్యువు రాదు.

పరలోక ఫలం – బ్రహ్మలోక ప్రాప్తి, క్రమముక్తి.

**ఉత్పత్తిమాయతిం స్థానం విభుత్వం చైవ పంచధా**
**అధ్యాత్మం చైవ ప్రాణస్య విజ్ఞాయామృతమశ్నుతే విజ్ఞాయామృతమశ్నుత ఇతి – 3.12**

ఈ ఆఖరిమంత్రంలో ఆరు ప్రశ్నలకు సమాధానాలు సారం రూపంలో వచ్చేశాయి, అది కూడా ఒక్కొక్క పదంలో వచ్చేశాయి. అంతేకాదు దాని ఫలం కూడా వచ్చింది.

1. **ఉత్పత్తిమ్ – ప్రాణం ఎలా పుట్టింది?**
   జవాబు: ఆత్మనుంచి నీడ పుట్టినట్టుగా పుట్టింది.
2. **ఆయతిమ్ – శరీరంలోకి ఎలా వచ్చింది?**
   జవాబు: మనోకృతేన – మన పూర్వజన్మ కర్మలవల్ల వచ్చింది.
3. **స్థానమ్ – శరీరంలో ఎక్కడ ఉంది?**
   జవాబు: ప్రాణం – కన్ను, చెవి, ముక్కు, నోరు
   అపానం – పాయు, ఉపస్థ
   వ్యానం – నాడుల ద్వారా అంతటా
   సమానం – మధ్యలో, జీర్ణకోశంలో
   ఉదానం – ఊర్ధ్వభాగంలో
4. **విభుత్వమ్ – ఎలా విభజించుకుంది?**
   జవాబు: సామ్రాట్‌లాగా విభజించుకుంది.
5. **పఞ్చధా – బాహ్యప్రపంచానికి ఎలా శక్తినిస్తోంది?**
   జవాబు: ఆదిత్య, పృథివి, అంతరిక్షం, వాయువు, తేజోరూపంలో ఇస్తోంది.
6. **వ్యష్టికి ఎలా శక్తినిస్తోంది?**
   జవాబు: ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానాలరూపంలో ఇస్తోంది.

**ఫలం – విజ్ఞాయామృతమశ్నుతే** – ఇది తెలుసుకుని ఉపాసన చేసినవాడు అమరత్వాన్ని పొందుతాడు.

ఈ అధ్యాయంలో ప్రశ్నలు ప్రాణానికి చెందినవి కాబట్టి, ప్రాణం సూక్ష్మశరీరానికి చెందినది కాబట్టి, మూడవ అధ్యాయాన్ని కూడా సూక్ష్మశరీరప్రధానం అని చెప్పవచ్చు.

**అధ్యాయం 4 – కారణశరీర + ఆత్మ ప్రధానం – మంత్రాలు 11**

ఈ అధ్యాయంలో సౌర్యాయణీ గార్గ్యః పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. ఇతను నిద్ర గురించి అనేక ప్రశ్నలు అడుగుతాడు. ఆ ప్రశ్నలు ఇవి.

1. **ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** – ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?
2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?
3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?
4. **కస్యైతత్సుఖం భవతి?** – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?
5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?

నిజానికి ప్రశ్నలు నిద్రకు సంబంధించినవే అయినా, పిప్పలాద ఋషి మూడు అవస్థల గురించి బోధిస్తారు. జాగ్రదావస్థలో అన్ని అంగాలు పూర్తిగా పనిచేస్తాయి. అన్ని అంగాలు అంటే – జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు. పూర్తిగా విచ్చుకున్న పువ్వుతో దాన్ని పోల్చవచ్చు.

స్వప్నావస్థలో కొన్ని కరణాలు నిద్రిస్తాయి.

**యథా గార్గ్య మరీచయోఽర్కస్యాస్తం గచ్ఛతః సర్వా ఏతస్మింస్తేజోమండల ఏకీభవన్తి –4.2**

ఎలాగైతే సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు అన్ని కిరణాలు సూర్యమండలంలో ఐక్యం అవుతున్నాయో, అదేవిధంగా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు నిద్రపోతున్నప్పుడు, పని చేయవు. కళ్ళు చూడవు, చెవులు పనిచేయవు, దోమలు శరీరం మీద స్వైరవిహారం చేస్తున్నా తెలియదు, మనస్సు ఆలోచనలు చేయదు, బుద్ధి నిశ్చయం చేయదు. నాలుగు అంతఃకరణాలలో చిత్తం మాత్రం పనిచేస్తుంది. దాన్ని వాసనామయ అంతఃకరణం అంటారు.

**పరే దేవే మనస్యేకీ భవతి**

అన్నీ మనస్సులో ఏకమవుతాయి.

**అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి – 4.5**

చిత్తం ద్వారా స్వప్నప్రపంచం సృష్టించబడుతుంది. అందువల్ల స్వప్నావస్థలో పంచేంద్రియాలు పడుకుంటాయి. చిత్తం మాత్రం మేలుకుంటుంది.

జాగ్రదావస్థను వి.సి.ఆర్.తోనూ, స్వప్నావస్థను వి.సి.పి.తోనూ పోల్చవచ్చు. జాగ్రదావస్థలో మన మనస్సులో ఏదైతే నిక్షిప్తమై ఉంటుందో, అదే స్వప్నావస్థలో వస్తుంది. ఉదాహరణకు క్రికెట్‌మ్యాచ్‌లోని ముఖ్యాంశాలను ఏక్షన్ రీప్లేలో మళ్ళీ చూపించినట్టుగా, మన మనస్సుకు హత్తుకుపోయినవి మళ్ళీ వస్తాయి.

**దృష్టం చ అదృష్టం చ** – చూసినవి, చూడనివి. అతను జాగ్రదావస్థలో చూసినవి, చూడనివి కూడా స్వప్నంలో చూస్తాడు అంటుంది ఉపనిషత్తు. అలాగే **శ్రుతం చ–అశ్రుతం చ** – విన్నవీ, విననివీ వింటాడు. అసలు ఎన్నడూ చూడనివీ, విననివీ స్వప్నంలో ఎలా చూస్తాడు అని అనుమానం రావచ్చు. ఎందుకంటే వి.సి.ఆర్.లో రికార్డు చేసినవే వి.సి.పి.లో వస్తాయని ఇప్పుడే చూశాము.

ఈ చిక్కుముడిని శంకరాచార్యుల వారు తన భాష్యంలో విప్పుతారు. అశ్రుతం చ అంటే పూర్వజన్మ శ్రుతం చ గా మార్చుకోవాలి. వినని అంటే ఈ జన్మలో వినకపోయినా, పూర్వజన్మలో వినివుంటారు. పూర్వజన్మ అంటే సరిగ్గా దీనిముందు జన్మ మాత్రమే అవసరం లేదు, కొన్ని జన్మల ముందువి కూడా కావచ్చు. అనాది కాల ప్రవృత్త జన్మ. ఒక్కముక్కలో చెప్పాలంటే, స్వప్నంలో అంతకుముందు చూసినవే చూడగలరు.

కొంతమందికి జరగబోయే సంఘటనలు కలలోకి వస్తాయి. సాయంకాలం మా మావయ్య వస్తున్నట్టు నేను ముందురోజు కలలోనే చూశాను అంటారు ఎవరో. నిజంగానే ఆయన వస్తాడు. అలాంటప్పుడు స్వప్నాన్ని వి.సి.పి.తో ఎలా పోల్చగలరు? దానికి మన జవాబు, జరగబోయే సంఘటనను గురించి మీరు కలగన్నారంటే అది స్వప్నం కాదు. ఎందుకంటే స్వప్నం నిర్వచనమే, మనస్సులో ఏదైతే నిక్షిప్తమై ఉందో అది కలలో వస్తుంది. అందువల్ల ఒకవేళ జరగబోయేది మీరు కలగన్నారంటే, యోగి ప్రత్యక్షం అంటారు దాన్ని యోగశాస్త్రంలో. అంటే మీకు ఏదో ప్రత్యేకశక్తి ఉన్నట్టు అర్థం. అది జాగ్రదావస్థలో రాదు, స్వప్నావస్థలోనూ రాదు. అది నాలుగవ అవస్థ అయిన ఉభయత ప్రజ్ఞావస్థలో వస్తుంది. అందువల్ల స్వప్నావస్థ నిర్వచనం మీ చిత్తంలో నిలువవున్న అనుభవాలనుంచి వచ్చేది.

దాని తర్వాత మనస్సు కూడా నిద్రపోతుంది. **అత్రైష దేవః స్వప్నాన్న పశ్యతి**

మనస్సు స్వప్నాన్ని కూడా చూడదు. దాన్ని సుషుప్తి అవస్థ అంటారు. ఇక్కడ మనస్సు ముడుచుకున్న మొగ్గలా ఉంటుంది.

**స యథా సోమ్య వయాంసి వాసోవృక్షం సమ్ప్రతిష్ఠన్తే ఏవం హ వై తత్సర్వం పర ఆత్మని సమ్ప్రతిష్ఠతే – 4.7**

ఎలాగైతే పక్షులు తాము నివసిస్తున్న వృక్షాన్ని సాయంకాలం చేరుకుంటాయో, అదే విధంగా సుషుప్తిలో అన్ని కరణాలు కారణ అవస్థలో లయమవుతాయి. మనశ్శరీరాలు మాత్రమే పడుకోవు, అవి పనిచేయకపోవటంవల్ల మనశ్శరీరాలు వ్యవహారం నడిపే జాగ్రత్ ప్రపంచం కూడా కనబడదు.

**పృథివీ చ పృథివీమాత్రా చ** అంటూ ఒక పెద్ద పట్టికనే ఇస్తుంది ఉపనిషత్తు. వాటిని టూకీగా చూస్తే –

స్థూలపంచభూతాలూ, వాటి తన్మాత్రలూ (సూక్ష్మపంచభూతాలు)
పంచజ్ఞానేంద్రియాలూ, తద్ విషయాలూ
పంచకర్మేంద్రియాలూ, తద్ విషయాలూ
నాలుగు అంతఃకరణాలూ, తద్ విషయాలూ
పంచప్రాణాలూ, తద్ విషయాలూ

అన్నీ పడుకుంటాయి. త్రిపుటి పరంగా చూస్తే భోక్త, భోగకరణం, భోగ్యవిషయం – మూడూ లయమవుతాయి. అంటే ద్వైతం అవ్యక్తంలో కారణశరీరంలో ఉంటుంది. సుషుప్తి అవస్థను కారణశరీరంలో అనుభవిస్తాము.

ఈ మూడు అవస్థలూ వాటి అధిష్ఠానంలో లయమవుతాయి. మూడు అవస్థలు – జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు. వాటి అధిష్ఠానం, పర అక్షరం ఆత్మ. ఈ ఉపనిషత్తు అక్షరం పదం వాడటానికి కారణం, మనకు ముండకోపనిషత్తులో వాడిన అక్షరం బ్రహ్మ పదాన్ని గుర్తు చేయటానికి. ఎందుకు? ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తుకు వ్యాఖ్యానం కాబట్టి. అక్షరం అంటే నాశనం లేని ఆత్మ చైతన్యం.

ఆత్మను ఇక్కడ **అచ్ఛాయమశరీరమలోహితమ్** అంది. అచ్ఛాయమ్ అంటే కారణశరీరం లేనిది, అశరీరం అంటే సూక్ష్మశరీరం లేనిది, అలోహితం అంటే స్థూలశరీరం లేనిది.

**స్థూలసూక్ష్మకారణ శరీరవిలక్షమ్ ఆత్మా**

ఇది శుద్ధచైతన్యం. శరీరత్రయానికి విలక్షణంగానూ, అధిష్ఠానంగానూ ఉంటుంది. చైతన్యం ఐదు లక్షణాలు ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. అవి –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.

2. చైతన్యం స్వతంత్రం. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.

3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఎవరైతే ఆత్మజ్ఞానం పొందుతారో వారు సర్వజ్ఞులు అవుతారు. వేదాంతానికి రాకముందు నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది అనుకుంటారు. వేదాంతం నేర్చుకున్నాక నేను ఆత్మను, నాకు వ్యవహారం నడపటానికి శరీరం ఉందని అర్థం చేసుకుంటారు. శరీరం వచ్చి పోతుంది కాని నేను ఆత్మగా సర్వవ్యాపకం. ఈ విధంగా ఆత్మ, అనాత్మల వివేకం చూపబడింది. ఈ అధ్యాయంలో సుషుప్తి గురించిన వివరణలో భాగంగా కారణశరీరం, ఆత్మల గురించి చెప్పటం జరిగింది. ఈ జవాబులను సౌర్యాయణీ గార్గ్యః ప్రశ్నలతో కలుపుకుంటే ఈ విధంగా వస్తాయి.

సౌర్యాయణీ గార్గ్యః అవస్థాత్రయం గురించి 5 ప్రశ్నలు అడిగాడు.

**1. ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?

**పరేదేవే మనస్యేకీభవన్తి** – దశ ఇంద్రియాలు (పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు) మనస్సులో నిద్రిస్తాయి.

2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?

**ప్రాణాగ్నయ ఏవ తస్మిన్ పురే జాగ్రతి। మనో హ వావ యజమానః॥** – పంచప్రాణాలు, మనస్సు మాత్రమే మేలుకొని ఉంటాయి.

3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?

**అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి –** మహిమానమైన మనస్సు చూస్తుంది.

4. **కస్యైతత్సుఖం భవతి?** – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?

**ఏతస్మిన్ శరీరే ఏతత్సుఖం భవతి–** కారణశరీరం లేదా ప్రాజ్ఞ సుఖాన్ని అనుభవిస్తుంది.

5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?

**సర్వం పరే ఆత్మని సంప్రతిష్ఠతే –** అన్నీ పర అక్షర ఆత్మలో లయమవుతాయి. అన్నీ అంటే భోక్తా, భోగకరణం, భోగ్యవిషయం.

**ఫలం** – ఇవి తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడు అవుతాడు. సమస్తమూ తానే అవుతాడు.

### అధ్యాయం 5 – ఓంకార ఉపాసన – క్రమముక్తికోసం – మంత్రాలు 7

ఈ అధ్యాయంలో శైబ్యః సత్యకామః పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. ఇది చాలా చిన్న అధ్యాయం. ఇందులో ఏడు మంత్రాలే ఉన్నాయి. ఇతను ఓంకారధ్యానం గురించి అడిగాడు. ఓంకార ధ్యానం అంటే ఓంకారంమీద ధ్యానం కాదు. ఓంకారాన్ని ప్రతీకగా తీసుకుని భగవంతునిమీద చేసే ధ్యానం.

**మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతి –** మనుష్యుల్లో ఎవరైనా మరణం వరకు ఓంకారధ్యానం చేస్తే ఏ లోకానికి వెళతారు?

ఓంకార ఉపాసన చేసిన వ్యక్తి క్రమముక్తి పొందుతాడు. ఓంకార ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మ ద్వారా ఆత్మజ్ఞానం పొంది, అక్కడ మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు. ఓంకార ఉపాసన ద్వారా క్రమముక్తి పొందుతాడు. దీన్ని దశల వారీగా చెబుతాడు గురువు. అంటే ఓంకారంయొక్క ఒక మాత్రమీద ఉపాసన చేస్తే ఏ దేవతలు ఏ లోకానికి తీసుకుని వెళతారో వస్తుంది. దాన్ని ఈ క్రింద పట్టికలో చూడవచ్చు. ఇలా నిజంగా ఒక్కొక్క మాత్రగా ఉపాసన చేయకూడదు అంటారు. అలా చేస్తే అది అంగవైకల్య ఉపాసన కిందికి వస్తుంది.

| **మాత్ర** | **సూచించే అధిష్ఠానదేవత** | | **మాత్రసంఖ్య** | **వేదం** | **లోకం** | **ఇంకోపేరు** |
|---|---|---|---|---|---|---|
| | **వ్యష్టి** | **సమష్టి** | | | | |
| అ | విశ్వ | విరాట్ | ఏకమాత్ర | ఋగ్వేద | భూలోకం | మనుష్యలోకం |
| అ, ఉ | తైజస | హిరణ్యగర్భుడు | ద్విమాత్ర | యజుర్వేద | భువర్లోకం | సోమలోకం |
| అ,ఉ,మ | ప్రాజ్ఞ | ఈశ్వరుడు | త్రిమాత్ర | సామవేద | సువర్లోకం | బ్రహ్మలోకం |

**మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం వావ స తేన లోకం జయతీతి –** మనుష్యుల్లో ఎవరైనా మరణం వరకు ఓంకారధ్యానం చేస్తే ఏ లోకానికి వెళతారు? భూలోక, భువర్లోక, సువర్లోకాలకు, వారు చేసిన ఉపాసనలనుబట్టి వెళతారు.

**అధ్యాయం 6 – బ్రహ్మ ప్రతిపాదనం – షోడశ కల పురుషః – మంత్రాలు 8**

ఇందులో సుకేశా భారద్వాజః పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. అతను షోడశకల పురుషుని గురించి అడుగుతాడు.

**క్వాసౌ పురుషః**? – ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

పరోక్షంగా అడిగిన ప్రశ్న –

**షోడశకలం పురుషం వేత్థ**? – పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా?

**క్వాసౌ పురుషః –** ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

**ఇహైవాన్తః శరీరే–** అంతః కరణంలో ఉన్నాడు

పరోక్షంగా అడిగిన ప్రశ్న –

**షోడశకలం పురుషం వేత్థ**? – పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా? .

షోడశకలం అంటే సృష్టి మొత్తం వస్తుంది. సృష్టిని 16 తత్త్వాలుగా విభజిస్తారు. ఆ పదహారు కలలు ఇవి –

1. ప్రాణం, 2. శ్రద్ధా, 3. ఆకాశం, 4. వాయువు, 5. అగ్ని, 6. నీరు, 7. భూమి, 8. ఇంద్రియాలు, 9. మనస్సు, 10. అన్నం, 11. వీర్యం, 12. తపస్సు, 13. మంత్రాలు, 14. కర్మ, 15. లోకాలు, 16. లోకాలలో పేర్లు.

ఇంకో విధంగా చూస్తే సృష్టిని 16 తత్త్వాలుగా చూపిస్తున్నది. అందువల్ల షోడశకల పురుషుడు అంటే మొత్తం సృష్టిని తన శరీరంగా కల భగవంతుడు అని అర్థం.

దీనికి జవాబుగా పిప్పలాద ఋషి పరంబ్రహ్మను అధ్యారోప అపవాద పద్ధతి ద్వారా వివరిస్తాడు.

**అధ్యారోప అపవాదం**

దీన్ని నాలుగు దశల్లో చూస్తాము.

దశ 1 – జగత్తు కార్యం

దశ 2 – బ్రహ్మ ఈ జగత్తుకు కారణం

ఇది అధ్యారోపం

దశ 3 – కార్యానికి, కారణం లేకుండా విడిగా ఉనికి లేదు.
అందువల్ల జగత్తు మిథ్యా నామరూపం మాత్రమే

దశ 4 – కార్యం జగత్తు లేకపోతే కారణానికి కారణత్వ హోదా లేదు.
(కారణం లేదు అనకూడదు)

ఇది అపవాదం.

**కార్య–కారణ విలక్షణం బ్రహ్మ**

జగత్తు గుణం మాత్రమే. జగత్తును మిథ్యగా కొట్టివేస్తే నిర్గుణబ్రహ్మ అవుతుంది. నిర్గుణబ్రహ్మను ఇక్కడ అకలః అని చూస్తాము. ప్రపంచానికి విడిగా ఉనికి లేకపోతే, అది మిథ్య అవుతుంది. మిథ్యా జగత్తు ఉన్నా లేనట్టే అర్థం.

**షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!**

**విశ్వమే విష్ణువు!!**

విష్ణుసహస్రనామంలో వచ్చే మొట్టమొదటి నామమే **విశ్వం విష్ణుః.** విశ్వమంతటా అధిష్ఠానంగా ఉన్నది విష్ణువే. వేదాంతంలో నిర్గుణ బ్రహ్మ అంటారు.

ఆ విధంగా నిర్గుణబ్రహ్మ మాత్రమే ఉంది. గుణాత్మకమైన జగత్తు వచ్చిపోతుంది. బ్రహ్మ మిథ్యా జగదధిష్ఠానం. ఎవరైతే ఈ బ్రహ్మతత్త్వాన్ని అర్థం చేసుకుంటారో, షోడశకల అకలం బ్రహ్మ గురించి అర్థం చేసుకుంటారో, అతను జీవన్ముక్తి పొందుతాడు.

అధ్యారోప అపవాద పద్ధతి ద్వారా ఈ **షోడశకల–అకలం బ్రహ్మ**ను వివరించాడు గురువు.

ఓంకార ధ్యానం చేస్తే క్రమముక్తి పొందుతాడు, జ్ఞానం పొందితే జీవన్ముక్తి పొందుతాడు.

ఇక్కడితో ఆరుగురు శిష్యుల ప్రశ్నలూ, జవాబులూ ముగిశాయి.

**పరం పారం తారయసీతి** – ఆరుగురు ఇప్పుడు గురువు దగ్గరకు కలసివచ్చి, ఆయనకు నమస్కారం చేసి, మీరు మమ్మల్ని సంసారంనుంచి కాపాడారు అన్నారు.

**నమః పరమ ఋషిభ్యో నమః పరమఋషిభ్యః – 6.8**

వారి గురువైన పిప్పలాద ఋషికే కాకుండా మొత్తం ఋషి పరంపరకే నమస్కారాలు పెట్టారు.

దీనితో ఆరవ అధ్యాయం కూడా అయిపోయింది.

**ముఖ్యమైన మంత్రాలు**

అధ్యాయం 3 – 3, 7, 10

అధ్యాయం 4 – 10, 11

అధ్యాయం 6 – 5, 6, 7, 8

# దుర్గాసూక్తం

**ఓం జాతవేదసే సునవామ సోమ మరాతీయతో నిదహాతి వేదః ।**

**స నః పర్షదతి దుర్గాణి విశ్వా నావేవ సింధుం దురితాఽత్యగ్నిః ॥**

ఓజాతవేదా, అగ్నిదేవా సోమలతలను పిండి సోమరసాన్ని నీకు ప్రీతితో అర్పిస్తాము. మా అడ్డంకులను అగ్నిదేవుడు దగ్ధము చేయుగాక. సముద్రాన్ని నౌక ఎలా దాటిస్తుందో, అలా అగ్నిదేవుడు మమ్ములను కష్టాలనుంచి దాటించు గాక. అగ్నిదేవుడు మమ్మల్ని సమస్త పాపములనుంచి, మా తప్పులనుంచి మమ్ము గట్టెక్కించాలి.

**తామగ్నివర్ణాం తపసా జ్వలంతీం వైరోచనీం కర్మఫలేషు జుష్టామ్ ।**

**దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే సుతరసి తరసే నమః ॥**

అగ్నివర్ణంతో జ్వలించేది, తపస్సు ద్వారా ప్రకాశించేదీ, భక్తులకు వారి కర్మలబట్టి కర్మఫలాన్నొసిగేది భగవంతుని శక్తిస్వరూపిణి అయిన దుర్గామాతను, నేను వేడుకొంటున్నాను. సంసార దుఖసాగరమునుంచి ఆవలి తీరానికి చేర్చే ఓ మాతా నన్ను కాపాడు. నీకివే మా హ్రదయపూర్వక నమస్కారములు.

**అగ్నే త్వం పారయా నవ్యో అస్మాంథ్స్వస్తిభిరతి దుర్గాణి విశ్వా ।**

**పూశ్చ పృథ్వీ బహులా న ఉర్వీ భవా తోకాయ తనయాయ శంయోః ॥**

హే అగ్నిదేవా! నువ్వు కీర్తింపదగినవాడవు. సంతోషకరమైన మార్గాల ద్వారా మమ్ములను సమస్త దుఃఖాలనుండి సుదూరంగా తీసుకుని వెళ్ళు. మా ఊరూ, దేశమూ, ప్రపంచమూ పాడిపంటలతో సుభిక్షముగానుండుగాక. మా పిల్లలకు, వారి పిల్లలకు సుఖసంతోషాలనివ్వు.

విశ్వాని నో దుర్గహా జాతవేదస్సింధున్న నావా దురితాఽతిపర్షి ।
అగ్నే అత్రివన్మనసా గృణానోఽస్మాకం బోధ్యవితా తనూనామ్ ॥

జాతవేదుడా, సమస్త దుఃఖాలను హరించేవాడా! భవసాగరంనుంచి, పాపాలనుంచి కాపాడి మోక్షమనే తీరానికి చేర్చు. హే అగ్నిదేవా! మా శరీరాలను కాపాడి రక్షించు. సమస్త జనావళి సుఖశాంతులతో ఉండాలని కాంక్షించే అత్రిమునివలె మా శ్రేయస్సును సదా మనసునందు గుర్తుచేసుకో, మమ్మల్ని ఎల్లవేళలా కాపాడు.

పృతనా జితగ్ం సహమానముగ్రమగ్నిగ్ం హువేమ పరమాథ్సధస్థాత్ ।
స నః పర్షదతి దుర్గాణి విశ్వా క్షామద్దేవో అతి దురితాఽత్యగ్నిః ॥

శత్రుసైన్యాన్ని ముట్టడించి నాశనం చేసేవాడు, ఉగ్రమైనవాడు అయిన అగ్నిదేవుణ్ణి ఆయన ఉండే అతి ఉన్నతస్థానంనుండి రమ్మని ఆహ్వానిస్తున్నాం. మా సమస్త క్లేశములను, పాపములను, మా ఆపరాధములను నశింపచేసి మమ్ము కాపాడుగాక.

ప్రత్నోషి కమీడ్యో అధ్వరేషు సనాచ్చ హోతా నవ్యశ్చ సత్సి ।
స్వాంచాగ్నే తనువం పిప్రయస్వాస్మభ్యం చ సౌభగమాయజస్వ ॥

ఓ దేవా యజ్ఞయాగాలలో కొనియాడబడే నీవు మా ఆనందాన్ని వృద్ధిచేస్తున్నావు. ప్రాచీనకాలంనుంచి ఈరోజువరకు జరిపే యజ్ఞయాగాది క్రతువులలో హవిస్సులను తీసుకుని ఆ యా దేవతలకు అందచేసే హవ్యవాహనుడివిగా పేరుపొందావు. నీ స్వరూపములుగా ఉంటున్న మాకు ఆనందమును చేకూర్చు. మాకు అన్ని విధాల శ్రేయస్సును కలుగజేయి.

గోభిర్జుష్టమయుజో నిషిక్తం తవేంద్ర విష్ణోరనుసంచరేమ ।
నాకస్య పృష్ఠమభి సంవసానో వైష్ణవీం లోక ఇహ మాదయంతామ్ ॥

ఓ భగవన్ నీవు అసంగుడవు. నీవు పాపము, దుఃఖములు అంటనివాడవు. నీవు అంతటావ్యాపించి ఉన్నావు. యజ్ఞయాగాది క్రతువులందు వ్యాపించి ఉన్నావు. యాగాలలో కీర్తింపబడుతున్న భగవంతుడా! అసంఖ్యాకములగు పశువులతో, ధనంతో, ధాన్యంతో, బహుసంతానముతో పరమానందం అపరిమితంగా పొందగోరి నిన్ను ప్రార్థిస్తున్నాము. నిన్ను సేవించే భాగ్యము మాకు కలుగజేయి. ఉన్నతమైన దేవలోకంలో నివసించే విష్ణుస్వరూపమైన దేవియందు మాకు మా భక్తి ప్రపత్తులు కలిగేటట్టు చేయి. ఆ దేవతలు మమ్ము ఆశీర్వదించి సంతోషాన్ని ప్రసాదించుగాక.

**ఓం కాత్యాయనాయ విద్మహే కన్యకుమారి ధీమహి ।**

**తన్నో దుర్గిః ప్రచోదయాత్ ॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

శక్తి స్వరూపిణి కాత్యాయనీ దేవిని తెలుసుకుందాము. కన్యాకుమారిని ధ్యానిద్దాం. మన ధ్యానంలో సమస్త శక్తి ప్రదాయినీ దుర్గాదేవి మన బుద్ధిని ప్రచోదనం చేయుగాక. బుద్ధిని వికశింపజేయుగాక. అధిభౌతిక, అధిదైవిక, అధ్యాత్మిక విఘ్నాలు మాకు కలుగకుందుగాక.

Some Important Links of

**ARSHA VIDYA TARANGINI TRUST**

Name of our YouTube Channel is **ARSHA VIDYA TARANGINI** you can simply search for **ARSHA VIDYA TARANGINI** in google or YouTube

Arsha Vidya Tarangini Online Classes videos are also available at https://www.youtube.com/channel/UCvN1vYmtiImR1-r9AIVI6QQ/playlists

Our books are also available as free downloadable soft copies at http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Our Gita Classes in Telugu, Audio Files are available for download at - http://www.telugubhakti.com/telugupages/Adwaitam/BG/BGaudios.htm

**ARSHA VIDYA TARANGINI** conducts Vedanta Online Classes in M S Teams every Tuesday to Saturday
Time 6.00 p.m to 7.30 p.m
Information to join our online classes is available - http://www.telugubhakti.com/AVTT/onlineclasses.htm

You can join our WhatsApp Group by contacting us at 9849092368.